www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఐదో రోజూ ఆగని పతనం

75,000 దిగువకు సెన్సెక్స్ 10




4.22 లక్షల కోట్ల సంపద ఆవిరి

మంగళవారం | 25-2-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 311 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి మ. 12.48 తదుపరి త్రయోదశి; నక్షత్రం: ఉత్తరాషాఢ రా. 6.31 తదుపరి శ్రవణం; వర్జ్యం: రా. 10.19-11.51; దుర్ముహూర్తం: ఉ. 8.59-9.45, రా. 10.20-11.087; అమృతఘడియలు: మ. 12.14-1.48; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.39; సూర్యాస్తమయం: 6.16 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





ఉభయసభలనుద్దేశించి ప్రసంగిస్తున్న గవర్నర్ నజీర్. చిత్రంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మండలి చైర్మన్ మోషేన్ రాజు. హాజరైన వైసీపీ నేత జగన్, ఆ పార్టీ సభ్యులు



సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు, అధికారపక్ష సభ్యులు

60 డేస్.. టెన్షన్!

జగన్‌ను భయ పెట్టిన 'అనర్హత వేటు'!

పరుగు పరుగున సభకు హాజరు

ఆర్టికల్ 109(4)లో 60 రోజుల గైర్హాజరు నిబంధన

ఆ లెక్క చూసుకున్నా ఇంకా చాలా గడువే ఉంది

ఈ సెషన్‌కు రాకున్నా 43 రోజులే గైర్హాజరైనట్లు

సోమవారం సభకు వచ్చినా.. రానట్లే!

గవర్నర్ ప్రసంగం లాంఛన ప్రాయం

అసెంబ్లీ పని దినం కిందకు రాదు!

జగన్‌పై అనర్హత వేటు కత్తి వేలాడుతున్నట్లే

ఒట్టు తీసి గట్టున పెట్టి మరోసారి రావాల్సిందే

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'వరుసగా ఆబ్సెంట్ అవుతున్నావ్! రేపు బడికి రాకపోతే టీసీ ఇచ్చేస్తాం' అని హెడ్మాస్టర్ హెచ్చరిస్తే ఏం జరుగుతుంది? పిల్లాడు పరిగెత్తుకుంటూ స్కూలుకు వెళతాడు! వైసీపీ అధ్యక్షుడు జగన్ తీరు కూడా అచ్చం ఇలాగే ఉంది. '60 రోజులు శాసన సభకు గైర్హాజరైతే అనర్హత వేటు పడుతుంది' అని స్పీకర్, డిప్యూటీ స్పీకర్ చెప్పగానే... ఏ లెక్కలూ వేసుకోకుండా సోమవారం అసెంబ్లీకి వెళ్లి... వచ్చారు! అసలు విషయమేమిటంటే... గవర్నర్ ప్రసంగం

మిగతా 12వ పేజీలో...



జగన్ జర్మనీకి వెళ్లాలి!

అక్కడైతేనే వైసీపీకి 'హోదా' వస్తుంది

ఇక్కడ ఈ ఐదేళ్లూ జగన్‌కు ప్రతిపక్ష నేత హోదా రాదు

దాని కోసం సభా సమయం వృథా చేయడం సబబు కాదు

గవర్నర్, సీఎం, నేను ఆయనకు తగిన గౌరవం ఇచ్చాం

11 సీట్లేనని తక్కువగా చూడలేదు

పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు

12 13



జనం ఛీ కొడుతున్నా తీరు మారదా?

11 మంది ఎమ్మెల్యేలతో 11 నిమిషాలు ఉండటానికా సభకు వచ్చింది?: జగన్‌పై షర్మిల ఫైర్

ఏపీలో మరో విప్లవం.. బ్రాండ్ ఏపీ పునరుద్ధరణ

కొత్త వాణిజ్య కారిడార్ల ఆవిష్కరణకు సిద్ధం

పేదరిక రహిత సమాజం లక్ష్యంగా పాలసీలు

నిలిపేసిన 74 కేంద్ర పథకాల పునరుద్ధరణ

డెమోగ్రాఫిక్ మేనేజ్‌మెంట్‌పై కొత్త విధానం

ఇంటికో పారిశ్రామికవేత్త లక్ష్యంగా స్వర్ణాంధ్ర 2047

బడ్జెట్ ప్రసంగంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ వెల్లడి

గవర్నర్ నోట కందుకూరి మాట

దుష్పరిపాలన నుంచి విముక్తి

సుపరిపాలన దిశగా అడుగులు



పోడియం వద్దకెళ్లి గవర్నర్ ప్రసంగానికి అడ్డు తగులుతున్న వైసీపీ సభ్యులు

వచ్చారు.. అరిచారు.. వెళ్లారు

తొలి రోజు సభలో వైసీపీ వింత ధోరణి.. జగన్ సహా 11మంది హాజరు

విపక్షంగా గుర్తించాలంటూ నినాదాలు.. జగన్ సైగలతో పోడియం వద్దకు

గవర్నర్ ప్రసంగం మొదలైన తొమ్మిదో నిమిషమే సభ నుంచి వాకౌట్

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గత దుర్భరపాలన, దుష్పరిపాలన నుంచి బాధ్యతాయుతమైన సుపరిపాలన వైపుగా రాష్ట్రాన్ని నడిపించడంలో గత ఎనిమిది నెలల్లో ప్రభుత్వం గణనీయమైన పురోగతి సాధించిందని గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ మరో విప్లవానికి నాయకత్వం వహిస్తోందని, ఐటీ నుంచి కృత్రిమ మేధ వరకు టెక్నాలజీ వినియోగంలో కొత్త పుంతలు తొక్కుతోందని తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్యంలో భాగమవుతూ 'పీపుల్ ఫస్ట్' విధానంతో స్వర్ణాంధ్ర-2047 దార్శనిక పత్రం తయారుచేసుకుని, సమగ్ర రోడ్‌మ్యాప్‌ను ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. దీనికోసం పది మార్గదర్శక సూత్రాలను రూపొందించుకుని పని చేస్తోందన్నారు. సోమవారం అసెంబ్లీలో బడ్జెట్ సమావేశాలను ప్రారంభిస్తూ ఉభయ సభల సభ్యులను ఉద్దేశించి గవర్నర్

మిగతా 12వ పేజీలో...

21 వరకు అసెంబ్లీ

మొత్తం 15 పనిదినాల్లో సమావేశాలు

బీఏసీలో నిర్ణయం

భేటీకి జగన్ గైర్హాజరు



సన్నరకాల వరి సాగుకు ప్రోత్సాహం

మంత్రి అచ్చెన్న అధ్యక్షతన భేటీలో నిర్ణయం

ముతక రకాల సాగు విస్తీర్ణం కుదింపు

ప్రత్యామ్నాయ రకాలు సూచించాలని ఎన్జీ రంగా వర్సిటీకి ఆదేశం 14

ఎగుమతికి అనువైన బియ్యం ఉత్పత్తికి ప్రణాళికలు

వాట్సాప్ ద్వారా త్వరలో 500 సేవలు 14

ఆర్టీజీఎస్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష

సమస్యలపై పరిష్కారానికి వాట్సాప్ గవర్నెన్స్ సెల్

కరువు నేలలో 'ఏఐ' సేద్యం

రైతు వీడియోను పంచుకున్న సత్య నాదెళ్ల

మహారాష్ట్రలోని బారామతిలో ఉష్ణోగ్రతలు, భూసారంపై డేటాను వాడుకుని

అధిక ఉత్పాదకత సాధించిన ఓ చెరుకు రైతు

టెక్నాలజీ సత్తా ఇది: మైక్రోసాఫ్ట్ సీఈవో 2

ఏఐ అన్నింటినీ మెరుగుపరుస్తుంది: మస్క్



విద్యుదాఘాతంతో నలుగురు దుర్మరణం 3

గోశాలలో బావి శుభ్రం చేస్తుండగా ప్రమాదం

గుంటూరు జిల్లా పెదకాకాని మండలంలో ఘటన

క్యాన్సర్ కోరల్లో..

దేశంలో ప్రతి ఐదుగురు బాధితుల్లో ముగ్గురి మృతి

మరణాల రేటు 64.8%.. అమెరికా, చైనాలో 25, 50%

స్త్రీలలో రొమ్ము, పురుషుల్లో నోటి క్యాన్సర్ కేసులెక్కువ

భారత్‌లో ఏటా 2% మేర క్యాన్సర్ కేసులు పెరిగే ముప్పు

లాన్సెట్‌లో ఐసీఎంఆర్ అధ్యయన నివేదిక



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: భారతదేశంలో క్యాన్సర్ చికిత్స పొందుతున్న ప్రతి ఐదుగురిలో సగటున ముగ్గురు (64.8%) చనిపోతున్నారని.. భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) నిర్వహించిన తాజా అధ్యయనంలో వెల్లడైంది. అందులోనూ మహిళల మరణాల సంఖ్య అధికంగా ఉందని తేలింది. క్యాన్సర్ కేసుల పరంగా చైనా, అమెరికాల తర్వాత మూడోస్థానంలో ఉన్న భారత్.. క్యాన్సర్ మరణాల సంఖ్య విషయంలో చైనా తర్వాత రెండో స్థానంలో ఉందని

మిగతా 2వ పేజీలో...

ఊబకాయంపై 'దశ'దిశగా పోరు 2



విస్తృత ప్రచారానికి ప్రధాని మోదీ శ్రీకారం

ఒమర్, మోహన్‌లాల్, ఆనంద్ మహీంద్ర సహా 10 మంది ప్రముఖుల నియామకం



గువాహటి గిరిజన నృత్యోత్సవంలో ప్రధాని మోదీ, అసోం సీఎం హిమంత

ఆటవిక రాజ్యం తెచ్చినోళ్లు మన నమ్మకాలను గౌరవిస్తారా?

కుంభమేళాపై లాలూవి అసభ్యకరమైన వ్యాఖ్యలు

పశువుల దాణా మెక్కినోళ్లు రైతుల గురించి ఆలోచిస్తారా?

ప్రధాని నరేంద్ర మోదీ విమర్శ

'పీఎం కిసాన్' నిధుల విడుదల

కుంభమేళాను విమర్శించే వారు రాబందులు, పందులు

యూపీ సీఎం యోగి వ్యాఖ్య

భాగల్పూర్, భోపాల్, ఫిబ్రవరి 24: మహా కుంభమేళాపై ఆర్జేడీ అధినేత లాలూ 'అసభ్యకరమైన' వ్యాఖ్యలు చేశారని ప్రధాని మోదీ మండిపడ్డారు. బిహార్‌లో 'ఆటవిక రాజ్యాన్ని' తెచ్చినోళ్లు కుంభమేళా గురించి అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. బిహార్‌లోని భాగల్పూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న మోదీ, లాలూపై తీవ్ర ఆరోపణలు

మిగతా 2వ పేజీలో...

APSFL

ఫైబర్‌నెట్ పోస్టులు 'కట్'



జీవీ రెడ్డి



దినేశ్ కుమార్

'బహిరంగ రచ్చ'పై సర్కారు సీరియస్

అనూహ్య మలుపు తిరిగిన వివాదం

చైర్మన్ జీవీ రెడ్డి రాజీనామా

పార్టీ సభ్యత్వానికీ గుడ్‌బై

తక్షణం ఆమోదించిన సర్కారు

ఎండీ దినేశ్ కుమార్‌పైనా వేటు

నాలుగు పోస్టుల నుంచి తొలగింపు

వీధికెక్కితే సహించేదిలేదని సంకేతాలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఫైబర్‌నెట్ వివాదం అనూహ్య మలుపు తిరిగింది. ఈ వివాదానికి కేంద్రంగా మారిన ఇద్దరూ ఒకే రోజు గంటల వ్యవధిలోనే తమ పోస్టులకు దూరమయ్యారు. ఎలాంటి సమస్యలున్నా అంతర్గతంగా చర్చించుకుని పరిష్కరించుకోవాలే తప్ప... రోడ్డుకెక్కితే సహించబోమని సర్కారు ఒకింత కఠినమైన సంకేతాలు పంపింది. ఫైబర్‌నెట్ ఎండీ, ఐఏఎస్ అధికారి దినేశ్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేసిన సంస్థ చైర్మన్ జీవీ రెడ్డి సోమవారం సాయంత్రం తన పదవికి, తెలుగుదేశం పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఇకపై తాను న్యాయవాద వృత్తికి పరిమితమవుతానని, ఏ రాజకీయ పార్టీలోనూ చేరనని రాజీనామా లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వం

మిగతా 11వ పేజీలో...



మిర్చి క్వింటా రూ. 11,781

ఏపీలో మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం తక్షణ అమలు

ధర లోటు చెల్లింపునకు కేంద్రం అంగీకారం

గరిష్ఠంగా 2,58,238 టన్నులకు ఎంఐఎస్ కవరేజీ

నేరుగా రైతుల ఖాతాలకు రీయింబర్స్‌మెంట్

మార్గదర్శకాలు జారీ చేసిన కేంద్ర వ్యవసాయ శాఖ

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ధర తగ్గిపోయి, నష్టపోతున్న మిర్చి రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ఏపీలో మిర్చి రైతులకు మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం (ఎంఐఎస్) తక్షణమే అమలు చేయడానికి అంగీకరించింది. రాష్ట్రంలో మిర్చి ధర పతనమైన

మిగతా 3వ పేజీలో...

ఐదూ కూటమి ఖాతాలోకే!

ఎమ్మెల్యే కోటా 'మండలి' సీట్లలో ఒకటి జనసేన నుంచి నాగబాబుకు!

మిగతా 4 సీట్లకు టీడీపీలో భారీగానే పోటీ

ఆశావహుల్లో దేవినేని, కొమ్మాలపాటి, బుద్దా వెంకన్న, ఎండీ నజీర్, మరికొందరు

బడ్జెట్ తర్వాత దృష్టిపెట్టనున్న చంద్రబాబు

సంఖ్యాబలం లేని వైసీపీ పోటీకి దూరం?

బరిలోకి దిగే అవకాశాలు లేనట్లే

14

20న ఎమ్మెల్యే కోటా ఎన్నికలు

షెడ్యూల్ విడుదల చేసిన ఈసీ

వచ్చే నెల 29తో ముగియనున్న ఐదుగురు సభ్యుల పదవీ కాలం

తెలంగాణలో 5 స్థానాలకు కూడా



వంశీ అక్రమాలపై సిట్

ఐజీ అశోక్ నేతృత్వంలో ఏర్పాటు

సభ్యులుగా తూర్పు, ఏలూరు ఎస్పీలు

సీఐడీ డీజీ అయ్యన్నార్ పర్యవేక్షణ

ఇప్పటికే సర్కారుకు విజిలెన్స్ నివేదిక

అక్రమ మైనింగ్‌లోనే 195 కోట్ల లూటీ

భూ కబ్జాలు, అరాచకాలపైనా దర్యాప్తు

3 రోజుల పోలీసు కస్టడీకి కోర్టు ఓకే

మరో ముగ్గురు నిందితుల అరెస్ట్

అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): గన్నవరం వైసీపీ మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అరాచకాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఐజీ ర్యాంకు అధికారి జీవీజీ అశోక్ కుమార్(ఏలూరు రేంజ్) నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. తూర్పు గోదావరి, ఏలూరు జిల్లాల ఎస్పీలు నరసింహ కిశోర్,

మిగతా 13వ పేజీలో...

గన్నవరాన్ని గుల్ల చేసేశారు

ఐదేళ్లూ వంశీ, అనుచరుల అరాచకకాండ

అక్రమ మైనింగ్‌తో కోట్లు లూటీ

కొండలు పిండి.. చెరువులు చెర

కృష్ణా జలాలను ఏపీ ఎక్కువ వాడలేదు!

కేఆర్ఎంబీ స్పష్టీకరణ.. వరద సమయంలో వాడుకున్నా వెంటనే ప్రాజెక్టులు నిండాయి: జైన్

సాగర్‌లో ఉన్న నీటి వినియోగంపై 2 రాష్ట్రాల సీఈలతో కమిటీ. నేడు నల్లగొండలో భేటీ

27న బోర్డు సమావేశంలో చర్చించి నీటి కేటాయింపులపై నిర్ణయం 14



అసోం రాష్ట్రం గువాహటి పట్టణంలోని సరుసజాయ్ స్టేడియంలో సోమవారం 8,600 మంది ఒకేసారి సంప్రదాయ జుమూర్ నాట్యమాడారు. అసోంలో టీ పరిశ్రమ ప్రారంభమై 200 ఏళ్లు గడిచిన సందర్భంగా ఈ మెగా కార్యక్రమాన్ని నిర్వహించారు.

యూఎస్ఎయిడ్ ఉద్యోగులపై ట్రంప్ వేటు

» రెండు వేల మంది తొలగింపు

వాషింగ్టన్, ఫిబ్రవరి24: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. యూఎస్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్(యూఎస్ ఎయిడ్) సంస్థలో పనిచేసే 2 వేల మంది ఉద్యోగులను తొలగించారు. మిగిలిన వారిలో కొందరిని మినహాయించి మిగతావారందరికీ బలవంతపు సెలవులిచ్చారు. ప్రభుత్వ చర్యలను అడ్డుకోవాలంటూ దాఖలైన పిటిషన్లను అమెరికా జిల్లా న్యాయమూర్తి జార్జ్ నికోలస్ తోసిపుచ్చారు. ఆ వెంటనే ట్రంప్ సర్కారు ఉద్యోగులను తొలగించే చర్యలు చేపట్టింది. ఇప్పటికే సంస్థకు నిధులను నిలిపివేయడంతో పాటు 600 మంది ఉద్యోగులను కార్యాలయ భవనంలోకి వెళ్లకుండా నిలిపివేశారు. దీంతో మిగతా ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. యూఎస్ ఎయిడ్ నిధుల వల్ల అంతర్జాతీయ స్థాయిలో అమెరికాకు ఒరిగిందేమీ లేదని ట్రంప్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఎన్నికల కోసం భారత్‌కు రూ.182 కోట్లు, బంగ్లాదేశ్‌కు రూ.251 కోట్లు సాయం చేయడాన్ని ట్రంప్ తప్పుబట్టారు.

తేజస్ ఆలస్యంపై ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: తేజస్ యుద్ధవిమానాల తయారీలో ఆలస్యానికి కారణాలను గుర్తించి, పరిష్కారాలను సూచించేందుకు రక్షణ శాఖ ఐదుగురు సభ్యులతో ఉన్నతస్థాయి కమిటీని నియమించింది. రక్షణశాఖ కార్యదర్శి రాజేశ్‌కుమార్ సింగ్ ఈ కమిటీకి నేతృత్వం వహిస్తారు. తేజస్ యుద్ధ విమానాలను హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హాల్) తయారు చేస్తున్న విషయం తెలిసిందే..! ఇటీవల భారత వాయుసేన చీఫ్ ఎయిర్ మార్షల్ ఏపీ సింగ్ హాల్ తీరుపై బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ఏరో ఇండియా షో'లో ఆయన మాట్లాడుతూ.. 2009-10లో ఆర్డరిచ్చిన తేజస్ విమానాలను హాల్ ఇంకా డెలివరీ చేయలేదని, ఆ సంస్థపై నమ్మకం లేదని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ రక్షణ శాఖ ఉత్తర్వులిచ్చింది.

హిందీ పద్యం చదవలేదని విద్యార్థిని కొట్టిన ఉపాధ్యాయురాలి సస్పెన్షన్

» చెన్నైలోని ప్రముఖ పాఠశాలలో ఘటన

చెన్నై, ఫిబ్రవరి 24: చెన్నైలోని ప్రముఖ పాఠశాలలో 3వ తరగతి విద్యార్థిని దండించిన ఉపాధ్యాయురాలిని యాజమాన్యం సస్పెండ్ చేసింది. గత వారం విద్యార్థిని హిందీ పద్యం చదవలేదన్న కారణంతో ఉపాధ్యాయురాలు కొట్టారు. దీనిపై విద్యార్థి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేసినట్టు సోమవారం తెలిపింది. పాఠశాలలో భౌతికంగా, మానసికంగా దండనకు అవకాశం లేదని, ఈ నియమాన్ని అతిక్రమించినందుకు ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకున్నట్టు వెల్లడించింది.

పాక్‌లో విదేశీయుల కిడ్నాప్‌నకు ఉగ్ర యత్నాలు

» చాంపియన్స్ ట్రోఫీ వేళ పాక్ ఇంటెలిజెన్స్ హెచ్చరికలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: పాకిస్థాన్ వేదికగా జరుగుతున్న ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లను వీక్షించేందుకు వచ్చే విదేశీ పర్యాటకులకు ఉగ్రవాదుల నుంచి ముప్పు పొంచి ఉందని ఆ దేశ ఇంటెలిజెన్స్ విభాగం హెచ్చరించింది. ఇస్లామిక్ స్టేట్ ఖొరాసాన్ ప్రావిన్స్ (ఐఎస్‌కేపీ) సంస్థ విదేశీ అతిథులను కిడ్నాప్ చేసి డబ్బులు డిమాండ్ చేసే ప్రమాదముందని వెల్లడించింది. ముఖ్యంగా చైనీయులు, అరబ్ జాతీయులను లక్ష్యంగా చేసుకోవచ్చని తెలిపింది. ఐఎస్‌కేపీకి చెందిన వ్యక్తులు నగర శివార్లలో ఇళ్లను అద్దెకు తీసుకుని... సీసీ కెమెరాలు లేని ప్రాంతాల్లో రిక్షా, బైకులు మాత్రమే వెళ్లే చోట విదేశీయుల కిడ్నాప్‌లకు ప్లాన్ చేస్తున్నారని పేర్కొంది. ఇటు అఫ్ఘనిస్థాన్ నిఘా విభాగం (జీడీఐ) కూడా ఐఎస్‌కేపీ దాడులు తెగబడే ప్రమాదముందని అధికారులను అప్రమత్తం చేసింది.

శ్యాం పిట్రోడా అటవీ భూమిని ఆక్రమించారు

» లోకాయుక్తకు బీజేపీ సీనియర్ నేత రమేశ్ ఫిర్యాదు

బెంగళూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నేత, రాహుల్‌గాంధీ ఆప్తుడు శ్యాం పిట్రోడా భూ ఆక్రమణకు పాల్పడినట్టు లోకాయుక్తకు ఫిర్యాదు అందింది. బీజేపీ సీనియర్ నేత ఎన్ఆర్ రమేష్ సోమవారం సమగ్ర రికార్డులతో లోకాయుక్త అధికారులకు ఈ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ రమేష్ మీడియాతో మాట్లాడారు. బెంగళూరు యలహంక సమీపంలోని జారకబండ అటవీ రిజర్వు ప్రాంతంలో 12.35 ఎకరాల భూమిని శ్యాం పిట్రోడాకు 2001లో లీజు పద్ధతిలో కేటాయించారని తెలిపారు. 2011లో కాంట్రాక్టు ముగిసినా పిట్రోడా ఆ భూమిని తన ఆధీనంలోనే ఉంచుకున్నారని తెలిపారు. ఆ భూమిలో ఔషధ మొక్కలు సాగు ద్వారా ఏటా కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్నారన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఆ భూమి విలువ రూ.400 కోట్లకు పైగా ఉంటుందని తెలిపారు.

ఢిల్లీ సీఎం ఆఫీసులో అంబేడ్కర్ ఫొటో తీసేశారు

» ఆప్ ఆరోపణ.. అంతా వట్టిదేనంటూ బీజేపీ మండిపాటు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: దేశ రాజధాని ఢిల్లీలో విపక్ష ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), పాలక బీజేపీ మధ్య తాజాగా ఫొటోల యుద్ధం మొదలైంది. సీఎం కార్యాలయంలో అంబేడ్కర్, భగత్‌సింగ్ ఫొటోలు తీసేశారంటూ మాజీ సీఎం, ఢిల్లీ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత ఆతిశీ సోమవారం ఆరోపించారు. వాటిస్థానంలో మహాత్మాగాంధీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ ఫొటోలు పెట్టారని సభలో అనడమే గాక.. 'ఎక్స్'లో ఆ ఫొటోలను పోస్టుచేశారు. బీజేపీ దళిత వ్యతిరేకి, సిక్కు వ్యతిరేకి అని మరోసారి రుజువైందన్నారు. ఈ ఆరోపణలను సీఎం రేఖా గుప్తా, బీజేపీ నేతలు తిప్పికొట్టారు. సీఎం ఆఫీసులో గాంధీజీ, రాష్ట్రపతి, ప్రధాని ఫొటోలతో పాటు ఉన్న అంబేడ్కర్, భగత్‌సింగ్ చిత్రాలున్న ఫొటోలను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఆప్ సర్కారు అవినీతిని బహిర్గతం చేసే 'కాగ్' నివేదికలను మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టబోతున్నామని.. వీటి భయంతోనే ఆప్ అగ్ర నేతలు ఫొటోలపై రచ్చచేస్తున్నారని కమలనాథులు మండిపడ్డారు.

మాట వినకుంటే నిర్బంధం.. కరెంట్ షాక్‌లు!

» మయన్మార్‌లో సైబర్ నేరగాళ్ల చెరలో చిక్కిన వారి దుస్థితి

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మయన్మార్‌లో తమ చెరకు చిక్కిన భారతీయులను సైబర్ నేరగాళ్లు నానా ఇబ్బందులు పెడుతున్నట్టు తెలుస్తోంది. చీకటి గదుల్లో నిర్బంధించడంతోపాటు కరెంట్ షాక్‌లు పెడుతున్నట్టు ఓ బాధితుడు పేర్కొన్నారు. ఉద్యోగాల పేరుతో భారతీయులను మయన్మార్‌కు రప్పించుకుంటున్న సైబర్ నేరగాళ్లు.. అక్కడ వారితో సైబర్ నేరాలు చేయిస్తున్నారు. ఈ పని చేయడానికి నిరాకరించిన వారిని ముందుగా చీకటి గదుల్లో నిర్బంధిస్తున్నారు. అయినా మాట వినకపోతే కరెంట్ షాక్‌లు పెడుతున్న సందర్భాలు ఉన్నాయని బాధితుల చెర నుంచి విముక్తుడైన మధుకర్‌రెడ్డి తన కుటుంబసభ్యులకు ఫోన్ ద్వారా తెలిపారు. బాధిత యువకుల పాస్‌పోర్టులను ముందే చైనీస్ సైబర్ నేరగాళ్ల ముఠాలు గుంజుకుని తమ వద్ద పెట్టుకుంటున్నాయని ఆయన వివరించారు. ఇదిలా ఉండగా.. ఈ చెర నుంచి 162 మందిని రక్షించిన పోలీసులు వారిని థాయ్‌లాండ్ సరిహద్దుకు తరలించి భారత ఎంబసీ అధికారులకు అప్పగించారు. ఇక్కడకు వచ్చిన వారిలో తెలంగాణకు చెందిన మధుకర్ రెడ్డి, మరో యువకుడు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐదుగురు యువకులు ఉన్నారు.

ఆటవిక రాజ్యం తెచ్చినోళ్లు

మన నమ్మకాలను గౌరవిస్తారా?

(మొదటి పేజీ తరువాయి)



చేశారు. భారత ఐక్యతను కుంభమేళా వేడుక నిదర్శనం అని.. ఐరోపా జనాభాకు మించి ప్రయాగ్‌రాజ్‌లో భక్తులు పుణ్యస్నానాలు చేశారని, బిహార్ నుంచీ పెద్ద సంఖ్యలో భక్తులు కుంభమేళాకు వచ్చారన్నారు. అయితే 'ఆటవిక రాజ్యం వాళ్లు' మన సంస్కృతి, వారసత్వాలు.. నమ్మకాలను ద్వేషిస్తారని లాలూ పేరును ప్రస్తావించకుండా విమర్శలు గుప్పించారు. ఇలాంటి వారు.. అయోధ్యలో రామ మందిర నిర్మాణాన్ని కూడా వ్యతిరేకించారని, దీన్ని బిహార్ ప్రజలూ మరిచిపోలేరని పేర్కొన్నారు. ఇటీవల న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో 18మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనకు బాధ్యత వహిస్తూ రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ రాజీనామా చేయాలని లాలూ ప్రసాద్ డిమాండ్ చేస్తూ.. 'కుంభమేళాతో ఏం ప్రయోజనం? అదో మూర్ఖపు తంతు' అని విమర్శించారు. రైతులు బాగుపడాలనే ఉద్దేశం ఆర్జేడీకి లేదని.. పశువుల దాణాను భోంచేసిన వారికి రైతుల ప్రయోజనం గురించి ఆలోచించే తీరిక ఎక్కడుంటుంది? అని మోదీ ప్రశ్నించారు. అప్పట్లో ఆర్జేడీ, కాంగ్రెస్ కలిసి బిహార్‌లో అధికారాన్ని వెలగబెట్టడం ద్వారా ఆ రాష్ట్రాన్ని నాశనం చేశాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమం సందర్భంగా పీఎం-కిసాన్ కింద రైతుల ఖాతాల్లో 19వ విడత పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో వేస్తున్నట్లు మోదీ ప్రకటించారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద రైతులకు ఎన్డీయే ప్రభుత్వం ఎంతో చేసిందని.. కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద దేశవ్యాప్తంగా 9.8కోట్ల మంది రైతుల ఖాతాల్లో 19వ విడత పెట్టుబడి సాయం కోసం రూ.22వేల కోట్లు వేశామని ప్రధాని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాని 40 నిమిషాలు మాట్లాడారు. ప్రసంగం ప్రారంభించే ముందు ఆయన్ను తామరగింజలతో తయారు చేసిన దండతో సన్మానించారు. తామరగింజలు మంచి ఆహారం అని, ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉండటంతో తాను తామరగింజలను దాదాపు రోజూ ఆహారంలో తీసుకుంటానని మోదీ చెప్పారు. బిహార్‌లో తామరగింజల ఉత్పత్తి బోర్డును ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించామని, తామరగింజలకు ప్రపంచ వ్యాప్తంగా మార్కెట్ ఉందన్నారు.

క్షమించండి.. అందుకే ఆలస్యంగా వచ్చా

ప్రధాని మోదీ సోమవారం మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జరుగుతున్న ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సులోనూ పాల్గొన్నారు. భారత ఆర్థిక వ్యవస్థపై ప్రపంచం ఆశాభావంతో ఉందని.. ఆర్థికరంగంలో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశం అని ప్రపంచ బ్యాంకు చెప్పిందని ప్రధాని అన్నారు. కాగా ఐరాసలో వాతావరణ మార్పులపై పనిచేసే సంస్థ.. భారత్‌ను సౌరశక్తిలో సూపర్‌పవర్‌గా పేర్కొందని చెప్పారు. కాగా ఈ కార్యక్రమానికి 15-20నిమిషాలు ఆలస్యంగా వచ్చినందుకు సదస్సులోని ప్రతినిధులను మోదీ క్షమాపణలు కోరారు. మధ్యప్రదేశ్‌లో ప్రస్తుతం టెన్త్, ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయని.. ఆ పరీక్షలు ప్రారంభమయ్యే సమయం, తాను సదస్సుకు రాజ్‌భవన్ నుంచి బయలుదేరే సమయం ఒకటేకావడంతో తాను ఆలోచించానన్నారు. తాను నిర్ణీత సమయానికే బయలుదేరితే.. భద్రత దృష్ట్యా ఏర్పాటుచేసే గ్రీన్ కారిడార్‌తో విద్యార్థులు ఇబ్బందిపడే అవకాశం ఉండేదన్నారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు వెళ్లాక తాను బయలుదేరానన్నారు.

కుంభమేళాను విమర్శించేవారు రాబందులు, పందులు

» యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్య

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: మహా కుంభమేళాను విమర్శించేవారిపై ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. అలాంటివారు రాబందులు, పందులు అని ప్రతి విమర్శ చేశారు. కుంభమేళాలో ఎవరు ఏది కోరుకుంటే అదే దొరుకుతుందన్నారు. 'రాబందులకు శవాలు దొరుకుతాయి. పందులకు బురద దొరుకుతుంది. సున్నితమైన వ్యక్తులకు అద్భుతమైన సంబంధాలు దొరుకుతాయి. వ్యాపారులకు బేరాలు, భక్తులకు స్వచ్ఛమైన ఏర్పాట్లు ఉన్నాయి' అని చెప్పారు. 'నిర్వహణ లోపాల వల్ల హజ్‌లో తొక్కిసలాట జరిగితే లౌకిక మేధావులు ఎవరూ మాట్లాడలేదు. అలాంటివారే కుంభమేళా ఏర్పాట్లపై విమర్శలు చేస్తున్నారు. ఎంతగా దుష్ప్రచారం చేస్తున్నా లక్షలాది మంది భక్తులు పవిత్ర స్నానాలు చేస్తూనే ఉన్నారు' అని చెప్పారు. కుంభమేళాలో దురదృష్టకర సంఘటనలు చోటుచేసుకున్నప్పటికీ భక్తుల విశ్వాసం, ఉత్సాహంలో ఎలాంటి మార్పు రాలేదని తెలిపారు. సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు అఖిలేష్ యాదవ్‌పై విమర్శలు చేస్తూ వారిలాగా మతవిశ్వాసాలతో ఆడుకోబోమన్నారు. ఆయన సీఎంగా ఉన్నప్పుడు కుంభమేళా ఏర్పాట్లను సక్రమంగా చేయలేదని ఆరోపించారు.

500 కాదు.. 100 బిలియన్ డాలర్లే!



» యుద్ధంలో ఉక్రెయిన్‌కు అమెరికా సాయంపై జెలెన్‌స్కీ ప్రకటన


» ప్రతిగా ఖనిజ సంపదను ఇచ్చేందుకు సిద్ధం: జెలెన్‌స్కీ

కీవ్, ఫిబ్రవరి 24: రష్యాతో తాము యుద్ధం కొనసాగిస్తున్న ఈ మూడేళ్లలో అమెరికా నుంచి తమకు రూ.8.67 లక్షల కోట్లు (వంద బిలియన్ డాలర్లు) మాత్రమే సాయం అందిందని, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పినట్టు అది రూ.43 లక్షల కోట్లు(500 బిలియన్ డాలర్లు) కాదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తేల్చి చెప్పారు. ఆ 8.67 లక్షల కోట్లను అప్పుగా పరిగణించేందుకూ తాను సిద్ధంగా లేనన్నారు. తమ దేశం ఇస్తున్నవి గ్రాంట్లు అని, అప్పు కాదని నాటి అధ్యక్షుడు బైడెన్‌తోపాటు అమెరికా కాంగ్రెస్ కూడా స్పష్టంగా చెప్పినట్టు తెలిపారు. సోమవారం ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో విలేకరుల సమావేశంలో జెలెన్‌స్కీ మాట్లాడుతూ 'అమెరికా నుంచి సాయం 100 బిలియన్ డాలర్లు మాత్రమే. 500 బిలియన్ డాలర్లు కాదు. ఉక్రెయిన్‌కు అందింది 100 బిలియన్ డాలర్లు మాత్రమే. అందుకు మేం కృతజ్ఞత తెలుపుతున్నాం. యుద్ధంలో ఇప్పటి వరకు 320 బిలియన్ డాలర్ల వ్యయం అయ్యింది. అందులో 120బిలియన్ డాలర్లు ఉక్రెయిన్ తన ప్రజల నుంచే సమకూర్చుకుంది. 100బిలియన్ డాలర్లు ఐరోపా నుంచి అందింది' అన్నారు. రక్షణ సాయం అందిస్తున్నందుకు ప్రతిగా అమెరికాకు సహజ వనరులను అందించేందుకు ట్రంప్‌తో తాను చర్చలు జరుపుతున్నట్టు తెలిపారు. అయితే, ఉక్రెయిన్ ప్రజలు పదితరాలపాటు అమెరికాకు తిరిగి చెల్లించేలా ఎలాంటి ఒప్పందం పైనా తాను సంతకం చేయబోనన్నారు. ఒప్పందం ఉక్రెయిన్‌కు భద్రతా పరమైన గ్యారెంటీలు ఉండాలని, ఇరుదేశాలకూ ప్రయోజనకరంగా ఉండాలని పేర్కొన్నారు.

యుద్ధ ఖైదీలందరి విడుదల! రష్యాకు జెలెన్‌స్కీ ప్రతిపాదన

యుద్ధాన్ని ముగించేందుకు పరస్పరం యుద్ధ ఖైదీలందరినీ విడుదల చేద్దామని రష్యాకు జెలెన్‌స్కీ ప్రతిపాదన చేశారు. ఇరుదేశాల మధ్య యుద్ధం ప్రారంభమై మూడేళ్లయిన సందర్భంగా సోమవారం కీవ్‌లో ఓ సదస్సులో జెలెన్‌స్కీ మాట్లాడారు. ఉక్రెనియన్లందరినీ రష్యా విడుదల చేయాలని, బదులుగా తమ వద్ద బందీగా ఉన్న రష్యన్లందరినీ విడుదల చేసేందుకు సిద్ధమన్నారు.

లోకం తీరు



భారత్‌ను ఓడించకపోతే నా పేరు షెహబాజే కాదు!

» మా అన్న మీద ఒట్టేసి చెబుతున్నా

» బహిరంగ సభలో పాక్ ప్రధాని వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: బహిరంగ సభల్లో అత్యుత్సాహంతో ప్రసంగిస్తారన్న పేరున్న పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్.. తాజాగా తన పేరునే మార్చుకుంటానంటూ ప్రతిజ్ఞ చేసే స్థాయిలో ఉపన్యాసం ఇచ్చారు. భారత్‌ను ఆర్థికంగా, అభివృద్ధి పరంగా ఓడించకపోతే తనను షెహబాజ్ షరీఫ్ అన్న పేరుతో పిలవద్దన్నారు. పంజాబ్ ప్రావిన్స్‌లోని డేరా ఘాజీ ఖాన్‌లో ఇటీవల జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. పిడికిలి పైకెత్తడం, గాలిలో చేతులు ఊపడం, వేదికమీద గెంతడం, ఛాతీపై కొట్టుకోవడం, పోడియం డెస్కును కొట్టడం వంటి విన్యాసాలు ప్రదర్శించారు. సామాన్యుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కఠోరంగా శ్రమిస్తోందని చెబుతూ "పాకిస్థాన్ పరిస్థితిని మెరుగుపరిచేందుకు రాత్రింబవళ్లు కష్టపడుతున్నాం. పరమాత్మ ఆశీస్సులు ఎల్లప్పుడూ పాకిస్థాన్‌కు ఉన్నాయి" అని చెబుతూ ఆకస్మాత్తుగా తన ప్రసంగాన్ని భారత్‌వైపు మళ్లించారు. "మనందరి కృషి కారణంగా అభివృద్ధి, పురోగతి విషయంలో భారత్ మనకన్నా వెనుకన ఉండకపోతే నా పేరు షెహబాజ్ షరీఫ్ కాదు" అని అన్నారు. తన పెద్దన్న పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌పై ప్రమాణం చేసి ఈ విషయాన్ని చెబుతున్నానని పేర్కొన్నారు. ఈ ప్రసంగం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో విమర్శలు వెల్లువెత్తాయి. క్షేత్రస్థాయిలో ఎలాంటి ప్రగతి లేకున్నా పెద్దపెద్ద వాగ్దానాలు చేస్తున్నారని పలువురు విమర్శించారు.

క్యాన్సర్ కోరల్లో..

(మొదటి పేజీ తరువాయి)



తెలిసింది. గ్లోబల్ క్యాన్సర్ అబ్జర్వేటరీ (గ్లోబోకాన్ 2022)లో, గ్లోబల్ హెల్త్ అబ్జర్వేటరీలో.. 36 రకాల క్యాన్సర్ కేసులకు సంబంధించి అందుబాటులో ఉన్న రెండు దశాబ్దాలకు పైబడిన సమాచారాన్ని విశ్లేషించడం ద్వారా ఐసీఎంఆర్ ఈ అధ్యయన నివేదికను రూపొందించింది. అది 'లాన్సెట్ రీజనల్ హెల్త్ సౌత్ ఈస్ట్ ఆసియా'లో ప్రచురితమైంది. ఆ నివేదిక ప్రకారం.. అమెరికాలో ప్రతి నలుగురు క్యాన్సర్ బాధితుల్లో ఒకరు చనిపోతుండగా.. చైనాలో ప్రతి ఇద్దరు క్యాన్సర్ పేషెంట్లలో ఒకరు మృత్యువాత పడుతున్నారు. భారత్‌లో అంత కంటే ఎక్కువ చనిపోతున్నారు.

- ప్రపంచవ్యాప్తంగా ఏటా నమోదవుతున్న క్యాన్సర్ సంబంధిత మరణాల్లో 10 శాతం భారతీయులవే.
- రానున్న రెండు దశాబ్దాల్లో క్యాన్సర్ మరణాల సంఖ్యను నిరోధించడం భారత్‌కు పెనుసవాల్‌గా మారబోతోంది. దేశ ప్రజల సగటు వయసు పెరగడం వల్ల ఏటా క్యాన్సర్ మరణాల్లో 2 శాతం పెరుగుదల నమోదు కానుంది.
- దేశంలో నమోదవుతున్న క్యాన్సర్ కేసుల్లో 44 శాతం.. కేవలం ఐదు రకాల క్యాన్సర్లకు చెందినవే.
- మహిళల్లో రొమ్ము క్యాన్సర్ కేసులు (మొత్తం కేసుల్లో 40%.. మరణాల్లో 24%), గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ కేసులు (మొత్తం కేసుల్లో 19%.. మరణాల్లో 20%) ఎక్కువ ఉండగా.. పురుషుల్లో నోటి క్యాన్సర్ కేసులు (16%), శ్వాసకోశ క్యాన్సర్లు (8.6%), ఆహారనాళ క్యాన్సర్లు (6.7%) ఎక్కువ ఉంటున్నాయి.
- దేశంలో అత్యధికంగా నమోదవుతున్న క్యాన్సర్లలో 13.8 శాతం రొమ్ము క్యాన్సర్ కేసులే. 9.2 శాతంతో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కేసులు రెండో స్థానంలో ఉన్నాయి.
- వయసుల వారీగా చూస్తే 70ఏళ్లు దాటిన వారిలో క్యాన్సర్ కేసుల శాతం ఎక్కువగా ఉంది. తర్వాత, 15-49ఏళ్ల వారిలో క్యాన్సర్ ఎక్కువగా వస్తోంది. 20 శాతం క్యాన్సర్ మరణాలు కూడా ఈ వయసువారిలోనే ఎక్కువగా నమోదవుతున్నాయి.

ఊబకాయంపై 'దశ'దిశగా పోరు

» విస్తృత ప్రచారానికి ప్రధాని శ్రీకారం

» ఒమర్ అబ్దుల్లా, ఆనంద్ మహీంద్రా, మోహన్‌లాల్ సహా 10 మంది ప్రముఖుల నియామకం

» తాము కూడా పది మంది చొప్పున నామినేట్ చేసిన ప్రముఖులు



ఆనంద్ మహీంద్రా



సుధామూర్తి



ఒమర్ అబ్దుల్లా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్న ఊబకాయంపై మన్ కీ బాత్‌లో ప్రస్తావించిన మరుసటి రోజే.. ప్రధాని మోదీ ఆ సమస్య నియంత్రణకు శ్రీకారం చుట్టారు. ఊబకాయంపై యుద్ధం చేయడంలో సహాయపడటానికి, విస్తృత ప్రచారానికి వివిధ రంగాలకు చెందిన 10 మంది ప్రముఖులను నియమించారు. ఈ విషయాన్ని సోమవారం ఆయన ఎక్స్ వేదికగా వెల్లడించారు. "ఊబకాయంపై పోరాటానికి మరింత శక్తిని సమకూర్చేందుకు, ఆహారంలో వంట నూనెల వినియోగాన్ని తగ్గించడంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వీరిని నియమిస్తున్నాను. వారిని మరో 10 మందిని నామినేట్ చేయమని కోరుతున్నారు. తద్వారా ఈ ఉద్యమం మరింత పెద్దది అవుతుంది" అని పోస్టులో ఆ జాబితాను మోదీ ప్రకటించారు. వారిలో జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్ర, నటులు మోహన్‌లాల్, ఆర్ మాధవన్, గాయని శ్రేయా గోషాల్, భోజ్‌పురి గాయకుడు, నటుడు నిరాహువ, షూటింగ్ చాంపియన్ మను భాకర్, వెయిట్‌లిఫ్టర్ మీరాబాయ్ చాను, ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకుడు నందన్ నీలేకని, ఎంపీ సుధామూర్తి ఉన్నారు. మోదీ ప్రకటనపై వీరు వెంటనే ప్రతిస్పందించారు. తమను నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఊబకాయంపై ప్రచారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు తమ తరఫున వారు కూడా 10 మంది చొప్పున నామినేట్ చేశారు. ప్రచారానికి కొనసాగింపుగా తాము ప్రతిపాదించిన ఆ 10 మంది మరో పది మందిని నామినేట్ చేయాలని కోరారు. ఆదివారం మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ ఊబకాయం సమస్యపై మాట్లాడిన విషయం తెలిసిందే. వంట నూనెల వినియోగం పది శాతం తగ్గించాలని, ఆ విషయం చెప్పి మరో పది మందికి సవాల్ విసరాలని ఆయన కోరారు.

ఊబకాయం.. పెరిగిపోతోంది

ఊబకాయంతో ఆరోగ్యానికి ప్రమాదమని డబ్ల్యూహెచ్‌వో పేర్కొంది. బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) 25 కంటే ఎక్కువ ఉంటే దానిని అధిక బరువుగానూ, 30 కంటే ఎక్కువ ఉంటే దానిని ఊబకాయంగానూ పరిగణిస్తారు. అయితే భారత్‌లో ఊబకాయానికి సంబంధించి ప్రమాద ఘంటికలు మోగుతున్నాయని గతేడాది లాన్సెట్ జర్నల్‌లో ప్రచురించిన ఓ అధ్యయనం తెలిపింది. ఇది యువతలో ఎక్కువ అవుతోందని హెచ్చరించింది. ఇప్పటికే అసాంక్రమిక వ్యాధులైన గుండె జబ్బులు, స్ట్రోక్స్ మధుమేహంతో భారతీయులు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. ఊబకాయం కూడా ఉంటే ఆ జబ్బుల తీవ్రత యువతలో మరింత పెరుగుతుంది. యుక్తవయసులోనే టైప్2 మధుమేహం బారిన పడే ప్రమాదం ఉంటుంది. దేశంలో ఇప్పటికే 10 కోట్ల మంది ఊబకాయంతో బాధపడుతున్నారు. కొన్ని రకాల కేన్సర్ల రిస్క్ కూడా ఊబకాయంతో పెరుగుతుంది. గుండెలో మంట, గాల్ బ్లాడర్ వ్యాధులు, లివర్ సమస్యలు తలెత్తుతాయి. నిద్రలో కొంచెం సేపు ఊపిరి ఆగిపోయి మళ్లీ మొదలయ్యే స్లీప్ అప్నియా ప్రమాదం ఊబకాయుల్లో చాలా ఎక్కువ.

ఇవీ లెక్కలు..

- *2019-21 జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం 24% మహిళలు, 22.9% పురుషులు ఊబకాయులుగా ఉన్నారు.*
- *ప్రపంచ వ్యాప్తంగా ఊబకాయులు ఎక్కువగా ఉన్న దేశాల్లో అమెరికా, చైనా తర్వాత భారత్ మూడో స్థానంలో ఉంది.*
- *2035కి ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 330 కోట్ల మంది ఊబకాయ బాధితులు ఉంటారని అంచనా. వీరిలో 77 కోట్ల మంది 5-19 ఏళ్ల మధ్య వారే ఉంటారు.*
- *గతేడాది లాన్సెట్ జర్నల్ అధ్యయనంలో పేర్కొన్న ప్రకారం.. 2022 నాటికి భారత్‌లో 1.25 కోట్ల మంది 5 నుంచి 19 ఏళ్ల మధ్య బాలలు అధిక బరువు ఉన్నారు.*
- *2030 కల్లా ప్రపంచ వ్యాప్తంగా ఊబకాయ బాధిత పిల్లల్లోని ప్రతి 10 మందిలో ఒకరు భారత్‌లో ఉంటారని యూనిసెఫ్ ఒబేసిటి అట్లాస్-22 పేర్కొంది. ఆ సమయానికి భారత్‌లో 2.7 కోట్ల మందికి మించి ఊబకాయ పిల్లలు ఉంటారని అంచనా వేసింది.*

కరువు నేలలో ఏఐ సేద్యం

ఓ రైతు వీడియోను పంచుకున్న సత్య నాదెళ్ల

» మహారాష్ట్రలోని బారామతిలో సాగుకు ఏఐ జోడింపు

» ఉష్ణోగ్రతలు, భూసారంపై డేటాను వాడుకుని అధిక ఉత్పాదకత సాధించిన ఓ చెరకు రైతు

రైతు సురేశ్ జగ్‌తప్



వాషింగ్టన్, ఫిబ్రవరి 24: వ్యవసాయానికి కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను జోడించి అద్భుతాలు సృష్టించిన ఓ రైతు వీడియోను మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల పంచుకున్నారు. కరువు, నీటి ఎద్దడిని తీవ్రంగా ఎదుర్కొంటున్న మహారాష్ట్రలోని బారామతిలోని బట్టీస్ షిరాలా ప్రాంతంలో సన్నకారు రైతులు ఏఐ సాయంతో మంచి దిగుబడిని సాధించినట్టు 'ఎక్స్'లో ఆయన తెలిపారు. దీనిపై టెస్లా అధినేత ఎలాన్ మస్క్ స్పందించారు. "ఏఐ ప్రతిదానినీ మెరుగుపరుస్తుంది" అంటూ ఆయన హర్షం వ్యక్తం చేశారు. నిజానికి, బారామతిలో గత రెండేళ్లుగా మైక్రోసాఫ్ట్ వ్యవసాయ ప్రయోగాలు చేస్తోంది. కరువు, అప్పులు, విపరీతంగా పురుగుమందుల వినియోగంతో పెరిగిన పెట్టుబడి వ్యయాలు, ఆత్మహత్యలతో ఈ ప్రాంత రైతులు దీనస్థితిలో ఉండేవారు. వారి పంటలను తెగుళ్లు ఆశించేవి. ఈ పరిస్థితుల్లో ఇక్కడి సాగులోకి ఏఐ పరికరాలను మైక్రోసాఫ్ట్ ప్రవేశపెట్టింది. ఇందులోభాగంగా ప్రాంత ఉష్ణోగ్రతలు, భూసారంపై ఏఐ అందించిన సమాచారం ఆధారంగా చెరకు పంట వేసి ఓ రైతు మంచి ఫలితాలు సాధించారు. తక్కువగా దొరికే నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటూ, పురుగుమందుల వాడకం బాగా తగ్గించి ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తిని ఆయన తీయగలిగారని సత్య నాదెళ్ల తెలిపారు. భారత వ్యవసాయ రంగంలో ఏఐ సమర్థ వర్తింపునకు ఇది మంచి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. "వ్యవసాయ రంగంపై కూడా ఏఐ వేయగల ప్రభావానికి ఇదొక అద్భుత ఉదాహరణ. బారామతి సహకార సంఘంలో సభ్యులుగా ఉన్న రైతులకు ఏఐపై అవగాహన కల్పించాం. శక్తివంతమైన ఈ సాంకేతికను ఎలా వినియోగించుకోవాలో తెలియజేశాం. డ్రోన్లు, శాటిలైట్లు అందించిన భౌగోళిక ప్రాదేశిక సమాచారాన్ని వారు వాడుకున్నారు. తమ సేద్యాన్ని మెరుగుపరుచుకున్నారు" అని సత్య నాదెళ్ల వివరించారు. అగ్రికల్చర్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఏడీటీ) సాయంతో బారామతిలో మైక్రోసాఫ్ట్ ఈ ప్రయోగాలు చేపడుతోంది.

పెరిగిన దిగుబడి.. తగ్గిన ఖర్చులు..

బారామతి వ్యవసాయంలో కృత్రిమ మేధ అద్భుతమైన ఫలితాలను ఇచ్చింది. సక్రమమైన వ్యవసాయ పద్ధతులను అవలంబించడం, సకాలంలో నిర్ణయాలు తీసుకోవడం వల్ల పంట దిగుబడులు 20 శాతం పెరిగాయి. ఎరువుల ఖర్చులు 25 శాతం తగ్గాయి. నీటి వినియోగం 8 శాతం తగ్గింది. మెరుగైన పర్యవేక్షణ, నిర్వహణ ఫలితంగా కోత అనంతర నష్టాలు 12 శాతం తగ్గాయి. ఇవన్నీ రైతుల ఆదాయాన్ని పెంచడమే కాకుండా వనరుల వృథాను, రసాయనాల వాడకాన్ని తగ్గించాయి. తద్వారా పర్యావరణ సుస్థిరతకు ప్రోత్సాహం అందించినట్టయింది.

బారామతిలో ఏఐ వినియోగం ఇలా..

మైక్రోసాఫ్ట్‌కు చెందిన అజూర్ డేటా మేనేజర్ ఫర్ అగ్రికల్చర్ (ఏడీఎంఏ) సహకారంతో డేటా ఆధారిత పరిష్కారాలకు మార్గం సుగుమమైంది. శాటిలైట్లు, వాతావరణ కేంద్రాలు, సాయిల్ సెన్సర్ల ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా రైతులకు వారి భూమి గురించి సమగ్రమైన అవగాహన కల్పించారు. నేలలోని తేమ, ఉష్ణోగ్రతలు, గాలిలో తేమ, పోషకస్థాయిలు ఇలా అన్ని రకాల వివరాలనూ అగ్రిపైలట్.ఏఐ అనే మొబైల్ యాప్ ద్వారా రైతులకు అందించారు. ఈ సమాచారమంతా స్థానిక భాషలోనే ఉండడంతో రైతులకు దాన్ని అర్థం చేసుకోవడం తేలికైంది. ఏఐ ఆల్గరిథమ్స్ ఈ డేటాను విశ్లేషించి విత్తనాలు ఎప్పుడు నాటాలి, ఏ సమయంలో ఎంత నీరందించాలి, తెగుళ్ల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే విషయాలను రియల్‌టైమ్‌లో విశ్లేషించి రైతులకు తెలియజేసింది.



పెన్సిల్ ముల్లుపై శివతాండవం

సూక్ష్మ కళలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించిన అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం చిన దొడ్డిగల్లుకు చెందిన గట్టెం వెంకటేశ్ మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పెన్సిల్ ముల్లుపై పరమేశ్వరుడి రూపాన్ని తీర్చిదిద్దారు. 18 మి.మీ పొడవు, 8 మి.మీ వెడల్పులో రూపొందించిన శివుని తాండవం భంగిమ అందరినీ ఆకర్షిస్తోంది. -నక్కపల్లి, ఆంధ్రజ్యోతి



శ్రీగిరిలో వైభవంగా పుష్ప పల్లకీ సేవ

శ్రీశైలం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో మల్లికార్జునస్వామి దేవేరి భ్రామరీతో కలిసి పూల పల్లకిలో విహరించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఆరో రోజు సోమవారం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజల అనంతరం పుష్ప పల్లకీలో కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు.



హంస, యాళి వాహనాలపై శివపార్వతుల విహారం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా సోమవారం ఉదయం బంగారు హంసపై వాయులింగేశ్వరుడు.. బంగారు యాళి వాహనంపై జ్ఞానప్రసూనాంబ అమ్మవారు విహరించారు. రాత్రి రావణ, నెమలి వాహనాలపై ఊరేగుతూ దర్శనమిచ్చారు. ప్రభుత్వం తరపున మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మంగళవారం పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం

తిరుమల, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు సోమవారం రూ.10 లక్షలు విరాళంగా అందింది. హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాసులురెడ్డి ఈ విరాళాన్ని అందజేశారు. ఈ మొత్తానికి సంబంధించిన డీడీని తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందించారు. కాగా, గతంలో టీటీడీకి చెందిన వివిధ ట్రస్టులకు శ్రీనివాసులురెడ్డి రూ.30 లక్షలు విరాళంగా అందజేశారు.



అదనపు ఈవోకు విరాళం డీడీ అందజేస్తున్న దాత

సినీనటి మాధవీలతపై కేసు నమోదు

తాడిపత్రి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): సినీ నటి మాధవిలతపై కేసు నమోదు చేశామని అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణ సీఐ సాయిప్రసాద్ సోమవారం తెలిపారు. డిసెంబరు 31న తాడిపత్రి జేసీ పార్కులో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలకు సంబంధించి మాధవిలత చేసిన వ్యాఖ్యలు మహిళలను కించపరిచేలా ఉన్నాయని ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కమలమ్మ ఫిర్యాదు చేశారని చెప్పారు.

1008 కేజీల లడ్డూతో శివలింగం

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని 1008 కేజీల లడ్డూతో తయారు చేసిన శివలింగం విశేషంగా ఆకట్టుకుంది. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన ఓ స్వీట్ షాపు వ్యాపారికి పేరేచర్ల సమీపంలోని కైలాసగిరి క్షేత్రంలో నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలకు భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేసేందుకు లడ్డూ తయారీకి ఆర్డర్ లభించింది. షాపు నిర్వాహకులు వినూత్నంగా ఆలోచించి లడ్డూతో ఆరు అడుగుల ఎత్తు, నాలుగు అడుగుల వెడల్పుతో శివలింగాకారాన్ని రూపుదిద్దారు. కైలాసగిరిలో ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. -తెనాలి రూరల్, ఆంధ్రజ్యోతి



మిర్చి క్వింటా రూ. 11,781

(మొదటి పేజీ తరువాయి)

నేపథ్యంలో రైతుల్ని ఆదుకోవాలని సీఎం చంద్రబాబు కేంద్రానికి లేఖలు రాసిన విషయం తెలిసిందే. దీనిపై కేంద్రం స్పందించింది. ఎంఐఎస్ అమలు చేస్తున్నట్లు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ డిప్యూటీ కమిషనర్ బినోద్ గిరి వెల్లడించారు. ఈ మేరకు కేంద్రం రూపొందించిన మార్గదర్శకాలను రాష్ట్ర వ్యవసాయశాఖ ఎక్స్ అఫీషియో స్పెషల్ సీఎస్ రాజశేఖర్‌కు సోమవారం ఆయన పంపారు. ఉత్పత్తిలో 25%, ఎంఐఎస్‌లో గరిష్ఠంగా 2,58,238 మెట్రిక్ టన్నుల మిర్చికి ధర లోటు చెల్లింపు అమలు చేయనున్నారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ ప్రైస్ (ఎంఐపీ) కింద క్వింటా మిర్చి రూ. 11,781గా కేంద్రం ధర నిర్ణయించింది. దీని ప్రకారం వ్యవసాయ, ఉద్యానశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఏర్పాటైన కవిటీ విక్రయ ధరను నిర్ణయిస్తుందని పేర్కొంది. ఎంఐపీ, అమ్మకం ధర మధ్య వ్యత్యాసం చెల్లింపు గరిష్ఠ పరిమాణంలోని 25% వరకు ఉంటుందని తెలిపింది. ధర లోటు చెల్లింపుల కింద ప్రయోజనం పొందే రైతులు రాష్ట్రంలోని నోటిఫైడ్ మార్కెట్ యార్డుల్లోనే మిర్చిని విక్రయించాలని స్పష్టం చేసింది. 2024-25 సీజన్‌లో మిర్చికి ఎంఐఎస్ కింద ధర లోటు చెల్లింపు అమలు వ్యవధి మొదటి లావాదేవీ నుంచి ఒక నెల మాత్రమే ఉంటుందని తెలిపింది. ధర లోటు చెల్లింపు అమలులో సంభవించే నష్టాలు 50:50 నిష్పత్తిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరించాల్సి ఉంటుందని లేఖలో వివరించారు. అలాగే ఈ సీజన్‌లో ఎంఐఎస్ కింద మిర్చి కవరేజ్ కోసం వ్యాపారుల జాబితాను ప్రైస్ డెఫిషియెన్సీ పేమెంట్(పీడీపీ) ద్వారా తెలియజేయాలని, అమ్మకం ధర, ఎంఐపీ మధ్య తేడాను నిర్ణయించడానికి అగ్‌మార్క్‌నెట్ పోర్టల్, ప్రభుత్వ ఈ-క్రాప్ సమాచారాన్ని పరిగణనలోకి తీసుకుంటామని తెలిపింది. వ్యత్యాస ధర చెల్లింపును నేరుగా రైతుల ఖాతాలకు జమ చేయడానికి పెట్టుబడి వ్యయం నిర్ధారణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం వహించాలని, రాష్ట్ర ప్రభుత్వ రీయింబర్స్‌మెంట్‌కు మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం అమలు తర్వాత ఖాతా వివరాలు, తగిన పత్రాలను కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖకు సమర్పించాలని, కాస్టింగ్ సెల్, వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ ద్వారా ఖాతాల పరిశీలన తర్వాత రీయింబర్స్‌మెంట్ అవుతుందని డిప్యూటీ కమిషనర్ బినోద్ గిరి స్పష్టం చేశారు.



మిర్చి రైతుకు న్యాయం చేసింది కూటమి ప్రభుత్వమే

- గత పాలకులు కేసుల మాఫీ కోసం రాజీ పడ్డారు
- మేం రాష్ట్ర ప్రయోజనాల కోసం కట్టుబడి ఉన్నాం: లోకేశ్



అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మిర్చి రైతులను ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. గత పాలకులు కేసుల మాఫీ కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడితే... చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం పరితపిస్తోంది' అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఈమేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 'మిర్చి రైతుకు న్యాయం చేసేందుకు మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం ఆర్థిక భారాన్ని భరించేలా నిర్ణయం తీసుకున్నాయి. మిర్చి రైతులకు క్వింటాకు కనీస మద్దతు ధర రూ.11,781 చెల్లించేందుకు కేంద్రం అంగీకరించింది. 2024-25లో రైతులు పండించిన 2.58 లక్షల టన్నుల మిర్చిని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలని నిర్ణయించడం హర్షణీయం. సీఎం వినతిపై పెద్ద మనసుతో సానుకూలంగా స్పందించిన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు కృతజ్ఞతలు' అని లోకేశ్ పేర్కొన్నారు.

పెరిగిన ఉష్ణోగ్రత.. కర్నూలులో 38.2 డిగ్రీలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉష్ణోగ్రత క్రమేపీ పెరుగుతోంది. వాయవ్య భారతం నుంచి మధ్య భారతం మీదుగా రాష్ట్రంలో పలు ప్రాంతాలకు పొడి గాలులు వీస్తున్నాయి. దీంతో రాయలసీమ, కోస్తాల్లోని అనేక ప్రాంతాల్లో సోమవారం వేడి వాతావరణం కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. కర్నూలులో 38.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న రెండు రోజుల్లో రాయలసీమ, కోస్తాలో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు ఎక్కువగా నమోదవుతాయని వాతావరణ శాఖ తెలిపింది.

ఉర్దూ అకాడమీ నిధుల గోల్‌మాల్ కేసులో ఇద్దరి అరెస్టు

అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఉర్దూ అకాడమీలో నిధుల గోల్‌మాల్‌కు సంబంధించిన కేసులో ఇద్దరు నిందితులను సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ మస్తాన్ వలీ(రిటైర్డ్)తోపాటు ప్రస్తుతం తెలంగాణలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తోన్న జాఫర్ రూ.3.92 కోట్ల మేర అక్రమాలకు పాల్పడినట్లు గతంలో సీఐడీ కేసు నమోదు చేసింది. ఆ సొమ్ము సుమారు 67మంది ఖాతాల్లోకి వెళ్లినట్లు దర్యాప్తులో తేలడంతో జాఫర్ బంధువులైన సహిదుల్లా బేగ్, ఖలీల్ బేగ్‌లను గుంటూరులో సీఐడీ అధికారులు అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయస్థానం రిమాండ్ విధించడంతో వారిని నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించినట్టు సీఐడీ అధికారులు తెలిపారు.



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

శ్రీశైలంలో నేడు మల్లన్నను దర్శించుకోనున్న గవర్నర్

సున్నిపెంట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైల మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్ల దర్శనార్థం రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ సోమవారం కుటుంబ సమేతంగా శ్రీశైలం వచ్చారు. అమరావతి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి సాయంత్రం 5.10 గంటలకు సున్నిపెంటలోని హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ గవర్నర్‌కు మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ కుటుంబ సభ్యులు శ్రీశైలం భ్రమరాంబ అతిథి గృహానికి చేరుకున్నారు. మంగళవారం ఉదయం గవర్నర్ కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకోనున్నారు.

టెన్త్ విద్యార్థులకు గ్రాండ్ టెస్ట్

- మార్చి 3 నుంచి 13 వరకు.. మొదటిసారి నిర్వహణ

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు ముందు గ్రాండ్ టెస్ట్ నిర్వహించాలని ఆదేశిస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు ఉత్తర్వులు జారీచేశారు. వందరోజుల కార్యాచరణ ప్రణాళిక అమలులో భాగంగా ఈ మేరకు గ్రాండ్ టెస్ట్ తేదీలు ప్రకటించారు. మార్చి 3న ప్రథమ భాష, 4న ద్వితీయ భాష, 5న ఇంగ్లీష్, 7న గణితం, 10న ఫిజికల్ సైన్స్, 11న బయలాజికల్ సైన్స్, 13న సోషల్ స్టడీస్ పరీక్షలు నిర్వహించనున్నారు. 6, 12 తేదీల్లో ఒకేషనల్, ఓపెన్ స్కూల్ విద్యార్థులకు పరీక్షలు ఉంటాయి. గ్రాండ్ టెస్ట్ ముగిసిన మూడు రోజులకు టెన్త్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటివరకూ పబ్లిక్ పరీక్షలకు ముందు ప్రీఫైనల్ పరీక్షల విధానం మాత్రమే ఉంది. అయితే విద్యార్థులంతా మొదటిసారి ఇంగ్లీష్ మీడియంలో ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ పరీక్షలు రాస్తున్నందున సన్నద్ధత కోసం మొదటిసారి గ్రాండ్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నారు.

బయోమెట్రిక్ అప్‌డేట్ మానిటరింగ్‌కు కమిటీ

అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పిల్లల తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్(ఎంబీయూ) మానిటర్ చేసేందుకు గ్రామ, వార్డు సచివాలయశాఖ కొంతమంది అధికారులతో కమిటీని ఏర్పాటుచేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్, మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్, మహిళా శిశుసంక్షేమశాఖ డైరెక్టర్, పాఠశాల విద్య డైరెక్టర్, ఇంటర్ విద్య డైరెక్టర్, టెక్నికల్ విద్య డైరెక్టర్ సభ్యులుగా, గ్రామ, వార్డు సచివాలయశాఖ డైరెక్టర్‌ను మెంబర్ కన్వీనర్‌గా నియమిస్తూ ఆదేశాలిచ్చారు. గ్రామ, వార్డు సచివాలయశాఖ డైరెక్టర్ ఏడాదిలో రెండుసార్లు పాఠశాలలు, కళాశాలల్లో క్యాంపులు ఏర్పాటుచేసి ఎంబీయూ నిర్వహించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేవీ గూఢచర్యం కేసు.. భార్యాభర్తలకు ఐదున్నరేళ్ల జైలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నేవీ గూఢచర్యం కేసులో భార్యాభర్తలకు ఐదున్నర సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ విశాఖపట్నంలోని ఎన్ఐఏ కోర్టు సోమవారం తీర్పు చెప్పింది. రూ.5 వేలు జరిమానా కూడా విధిస్తూ.. చెల్లించకపోతే అదనంగా మరో ఏడాది జైలులో ఉండాలని స్పష్టం చేసింది. భారత నౌకాదళానికి చెందిన రహస్యాలను పాకిస్థాన్‌కు చేరవేయడంలో అబ్దుల్ రెహమాన్, షాయిస్తా ఖైజర్ అనే భార్యాభర్తలు కీలకపాత్ర పోషించారని ఎన్ఐఏ అభియోగం మోపింది. ఈ కేసులో 2019 డిసెంబరు, 2020 జూన్ మధ్య 15 మందిని అరెస్టు చేయగా, అందులో ఈ ఇద్దరు కూడా ఉన్నారు. వీరిపై చార్జిషీట్ నమోదైంది. విదేశీ ఇంటెలిజెన్స్‌కు ఏజెంట్లుగా వ్యవహరించారని, పాక్‌లో ఉన్న బంధువుల ద్వారా అక్కడి ఏజెంట్లతో సంబంధాలు పెట్టుకున్నారని పేర్కొంది. 2018 ఆగస్టు 14, సెప్టెంబరు 1 తేదీల్లో పాకిస్థాన్ వెళ్లారని, అక్కడి ఏజెంట్ల ఆదేశం ప్రకారం ఆన్‌లైన్ ద్వారా డబ్బులను వివిధ ఖాతాలకు పంపించారని వెల్లడించింది. వారంతా భారత నౌకాదళ రహస్య సమాచారం చేరవేసినవారు కావడంతో ఈ భార్యాభర్తలకు కోర్టు శిక్ష విధించింది.

ఏఆర్ డెయిరీ ఎండీకి చుక్కెదురు

- కల్తీ నెయ్యి కేసులో బెయిల్ పిటిషన్ డిస్మిస్
- తీర్పు వెలువరించిన తిరుపతి కోర్టు

తిరుపతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కల్తీ నెయ్యి కేసులో రెండో ప్రధాన నిందితుడు, ఏఆర్ డెయిరీ ఎండీ రాజశేఖరన్‌కు కోర్టులో చుక్కెదురైంది. ఆయన బెయిల్ పిటిషన్‌ను తిరుపతి 2వ ఏడీఎం కోర్టు సోమవారం డిస్మిస్ చేసింది. మిగిలిన ముగ్గురు నిందితులకు సంబంధించిన బెయిల్ పిటిషన్‌తో పాటు ఇద్దరు నిందితులను కస్టడీకి తీసుకునే విషయమై సిట్ దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం వాదనలు జరగనున్నాయి. కల్తీ నెయ్యి కేసులో ఈనెల 9న సిట్ బృందం అరెస్టు చేసిన నలుగురు నిందితులకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఆ మరుసటి రోజు తిరుపతి కోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఏ2, ఏఆర్ డెయిరీ ఎండీ సంబంధించిన పిటిషన్‌పై గురువారం కోర్టులో వాదనలు జరిగాయి. రాజశేఖరన్ ఆరోగ్య పరిస్థితి బాగా లేదని, హృదయ సంబంధ సమస్యలతో బాధపడుతున్నారని కాబట్టి బెయిల్ మంజూరు చేయాలంటూ అతడి తరఫు న్యాయవాది వాణి కోర్టును కోరారు. కల్తీ నెయ్యి కేసులో రాజశేఖరన్ కీలక నిందితుడని, ఆయనకు తీవ్రమైన ఆరోగ్య సమస్యలేవీ లేవని సిట్ తరఫున ఏపీపీ జయశేఖర్ వాదించారు. వైద్యులు ఇచ్చిన నివేదికలను కూడా కోర్టు దృష్టికి తెచ్చారు. కీలక నిందితుడైనందున అతన్ని బెయిల్‌పై విడుదల చేస్తే సాక్ష్యాధారాలను తారుమారు చేసే అవకాశముందన్నారు. వాదనలు ముగిశాక తీర్పును కోర్టు రిజర్వు చేసింది. రాజశేఖరన్ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ సోమవారం తీర్పును వెల్లడించింది. కాగా ఈ కేసులో మిగిలిన నిందితులైన పొమిల్ జైన్, విపిన్ జైన్, అపూర్వ వినయ్‌కాంత్ చావడాల తరఫున న్యాయవాది అర్చన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరగనుంది. అలాగే ఇదివరకూ నిందితులు నలుగురినీ ఐదు రోజుల పాటు కస్టడీకి తీసుకుని విచారించిన సందర్భంలో పొమిల్ జైన్, అపూర్వ వినయ్‌కాంత్ చావడాలు విచారణకు సహకరించలేదని, ఆ కారణంగా వారిని తిరిగి కస్టడీకి తీసుకుని విచారించేందుకు అనుమతి ఇవ్వాలంటూ సిట్ దాఖలు చేసిన పిటిషన్‌పై కూడా వాదనలు జరగనున్నాయి.

తిరుపతి తొక్కిసలాటపై వర్చువల్ విచారణ

- హాజరైన విశాఖకు చెందిన బాధితులు
- నేడు కూడా కొనసాగనున్న విచారణ



గోపాలపట్నం తహశీల్దార్ కార్యాలయంలో విచారణకు వచ్చిన బాధితులు

ఎన్ఏడీ జంక్షన్ (విశాఖపట్నం), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనపై జ్యుడీషియల్ విచారణ కొనసాగుతోంది. జస్టిస్ సత్యనారాయణమూర్తి సోమవారం విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చేపట్టిన విచారణలో విశాఖకు చెందిన బాధితులు, మృతుల బంధువులు పాల్గొన్నారు. విచారణకు రావాలని 30 మందికి నోటీసులు ఇవ్వగా.. గోపాలపట్నం మండల పరిధిలోని 19 మందికి గాను 18మంది తహశీల్దార్ కార్యాలయం నుంచి కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. విజయనగరం, ఇతర మండలాల నుంచి మరో ముగ్గురు హాజరయ్యారు. తొక్కిసలాట ఘటన ఎలా జరిగింది? ఏ సమయంలో జరిగింది? మీరు గమనించిన లోపాలు ఏంటి? తదితర అంశాలను జస్టిస్ సత్యనారాయణమూర్తి అడిగి తెలుసుకున్నట్టు సమాచారం. ఈ విచారణ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కొనసాగిందని గోపాలపట్నం తహశీల్దార్ సి.హెచ్.రమేష్ పేర్కొన్నారు. మంగళవారం కూడా జస్టిస్ సత్యనారాయణమూర్తి వర్చువల్ విధానంలో విచారణ జరుపుతారు. పాలకొల్లు నుంచి కొందరు, విశాఖపట్నం నుంచి మరికొందరు ఈ విచారణకు హాజరుకానున్నారు. అలాగే, తొక్కిసలాటలో గాయపడిన కేరళ, తమిళనాడుకు చెందిన వారిని కూడా ఈ నెల 27న విజయవాడ నుంచి వర్చువల్‌గా విచారించనున్నారు.

విద్యుదాఘాతంతో నలుగురు దుర్మరణం

- గోశాలలో బావి శుభ్రం చేస్తుండగా ప్రమాదం
- గుంటూరు జిల్లా పెదకాకాని మండలంలో ఘటన



మృతులు మహంకాళి, రాజేష్, కాశీ బాబు, బాలయ్య

పెదకాకాని, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పెదకాకాని మండలంలో విద్యుదాఘాతంతో నలుగురు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన సోమవారం నంబూరు కాశీ బాబా ఆశ్రమం సమీపంలోని గోశాలలో జరిగింది. గుంటూరు జిల్లా తెనాలి సమీపంలోని చినరావూరుకు చెందిన గండాల మహంకాళి (29), అదే ప్రాంతానికి చెందిన వేటగిరి బాలయ్య (45), దుగ్గిరాల మండలం పెనుమూడి గ్రామానికి చెందిన యాకుల రాజేష్ (20) గత సంవత్సర కాలంగా గోశాలలో కూలీలుగా పనిచేస్తున్నారు. గోశాలలో సేవ చేసేందుకు సత్తెనపల్లి సమీపంలోని కట్టమూరు గ్రామానికి చెందిన మండాది కాశీ బాబు(52) గోశాల వద్దకు వచ్చాడు. గోశాలలోని వరల బావిలో దిగి శుభ్రం చేసే క్రమంలో లోపల ఉన్న నీటిని బయటికి పంపేందుకు విద్యుత్ కంప్రెషర్‌తో ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో కంప్రెషర్‌కు ఉన్న వైర్లు తెగి విద్యుత్ సరఫరా అయింది. బావిలో దిగేటప్పుడు ఇనుప నిచ్చెన వేసుకొని దిగడంతో తొలుత మహంకాళి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఇది గమనించి కాపాడే ప్రయత్నంలో రాజేష్, బాలయ్య, కాశీ బాబు కూడా విద్యుదాఘాతానికి గురై నిమిషాల వ్యవధిలోనే నలుగురూ దుర్మరణం చెందారు. ఘటనా స్థలాన్ని గుంటూరు ఎస్పీ సతీష్ కుమార్ పరిశీలించారు.

మంత్రి గొట్టిపాటి దిగ్భ్రాంతి

అమరావతి: గుంటూరు జిల్లా పెదకాకాని విద్యుదాఘాతం దుర్ఘటనపై ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తీవ్రదిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ నరేంద్రతో ఈ ఘటనపై గొట్టిపాటి ఆరాతీశారు. మృతుల కుటుంబానికి ప్రభుత్వం పూర్తి అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సరిదిద్దుకోవాల్సిన తప్పు

భారత్, నేపాల్ సంబంధాలు సవ్యంగా లేని కాలంలో, ఒడిశాలోని కళింగ వర్సిటీలో ఇటీవల చోటుచేసుకున్న ఘటన రెండు దేశాల మధ్యా దూరాన్ని మరింత పెంచింది. నేపాలీ విద్యార్థిని ప్రకృతి లామ్సాల్ ఆత్మహత్య, న్యాయంకోసం పోరాడిన నేపాలీ విద్యార్థులపై దాడులు, క్యాంపస్ నుంచి గెంటివేత ఇత్యాది వరుస పరిణామాలమీద లోతైన దర్యాప్తు చేపట్టవలసిందిగా ఆ దేశ మానవహక్కుల సంఘం మనదేశంలోని సంస్థను అభ్యర్థించింది. నేపాలీ విద్యార్థులను మాటలతోనూ, చేతలతోనూ భయభ్రాంతులకు గురిచేసి, వారు తమ చదువు కొనసాగించలేని పరిస్థితులను యూనివర్సిటీ ప్రొఫెసర్లు, అధికారులు సృష్టించారని, వారిమీద కఠినమైన చర్యలు తీసుకుంటే తప్ప ఆ భయం తొలగిపోదని ఆ సంస్థ సోమవారం విడుదల చేసిన తన లేఖలో వ్యాఖ్యానించింది. శనివారం నాడు ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ నేపాల్ విదేశాంగమంత్రితో ఫోన్‌లో మాట్లాడి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని, బాధితులకు అండగా ఉంటామని చాలా హామీలు ఇచ్చారు. వాళ్ళు కూడా మా పిల్లలే, భద్రమైనవాతావరణంలో చక్కగా చదువుకొనేట్టు చేసే బాధ్యత నాది అంటూ భరోసా ఇచ్చారు. తనను కలిసిన నేపాల్ రాయబార కార్యాలయం అధికారుల్లో కూడా నమ్మకం పెంచే ప్రయత్నాలు చేశారు ఆయన. ఇదంతా బాగానే ఉన్నది కానీ, రాష్ట్ర రాజధాని నగరం భువనేశ్వర్‌లోని ఒక పెద్ద యూనివర్సిటీలో వెయ్యిమంది విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నారని, వారిని యాజమాన్యం పక్షాన రంగంలోకి దిగిన ఓ నలభైయాభైమంది చావగొట్టారని, అంతా కలిసి ఈ నేపాలీ విద్యార్థులను క్యాంపస్‌నుంచి బయటకు గెంటేశారని ముఖ్యమంత్రికి ఎప్పటికప్పుడు సమాచారం తెలియకుండా ఉంటుందా?

నేపాలీ విద్యార్థిని ఆత్మహత్యకు మరో విద్యార్థి కారకుడు కానీ, అనంతర పరిణామాలకు ఆ యూనివర్సిటీ యాజమాన్యం, ప్రొఫెసర్లు కారకులు. వారి బాధ్యతారహితమైన వ్యవహారశైలి, సామరస్యపూర్వకమైన పరిష్కారం మీద గౌరవం లేకపోవడం, పొరుగుదేశం పిల్లలమీద చిన్నచూపు ఇత్యాదివి ఈ చిచ్చురాజుకోవడానికి కారణం. తోటి నేపాలీ ఆత్మహత్య చేసుకున్నందున విద్యార్థులను ఆగ్రహావేశాలు కమ్ముకోవడం సహజం. కారకుడైన విద్యార్థిని అరెస్టుచేయాలనో, శిక్షించాలనో డిమాండ్ చేయడమూ సరైనదే. ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు, విద్యార్థుల ప్రతిస్పందన, ప్రవర్తన అనూహ్యంగానే ఉంటాయి. నేపాలీ విద్యార్థులు యూనివర్సిటీ ఆస్తులనేమీ ధ్వంసం చేయలేదు, ఎవరిమీదా దాడులూ చేయలేదు. బాధితురాలికి మరణానంతర న్యాయం జరగాలని నిలదీస్తున్న మన పొరుగుదేశ విద్యార్థుల మీద అంత తీవ్రంగా విరుచుకుపడటం అన్యాయం. యువతి మృతి ఒక సమస్య అయితే, విద్యార్థులను ఉన్నపళంగా స్వదేశానికి తరిమేయడం దౌత్యపరంగా మరింత తీవ్రసమస్యను సృష్టించింది. నేపాల్ ప్రధాని పార్లమెంట్‌లో ఈ అంశాన్ని ప్రస్తావించే అవకాశం మనమే అందించాం.

ఈ కమిటీలు, అరెస్టులు, సస్పెన్షన్లు ఇత్యాదివన్నీ జరిగిన నష్టాన్ని కొద్దిమేరకు భర్తీచేయడానికి ఉపకరిస్తాయేమో కానీ, నేపాల్ విద్యార్థులకు భారత్‌లో జరిగిన అన్యాయం, ఈ సందర్భంగా నేపాల్‌ను అవమానిస్తూ కొందరు ప్రొఫెసర్లు చేసిన వ్యాఖ్యలు ఆ దేశ ప్రజల మనస్సుల్లోంచి త్వరగా చెరిగిపోవు. పరిణామాలను పూర్తిగా యూనివర్సిటీ దయాదాక్షిణ్యాలకు వదిలేయకుండా అలజడి ఆరంభం కాగానే రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దిగకపోవడం పెద్ద తప్పు. ఇప్పుడది దౌత్యసమస్యగా పరిణమించడంతో నేపాల్‌ను అవమానించడం తమ ఉద్దేశం కాదనీ, విద్యార్థులంతా వెనక్కురావాలని యూనివర్సిటీ కోరుతోంది. సీనియర్ విద్యార్థిపై ప్రకృతి లమ్సాల్ చేసిన ఫిర్యాదులను పెడచెవినపెట్టి, ఆమె మరణానికి కారకులైనవారే ఆమె పేరిట ఒక అవార్డును కూడా ప్రకటించారు. కానీ, వందలాది మందిని సస్పెండ్ చేసి, దాడులతో వారిని భయభ్రాంతులను చేసిన నేపథ్యంలో, విద్యార్థుల విశ్వాసాన్ని చూరగొనడం అంత సులభం కాదు. నేపాల్ మీడియాలో మాస్కులు పెట్టుకొని ఈ సంఘటనపై విద్యార్థులు మాట్లాడుతున్న విడియోలు ప్రచారంలో ఉన్నాయి. విద్యార్థుల్లో భరోసా కల్పించే ప్రకటనలు, చర్యలతో కేంద్ర ప్రభుత్వం జరిగిన తప్పిదాన్ని సరిదిద్దాలి. డబుల్ ఇంజన్ సర్కార్ అయినంత మాత్రాన దానికే వదిలేయకూడదు.

రాష్ట్రాలన్నీ తమిళనాడు వైపేనా?



ఒక రాష్ట్రం మరో రాష్ట్రానికి ఆదర్శం అవ్వటం ఇప్పుడున్న పోటీ రాజకీయాల్లో అంత సులువు కాదు. దేశవిదేశీ పెట్టుబడులను ఆకర్షించటంలో రాష్ట్రాల మధ్య పోటీ ఇంతా అంతా అని చెప్పలేం. గతం తాలూకు ఘనతల గురించి చెప్పుకునేటప్పుడు కూడా ఒకమెట్టు పైనే ఉండేట్లుగా ప్రతి రాష్ట్రమూ ప్రయత్నిస్తుంది. ఇక తమ గడ్డ మీద వ్యాపార అనుకూలతల గురించి, వాటిని అద్భుతంగా ప్రోత్సహించే తమ ప్రభుత్వ విధానాల గురించి ఏ రాష్ట్రమైనా సొంత గొప్పలు చెప్పుకుంటుందే తప్ప మరో రాష్ట్రంపై ప్రశంసా ప్రవచనాలు పలకదు. ఇదంతా ఆరోగ్యకరమైన పోటీనే అనుకుందాం! ప్రచారంలో ముందుండి పెట్టుబడులను ఆకర్షించటం సహజమే అనుకుందాం! కానీ దీనికి భిన్నంగా ఒక రాష్ట్రం ఇప్పుడు అందరికీ ఆదర్శప్రాయమైపోయింది. ఇటీవల అందరూ ఆ రాష్ట్రం వైపే చూస్తున్నారు. దాన్నే అనుకరించాలని ప్రయత్నిస్తున్నారు.

విద్యా ఉద్యోగ రిజర్వేషన్ల విషయంపై 100 ఏళ్ల క్రితమే ఒక చరిత్ర సృష్టించిన తమిళనాడు ఇప్పటికీ ఏదోరకంగా ఆ ఒరవడిని కొనసాగిస్తూనే ఉంది. పెద్ద రాష్ట్రాల్లో ఎక్కడాలేని విధంగా దాదాపు నాలుగు దశాబ్దాల నుంచి 69 శాతం రిజర్వేషన్లను (బీసీ—30 శాతం, ఎంబీసీ—20 శాతం, ఎస్సీ—18శాతం, ఎస్టీ—1శాతం) అమలుపరుస్తూ ఉండటమే దీనికి నిదర్శం. ఆ అంకెలకు దగ్గరగా ఉండాలనే రాష్ట్రాలకు ఇప్పుడు తమిళనాడు ఆదర్శంగా మారింది. ఎక్కువ శాతం రిజర్వేషన్లను అమలుపరచటమే కాకుండా వాటిని సర్వోన్నత న్యాయస్థానం సమీక్షకు దూరంగా.. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో పెట్టించటంలో కూడా తమిళనాడు సఫలమైంది. మరాఠాలకు రిజర్వేషన్లను (విద్య—12 శాతం, ఉద్యోగాలు—13శాతం) కల్పించటానికి మహారాష్ట్ర చేసిన ప్రయత్నాలకూ, 2023లో కులగణన జరిపి బిహార్ చేపట్టిన చర్యలకూ తమిళ రిజర్వేషన్లే ప్రేరణ. కులగణనకు అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించి, వందల కోట్లు ఖర్చుపెట్టి, కులాల జనాభాతో పాటు విద్య ఉద్యోగాలు, ఆర్థిక వివరాలు సేకరించిన అనంతరం రిజర్వేషన్లను (65శాతం) పెంచుతూ బిహార్‌లో చట్టం చేసినా హైకోర్టు కొట్టివేసింది. సుప్రీంకోర్టుకు ఎక్కినా ఊరట దక్కలేదు. ఆర్థికంగా బలహీన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) కేంద్ర ప్రభుత్వం కల్పించిన 10శాతం రిజర్వేషన్లతో.. సుప్రీంకోర్టు గతంలో నిర్దేశించిన 50శాతం రిజర్వేషన్ల పరిమితికి అడ్డంకి తొలగిపోయిందనే వాదనకూ ఆమోదం లభించలేదు. రిజర్వేషన్లు 50 శాతానికి మించి పెంచటానికి చాలా రాష్ట్రాల్లో చేసిన ప్రయత్నాలకు ఏదో ఒక స్థాయిలో న్యాయస్థానాలు నిలువరించాయి. మహారాష్ట్ర, బిహార్‌తో పాటు రాజస్థాన్, హర్యాణ, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్‌లు ఈ పరిస్థితిని ఎదుర్కొన్నాయి. రాజ్యాంగంలోని ఆరో షెడ్యూలు కల్పించిన రక్షణతో ఈశాన్య రాష్ట్రాలు మాత్రం 50 శాతానికి మించి రిజర్వేషన్లను పెంచుకోగలిగాయి.

1992లో ఇచ్చిన మండల్ తీర్పును సుప్రీంకోర్టు పునఃసమీక్షించనంత వరకూ రిజర్వేషన్లను 50 శాతాన్ని దాటించటం సాధ్యం కాదు. 69 శాతం రిజర్వేషన్ల పరిరక్షణకు తమిళనాడు ప్రభుత్వం 1994లో తీసుకువచ్చిన చట్టాన్ని రాజ్యాంగం తొమ్మిదో షెడ్యూల్లో పెట్టటం ఆనాటి రాజకీయ పరిస్థితుల్లో మాత్రమే సాధ్యమైంది. పీవీ నరసింహారావు నేతృత్వంలోని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అన్నాడీఎంకే మద్దతుపై ఆధారపడి ఉంది. 1991 ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి పోటీచేసి 39 లోక్‌సభ స్థానాల్లోనూ గెలిచాయి. అదొక అసాధారణ రాజకీయ సన్నివేశం. అందుకే తమిళనాడు ఒత్తిడి ఫలించింది. ఆ తర్వాత అలాంటి ఒత్తిడి కేంద్రానికి ఎదురుకాలేదు. బిహార్‌లో నితీశ్‌కుమార్ ప్రభుత్వం కూడా 65 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ తీసుకొచ్చిన చట్టాలను తొమ్మిదో షెడ్యూల్‌లో పెట్టించలేకపోయింది. ఇక 9వ షెడ్యూల్‌లో పెట్టినంత మాత్రాన సుప్రీంకోర్టు నుంచి రక్షణ ఉంటుందని చెప్పటానికి వీల్లేదు. 2007లో ఇచ్చిన తీర్పులోనే సుప్రీంకోర్టు ఆ విషయాన్ని స్పష్టంచేసింది. రాజ్యాంగ మౌలిక నిర్మాణానికి విరుద్ధంగా ఉన్న చట్టాలను 9వ షెడ్యూల్‌లో పెట్టినప్పటికీ న్యాయసమీక్ష నుంచి మినహాయింపు లభించదని తేల్చి చెప్పింది. ఆ తీర్పు తర్వాత తమిళనాడు రిజర్వేషన్లకు సంబంధించి దాఖలైన పిటిషన్ ఇంకా సుప్రీంకోర్టులో పెండింగులోనే ఉంది. అందుకే తమిళనాడు రిజర్వేషన్లపై వివాదాన్ని ముగిసిన అధ్యాయంగానూ భావించలేం.

ఇప్పటివరకూ జరిగిన పరిణామాలను సమగ్ర దృక్పథం నుంచి చూస్తే రిజర్వేషన్లను 50 శాతానికి మించి పెంచటానికి మామూలు స్థాయి కసరత్తు సరిపోదు. అసాధారణరీతిలో రాజకీయంగా ఏకాభిప్రాయం అందుకు అవసరం. ఇప్పుడున్న పరిస్థితుల్లో అది సాధ్యమవుతుందనీ చెప్పలేం. దేశవ్యాప్త కులగణన కోసం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానాన్ని ఆమోదించి కిందటి లోక్‌సభ ఎన్నికల్లో దాన్నే ప్రధాన అంశంగా చేసుకుని పోరాడినా అనుకున్న ఫలితాలను సాధించలేదు. బీజేపీ నేతృత్వంలోని పాలకకూటమి నుంచి కులగణనపై ఇంతవరకూ సానుకూల ప్రకటన వెలువవడలేదు. అసలు ఆ కూటమి అత్యున్నత స్థాయి సమావేశాల్లో దాన్నొక ముఖ్య అంశంగా పరిగణించి చర్చించిన దాఖలాల్లేవు.



■ రాహుల్ కుమార్

రిజర్వేషన్లను రాజకీయ లాభనష్టాల ఎత్తుగడల్లో భాగంగా మార్చటంలో పార్టీలన్నిటి పాత్రా ఉంది. బీసీలను వర్గీకరించటానికి నియమించిన జస్టిస్ రోహిణి కమిషన్ ఇచ్చిన నివేదిక గురించి కేంద్రం ఇప్పటివరకూ ఒక్కమాట మాట్లాడలేదు. ఏళ్లు గడుస్తున్నా అందులో ఏముందో బహిరంగం చేయటానికి బీజేపీకి రాజకీయ అనుకూలత కనపడటం లేదు. ఆర్థికంగా తీవ్రమార్పులకు లోనవుతున్న సమాజంలో కులాల వెనుకబాటుతనం, కులాలమధ్య అసమానతల గురించి ఎప్పుడో ఏర్పరుచుకున్న కొన్ని భావాలను మార్చుకోవాల్సి ఉంటుంది. బీసీ వర్గంలో ఉన్న కొన్ని కులాలే అధిక లబ్ధిని పొందాయి. మొన్నటి బిహార్ కులగణనలో అదే తేలింది. తమిళనాడు మొదటి బీసీ కమిషన్ కూడా ఈ విషయాన్ని 1971లోనే చాలా స్పష్టంగా వెల్లడించింది. బీసీల్లోని 11 శాతం కులాలు 37శాతం నాన్‌గజిటెడ్, 48శాతం గజిటెడ్ పోస్టులనూ 47శాతం ఇంజనీరింగ్, 34శాతం మెడికల్ సీట్లనూ, 34శాతం స్కాలర్‌షిప్‌లనూ దక్కించుకున్నట్లు కమిషన్ ఛైర్మన్ సత్తనాథన్ స్పష్టంచేశారు. ఇటువంటి గుత్తాధిపత్యాన్ని నిరోధించటానికి ఏడాదికి రూ.9000 ఆదాయం దాటని వారికే బీసీ రిజర్వేషన్లు ఉండాలని ప్రతిపాదించారు. ఆనాటి కరుణానిధి ప్రభుత్వం ఆ సిఫార్సును పట్టించుకోలేదు. కానీ ఆ తర్వాత వచ్చిన ఎంజీ రామచంద్రన్ ప్రభుత్వం 1979లో ఆ సిఫార్సుని అమల్లోకి తెచ్చింది. డీఎంకే ప్రభుత్వం దీన్నొక రాజకీయ అంశంగా మార్చి అప్పుడు జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకేను ఓడించింది. దీంతో ఎంజీఆర్ ఆదాయ పరిమితి జీవోను ఉపసంహరించుకుని డీఎంకేని రాజకీయంగా దెబ్బతీయటంలో భాగంగా రిజర్వేషన్లను ఒక్కసారిగా 49శాతం నుంచి 69శాతం పెంచేశారు. సత్తనాథన్ కమిషన్ 33శాతం రిజర్వేషన్లను బీసీలకు ప్రతిపాదిస్తే డీఎంకే ప్రభుత్వం 31 శాతానికే పరిమితం చేసింది. మొత్తంగా రిజర్వేషన్లను 49 శాతానికి దాటకుండా చూసింది. కానీ 1980 నాటి లోక్‌సభ ఎన్నికల ఫలితాలు రిజర్వేషన్ల శాతాన్ని ఎక్కడికో తీసుకెళ్లాయి. కమిషన్ తాజా అధ్యయనం లేకుండా, గణాంకాలతో అవసరాన్ని నిరూపించకుండా రిజర్వేషన్లను తమిళనాడులో అకస్మాత్తుగా పెంచారు. కారణమేదైనా ఒకసారి పెంచిన తర్వాత రిజర్వేషన్లను తగ్గించటం చాలాకష్టం.

యాభై శాతం రిజర్వేషన్లకు సంబంధించి సుప్రీంకోర్టు గీసిన లక్షణరేఖను దాటాలంటే స్వయంగా సుప్రీంకోర్టే దాన్ని చెరిపివేయాలి. అది సాధ్యంకానప్పుడు పార్లమెంటే ఆ రేఖ విషయంలో ఒక విధానాన్ని రూపొందించాలి. ఈ రెండిటిలో ఏదో ఒకటి జరగకుండా అడుగుముందుకు పడదు. మండల్ తీర్పును తొమ్మిదిమంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చింది. ఆ తీర్పుని సమీక్షించి మార్పులు చేయాలంటే ఇంకా పెద్ద ధర్మాసనం ఏర్పాటుకావాలి. మరాఠా రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో జరిగిన వాదోపవాదాల సందర్భంగా దానికోసం విజ్ఞప్తులూ చేశారు.

అవేమీ ఫలించలేదు. రిజర్వేషన్లు 50 శాతం దాటితే రాజ్యాంగంలోని సమానత్వ సూత్రానికి విఘాతం కలుగుతుందనీ ఆ సూత్రం రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో భాగమనీ మండల్ తీర్పు అప్పుడే సుప్రీంకోర్టు స్పష్టంచేసింది.

అన్నివైపులా సమస్యను ఆవరించి ఇలా ఎన్నో చిక్కుముడులు ఉన్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం విద్య ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం కొత్త చట్టాలు చేస్తామని ప్రకటించింది. బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా 2017లో మొత్తం రిజర్వేషన్లను 62 శాతానికి పెంచుతూ చట్టం చేసి దాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చాలనీ కేంద్రాన్ని కోరింది. ఫలితం దక్కలేదు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కులగణన ఆధారంగా బిల్లులను రూపొందించి మొత్తం రిజర్వేషన్లు 67 శాతానికి పెంచటానికి ప్రయత్నిస్తోంది. ఇక్కడొక విషయాన్ని స్పష్టంగా చెప్పుకోవాలి. బిహార్‌లో రిజర్వేషన్లను పెంచటానికి ముందు ఏ కులానికి ఎన్ని ఉద్యోగాలు దక్కాయో తెలిపే సమాచారాన్ని ఎంతో-కొంత బహిరంగపరచారు. తెలంగాణ ప్రభుత్వం ఆపాటి సమాచారాన్ని కూడా వెల్లడించలేదు. మార్చి మొదట్లోనే బిల్లులు ప్రవేశపెడతామని చెప్పినా ఇంతవరకూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీల స్థూల జనాభా శాతాలను మాత్రమే ప్రకటించారు. వివిధస్థాయి ప్రభుత్వ ఉద్యోగాల్లో, చదువుల్లో కులాల వారీగా బీసీలు ఎంతెంతమంది ఉన్నారో తెలపటానికి అభ్యంతరం ఉండాల్సిన అవసరం లేదు. రిజర్వేషన్ల పెంపుపై సానుకూలత రావటానికి సైతం ఖచ్చితమైన సమాచారం చాలా అవసరం. రిజర్వేషన్లను పెద్ద ఎత్తున పెంచుతున్నప్పుడు వివిధ వర్గాల విద్య ఉద్యోగ పరిస్థితులపై తాజా గణాంకాలను తెలుసుకోవాలని పౌరులు కోరుకోవటం సహజం. మండల్ కమిషన్ కూడా అప్పటికి వివిధ శాఖలు అందించిన ఓబీసీ ఉద్యోగుల వివరాలను వెల్లడించింది. ఆ వివరాలతోనే సుప్రీంకోర్టు మండల్ సిఫార్సులతో ఏకీభవించింది.

ఆశించిన రాజకీయ ఫలితాలు ఎలా ఉంటాయో తెలియకపోయినా కులగణనలతో నిజమైన సామాజిక, ఆర్థిక చిత్రం ఎంతో కొంత తెలుస్తుంది. నిశితంగా చూస్తే ఆర్థిక అంతరాలు ఇతర అంశాలపై క్రమేపీ పైచేయి సాధిస్తున్న దృశ్యమూ కనపడుతుంది! ఆ దృశ్యం ఒక్కటే చివరికి అన్ని అన్యాయాలను సరిదిద్దటానికి గీటురాయిగా మారినా ఆశ్చర్యపోవాల్సిన అవసరంలేదు! ఫలితంగా ఆర్థిక హెచ్చుతగ్గుల దృష్టి బలపడి కులదృష్టిని పలచనచేసే కాలాన్నీ తీసుకురావొచ్చు!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

విద్యా, ఉద్యోగ రిజర్వేషన్ల విషయంపై 100 ఏళ్ల క్రితమే ఒక చరిత్ర సృష్టించిన తమిళనాడు ఇప్పటికీ ఏదోరకంగా ఆ ఒరవడిని కొనసాగిస్తూనే ఉంది. పెద్ద రాష్ట్రాల్లో ఎక్కడాలేని విధంగా దాదాపు నాలుగు దశాబ్దాల నుంచి 69 శాతం రిజర్వేషన్లను (బీసీ–30శాతం, ఎంబీసీ–20శాతం, ఎస్సీ–18శాతం, ఎస్టీ–1శాతం) అమలుపరుస్తూ ఉండటమే దీనికి నిదర్శం.


ఆశించిన రాజకీయ ఫలితాలు ఎలా ఉంటాయో తెలియకపోయినా కులగణనలతో నిజమైన సామాజిక, ఆర్థిక చిత్రం ఎంతో కొంత తెలుస్తుంది. నిశితంగా చూస్తే ఆర్థిక అంతరాలు ఇతర అంశాలపై క్రమేపీ పైచేయి సాధిస్తున్న దృశ్యమూ కనపడుతుంది! ఆ దృశ్యం ఒక్కటే చివరికి అన్ని అన్యాయాలను సరిదిద్దటానికి గీటురాయిగా మారినా ఆశ్చర్యపోవాల్సిన అవసరంలేదు! ఫలితంగా ఆర్థిక హెచ్చుతగ్గుల దృష్టి బలపడి కులదృష్టిని పలచనచేసే కాలాన్నీ తీసుకురావొచ్చు!

నీడ కోల్పోతున్న నల్లమల చెంచులు

ప్రపంచం మొత్తంమీద మన దేశంలో అడవి తెగల జనాభా అధికం. అందుకే భారతదేశం అడవిబిడ్డల మానవశాస్త్ర పరిశోధనశాల. 2011 జనాభా లెక్కల ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో షెడ్యూల్డు తెగలు 35. ఇందులో చెంచులు అతి వెనుకబడ్డ గుంపులో ఉన్నారు. ప్రత్యేకంగా నల్లమల అడవుల్లో చెంచుల జనాభా 64,227. వీరు షెడ్యూల్డ్ తెగల జాబితాలో మూడవ స్థానంలో ఉన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో షెడ్యూల్డ్ తెగల జనాభా 59,18,000 కాగా చెంచులు 5.6 శాతం ఉన్నారు.

అడవి లోపలి భాగాన కొండ వరసలలో చెంచు గుడిసెలు గుంపులుగా పెంట లేక గ్రామంగా ఉంటాయి. వీరి ముఖ్యమైన వృత్తి వేట. వేటాడిన జంతుజాలంతో పాటు అడవి చెట్ల నుండి లభించే వివిధ తినుబండారాలు వారి ఆహారం. కొంతమంది నల్లమల అడవులలో వ్యవసాయాన్ని కూడా వృత్తిగా అనుసరిస్తున్నారు. వీరికి విద్య అవగాహన లేవు. వీరిని ఆదిమ గిరిజన సమూహాలు అంటారు. ఇంత వెనుకబడ్డ జీవనాన్ని సాగిస్తున్న చెంచుల పట్ల ప్రస్తుత భారత ప్రభుత్వం 'అడవుల వైవిధ్యాల పరిరక్షణ—1980' చట్టాన్ని అమలు చేసింది. దీనితో చెంచులకు అందవలసిన రక్షణ నిర్లక్ష్యానికి గురయింది.

'అడవుల వైవిధ్య పరిరక్షణ' అన్న ఆచరణ భారతదేశానికి కొత్త కాదు. కౌటిల్యుని రాజకీయ వ్యూహాల్లోను, అశోక చక్రవర్తి కాలంలోను ఈ ఆచరణలు ఉన్నాయి. బ్రిటిష్‌వారు తమ పాలనలో అడవులలో నివసిస్తున్న అడవి బిడ్డలతో పాటు వారి పరిరక్షణలో ఉన్న విలువైన అటవీ సహజ వనరులపై ఆధిపత్యాన్ని పొందడానికి చిరుతపులులను పెంచి పోషించారు. ఈ ఆచరణతో పాటు అడవుల పరిరక్షణను బలపరిచిన సంఘటనలకు సాంస్కృతిక సందేశాలు తోడయ్యాయి. అవి— 1969లో మన దేశంలో జరిగిన 'ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్సర్వేషన్ ఆఫ్ నేచర్' సంస్థ 10వ జనరల్ అసెంబ్లీ ప్రకటించిన సందేశం "ఆసియా అంతటా పులుల సంఖ్య ప్రమాదకర స్థాయికి చేరుకుంది" అని. ఈ ప్రకటన మద్దతుతోనే 1973 నాటికి పులిని జాతీయ జంతువుగా ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని భారతదేశంలో మతపర ఆచార సాంస్కృతిక పరంగా పులికి ఉన్న విశిష్ట స్థానాన్ని ఆధారంగా తీసుకుని పరిరక్షణ నిర్ణయాన్ని బలపరిచింది.



చెంచులు వంటి వెనుకబడిన ఆదివాసీలకు సంక్షేమం సమకూరితేనే భారతదేశం అభివృద్ధి చెందుతుంది. అభివృద్ధి దిశను మార్చాలి. ఆదివాసీలను స్నేహితులుగా చూడాలి. చెంచులను రక్షించడమంటే సహజ వనరులను కాపాడడం. ఈ సంపదలో అగ్రభాగం రాబోయే తరాలదే.

1963 నుంచి 1/70 చట్టం అమలులో ఉంది. దీని ప్రకారం గిరిజనుల భూమి గిరిజనేతరులకు బదిలీ చేయడం నిషిద్ధం. 1980 నాటికి భారత ప్రభుత్వం 'అడవి వైవిధ్య పరిరక్షణ'తో పాటు చెంచుల అభివృద్ధిని ప్రకటించి, అమలుపరిచింది. దీనివల్ల చెంచులు స్థానభ్రంశం చెంది పట్టణ అంచుల్లోకి నెట్టబడ్డారు. చెంచులు పోరాడి సాధించుకున్న 1/70 చట్టం నిరర్థకమైంది. దీనికి కొనసాగింపుగా షెడ్యూల్డ్ ప్రాంతాలకు పంచాయతీల విస్తరణ (పెసా) చట్టం 1996లో వచ్చింది. ఈ చట్టాన్ని చెంచులు తిరిగి పోరాడి సంపాదించుకున్నారు. ఈ చట్టం ప్రధాన లక్ష్యాలు— 1) గ్రామసభల ద్వారా స్వయంపాలనను ప్రోత్సహించడం. 2) సహజవనరుల నిర్వహణకు గ్రామసభలకు ప్రత్యేక అధికారాలను ఇవ్వడం. 3) గిరిజన సంఘాల హక్కులను చట్టబద్ధంగా గుర్తించడం. 4) గిరిజన జీవనోపాధులు, వర్గాల మొత్తం ఉన్నతికి దోహదపడడం. ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఈ పెసా చట్టం వర్తిస్తుంది. కాని, ఈ లక్ష్యాలకు వ్యతిరేకంగా దేశంలో అతిపెద్ద రిజర్వాయర్లు, అభయారణ్యాలు ప్రభుత్వం ఏర్పరచింది. పర్యవసానంగా చెంచులు భూమిపై, అడవిపై, ఉపాధి హక్కులన్నీ పోగొట్టుకున్నారు. పోషకాహార లోపాలు, రక్తహీనతలు, టీబీ, మలేరియా వంటి రుగ్మతలకు లోనయి, ఆ జాతి క్షీణించసాగింది. అత్యంత భయాందోళనలకు లోనుచేసే విషయం యురేనియం తవ్వకాలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడం. చెంచులు నివసించే నల్లమల అభయారణ్యంలోనే 83 చ.కి.మీ. విస్తీర్ణంలో యురేనియం సర్వే, తవ్వకాలకు కేంద్ర పర్యావరణ, వాతావరణ మంత్రిత్వ శాఖ, అణుశక్తి శాఖ ఆమోదం తెలిపాయి. యురేనియం విద్యుత్ ఉత్పత్తికి, వైద్య అనువర్తనాల కోసం రేడియో ఐసోటోపుల తయారీ, అణుశాస్త్ర పరిశోధనలకు ఉపయోగపడుతుంది. అయితే యురేనియం తవ్వకాల పర్యవసానాలు దుర్భరంగా ఉంటాయి.

జాతీయ నీటివనరుల సంరక్షణ సమన్వయకర్త బి. సత్యనారాయణ వైజాగ్ జర్నలిస్టు ఫోరంలో మాట్లాడుతూ 'కృష్ణనది పరివాహక ప్రదేశానికి 0.5 కి.మీ. దూరంలో ఉన్న నల్లమల అడవిలో యురేనియం తవ్వకాల వల్ల, ఆ ప్రభావం నదీ జలాలపై ఉంటుంది. ఇవి కాలుష్యానికి గురవుతాయి. ఇది విపత్కర పరిస్థితులను సృష్టిస్తుంది. దీంతో కాలుష్యరహిత వాతావరణంలో జీవించే చెంచులు, చెట్లు, జీవజాలం విపత్తుల పాలవుతాయి. యురేనియం తవ్వకాలకు అనుమతుల వల్ల కాలుష్య నియంత్రణ యాక్టు 1986, అడవుల పరిరక్షణ యాక్టు 1980, వనజీవన రక్షణ యాక్టు 1972, అణుశక్తి నియంత్రణ యాక్టు 2011లను ఉల్లంఘిస్తూ రాజ్యాంగం ప్రజలకిచ్చిన జీవించే హక్కు, జీవనోపాధి హక్కులను ప్రభుత్వం కాలరాసింది. వికిరణ (అణుశక్తి ప్రతిచర్య నుంచి వచ్చే శక్తి రూపం) నుంచి ప్రజలను కాపాడడాన్ని ఆలోచించకుండా ఏ లక్ష్యసాధనకై ఇన్ని చట్టాలను ఉల్లంఘించారు? ఇందుకు కార్పొరేట్ శక్తులు బాధ్యత వహిస్తాయా? 1984లో భోపాల్ జరిగిన దుర్ఘటన వంటివి యురేనియం తవ్వకాలతో పునరావృతం కాకుండా చూసే బాధ్యత ప్రభుత్వం వహించాలి. లేనిపక్షంలో ప్రజలు ఈ బాధ్యతను చేపట్టాలి' అని అన్నారు.

ఈ చర్చ వల్ల, చెంచుల ఉద్యమాల వల్ల తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవంగా యురేనియం తవ్వకాలను వ్యతిరేకిస్తూ తీర్మానించింది. దీనికి కొనసాగింపుగా రాజకీయ పార్టీలు, పర్యావరణ కార్యకర్తలు, ప్రజా సంస్థలు కలిసి యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా పోరాట కమిటీ ఏర్పాటు చేశారు. ఇంత పెద్దయెత్తున వ్యతిరేకత రావడం వల్ల ప్రభుత్వం యురేనియం తవ్వకాలను నిలిపివేసింది. అయితే గత ఏడాది పార్లమెంటు ఎన్నికల తర్వాత తిరిగి కొనసాగిస్తున్న దాఖలాలు కనబడుతున్నాయి. అడవుల్లోకి అధికారులు రావడం, ఆకాశంలో ఛాపర్లు కనిపించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

విద్య అవగాహనకు ఆమడదూరంలో ఉన్న చెంచు వర్గాల ఓట్లతో రాజకీయ లబ్ధిపొందదలచిన ప్రభుత్వం ప్రపంచ దేశాలలో భారతదేశం మూడవ స్థానానికి చేరుకున్నట్లు ఎండమావులను చూపిస్తున్నది. ఇక చెంచుల అభివృద్ధి మాటేమిటి? చెంచులు వంటి వెనుకబడిన ఆదివాసీలకు సంక్షేమం సమకూరితేనే భారతదేశం అభివృద్ధి చెందుతుంది. అభివృద్ధి దిశను మార్చాలి. ఆదివాసీలను స్నేహితులుగా చూడాలి. చెంచులను రక్షించడమంటే సహజ వనరులను కాపాడడం. ఈ సంపదలో అగ్రభాగం రాబోయే తరాలదే.

• డా. వనమాల
పాలమూరు అధ్యయన వేదిక

ఫాస్టాగ్ పేరుతో మరో నిలువుదోపిడీ!

ప్రజలకు ఏ మాత్రం ప్రయోజనం లేని ఫాస్టాగ్ విధానం వల్ల కేంద్ర ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయల ఆదాయాన్ని పొందుతోంది. 2024లో కేంద్ర ప్రభుత్వానికి టోల్‌టాక్స్‌ల ద్వారా రూ.68,037.60కోట్ల ఆదాయం లభించింది. 2023వ సంవత్సరంతో పోల్చుకొంటే ఇది 9.2 శాతం ఎక్కువ. ప్రస్తుతం రోజుకి సగటున రూ.191.14కోట్ల ఆదాయం లభిస్తోంది. ఈ దోపిడీ చాలదన్నట్టుగా ఫాస్టాగ్ అకౌంట్‌లో తగినంత డిపాజిట్ లేకపోతే వాహనాలకు రెట్టింపు రుసుము వసూలు చేయాలంటూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పరిస్థితి చూస్తే క్రమంగా టోల్‌గేట్లు దోపిడీ కేంద్రాలుగా మారుతున్నట్టు అర్థమవుతోంది.

ఫాస్టాగ్ అకౌంట్‌లో కనీసం 100 రూపాయలు ఉండాలన్న నిబంధన వల్ల ప్రస్తుతం ఫాస్టాగ్‌లను నిర్వహిస్తున్న ఎయిర్‌టెల్, జియోలతో పాటు వివిధ ప్రైవేటు బ్యాంక్‌లకు ఉచితంగా వందల కోట్ల రూపాయలు లభిస్తాయి. 2023—24 లెక్కల ప్రకారం భారతదేశంలో దాదాపు 50 కోట్లకుపైగా నాలుగు చక్రాల వాహనాలు ఉన్నాయి. ఈ వాహన యజమానులు ఒక్కొక్కరు తమ అకౌంట్లో కనీసం రూ.100 డిపాజిట్ చేసినా ఆయా బ్యాంక్‌లు, ఎయిర్‌టెల్ వంటి సంస్థల వద్ద ఎవరికీ ఎటువంటి వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేని రూ.5000 కోట్ల ప్రజల డబ్బు నిలువ ఉండిపోతోంది. ఇక తగిన డిపాజిట్ లేకపోతే టోల్ రుసుము రెట్టింపు వసూలు చేయడం వల్ల కేంద్ర ప్రభుత్వానికి ఆదాయం లభిస్తుంది. ఇవిగాక దేశవ్యాప్తంగా 2022 నాటికి దాదాపు 50 లక్షల లారీలు/గూడ్స్ వాహనాలు ఉన్నాయి. వీటి ద్వారా లభించే ఆదాయం అదనం.

ఇంతఖర్చు చేసినా వాహనదారులకు మాత్రం టోల్‌గేట్‌ల వద్ద వేచి వుండే పరిస్థితి మెరుగుపడలేదు. టోల్‌గేట్ నిర్వాహకులు నాసిరకం సెన్సార్‌లు వినియోగించడం వల్ల, అవి తరచూ పనిచేయకపోవడంతో, పెద్దఎత్తున వేచివుండాల్సి వస్తోంది. పండుగల సమయంలో అయితే వాహనాలు గంటల కొద్దీ వరుసలో నిలిచిపోతున్నాయి. టోల్‌గేట్ల వద్ద వాహనాలు మూడు నిమిషాలకు మించి నిలిచి వుండే పక్షంలో టోల్ ఛార్జీ చెల్లించాల్సిన అవసరం లేదని చెబుతారు. కానీ ఆచరణలో అమలుకావడం లేదు. పండుగల సమయంలో టోల్‌గేట్ల వద్ద గంట సేపు వేచివున్నప్పటికీ టాక్స్ వసూలు చేస్తూనే వున్నారు.

టోల్ టాక్స్ విధానం అమల్లోకి వచ్చిన సందర్భంలో దేశవ్యాప్తంగా లారీ యజమానులు ఆందోళన వ్యక్తం చేయగా, కొత్తగా నిర్మించిన రహదారులలో రహదారుల నిర్మాణం కోసం చేసిన అప్పు తీరేంత వరకు అంటే 10—15 ఏళ్లు మాత్రమే వసూలు చేస్తామని, ఆ తర్వాత టోల్ టాక్స్ వుండదని కేంద్ర ప్రభుత్వం నచ్చచెప్పింది. కాని, వాస్తవంలో 15 ఏళ్లు దాటిన తర్వాత కూడా వసూలు చేస్తూనే వున్నారు. టోల్ టాక్స్ కేంద్ర ప్రభుత్వానికి మంచి ఆదాయ వనరుగా మారడంతో టోల్ ఆదాయంపై మరింత ఆశపెరిగింది. ఇదే సమయంలో రెండేళ్ల క్రితం వరకు నాలుగు లేన్లు అంతకుమించి లేన్లు ఉన్న రహదారులకు మాత్రమే టోల్‌గేట్‌లు ఏర్పాటు చేసి రుసుము వసూలు చేసేవారు. కాని తాజాగా కేవలం రెండు లేన్ల రహదారులకు కూడా టోల్‌గేట్లు ఏర్పాటు చేస్తున్నారు. యూరోపియన్ దేశాలలో టోల్ రహదారులు, సాధారణ రహదారులు కూడా వుంటాయి. వాహనదారులు సాధారణ రహదారులపై ప్రయాణం చేస్తే టోల్ టాక్స్ చెల్లించాల్సిన పనిలేదు. మన దేశంలో మనకు ఇష్టం వున్నా లేకపోయినా టోల్ టాక్స్ రహదారులపై మాత్రమే ప్రయాణం చేయాలి.

నిజానికి వాహనాలు కొనుగోలు చేసే సమయంలో 28 శాతం జీఎస్‌టీతో పాటు రోడ్ టాక్స్ కూడా వసూలు చేస్తారు. ఆయా రాష్ట్రాల పరిస్థితులను బట్టి వాహనం ఖరీదులో 12 నుంచి 17 శాతం వరకు వసూలు చేస్తున్నారు. అంటే 20 లక్షల రూపాయల వాహనం కొంటే 2.40 నుంచి 3.40 లక్షల వరకు రోడ్డు టాక్స్ వసూలు చేస్తున్నారు. అంతేకాకుండా ఒక వాహనం వుండగా మరో వాహనం కొనుగోలు చేస్తే అదనంగా రెండు శాతం వసూలు చేస్తారు. అంటే ఇప్పటికే మనకు స్కూటర్ వుండి, కొత్తగా కారు కొనుగోలు చేస్తే లక్షకి 2 శాతం వంతున రూ.20వేలు అదనంగా వసూలు చేస్తారు. మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే జాతీయ రహదారుల అభివృద్ధికి గాను కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఇప్పటికే పెట్రోలియం ఉత్పత్తులపై రోడ్ డెవలప్‌మెంట్ సెస్‌ను విధిస్తోంది. ప్రస్తుతం ప్రజలు ప్రతి లీటర్ డీసెల్/ పెట్రోల్ ధరలో 7 రూపాయలను జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వానికి చెల్లిస్తున్నాము. ఈ టాక్స్ ద్వారా 2022—23 సంవత్సరంలో దాదాపు రూ.22వేల కోట్లు వసూలు చేసింది. నిబంధనల ప్రకారం ఈ నిధులను రహదారులు అభివృద్ధికి విని యోగించాలి. అయితే ఇందుకు విరుద్ధంగా ఈ నిధులను ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. మొత్తంగా గమనిస్తే ఒక వాహనదారుడి నుంచి తొలుత రోడ్ టాక్స్, ఆ తర్వాత డీసెల్/ పెట్రోల్ ద్వారా రోడ్ సెస్ వసూలు చేయడంతో పాటు మరల జాతీయ రహదారిపైకి వస్తే టోల్ టాక్స్ అంటూ మొత్తం మూడు రకాల పన్నులను ప్రజల నుంచి వసూలు చేస్తున్నారు.

టోల్‌టాక్స్, జీఎస్‌టీ, రోడ్ టాక్స్ వంటి పన్నుల ప్రస్తావన వచ్చినప్పుడు వాహనాలనేవి ధనవంతులకు సంబంధించిన అంశమని, వీటితో సామాన్యులకు వచ్చిన ఇబ్బంది ఏమిటి? అంటూ అధికారంలో ఉన్న నాయకులు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. టోల్‌టాక్స్ ధరలు సింపుల్‌గా కాకుండా వందల రూపాయలలో వుండటమే కాకుండా దూరప్రాంతాలకు ప్రయాణించాల్సి వస్తున్నప్పుడు వేల రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. ప్రత్యక్షంగా పన్నులు లారీ యజమానులు చెల్లిస్తున్నట్టు కనిపిస్తున్నప్పటికీ పరోక్షంగా ఆ రవాణా ఖర్చుల భారం సరుకుల ధరలపై పడటం వల్ల సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇదే సమయంలో అఖిల భారత లారీ యజమానుల సంఘం వారు టోల్‌గేట్లు ఎత్తి వేయాలని, టోల్‌టాక్స్ ద్వారా వచ్చే ఆదాయాన్ని డీసెల్/ పెట్రోల్ ధరను పెంచడం ద్వారా పొందాలని కోరుతున్నారు. ఈ కారణంగా సరుకుల చేరవేతలో సమయం చాలా కలసి వస్తుందని వారు అంటున్నారు. లారీ యజమానులు ఎటువంటి రాయితీ కోరడం లేదు, టోల్‌గేట్ల ద్వారా ఎంత ఆదాయం వస్తోందో అంతే మొత్తంలో డీసెల్/ పెట్రోల్ ధరలు పెంచి, టోల్‌గేట్లు తొలగించాలని కోరుతున్నారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం మాత్రం టోల్‌గేట్లను యథావిధిగా కొనసాగించడంలో మర్మమేమిటో అర్థం కావడం లేదు.

ప్రపంచంలో మరే దేశంలో లేనివిధంగా భారతదేశంలో పెట్రోల్/ డీసెల్ లీటరు ధర మండిపోతోంది. వంట గ్యాస్ ధర నాలుగు రూపాయలు, పెట్రోల్ ధర 90 పైసలు పెరిగినప్పుడు ఖాళీ సిలెండర్లు, ఎడ్ల బండ్లు రోడ్లపైకి తీసుకువచ్చిన నేతలు గతాన్ని మరచి ధరలు పెంచుతున్నారు. దేశంవ్యాప్తంగా ఒకే విధమైన పన్ను అనే నినాదంతో జీఎస్‌టీ అమల్లోకి వచ్చినప్పుడు క్రమంగా పెట్రోలియం ఉత్పతులు జీఎస్‌టీ పరిధిలోకి తీసుకురాలేదు. కాని, ప్రజలకు ప్రయోజనం కలిగే విధంగా పెట్రోలియం ఉత్పత్తులను కూడా క్రమంగా జీఎస్‌టీ పరిధిలోకి తీసుకువస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఆచరణకు వచ్చేసరికి అదనంగా పన్నులపై పన్నులు విధిస్తూ ప్రజలను నిలువు దోపిడీ చేస్తోంది.

ఫాస్టాగ్ అకౌంట్‌లో కనీసం వంద రూపాయలు ఉండాలన్న నిబంధన వల్ల ప్రస్తుతం ఫాస్టాగ్‌లను నిర్వహిస్తున్న వివిధ ప్రైవేట్ బ్యాంక్‌లకు ఉచితంగా వందల కోట్ల రూపాయలు లభిస్తాయి. భారతదేశంలో దాదాపు 50 కోట్లకు పైగా నాలుగు చక్రాల వాహనాలు ఉన్నాయి. ఈ వాహన యజమానులు ఒక్కొక్కరు తమ అకౌంట్లో కనీసం రూ.100 డిపాజిట్ చేసినా ఆయా బ్యాంక్‌లు, సంస్థల వద్ద రూ.5000 కోట్ల ప్రజల డబ్బు నిలువ ఉండిపోతుంది.



■ -అన్నవరపు బ్రహ్మయ్య

ఇన్నర్‌తోనే ఇక్కట్లకు చెక్!

రోజురోజుకూ పెరిగిపోతున్న అంతర్గత ట్రాఫిక్ సమస్యలతో నగర వాసులు నానా అవస్థలు పడుతున్నారు. తూర్పు బైపాస్‌పైనే ఇన్నాళ్లూ ఆశలు పెట్టుకున్నారు. అది లేదన్న సంకేతాలు రావడంతో ఇన్నర్ రింగ్ రోడ్డే ప్రత్యామ్నాయంగా మారింది. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లోని 24 గ్రామాల మీదుగా, ఎన్‌హెచ్- 16, 65, 30, 163జీలకు అనుసంధానంగా నిలవనుంది. ట్రాఫిక్ డైవర్షన్‌కు అనువైన ఇన్నర్ రింగ్ రోడ్డుపై ప్రభుత్వం సత్వర కీలక నిర్ణయం తీసుకోవాలని నగర వాసులు కోరుతున్నారు.

నగరంలో పెరుగుతున్న అంతర్గత ట్రాఫిక్ సమస్యలు

తూర్పు బైపాస్‌పై ఇన్నాళ్లూ ప్రజల ఆశలు

బైపాస్‌కు ప్రత్యామ్నాయంగా ఇన్నర్ రింగ్ రోడ్డు

ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో 24 గ్రామాల మీదుగా వెళ్తున్న మార్గం

- ఎన్‌హెచ్- 16, 65, 30, 163జీలకు అనుసంధానం

ట్రాఫిక్ డైవర్షన్‌కు అనువైన మార్గం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)కు అడుగులు పడుతున్న తరుణంలో ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్) విషయంలో కూడా సత్వర కీలక నిర్ణయం తీసుకోవాలని ప్రజల నుంచి అభ్యర్థనలు వస్తున్నాయి. ఐదు జిల్లాల విస్తృత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అమరావతి రాజధానికి అనుసంధానంగా తీర్చిదిద్దుతున్న ప్రాజెక్టు అవుటర్ రింగ్ రోడ్డు. విజయవాడ నగరంలో నెలకొన్న అంతర్గత ట్రాఫిక్ సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలంటే విజయవాడ వెస్ట్ బైపాస్‌కు సమాంతరంగా విజయవాడ తూర్పు బైపాస్‌ను కూడా చేపట్టాల్సిన అవసరం ఉంది. విజయవాడ తూర్పు బైపాస్ అవసరం లేదని కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ (మోర్తు) అలైన్‌మెంట్ కమిటీ నిర్దేశించటంతో దాదాపుగా ఇది లేనట్టేనని తెలుస్తోంది. విజయవాడ నగరంలో నెలకొంటున్న ట్రాఫిక్ సమస్యలకు పూర్తి పరిష్కారం చూపాలంటే తక్షణం ఐఆర్ఆర్ పనులు కూడా ఆరంభించాల్సిందేనన్నది ప్రజల అభిప్రాయం. విజయవాడ అంతర్గత ట్రాఫిక్‌ను గణనీయంగా తగ్గించటానికి ప్రత్యామ్నాయ రోడ్డుగా సీఆర్‌డీఏ అధికారులు ఐఆర్ఆర్ పనులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పూర్తి స్థాయిలో కాకపోయినా కనీసం ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాలను అనుసంధానించేలా అయినా ఫేజ్ - 1 పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ చక్రబంధంలో విజయవాడ

అమరావతి రాజధాని ప్రాంతంలో ప్రస్తుతం కీలక నగరాలుగా విజయవాడ, గుంటూరు ఉన్నాయి. గుంటూరు కంటే కూడా విజయవాడ భౌగోళికంగా పెద్దది. జనసాంద్రత ఎక్కువ. రవాణా రంగానికి కేంద్రంగా ఉంది. రాష్ట్రంలోనే తీవ్ర ట్రాఫిక్ సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న నగరంగా విజయవాడ నిలుస్తోంది. నిత్యం ట్రాఫిక్ సమస్యలు గందరగోళ పరిస్థితులను సృష్టిస్తున్నాయి. ఫ్లై ఓవర్లు నిర్మించినా అంతర్గత ట్రాఫిక్ పెరిగిపోవటంతో ట్రాఫిక్ సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయి. విజయవాడ మీదుగా బయటి నుంచి వచ్చే వాహనాల రాకపోకలను ఎంత మేర నియంత్రించ గలిగితే అంత మేర నగరంపై ట్రాఫిక్ ప్రభావం తగ్గుతుంది. ఈ సమస్యను సీరియస్‌గా తీసుకోకపోతే రానున్న రోజుల్లో విజయవాడ నగరం ట్రాఫిక్ చక్రబంధంలో ఇరుక్కుంటుంది.

తూర్పు బైపాస్‌కు ప్రత్యామ్నాయం అవసరం

విజయవాడలో అంతర్గత ట్రాఫిక్‌ను, బయటి నుంచి వచ్చే భారీ వాహనాల ట్రాఫిక్‌ను తగ్గించటానికి విజయవాడ వెస్ట్ బైపాస్ కొంత మేర ప్రత్యామ్నాయంగా ఉంది. దీనికి అనుసంధానంగా విజయవాడ తూర్పు బైపాస్‌ను నిర్మిస్తేనే మచిలీపట్నం-

మిగతా 6లో..

ఐఆర్ఆర్‌తో తక్షణ పరిష్కారం

అవుటర్ రింగ్ రోడ్డు అమరావతికి బాహ్యంగా వెళ్లే రహదారి. 190 కిలోమీటర్ల నిడివిన టన్నెల్స్‌తో కూడుకున్న నిర్మాణం పూర్తి కావటానికే గరిష్ఠంగా ఐదేళ్లకు పైగా పదేళ్ల వరకు కూడా సమయం పట్టడానికి అవకాశం ఉంది. ఇన్నర్ రింగ్ రోడ్డు అనేది రాజధాని అంతర్భాగంగా ఉంటుంది. విజయవాడ నగర సరిహద్దు వెంబడి అంతర్లీనంగా సాగుతుంది. విజయవాడలో నెలకొన్న తీవ్ర ట్రాఫిక్ సమస్యలకు ఇన్నర్ రింగ్ రోడ్డు తక్షణ పరిష్కార మార్గం.

ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఇలా..



ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మొత్తం 24 గ్రామాల మీదుగా సాగుతుంది. చోడవరం, దాములూరు, దోనె ఆత్కూరు, గంగూరు, ఇబ్రహీంపట్నం, జూపూడి, కవులూరు, కేతనకొండ, కొండపల్లి, కొత్తూరు, కొటికలపూడి, నవీ పోతవరం, నిడమానూరు, నున్న, పాతపాడు, పెనమలూరు, పోరంకి, రామచంద్రాపురం, సావారిగూడెం, తాడేపల్లి, త్రిలోచనాపురం, వెదురుపావులూరు, వెలగలేరు, జమీమాచవరం, కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ ప్రాంతాలు ఉన్నాయి.

ఎన్‌హెచ్ X ట్రాన్స్‌కో

విజయవాడ - మచిలీపట్నం ఎన్‌హెచ్ - 65 విస్తరణలో వివాదం



- గంగూరు సబ్‌స్టేషన్ వద్ద నిలిచిపోయిన రోడ్డు విస్తరణ పనులు
- అప్పట్లో స్థలం అంచనాలు పెంచి ఎస్టిమేట్లు ఇచ్చారని ఎన్‌హెచ్ ఆరోపణ
- వివరణ కోరితే ఇప్పటి వరకు సమాధానం లేదని ఆగ్రహం
- తమకు సమాచారం ఇవ్వకుండా ఎన్‌హెచ్ గోడ కూల్చిందంటున్న ట్రాన్స్‌కో

జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్), ట్రాన్స్‌కో మధ్య నెలకొన్న వివాదంతో విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారిపై గంగూరు సబ్‌స్టేషన్ దగ్గర విస్తరణ పనులు నిలిచిపోయాయి. ట్రాన్స్‌కో అధికారులు అంచనాలను పెంచటం, ఎన్‌హెచ్ అధికారులు ఆ అంచనాలపై వివరణ కోరటంతో ఏర్పడిన ప్రతిష్టంబన నేటికీ కొనసాగుతోంది. దీంతో ఏడేళ్లుగా రోడ్డు పనులు అసంపూర్తిగానే ఉండిపోయాయి. ఇదే అదనుగా భావించిన సమీపంలోని ప్రైవేటు వ్యక్తులు తమ స్థలాలకు పరిహారం తీసుకుని కూడా వాటిని సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారి ఎన్‌హెచ్ - 65 విస్తరణ పనుల నేపథ్యంలో 2017-18వ సంవత్సరంలో గంగూరులోని ట్రాన్స్‌కోకు చెందిన 100 కేవీ సబ్‌స్టేషన్ స్థలం కూడా కొంత అలైన్‌మెంట్ పరిధిలోకి వచ్చింది. ఈ రోడ్డును నాలుగు వరసలుగా విస్తరిస్తున్నప్పటికీ సర్వీసు రోడ్లను కూడా దృష్టిలో పెట్టుకుని ఆరు వరసల ప్రాతిపదికన అప్పట్లో భూ సేకరణ చేశారు. గంగూరు సబ్‌స్టేషన్‌లో స్థలం కూడా పోతున్న నేపథ్యంలో అప్పట్లో ఎన్‌హెచ్ అధికారులు ఎంత మేర సబ్‌స్టేషన్‌కు నష్టం వాటిల్లుతుందన్న దానిపై ఎస్టిమేట్లు వేసి పంపించాల్సిందిగా ట్రాన్స్‌కో అధికారులను కోరారు. ట్రాన్స్‌కో అధికారులు అప్పట్లో రూ. 5 కోట్లకు ఎస్టిమేట్లు వేసి పంపారు. ఈ ఎస్టిమేట్లపై అప్పట్లో ఎన్‌హెచ్ అధికారులు అభ్యంతరాలను వ్యక్తం చేశారు. ఎస్టిమేట్లు వాస్తవ ప్రాతిపదికగా లేవని ఎన్‌హెచ్ అధికారులు భావించారు. అప్పట్లోనే ఎన్‌హెచ్ అధికారులు విద్యుత్ రంగ నిపుణులతోనూ, పలు కంపెనీలతోనూ చర్చించిన మీదట ట్రాన్స్‌కో అధికారులు వేసిన ఎస్టిమేట్ల విలువ చాలా ఎక్కువగా ఉందని ఎన్‌హెచ్ అధికారులు గుర్తించారు. అప్పట్లోనే రూ.కోటి మేర ట్రాన్స్‌కో అధికారులు ఎక్కువగా ఎస్టిమేట్ వేశారని గుర్తించిన ఎన్‌హెచ్ అధికారులు దీనిపై వారినే వివరణ కోరారు. ఆ తర్వాత ట్రాన్స్‌కో నుంచి ఎలాంటి సమాధానాలు లేకపోవటంతో సమస్య మొదలైంది. ఎంతకీ ట్రాన్స్‌కో అధికారులు వివరణలు పంపకపోవటంతో అప్పటి ఎన్‌హెచ్ అధికారుల్లో సహనం నశించింది. విస్తరణ పనుల్లో భాగంగా ఎన్‌హెచ్ కాంట్రాక్టు సంస్థ గంగూరు సబ్‌స్టేషన్ గోడను 100 మీటర్ల మేర కూల్చివేసినట్టు తెలుస్తోంది. ట్రాన్స్‌కో అధికారుల

మిగతా 6లో..



- రేపటి మహాశివరాత్రికి శైవక్షేత్రాలు ముస్తాబు
- ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో విస్తృతంగా ఏర్పాట్లు 8లో
- శివనామస్మరణతో మారుమోగనున్న శివాలయాలు

ఇంద్రకీలాద్రిపై మహాశివరాత్రి క్రతువులు ప్రారంభం 6లో

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

ఒక్క రూపాయి అదనంగా వసూలు చేసినా సహించేది లేదు

- ఫిర్యాదులు రుజువైతే ఏజెన్సీ లైసెన్సుల రద్దుకూ వెనుకాడం
- దీపం-2 అమలు ప్రగతికి లబ్ధిదారుల సంతృప్తే గీటురాయి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ 6లో

పోలీసులకు బెదిరింపులు


వైసీపీ నేత శంకర్ నాయక్

వేర్వేరు నంబర్ల నుంచి వైసీపీ నేత శంకర్ నాయక్ ఫోన్లు

- 'స్పా' వీడియోల లీకులు ఆపాలని డిమాండ్
- లేకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపులు
- తనను ఇరికించడంలో కుట్ర ఉందంటూ మొసలి కన్నీరు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వడిత్యా శంకర్ నాయక్.. రాష్ట్ర ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు. వైసీపీ పాలనలో గిరిజనుల కోసం పాటుపడుతున్నది తానొక్కడినేనని చెలరేగిపోయిన నాయకుడు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇష్టానుసారంగా రెచ్చిపోయిన ఆయన ఇప్పుడు పోలీసులపై బెదిరింపులకు దిగినట్లు సమాచారం. విజయవాడ వెటర్నరీ కాలనీలోని ఫీడర్ రోడ్డులో స్టూడియో 9 స్పా సెంటర్‌లో శంకర్ నాయక్ పోలీసులకు గదిలో మంచం కింద దొరికిపోయిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. శంకర్ నాయక్ వీడియో సామాజిక మాధ్యల్లో ట్రెండింగ్‌లో ఉంది. మాచవరం పోలీసులు స్టూడియో 9లో తనిఖీలు చేసి పది మంది ఉత్తరాది యువతులు, 11 మంది విటులను అరెస్టు చేశారు. వారిలో శంకర్ నాయక్ ఒకరు. ఇప్పుడు ఆయన తనపై పడిన మరక వదిలించుకోవడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు వైసీపీ ఐదేళ్ల పాలనలో శంకర్ నాయక్ చేసిన బాగోతాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో ఉన్న శంకర్ నాయక్ బాధితులు ఒక్కొక్కరుగా పోలీసులకు ఫోన్లు చేస్తున్నారు. ఇదిలా ఉండగా శంకర్ నాయక్ పోలీసులకు వరుసగా ఫోన్లు చేసి బెదిరింపులకు దిగుతున్నట్టు తెలిసింది.

వీడియో లీకులు ఆపకపోతే చనిపోతా..

శంకర్ నాయక్ కర్నూలు జిల్లాకు చెందిన నాయకుడు. ఎస్టీ కమిషన్‌లో సభ్యుడిగా నియమితుడైన తర్వాత విజయవాడలోనే నివాసం ఉంటున్నాడు. స్టూడియో 9 స్పాలో పోలీసులు సోదాలు చేసినప్పుడు ప్రతి అడుగును వీడియో చిత్రీకరణ చేశారు. అందులో ఉన్న యువతులనే కాకుండా గదుల్లో ఉన్న విటులను చిత్రీకరించారు. వాటిని కోర్టుకు ఆధారాలుగా చూపించడానికి భద్రపరిచారు. పోలీసులు చిత్రీకరించిన వీడియోల్లో కొన్ని బయటకు వచ్చాయి. వాటిలో శంకర్ నాయక్ వీడియో వైరల్ అవుతోంది. ఈ వీడియోను పోలీసులే మీడియాకు విడుదల చేశారని వారిపై నాయక్ ఆక్రోశంతో ఉన్నారు. రెండు రోజులుగా శంకర్ నాయక్ వేర్వేరు నంబర్ల నుంచి మాచవరం పోలీసులకు ఫోన్లు చేస్తున్నారు. తన వీడియోను సామాజిక మాధ్యమాల నుంచి తొలగించాలని, దాన్ని బయటకు లీక్ చేయడం ఆపకపోతే చనిపోతానని బెదిరింపులకు దిగినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియమితుడైన తర్వాత శంకర్ నాయక్ ఏకంగా ఐఏఎస్‌లను బెదిరించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇద్దరు మాజీ సీఎస్‌లు శంకర్ నాయక్‌కు బాధితులుగా ఉన్నారని సమాచారం. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయిస్తానని వారిని బెదిరించినట్టు తెలిసింది. అంతేగాకుండా రాష్ట్రంలో గిరిజన గురుకుల పాఠశాలల సంక్షేమాధికారులను వివిధ కారణాలను చూపించి వేధించినట్టు తెలుస్తోంది.

స్పా అని తెలియదా..?

రెండు రోజులుగా శంకర్ నాయక్‌ను సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లు ఉతికి ఆరేయడంతో తాను బుద్ధిమంతుడినని చెప్పుకునే పనిలో పడ్డారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఉదయం విలేకరుల సమావేశం ఏర్పాటు చేస్తానని సమాచారం పంపారు. తర్వాత దాన్ని రద్దు చేసుకుని సాయంత్రానికి మార్చుకున్నారు. స్టూడియో 9 భవనంలో స్పా సెంటర్ ఉందని తనకు తెలియదని కథలు వల్లించడం మొదలుపెట్టారు. బయటకు యూట్యూబ్ చానల్ బోర్డు కనిపించడంతో సందర్శించడానికి వెళ్లానని చెప్పుకొచ్చారు. తర్వాత ఒక వ్యక్తి తనను లోపలకు తీసుకెళ్లారని, ఆ కాసేపటికే పోలీసులు రావడంతో మంచం కింద దాక్కోమన్నాడని వెల్లడించారు. వాస్తవానికి స్టూడియో 9 స్పాలో ప్రవేశం, బయటకు రావడం చాలా కట్టుదిట్టంగా ఉంది. అమ్మాయిలతో వ్యవహారాలు నడిపే వారికి మాత్రమే ఇక్కడ తలుపులు తెరుచుకుంటాయి. ఇదంతా స్పా

మిగతా 6లో..

వైసీపీ నుంచి శంకర్ నాయక్ బహిష్కరణ

విజయవాడ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు, వైసీపీ గిరిజన విభాగం నాయకుడు వడిత్యా శంకర్ నాయక్‌ను పార్టీ నుంచి బహిష్కరించారు. దీనికి సంబంధించి పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. శంకర్ నాయక్ విజయవాడ వెటర్నరీ కాలనీలో ఉన్న స్టూడియో 9 స్పా సెంటర్లో పోలీసులకు పట్టుబడిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో వైసీపీ క్రమశిక్షణ చర్యలను తీసుకుంది. ఇందులో భాగంగా శంకర్ నాయక్‌ను పార్టీ నుంచి బహిష్కరించారు.

దుర్గగుడిలో హ్యాకింగ్‌పై ఐటీ నిపుణులతో పరిశీలన చేయిస్తాం 6లో

- దేవదాయ కమిషనర్, ఈవో రామచంద్రమోహన్

విజయవాడ నగరంలో పోస్టర్లు నిషేధం 8లో

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- పోలింగ్ స్టేషన్లలో ఏర్పాట్లు తనిఖీ చేసిన కలెక్టర్ లక్ష్మీశ 6లో

జనసేన సమన్వయకర్తల నియామకం 6లో

కేసుల చిక్కులు

మాజీ ఎమ్మెల్యే వంశీ, ఆయన అనుయాయుల అరాచకాలపై సమగ్ర విచారణ

- మైనింగ్ అక్రమాలు, టీడీపీ ఆఫీస్‌పై దాడి, సత్యవర్ధన్ కిడ్నాప్..
- భూ కబ్జాలు, రెవెన్యూ రికార్డుల ట్యాంపరింగ్, నకిలీ ఇళ్ల పట్టాలపై ఆరా
- రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, మైనింగ్, పోలీసు శాఖలపైనా దర్యాప్తు
- అప్పట్లో వంశీ అనుచరుల అరాచకాల్లో వివిధశాఖల అధికారులకు వాటాలు
- అన్నింటిపై సమగ్ర విచారణ జరపనున్న సిట్

గన్నవరం నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, ఆయన అనుయాయులు సాగించిన అరాచకాలకు లెక్కే లేదు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అక్రమ మైనింగ్, భూ కబ్జాలు, రెవెన్యూ రికార్డుల ట్యాంపరింగ్, నకిలీ ఇళ్ల పట్టాలు, టీడీపీ కార్యాలయంపై దాడి వంటి ఘటనలతో రెచ్చిపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనలో ప్రత్యక్ష సాక్షిగా ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేశారు. ఈ కేసులపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం సిట్‌ను వేయటంతో వంశీ గ్యాంగ్ కేసుల చిక్కుల్లో పడనుంది.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్, ఆయన అనుయాయులు గన్నవరం నియోజకవర్గంలో గత ఐదేళ్లుగా సాగించిన అక్రమాల ఫలితంగా ఇప్పుడు చిక్కుల్లో పడనున్నారు. అక్రమ మైనింగ్, భూ కబ్జాలు, బెదిరింపులు, మోసాలు, చివరాఖరికి కిడ్నాప్‌లకు పాల్పడ్డారు. గత వైసీపీ ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని చేసిన ఈ అక్రమాలపై ఇప్పటికే వివిధ శాఖల అధికారులు అంతర్గత విచారణ చేస్తున్నారు. ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ద్వారా విచారణకు ఆదేశించినప్పటికీ అక్రమ క్వారీయింగ్‌కు సంబంధించిన అంశాలపై ఇప్పటికే విచారణ జరిపి రూ.195 కోట్ల మేర అక్రమాలు జరిగినట్టుగా ప్రాథమికంగా నివేదించటం జరిగింది. గన్నవరం నియోజకవర్గంలో జరిగిన అక్రమాలకు సంబంధించి రెవెన్యూ, పంచాయితీరాజ్, ఇరిగేషన్, మైనింగ్, పోలీసు తదితర శాఖలతో ముడిపడిన ఉన్న అంశాలు అనేకం ఉన్నాయి. విజిలెన్స్ ఒక్కటే పూర్తి స్థాయిలో అక్రమాలను ప్రాథమికంగా గుర్తించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో అన్ని శాఖలలో జరిగిన అక్రమాలపై దృష్టి సారిస్తేనే చైన్ లింక్‌గా జరిగిన అరాచకాలు, మోసాలు, కబ్జాలు వెలుగులోకి రానున్నాయి. దీనిని దృష్టిలో

మిగతా 6లో..

ఐదు ప్రధాన కేసులపై దృష్టి

సిట్ ఏర్పాటుతో ప్రధానంగా గన్నవరంలో వంశీ ఆయన అనుయాయులు సాగించిన ప్రధానమైన ఐదు కేసులను విచారించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఒకటి టీడీపీ కార్యాలయంపై వంశీ పథక రచనలో భాగంగా దాడి జరగడం, రెండు టీడీపీ ఆఫీసుపై దాడి ఘటనకు సంబంధించి ప్రత్యక్ష సాక్షిగా ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ సత్యవర్ధన్ కిడ్నాప్ వ్యవహారం, మూడు అక్రమ మైనింగ్, భూ కబ్జాలు, నాలుగు రెవెన్యూ రికార్డుల ట్యాపరింగ్, ఐదు నకిలీ ఇళ్ల పట్టాల వ్యవహారంపై సిట్ సమగ్ర విచారణ జరిపే అవకాశం ఉంది.



గంగా, పార్వతీ సమేత మల్లేశ్వరస్వామికి పట్టు వస్త్రాలు తీసుకు వస్తున్న ఆలయ డిప్యూటీ ఈవో ఎం.రత్నరాజు అర్చకస్వాములు

మహా శివరాత్రి క్రతువులు ప్రారంభం



ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని తొలిరోజైన సోమవారం పాంచాహ్నిక దీక్షాపూర్వక క్రతువులు దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటల నుంచి శ్రీగంగా, పార్వతీ సమేత మల్లేశ్వరస్వామివార్ల ఉత్సవమూర్తులకు మంగళ స్నానాలు జరిపించి ఆలయ అర్చకులు వధూవరులుగా అలంకరించారు. ఈ సందర్భంగా దేవదేవేరీలకు దేవస్థానం తరఫున అధికారులు పట్టు వస్త్రాలు సమర్పించారు. సాయంత్రం 4 గంటల నుంచి గణపతి పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, మండపారాధన, కలశ స్థాపన, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ఠాపన, మూల మంత్ర హవనములు, బలిహరణ, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగంతో తొలిరోజు పూజా క్రతువులు ముగిశాయి. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు వి.శివప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకులు వై.మల్లేశ్వర శాస్త్రి, డిప్యూటీ ఈవో ఎం.రత్నరాజు, సహాయ కార్య నిర్వహణాధికారి ఎం.దుర్గారావు, వైదిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

26న ఇంద్రకీలాద్రిపై మహాశివరాత్రి ప్రత్యేక అభిషేకాలు

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలోని మల్లేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 26న మహాశివరాత్రిని పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో, దేవదాయ కమిషనర్ కె.రామచంద్రమోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మల్లేశ్వర స్వామివారికి త్రికాల అభిషేకాలు నిర్వహిస్తారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, 10 నుంచి 1 గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు మూడు దఫాలుగా అభిషేకాలను నిర్వహిస్తారు. రాత్రి 9 గంటలకు మహాన్యాసం అనంతరం లింగోద్భవ కాల అభిషేకాలు, మహానివేదన, హారతి, మంత్ర పుష్పం తదితరాలను నిర్వహిస్తారు. అనంతరం గంగా పార్వతి, మల్లేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను వేదిక మీద ప్రతిష్ఠించి దివ్యలీలా కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తారు. మహాశివరాత్రి కళ్యాణ మహోత్సవం ఆర్జిత సేవా టిక్కెట్లు దేవస్థానం వెబ్‌సైట్, దేవస్థానం కౌంటర్లలో లభిస్తాయని ఆయన ప్రకటనలో తెలిపారు.



తప్పుల తడకగా ఉన్న ఓటర్ల జాబితా

తప్పుల తడకగా ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా

కూచిపూడి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా మొవ్వ మండలంలో తప్పుల తడకగా ఉంది. బూత్ నెంబర్ 167లో ఒకే వ్యక్తి రెండు ఓట్లు కలిగి ఉండగా, అదే బూత్‌లో మరోవ్యక్తి మూడు ఓట్లు కలిగి ఉన్నాడు. కూచిపూడికి చెందిన బోరుకాటి సతీష్ కుమార్‌కు రెండు ఓట్లు ఉన్నట్టు ఓటర్ల జాబితాలో ఉండగా, ఈడే సాంబశివరావు మూడు ఓట్లు కలిగి ఉన్నట్టు జాబితాలో ఉంది. ఓటర్ల జాబితాలో తప్పులు సరిదిద్దాలని ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.

చట్టసభలను జగన్ కించపరిచారు : రవీంద్ర



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రతిపక్ష హోదా అడిగేందుకు మాత్రమే జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీకి రావడం చట్టసభలను కించపరచడమేనని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సోమవారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్‌రెడ్డి అవినీతి, అరాచకపాలనపై విసిగిపోయిన ప్రజలు ఎన్నికల్లో చిత్తు చిత్తుగా ఓడించారన్నారు. టీడీపీకి ప్రతిపక్ష హోదా లేకుండా చేస్తామని జగన్‌రెడ్డి విర్రవీగిన మాటలు మరచిపోయారన్నారు. వైసీపీ ఐదేళ్లపాటు ఎన్ని అరాచకాలకు పాల్పడినా, జైళ్లకు పంపినా టీడీపీ నాయకులు అసెంబ్లీకి వచ్చి ప్రజల సమస్యలపై పోరాడారని గుర్తుచేశారు. ప్రతిపక్ష హోదా ఇవ్వాల్సింది అధికార పక్షంలో ఉన్న నాయకులు కాదని, ప్రజలే అన్నారు. ఎమ్మెల్యేగా అవకాశం కల్పించినప్పటికీ ప్రజాస్వామ్యంపై గౌరవం లేక జగన్‌రెడ్డి అసెంబ్లీకి ఇప్పటివరకు రాలేదన్నారు. ప్రజాతీర్పును గౌరవించని పక్షంలో అసెంబ్లీ పదవికి జగన్‌రెడ్డి రాజీనామా చేయడమే మంచిదన్నారు.

వైసీపీ నేత శ్రీధర్‌రెడ్డి అరెస్టు

విజయవాడ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) : వైసీపీ సోషల్ మీడియా విభాగం నేత ఎ.శ్రీధర్‌రెడ్డిని సూర్యారావుపేట పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఎం చంద్రబాబుపై సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ఆయనపై పోలీసులకు ఫిర్యాదులు అందాయి. వాటిని పరిశీలించిన పోలీసులు శ్రీధర్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. గుంటూరుకు చెందిన శ్రీధర్‌రెడ్డిపై లోగడ అక్కడి పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇంతకుముందు హైకోర్టు న్యాయమూర్తులపై చాలా అసభ్యకరంగా పోస్టింగ్‌లు పెట్టాడు. ఈ కేసులో గుంటూరు పోలీసులు అరెస్టు చేశారు. మూడు నెలలపాటు కారాగార జీవితం గడిపిన శ్రీధర్‌రెడ్డి కొద్దిరోజులుగా సామాజిక మాధ్యమాల్లో వికృత పోస్టింగ్‌లు చేస్తున్నాడు. అతడికి సూర్యారావుపేట పోలీసులు సంకెళ్లు వేశారు.

ఆర్టీసీలో కారుణ్య నియామకాలపై హర్షం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో కారుణ్య నియామకాలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ పేర్కొన్నారు. సోమవారం కొనకళ్లను మచిలీపట్నంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు కలిసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ, కార్మికులు తన కళ్లు అని, వారి కుటుంబసభ్యులకు ఏ విధమైన ఇబ్బందులు జరగకుండా చూస్తామన్నారు.

జనసేన సమన్వయకర్తల నియామకం

విజయవాడ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : కాకినాడ జిల్లాలో నిర్వహించే జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలకు సంబంధించి జిల్లాలోని పార్లమెంట్ నియోజకవర్గాలకు సమన్వయకర్తలను పార్టీ నియమించింది. విజయవాడ లోక్‌సభ స్థానానికి సామినేని ఉదయభాను, మచిలీపట్నం స్థానానికి బండి రామకృష్ణకు సమన్వయకర్తల బాధ్యతలను అప్పగించింది. మార్చి 14వ తేదీన ఈ వేడుకలు పిఠాపురంలో నిర్వహించబోతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

- రూపాయి అదనంగా వసూలు చేసినా సహించేది లేదు
- ఫిర్యాదులు రుజువైతే ఏజెన్సీ లైసెన్సుల రద్దుకూ వెనుకాడం
- దీపం-2 అమలు ప్రగతికి లబ్ధిదారుల సంతృప్తే గీటురాయి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, పాల్గొన్న అధికారులు, గ్యాస్ డీలర్ల ప్రతినిధులు

కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : దీపం-2 పథకం ద్వారా అందించే ఉచిత గ్యాస్ సిలిండర్లకు లబ్ధిదారుల నుంచి అదనంగా ఒక్క రూపాయి వసూలు చేసినా సహించేదిలేదని, ఫిర్యాదులు రుజువైతే సంబంధిత గ్యాస్ ఏజెన్సీల లైసెన్సులు రద్దు చేస్తామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ హెచ్చరించారు. జిల్లాలో దీపం-2 పథకం అమలు, ఐవీఆర్ఎస్ సర్వే నివేదికలు, ఫిర్యాదులపై చర్యలు తదితరాలపై చర్చించేందుకు కలెక్టర్ అధ్యక్షతన సోమవారం కలెక్టరేట్‌లో సమావేశం జరిగింది. పౌరసరఫరాలు, లీగల్ మెట్రాలజీ శాఖల అధికారులతో పాటు వివిధ ఎల్‌పీజీ డీలర్ల అసోసియేషన్ ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దీపం-2 పథకాన్ని అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో అమలు చేసే విషయంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించిందని, పథకం అమలు ప్రగతికి లబ్ధిదారుల సంతృప్తే గీటురాయని, దీపం పథకం కింద ఉచితంగా పొందుతున్న సిలిండెర్లకు లబ్ధిదారులు చెల్లించిన నగదు 48 గంటల్లో వారి ఖాతాల్లో జమవుతోందన్నారు. ఇప్పటివరకు పథకం ద్వారా 4,05,611మంది ఖాతాల్లో దాదాపు రూ.32.19కోట్లు జమయిందన్నారు. అయితే ఉచిత గ్యాస్ పథకం కింద ముందు చెల్లించే అసలు బిల్లుకు అదనంగా డెలివరీ బాయ్స్ కొంత మొత్తాన్ని వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదులు వచ్చాయని, ఇలాంటి ఫిర్యాదులకు సంబంధిత గ్యాస్ ఏజెన్సీ డీలర్లు బాధ్యత వహించాల్సి వుంటుందని స్పష్టం చేశారు. ఐవీఆర్ఎస్ సర్వే ఆధారంగా మొదటి విడతలో తొమ్మిదిమంది ఎల్‌పీజీ డీలర్లకు, రెండో విడతలో ఐదు మందికి షోకాజ్ నోటీసులు ఇచ్చినట్టు తెలిపారు. జిల్లాలో వున్న 52 ఏజెన్సీలు నిబద్ధతతో సేవలందించాలని, ఏవైనా అవకతవకలకు పాల్పడితే ఏపీ పెట్రోలియం ప్రొడక్ట్స్ యాక్ట్, ఎమ్మార్పీ యాక్ట్ తదితరాల ద్వారా చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్యాస్ వినియోగదారులు రశీదులో ముద్రించి వున్న ధరకంటే అదనంగా ఒక్కరూపాయి కూడా చెల్లించనవసరం లేదని అదేవిధంగా వినియోగదారుడు గ్యాస్ సిలిండర్ తీసుకొనే సమయంలో తూకంలో తేడా ఉన్నట్టు అనుమానం వుంటే సదరు డెలివరీ బాయ్స్ ద్వారా తూకాన్ని సరిచూసుకోవచ్చన్నారు. పౌరసంబంధాలు, తూనికలు-కొలతల అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలను ముమ్మరం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. సమావేశంలో డీఎస్వో ఎ.పాపారావు, జిల్లా లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ కృష్ణచైతన్యతో పాటు ఎల్‌పీజీ డీలర్ల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- పోలింగ్ స్టేషన్లలో ఏర్పాట్లు తనిఖీ చేసిన కలెక్టర్ లక్ష్మీశ



ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్య స్ఫూర్తితో ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఈనెల 27న కృష్ణా-గుంటూరు జిల్లాల శాసనమండలి పట్టభద్రుల పోలింగ్ జరగనున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా కలెక్టర్ లక్ష్మీశ సోమవారం నగరంలోని పటమట బాలుర ఉన్నత పాఠశాల, లయోలా కళాశాలలోని వివిధ పోలింగ్ స్టేషన్లను తనిఖీచేశారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా చేయాల్సిన ఏర్పాట్లను పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాల కల్పన విషయంలో ఎలాంటి లోటుపాట్లు వుండకూడదని అధికారులకు స్పష్టం చేశారు. ప్రలోభాలకు తావులేని, స్వేచ్ఛాయుత, శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయడం జరుగుతోందని, దీనిలో భాగంగా పోలింగ్ స్టేషన్‌లను సందర్శించి, చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తున్నట్టు వెల్లడించారు. భద్రతా చర్యలు, వెబ్‌క్యాస్టింగ్ తదితరాలపైనా మార్గనిర్దేశనం చేసినట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. జిల్లాలో మొత్తం 112 పోలింగ్ స్టేషన్లు వున్నాయని, ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు ఒకరు చొప్పున మొత్తం 112 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించి శిక్షణ కూడా ఇచ్చినట్టు తెలిపారు. తనిఖీల్లో కలెక్టర్ వెంట విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు

హైవే దొంగలు దొరికారు

- రూ. 6.50 లక్షల విలువైన బైకులు స్వాధీనం

కంకిపాడు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : హైవేపై వాహనదారులను బెదిరించి దొంగతనాలకు పాల్పడుతున్న పలువురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు గన్నవరం సబ్ డివిజన్ డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడుతూ, ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఈ నెల 18న తెల్లవారుజామున కంకిపాడు నుంచి ప్రొద్దుటూరు వెళ్తున్నాడు. అదే సమయంలో ఐదుగురు వ్యక్తులు రెండు బైకులపై వచ్చి సదరు వ్యక్తిని బెదిరించి అతని వద్ద ఉన్న రూ. 10 వేలు బలవంతంగా లాక్కున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు జిల్లా ఎస్పీ గంగాధర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టిన కంకిపాడు సీఐ మురళీకృష్ణ ప్రత్యేక బృందాలతో విచారణ చేపట్టారు. ఈనెల 24న ఈడుపుగల్లు సెంటర్ వద్ద రెండు బైకులపై అనుమానాస్పదంగా తిరుగుతున్న యర్రంశెట్టి విఘ్నేశ్వర, బనవల ఫణీంద్ర కుమార్, గోట్లు సిద్దూ, నీలపు మోహన్, మరో మైనర్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం వారు అపహరించిన రూ.10 వేలు నగదు, రూ. 6.50 లక్షల విలువైన వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితులను కోర్టుకు హాజరు పరిచినట్టు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ, సిబ్బందిని అభినందించారు.

దుర్గగుడిలో హ్యాకింగ్‌పై ఐటీ నిపుణులతో పరిశీలన

- దేవదాయ కమిషనర్, ఈవో రామచంద్రమోహన్

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో సిస్టమ్ నెట్‌వర్క్ హ్యాకింగ్‌పై ఐటీ నిపుణులతో విచారణ చేపడుతున్నామని ఈవో, దేవదాయ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థానం సిస్టమ్ నెట్‌వర్క్ హ్యాకింగ్‌కు గురికాలేదని, ఆన్‌లైన్ వ్యవస్థ, ఈ ఆఫీసు విధానాలు పటిష్ఠంగా పూర్తి భద్రతలో ఉన్నాయన్నారు. 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల ప్రచురితమైన 'హ్యాకింగ్ కింగ్' కథనానికి ఆయన స్పందించారు. దేవస్థానంలో సెక్యూరిటీ ఆడిట్ జరిగిందని, ఆన్‌లైన్, ఈ ఆఫీసు భద్రతా చర్యలు పటిష్ఠంగా ఉన్నాయని చెప్పారు. ఏదేమైనా ఈ అంశంలో దేవదాయ శాఖ ఐటీ నిపుణుల ద్వారా పూర్తి పరిశీలన చేయిస్తామని చెప్పారు. మరోవైపు విరాళాల సేకరణ, దాతలతో సంభాషణ, సంబంధం లేని వ్యక్తుల ప్రమేయం లేకుండా తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. దుర్గగుడిలో ఒక ఉద్యోగి ఈ ఆఫీసు నోటిఫికేషన్‌ను తన సొంత సిస్టమ్‌కు బదలాయించినట్టు, దాతల నుంచి విరాళాలు సేకరిస్తున్నట్టు వచ్చిన కథనానికి వివరణ ఇస్తూ.. దేవస్థానం సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్‌గా ఇంతకు ముందు పనిచేసిన కార్యనిర్వహణాధికారి ఆదేశాల మేరకు ఒక సీనియర్ అసిస్టెంట్ విధులు నిర్వహించారన్నారు. ఆన్‌లైన్ టెండర్ వ్యవహారాలు, ఎఫ్ఎఎస్‌కు సంబంధించిన ఐడీ పాస్‌వర్డ్‌లు వంటి కీలకమైనవి ఈవో వద్దనే ఉండాల్సి ఉండగా, సీనియర్ అసిస్టెంట్‌కు అప్పగించి పనులు జరిపించినట్టు తెలుస్తున్నదన్నారు. ఈవో బాధ్యతలు చేపట్టినప్పటికీ ముఖ్యమైన కీలక ఫైళ్లను ఆ సీనియర్ అసిస్టెంట్ అప్పగించకుండా బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించినట్టు చెప్పారు. దేవస్థానం గోప్యత, భద్రత ఉల్లంఘనల అభియోగాల పై సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేస్తున్న ఉద్యోగిని సస్పెండ్ చేశామన్నారు. అతడిపై వచ్చిన ఆరోపణల విచారణకు డిప్యూటీ కమిషనర్, దేవస్థాన ఉప కార్యనిర్వహణాధికారిని నియమించినట్టు తెలిపారు. విచారణ సమయంలో తగు సాంకేతిక సహకారం అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. విచారణ ఇంకా పూర్తి కాలేదని, సస్పెండ్ అయిన సీనియర్ అసిస్టెంట్‌ను విధుల్లోకి తీసుకోలేదని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

కేసుల చిక్కులు!

(5వ పేజీ తరువాయి)

పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం సిట్‌ను వేయటంతో ఈ కేసులపై సంపూర్ణ విచారణకు అడుగు ముందుకు పడింది.

కనీవినీ ఎరుగని మైనింగ్ దోపిడీ

గన్నవరం నియోజకవర్గంలో కనీవినీ ఎరుగని విధంగా అక్రమ మైనింగ్ కార్యకలాపాలు జరిగాయి. గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు, విజయవాడ రూరల్ మండలాల పరిధిలో చెరపట్టని కొండలు లేవు. కొండలను బోడిగుండ్లగా మార్చివేసి కోట్లాది రూపాయలను ఆర్జించారు. గ్రావెల్ తరలింపులో ఎన్నడూ లేని విధంగా రెవెన్యూ, పంచాయితీరాజ్, ఇరిగేషన్, మైనింగ్ శాఖల అప్పటి అవినీతి అధికారులను కూడా భాగస్వామ్యం చేసి వారికి వాటాలు ఇచ్చారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను ఆయా శాఖల అధికారులు ఎప్పుడూ పట్టించుకోలేదు. భారీ సంఖ్యలో చెరువులను ఆక్రమించారు. అక్రమంగా తవ్వకాలు సాగించారు. పేదల నుంచి భూములను బలవంతంగా లాక్కుని భారీ ఎత్తున మట్టి తవ్వకాలు చేశారు. పోలవరం కాలువను కూడా వదలకుండా మట్టి తవ్వుకుపోయారు. ప్రజలను బెదిరించి వారి భూములను వంశీ అనుయాయులు లాక్కున్నారు. భూ రికార్డుల ట్యాంపరింగ్‌కు సైతం పాల్పడ్డారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు సొంతగా పేదలకు ఇళ్ల పట్టాలను ఇచ్చారు. పట్టాలపై తహసీల్దార్ సంతకం చేయలేదన్న ఆరోపణలు ఉన్నాయి. తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేశారని ఆరోపణలు ఉన్నాయి. పట్టాలు ఇచ్చిన వారెవరికి ఆ పట్టాల్లో నిర్దేశించిన భూములు ఎక్కడ ఉన్నాయో తెలియదు. ఇవన్నీ ప్రాథమికంగా గుర్తించినప్పటికీ.. వీటిపై చర్యలు తీసుకోవటానికి సమగ్రమైన విచారణ అవసరం.

ఎన్‌హెచ్ X ట్రాన్స్‌కో

(5వ పేజీ తరువాయి)

అనుమతి తీసుకోకుండా ఈ గోడను కూల్చివేశారన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై ట్రాన్స్‌కో అధికారులు అప్పట్లో సీరియస్‌గా పట్టించుకోలేదు. అప్పటి ఉమ్మడి కృష్ణాజిల్లా కలెక్టర్‌కు దీనిపై ఫిర్యాదు చేసి ఊరుకున్నారు. ఎన్‌హెచ్‌కు నోటీసు పంపటం కానీ, వివరణ కోరటం కానీ జరగలేదు. జరిగిన నష్టాన్ని ఎన్‌హెచ్ నుంచి రాబట్టే అంశాన్ని కూడా అప్పటి ట్రాన్స్‌కో అధికారులు వదిలేశారు. అప్పట్లో ట్రాన్స్‌కో అధికారులు ఎందుకు ఇంత ఉదాసీనంగా ఉన్నారో అర్థం కాని విషయం. దాదాపుగా ఏడేళ్లుగా ఈ సమస్యకు పరిష్కారం లభించటం లేదు. ఇటు ఎన్‌హెచ్, అటు ట్రాన్స్‌కోల మధ్య నెలకొన్న వివాదం కారణంగా డ్రెయిన్ల విస్తరణ పనులు కూడా ఆగిపోయాయి. గంగూరు సబ్‌స్టేషన్ వివాదం కారణంగా ఆ పక్కన పరిహారం తీసుకున్న పెట్రోల్ బంక్ నిర్వాహకులు, కళ్యాణ మండపం నిర్వాహకులు సదరు స్థలాన్ని వదిలి పెట్టడం లేదు. దీనివల్ల డ్రెయిన్ నిర్మాణ పనులకు విఘాతం ఏర్పడుతోంది.

పెరుగుతున్న అంచనా వ్యయం

ఎన్‌హెచ్, ట్రాన్స్‌కోల మధ్యన తలెత్తిన వివాదం ఏడెనిమిదేళ్లుగా అలాగే ఉండటం వల్ల ప్రస్తుత ఎస్ఎస్ఆర్‌ల ప్రకారం 50శాతం మేర అంచనాలు పెరిగాయి. ఎన్‌హెచ్ లెక్కల ప్రకారం చూసుకున్నా రూ.8 కోట్లకు అంచనా పెరిగింది. ఈ ప్రతిష్ఠంబన వల్ల నెలకొన్న సమస్యతో మరో రూ. 4 కోట్ల అంచనా పెరిగింది. ఈ పెరిగిన అంచనాకు ఎవరు బాధ్యత వహిస్తారు?

ఒకరిపై మరొకరు నెపం నెట్టుకుంటూ..

గంగూరు సబ్‌స్టేషన్ వివాదం నేపథ్యంలో సామాజిక బాధ్యత కలిగిన కొందరు ఎన్‌హెచ్, ట్రాన్స్‌కోలకు లేఖలు రాస్తే, ఇటు ఎన్‌హెచ్, అటు ట్రాన్స్‌కోలు బాధ్యతారాహిత్యంగా సమాధానాలు ఇచ్చారు. ట్రాన్స్‌కో పంపిన ఎస్టిమేట్లకు సంబంధించిన వాటిపై వివరణ కోరటం జరిగిందని, వారి నుంచి సమాధానం రాలేదన్నది ఎన్‌హెచ్ వాదనగా ఉంది. తమకు సమాచారం ఇవ్వకుండానే గోడను కూల్చివేశారని ట్రాన్స్‌కో ఆరోపిస్తోంది. అంచనాలు పెరిగిపోయాయి కదా అంటే అప్పుడు వివరణ ఇవ్వలేదు కాబట్టి తమకేమీ సంబంధం ఉండదని ఎన్‌హెచ్, ఎన్‌హెచ్‌దే బాధ్యత అని ట్రాన్స్‌కోలు ఎవరి వాదన అవి వినిపిస్తున్నాయి.

పోలీసులకు బెదిరింపులు

(5వ పేజీ తరువాయి)

నిర్వాహకుడు చలసాని ప్రసన్న భార్గవ్ నియంత్రణలో ఉంటుంది. శంకర్ నాయక్ ఏ తప్పు చేయకపోతే ఎవరో చెబితే మంచం కింద ఎలా దాక్కున్నారన్న ప్రశ్న తలెత్తుతోంది. రాసలీలల వ్యవహారంలో పోలీసులకు అడ్డంగా దొరికిపోయిన శంకర్ నాయక్ దీనికి ఇప్పుడు రాజకీయ కోణాన్ని జత చేస్తున్నారు. కేవలం తనను కుట్రతో ఈ కేసులో ఇరికించి, విటుడిగా చిత్రీకరించారని మొసలికన్నీరు కారుస్తున్నారు.

సోషల్ మీడియాలో దుష్ప్రచారంపై ఫిర్యాదు

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 27వ తేదీన జరుగనున్న కృష్ణా-గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు పోటీ చేస్తున్న సంగతి విదితమే. ఎన్నికలు పోటాపోటీగా జరుగుతున్న తరుణంలో గత కొద్ది రోజులుగా సోషల్ మీడియా వేదికలలో కొందరు వ్యక్తులు దురుద్దేశ్యంతో కె.ఎస్.లక్ష్మణరావుపై దుష్ప్రచారం చేస్తున్నారని కె.ఎస్.లక్ష్మణరావు ఎలక్షన్ చీఫ్ ఏజెంట్, సీనియర్ న్యాయవాది సప్పా రమేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొద్ది సంవత్సరాల క్రితం మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డికి ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తమై వినతిపత్రం ఇవ్వబోగా, కిందపడిన కాగితాలను తీయడానికి కిందకు వంగిన కె.ఎస్.లక్ష్మణరావు వీడియోలను జగన్మోహనరెడ్డి పాదాలపై పడిన లక్ష్మణరావు అని ఓటర్లలో గందరగోళం సృష్టించి లబ్ధి పొందాలనే దురుద్దేశ్యంతో కొంతమంది సోషల్ మీడియా వేదికలలో దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులైన వ్యక్తులపై తగు చర్యలు తీసుకోవాలని సోమవారం ఎమ్మెల్సీ లక్ష్మణరావు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు.

కె.ఎస్.లక్ష్మణరావు గతంలో మూడు పర్యాయాలు శాసనమండలి సభ్యులుగా అనేక ప్రజా సమస్యల పరిష్కారానికి అవిరళ కృషి చేశారని, ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) సభ్యుడిగా మచ్చలేని ప్రజా జీవితం గడిపారని రమేష్‌బాబు తెలిపారు. కానీ కొంతమంది రాజకీయ, వ్యక్తిగత లబ్ధి కోసం ఆయనపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అలా దుష్ప్రచారం చేస్తున్న వారిపై తగిన సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, విచారణ జరిపి నిందితులపై తగు చర్య తీసుకోవాలని చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్, ఏపీ డీజీపీ, గుంటూరు జిల్లా కలెక్టర్, ఎస్పీలకు రమేష్‌బాబు తగు ఆధారాలతో సోమవారం ఫిర్యాదు చేశారు.

ఇన్నర్‌తోనే ఇక్కట్లకు చెక్!

(5వ పేజీ తరువాయి)

హైదరాబాద్, మచిలీపట్నం - బెంగళూరు, విశాఖపట్నం - చెన్నై, విశాఖపట్నం- బెంగళూరు మార్గాలలో విజయవాడ మీద పడే ట్రాఫిక్‌ను నూటికి తొంభై శాతం వరకు నివారించటానికి అవకాశం ఉంటుంది. విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డు ఎలాగూ మరో నాలుగైదు నెలల్లో పాక్షికంగా గొల్లపూడి వరకు ముందుగా అందుబాటులోకి వస్తుంది. తూర్పు వైపున కూడా బైపాస్ వస్తేనే శాశ్వతంగా ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టడానికి అవకాశం ఏర్పడుతుంది. తూర్పు బైపాస్ లేదంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఇన్నర్ రింగ్‌రోడ్డును అయినా ఈ సమయంలో ముందుకు తీసుకువస్తే విజయవాడకు శాశ్వతంగా ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టవచ్చు.

ఇన్నర్ అలైన్‌మెంట్ మీదుగా డైవర్షన్ ప్రాంతాలు

ఇన్నర్‌తో ఎన్‌హెచ్- 16, గ్రేటర్ విలీన ప్రాంతాలపై ఒత్తిడి తగ్గించే ప్రాంతాలు

నగరంతోపాటు విజయవాడ గ్రేటర్ విలీన ప్రతిపాదిత ప్రాంతాలు కూడా అంతర్గత ట్రాఫిక్ సమస్యల ప్రభావాన్ని చవిచూస్తున్నాయి. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ప్రకారం ఉమ్మడి కృష్ణాజిల్లాలో ప్రధానంగా ఎన్‌హెచ్-16 మీద పడే భారాన్ని తగ్గించటానికి అనేక కీలకమైన పాయింట్లు ఉన్నాయి. ఈ మార్గంలో నిడమానూరు దగ్గర ఇన్నర్ టచ్ అవుతుంది. నిడమానూరు జంక్షన్‌కు పైనుంచి అంటే గూడవల్లికి సమీపం నుంచి వెళుతుంది. ఏలూరు వైపు నుంచి వచ్చే భారీ వాహనాలు, ఇతర ట్రాఫిక్ ఇటు నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డులోకి వెళ్తాయి. దీంతో విజయవాడపై ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయి. ఎన్‌హెచ్-65పై పడే ట్రాఫిక్ రద్దీని నివారించటానికి పోరంకి, పెనమలూరు మీదుగా సాగే ఇన్నర్ అలైన్‌మెంట్ ద్వారా డైవర్షన్ అవుతుంది. పోరంకి, పెనమలూరు సెంటర్ మధ్యలో ఒక జంక్షన్ ఏర్పడుతుంది. ఈ జంక్షన్ కారణంగా విజయవాడలో పటమట నుంచి ఆటోనగర్, కానూరు, తాడిగడప, పోరంకి తదితర ప్రాంతాలు ఇన్నర్ ట్రాఫిక్ కూడా ఇన్నర్ అలైన్‌మెంట్ మీదుగా డైవర్షన్ కావటానికి అవకాశం ఉంటుంది. మరో జాతీయ రహదారి అయిన విజయవాడ - ఛత్తీస్‌గడ్ మార్గంలోని ఎన్‌హెచ్ - 30 మీద ఇబ్రహీంపట్నం, కొండపల్లి మీదుగా వెళ్లే ట్రాఫిక్‌ను ఐఆర్ఆర్ మీదుగా డైవర్షన్ చేయటానికి అవకాశం ఉంటుంది.

ఎన్టీఆర్ జిల్లాలో వెస్ట్ బైపాస్‌కు ఎగువన.. కృష్ణాజిల్లాలో తూర్పు బైపాస్‌కు దిగువన..

ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ వెస్ట్ బైపాస్ ఎగువన ఇన్నర్ రింగ్ రోడ్డు వస్తుంది. విజయవాడ వెస్ట్ బైపాస్ అనేది ఎన్‌హెచ్-65పై గొల్లపూడి బయట అనుసంధానం అవుతుంది. అదే ఇన్నర్ రింగ్ రోడ్డు అయితే ఇబ్రహీంపట్నం, కొండపల్లి మీదుగా వెళుతుంది. ఇలా డైవర్షన్ అయిన వాహనాలు తిరిగి నున్న దగ్గర విజయవాడ వెస్ట్ బైపాస్‌లోకి వస్తాయి. వెస్ట్ బైపాస్ మీదకు చేరిన వాహనాలు చిన్న అవుటపల్లిలో ఎన్‌హెచ్-16కు అనుసంధానమవుతాయి. కృష్ణాజిల్లాలో విజయవాడ ఈస్ట్ బైపాస్ అలైన్‌మెంట్ కంటే కూడా ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ దిగువన ఉంటుంది. అందువల్ల ఈస్ట్ బైపాస్ లేని కొరతను ఇన్నర్ రింగ్ రోడ్డు మాత్రమే తీర్చగలదు.

రాజకీయ కక్షతోనే నాపై తప్పుడు ప్రచారం

- ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు శంకర్ నాయక్

గాంధీనగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గిరిజన నేతగా తన రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేక తనపై కుట్రతో సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని వైసీపీ నేత, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సోషల్ మీడిమాలో తనపై వస్తున్న ఆరోపణలను ఖండించారు. గత ఇరవై ఏళ్లుగా గిరిజనుల సమస్యలపై పోరాడుతున్నానన్నారు. నగరంలోని ఒక యూట్యూబ్ చానల్‌కు వెళ్లానని, అక్కడ స్పా సెంటర్ నిర్వహిస్తున్నట్టు తనకు తెలియదన్నారు. కొద్ది సేపటికి పోలీసులు అక్కడకు వచ్చారని, ఒక వ్యక్తి తనను గదిలో ఉండమని చెప్పడంతో గదిలోకి వెళ్లానన్నారు. అక్కడ 20 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, కాని కేవలం తన ఫొటో, వీడియో మాత్రమే బహిర్గతం చేశారన్నారు. ఎస్టీ కమిషన్ సభ్యుడిగా మూడేళ్ల ఎంతో మంది గిరిజనుల సంక్షేమానికి కృషి చేశానని వివరించారు. రాజకీయ కక్షతోనే తనను ఈ కేసులో ఇరికించారని, తాను ఏ తప్పు చేయలేదన్నారు. దీనిపై న్యాయపరంగా పోరాడతానని తెలిపారు.

విజయవాడ తూర్పు



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 99, 110
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 480

పట్టభద్రుల సమస్యలపై పోరాడేందుకు మద్దతివ్వండి

ఇండిపెండెంట్ ఎమ్మెల్సీ అభ్యర్థి శారద

గాంధీనగర్, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) 24: ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో ఉద్యోగులు, పెన్షనర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారని కృష్ణా- గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఇండిపెండెంట్ ఎమ్మెల్సీ అభ్యర్థి తిరువీధుల శారద తెలిపారు. గాంధీనగర్‌లోసోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులకు కరపత్రాలు పంపిణీ చేస్తూ మొదటి ప్రాధాన్యత ఓటు తనకు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యలపై పోరాడేందుకు తనకు ఎమ్మెల్సీగా మద్దతు పలకాలని విజ్ఞప్తి చేశారు.

పారిశుధ్యం మెరుగ్గా ఉండాలి

శివరాత్రికి ఘాట్ల వద్ద ఏర్పాట్లు చేయండి.. సిబ్బందికి కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం

వన్‌టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఘాట్ల వద్ద పారిశుధ్య నిర్వహణ పూర్తిస్థాయిలో చేయాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. కమిషనర్ సోమవారం కృష్ణవేణి ఘాట్, దుర్గాఘాట్, పున్నమిఘాట్, భవానీ ఘాట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శివరాత్రి సందర్భంగా వచ్చే భక్తులందరికీ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నగరపాలక సంస్థ అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఘాట్ల వద్ద పారిశుధ్య నిర్వహణకు, ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేటట్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఘాట్లలో శాశ్వత చెత్తబుట్టలను ఏర్పాటు చేయాలన్నారు. భవానీపురంలోని నగరపాలక సంస్థ మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పున్నమి ఘాట్‌లో గ్రీనరీ పెంచి, ఆహ్లాదకరమైన వాతావరణం అందించాలన్నారు. నగరపాలక సంస్థ ఖాళీ స్థలాల్లో ప్రజలకు ఆహ్లాదపరిచే విధంగా పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ మోడల్‌లో ప్రాజెక్టులు తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జోనల్



దుర్గాఘాట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర, తదితరులు

కమిషనర్ రమ్య కీర్తన, చీఫ్ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఎస్‌ఈలు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, ప్రాజెక్టు ఆఫీసర్ (యూసీడీ) పి.వెంకటనారాయణ, ఈఈ వెంకటేశ్వర రెడ్డి, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయినేజీ పూడికతీత నిరంతరం జరగాలి

డ్రెయినేజీల పూడికతీత నిరంతరం జరుగుతూ ఉండాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. తన కార్యాలయంలో శాఖాధిపతులతో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. మైనర్, మీడియం, మేజర్ డ్రెయిన్లలో పూడికతీత పనులను పూర్తి చేయాలన్నారు. గుంతలు రహిత నగరంగా తీర్చిదిద్దాలన్నారు. నగర సౌందర్యాన్ని దెబ్బతీసే సర్వీసు ప్రొవైడర్ల వైర్లను పరిశీలించి తొలగించాలన్నారు. రెవెన్యూ, ప్రజారోగ్య, కమర్షియల్ టాక్స్, టౌన్ ప్లానింగ్ శాఖలు సమన్వయంతో పన్నులను వసూలు చేయాలని కమిషనర్ అన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డి.చంద్రశేఖర్, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు, జోనల్ కమిషనర్లు రమ్య కీర్తన, ప్రభుదాస్, ఎస్‌ఈలు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, డీడీ (హార్టికల్చర్) రామ్మోహన్, రీజనల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, ఎగ్జామినేటర్ ఆఫ్ అకౌంట్స్ చక్రవర్తి, అకౌంట్స్ ఆఫీసర్ సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

శాస్త్రీయ నృత్య పోటీల విజేతలు

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : సంస్కార భారతి విజయవాడ మహానగర్, సుమధుర కళానికేతన్ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జాతీయ స్థాయిలో నిర్వహించిన శాస్త్రీయ నృత్య పోటీలు మొత్తం ఆరు వేదికలపై జరిగాయి. ఈ పోటీల్లో 524 మంది కళాకారులు పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకొన్నారు. ఈ కార్యక్రమంలో వచ్చిన ప్రతి ఒక్కరికి సోమవారం జ్ఞాపిక, సర్టిఫికెట్స్ అందించారు. ప్రతి విభాగంలోను ప్రథమ, ద్వితీయ, తృతీయతో పాటు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. 15 మంది ప్రముఖ నాట్య గురువులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. రెండో రోజు కళాకారులందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. కూచిపూడి, భరతనాట్యం, ఆంధ్ర నాట్యం మొత్తం 11 విభాగాలలో విజేతలకు బహుమతులు అందించారు. సంస్కారభారతి కార్యకర్తలు రెండు నెలల పాటు ప్రణాళికాబద్ధంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించి నిర్వహించారని సంస్కార భారతి అధ్యక్షుడు డాక్టర్ పీవీఎన్ కృష్ణ తెలిపారు.

విజేతల వివరాలు..ఆంధ్రనాట్యంలో జూనియర్ విభాగంలో జి.నాగతన్వశ్రీ, ఐ.రూపశ్రీ, కేవీ శ్రీ అంజలి, సీనియర్స్ విభాగంలో పి.మానసతేజ, టీవీఎస్ చిన్మయి, పి.ఆదర్శ, భరతనాట్యం జూనియర్ విభాగంలో జి.పరిణీతి, కె.ఐశ్వర్య, బి.జాహ్నవి, సీనియర్ విభాగంలో పి.గాయత్రి, ఎస్.హర్షిత, కె.శాన్వశ్రీ కూచిపూడి నాట్యంలో జూనియర్స్‌లో వై.సత్యప్రణవి, రోషిత శ్రీవల్లిక, బేబీ జాహ్నవి, సీనియర్ విభాగంలో డి.శ్రీ సాయి వర్షిత, బి.దుర్గా సరస్వతి, ఎం.తనుష్ తేజ్, శాస్త్రీయ బృంద నృత్యంలో కె.శాన్వశ్రీ బృందం, సహస్ర బృందం, డి.సుప్రియ బృందం, లహరి డాన్స్ గ్రూప్, ఉమామహేశ్వర కళాక్షేత్రం బృందం, శాకాంబరీ బృందంలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారు.

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

దళిత, ప్రజా సంఘాల నేతల పిలుపు

గాంధీనగర్, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) 24: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని పలు దళిత, ప్రజా సంఘాలు పిలుపునిచ్చాయి. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. గత 18 ఏళ్లుగా రాజ్యాంగ లక్ష్యాలు, ఆశయాలకు కట్టుబడి పని చేస్తున్న పీడీఎఫ్ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కృష్ణా-గుంటూరు జిల్లాల అభ్యర్థిగా కే.ఎస్.లక్ష్మణరావు, ఉభయ గోదావరి జిల్లాల అభ్యర్థిగా దిడ్ల వీర రాఘవులు, ఉత్తరాంధ్ర అభ్యర్థిగా కె.విజయగౌరి పోటీ చేస్తున్నారన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి అండ్ర మాల్యాద్రి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్, బహుజన నాయకుడు కొలనుకొండ శివాజీ, అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల వీరాస్వామి, దళిత నాయకులు బాలు, డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర నేతలు గణేష్‌బాబు, కనకరాజు, కేవీపీఎస్ నేతలు జి.నాగరాజ్ పాల్గొన్నారు.

మెప్పించిన ‘పార్వతీ కల్యాణం’ యక్షగానం

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మొగల్రాజపురం సిద్ధార్థ ఆడిటోరియంలో ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో సోమవారం ప్రదర్శించిన పార్వతీ కల్యాణం (కూచిపూడి యక్షగానం) ప్రేక్షకులను మెప్పించింది. ఈ ప్రదర్శనలో బిస్మిల్లా ఖాన్ యువ పురస్కార్ గ్రహీత డాక్టర్ చింతా రవిబాలకృష్ణ బృందం పాల్గొని, ఆదిదంపతులైన పార్వతీ-పరమేశ్వరుల వివాహకథను సజీవంగా ఆవిష్కరించారు. హిమవంతుని కుమార్తె పార్వతీదేవి, పరమశివుని వివాహం చేసుకోవాలనే సంకల్పంతో ఆయనను భక్తిశ్రద్ధలతో పూజిస్తుంది. అయితే ఈశ్వరుడు స్పందించక పోవడంతో, మన్మధుడు పుష్ప బాణాన్ని ప్రయోగించి శివుని తపస్సుకు భంగం కలిగిస్తాడు. కోపోద్రిక్తుడైన శివుడు, తన త్రినేత్రంతో మన్మధుని భస్మం చేస్తాడు. రతీదేవి ప్రార్థనతో, శివుడు మన్మధునికి పునర్జన్మ ప్రసాదించి పార్వతీదేవిని వివాహం చేసుకొంటాడు. ఈ ప్రదర్శనలో నట్టువాంగం డాక్టర్ చింతా రవిబాలకృష్ణ, సహకార నట్టువాంగం కొరవి సుబ్రహ్మణ్య ప్రసాద్, గాయకులు కుమార సూర్యనారాయణ, గాయని సుధారాణి, వయోలిన్ పాలపర్తి ఆంజనేయులు, మృదంగం పసుమర్తి హరినాథశాస్త్రి, వేణువు కుమార బాబులు వాద్య సహకారం అందించారు. పాత్రధారులుగా పరమేశ్వరుడు డి.వర్షితవర్మ, పార్వతీదేవి పెదపూడి నాగశ్రీప్రవల్లిక, మన్మధుడు నదుల సరయు, రతీదేవి ఎల్.సాయి నాగసుస్మిత, భృంగి సూరుకుర్తి యాసశ్రీ తమ నృత్యంతో ప్రేక్షకులను మెప్పించారు. అనంతరం కళాకారులను అకాడమీ ప్రతినిధులు సెక్రటరీ లలిత ప్రసాద్, బీవీఎస్ ప్రకాష్ సత్కరించారు.



పార్వతీ కల్యాణం ప్రదర్శనలో నృత్య సన్నివేశం, శివపార్వతులు

భక్తిప్రపత్తులతో శ్రీశైల మల్లన్న తలపాగా ఊరేగింపు

వన్‌టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రిని పురస్కరించుకుని విజయవాడలో తొలిసారిగా శ్రీశైల మల్లన్న తలపాగా ఊరేగింపు మహోత్సవం భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం వన్‌టౌన్‌లోని భ్రమరాంబ మల్లేశ్వర దేవస్థానం (పాత శివాలయం)లోని స్వామి వారి తలపాగాకు విశేష పూజాదికాలు నిర్వహించారు. పాత శివాలయం నుంచి గుణదలలోని దేవాంగ సంక్షేమ సంఘం హాస్టల్ వరకు మేళ, తాళాల నడుమ స్వామివారి తలపాగాను ఊరేగింపుగా తీసుకువెళ్లారు. సంఘం కార్యాలయంలో శ్రీశైల మల్లన్న తలపాగాకు పూజలు నిర్వహించారు. కామయ్యతోపునకు చెందిన గీతాపారాయణ భక్త బృందం ఆధ్వర్యంలో భజన నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఈ మహోత్సవంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, గద్దె క్రాంతి కుమార్ పాల్గొన్నారు. సంఘం నాయకులు మాట్లాడుతూ గత కొన్ని తరాలుగా దేవాంగ వంశస్థులైన తొమ్మిది కుటుంబాలు శ్రీశైల మల్లన్న తలపాగా నేతలో తరిస్తున్నాయని వివరించారు. తలపాగా తయారీకి స్వచ్ఛమైన తెల్లటి దారాన్ని మాత్రమే ఉపయోగిస్తారని, తొలిసారిగా విజయవాడలో మల్లన్న తలపాగా ఊరేగింపు కార్యక్రమం నిర్వహించామని చెప్పారు. పూజా కార్యక్రమాలు అనంతరం తలపాగాను శ్రీశైల దేవస్థానానికి అందజేయటం జరుగుతుందని చెప్పారు. మహాశివరాత్రి పర్వదినాన అర్ధరాత్రి సమయంలో లింగోద్భవం తరువాత భక్తులు మల్లన్న పాగా దర్శనం చేసుకుని తరిస్తారని వివరించారు. విజయవాడ సంఘం అధ్యక్షుడు వై.శంకర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఆర్.తులసీరామ్, కోశాధికారి జి.శంకర్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు జి.ఎర్రిస్వామి, ప్రధాన కార్యదర్శి జె.శ్రీనివాస్, కోశాధికారి బి.మురళి పాల్గొన్నారు.



శ్రీశైల మల్లన్న తలపాగా ఊరేగింపులో పాల్గొన్న దేవాంగ సంక్షేమ సంఘం ప్రతినిధులు

వేర్వేరు సంఘటనల్లో ఇద్దరి మృతి

వన్‌టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : రెండు వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు మృతి చెందినట్లు సోమవారం కొత్తపేట పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం వాగు సెంటర్ దుక్కా తిరుపతమ్మ వీధిలో ఉంటున్న రావాడ అప్పారావు (79)వన్‌టౌన్ రాయల్ హోటల్ సమీపంలో సోలంకి రాజేంద్ర జైన్ నిర్మిస్తున్న బిల్డింగ్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. అప్పారావు సోమవారం ఉదయం 8 గంటలకు బిల్డింగ్ మొదటి అంతస్థులో వాటర్ సర్వీసు చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి బిల్డింగ్ పైనుంచి కిందపడ్డాడు. ఈ ఘటనలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. బిల్డింగ్ వద్ద పని చేస్తున్న మద్దాని శ్రీను అతని కుటుంబ సభ్యులకు సమాచారం తెలియపరిచాడు. కుమారుడు సత్యనారాయణ, మరికొందరు బంధువులు బిల్డింగ్ వద్దకు వెళ్లి చూడగా, అప్పటికే అప్పారావు మృతి చెందినట్లు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న కొత్తపేట పోలీసులు వివరాలు తెలుసుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆత్మహత్య చేసుకుని ఎలక్ట్రీషియన్..

బ్రైజర్‌పేట జేమ్స్ వీధిలో జొన్నలగడ్డ కిరణ్ దాస్, భార్య, ముగ్గురు పిల్లలతో ఉంటున్నారు. ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న కిరణ్ దాస్ మద్యానికి బానిసై చనిపోతానంటూ భార్యతో చెప్పేవాడు.ఆదివారం ఉదయం భార్య డ్యూటీకి వెళ్లగా కిరణ్ దాస్ ఫూటుగా మద్యం తాగాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో బెడ్ రూమ్‌లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకున్నాడు. భార్య రాత్రి 7.30కు ఇంటికి వచ్చి చూడగా భర్త వేలాడుతూ కనిపించాడు. ఆమె గట్టిగా కేకలు వేయటంతో పక్కనే ఉన్న ఆమె బంధువులు వచ్చి కిరణ్ దాస్ భౌతికకయాన్ని కిందకు దించారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



స్టెల్లా కళాశాలలో ప్రచారం నిర్వహిస్తున్న గద్దె అనురాధ

ఆలపాటిని ఆదరించాలి

జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ

పటమట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యా రంగంతో పాటు ఉపాధ్యాయుల, పట్టభద్రుల సమస్యలపై అవగాహన ఉన్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను ఉపాధ్యాయ లోకమంతా ఆదరించాలని జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ కోరారు. సోమవారం మారిస్ స్టెల్లా కళాశాలలో ఉపాధ్యాయులను కలిసి ఆలపాటికి ఓట్లు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెల్లా కళాశాల ప్రిన్సిపాల్ జెసింతా క్వాడ్రస్, పేరేపి ఈశ్వర్, పి.రత్నశ్రీ తదితరులు పాల్గొన్నారు.



న్యాయవిజ్ఞాన సదస్సులో పాల్గొన్న కృష్ణా జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ కేవీ రామకృష్ణయ్య

లీగల్ అథారిటీ సెక్రటరీ రామకృష్ణయ్య ప్రజ్వల ఓపెన్ షెల్టర్ సందర్శన

విజయవాడలీగల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కృష్ణలంకలోని ప్రజ్వల ఓపెన్ షెల్టర్‌ను కృష్ణాజిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ కేవీ రామకృష్ణయ్య సోమవారం సందర్శించి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన ప్రజ్వల సిబ్బంది, షెల్టర్‌లో ఆశ్రయం పొందుతున్న పిల్లలతో మాట్లాడారు. పిల్లల పూర్తి సమాచారం, సీడబ్ల్యూసీ ద్వారానే ఇక్కడ జాయిన్ చేయించుకొంటున్నామని సిబ్బంది ఆయనకు తెలిపారు. ఆయన రిజిస్టరును చెక్ చేశారు. డార్మిటరీ, టాయ్‌లెట్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం.రాజేశ్వరరావు, డీపీవో జ్యోతి, నోడల్ ఆఫీసర్ సాయిగీత, కిరణ్‌కుమార్, హోమ్ కో ఆర్డినేటర్ సుశీల్ పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్‌లో ఆహార నాణ్యతపై కమిషనర్ ఆరా

కృష్ణలంక, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : అన్న క్యాంటీన్‌కు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. సోమవారం కృష్ణలంక జాతీయ రహదారి వద్ద అన్నక్యాంటీన్‌ను ఆయన సందర్శించారు. అక్కడున్న ఆహార నాణ్యత గురించి ప్రజలను అడిగి తెలుసుకొన్నారు. కిచెన్‌లో పరిశుభ్రతను స్వయంగా వీక్షించారు. తాగునీరు సౌకర్యం నిరంతరాయంగా ఉండాలని, వాడుక నీటి పైపులైన్లలో ఎటువంటి మరమ్మతులు ఉండరాదని, బయట కూడా టేబుల్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.



అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర



విజేతలతో కళాశాల ప్రిన్సిపాల్ ఆచంట సునీత తదితరులు

జాతీయస్థాయి పోటీల్లో సిద్ధార్థ ఫార్మసీ విద్యార్థులకు బహుమతులు

విజయవాడ(స్పోర్ట్స్), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరు చలపతి ఫార్మసీ మిలీనోత్సవం 4.0శీర్షికతో ఈనెల 21,22 తేదీల్లో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో పలు విభాగాల్లో పాల్గొన్న సిద్ధార్థ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలు, ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆచంటి సునీత తెలిపారు. ఈ పోటీల్లో దేశంలోని పలు కళాశాలల నుంచి 750మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు.

వాలీబాల్, కబడ్డీ, చదరంగం, త్రోబాల్‌లో ప్రథమస్థానం, షాట్‌పుట్‌లో రెండోస్థానం ఓవరాల్ రన్నర్ చాంపియన్‌షిప్‌ను సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

ప్రపంచవ్యాప్తంగా ఏఐకు డిమాండ్

ఐబీఎం కంపెనీ ప్రతినిధి శ్రీకాంత్

ఉంగుటూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)లో ప్రత్యేక నైపుణ్యాలు కలిగివున్నవారికి స్కిల్స్ ఆధారిత ఉద్యోగాల్లో మంచి డిమాండ్ వుందని, ప్రముఖ ఐబీఎం(ఎంఎన్‌సీ సాఫ్ట్‌వేర్)కంపెనీ ప్రతినిధి ఎన్.శ్రీకాంత్(హైదరాబాద్) అన్నారు. మండలంలోని తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ థర్డ్ ఇయర్ విద్యార్థులకు ఐబీఎం అండ్ నాస్కామ్ ఆధ్వర్యంలో ఏఐ ఫండమెంటల్స్, ఉపయోగాలపై రెండు రోజులపాటు జరిగే వర్క్‌షాపును సోమవారం ప్రారంభించారు. కళాశాల చైర్మన్ సుంకర రామబ్రహ్మం, ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్, ఈసీఈ విభాగాధిపతి బి.నాంచారయ్య వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులను ప్రోత్సహించి అభినందించారు. వర్క్‌షాప్ సమన్వయకర్త పీవీ ధర్మరాజన్, కో-ఆర్డినేటర్లు ఎంకే కిషోర్, టి.శ్రీధర్ తదితరులు పర్యవేక్షించారు.

28న స్టేట్ లెవల్ ఫెస్ట్ లక్ష్య-2025

లబ్బీపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ మహిళా కళాశాలలో ఈనెల 28న కళాశాల కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో స్టేట్ లెవల్ ఫెస్ట్ లక్ష్య-2025 నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన తెలిపారు. సోమవారం కళాశాలలో లక్ష్య పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో అన్ని కళాశాలలు, యూనివర్సిటీ నుంచి విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. కళాశాల స్పెషల్ ఆఫీసర్ ఆర్.మాధవి, సంధ్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



లక్ష్య పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ ఎస్.కల్పన తదితరులు

అంతర్జాతీయ సాఫ్ట్‌టెన్నిస్‌కు భావన

అహ్మదాబాద్‌లో ఈ నెల 11 నుంచి 13 వరకు జరిగిన సాఫ్ట్ టెన్నిస్‌లో పాల్గొన్న తమ కళాశాల విద్యార్థిని బి.భావన అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన తెలిపారు. ఇప్పటి వరకు పలు టోర్నమెంట్‌లలో పాల్గొని పతకాలు సాధించిందని, మార్చి 16నుంచి 22వరకు యూపీలో జరిగే పోటీల్లో భావన పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని అభినందించారు.

నగర క్రీడోత్సవ్-2025 పోస్టర్ ఆవిష్కరణ



నగర క్రీడోత్సవ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

విజయవాడ(స్పోర్ట్స్), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి మార్చి 2 వరకు జరగనున్న నగర క్రీడోత్సవ్-2025 పోస్టర్‌ను శాప్ చైర్మన్ రవినాయుడు సోమవారం ఆవిష్కరించారు. మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాలలో ఖేలో భారత్ నగర క్రీడోత్సవ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకట గోపీ చౌదరి, స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడు దుర్గారావు తెలిపారు.

భారత జట్టుకు రాష్ట్ర సాఫ్ట్ టెన్నిస్ క్రీడాకారులు ఎంపిక హర్షణీయం

లబ్బీపేట: రాష్ట్రానికి చెందిన సాఫ్ట్ టెన్నిస్ క్రీడాకారులు భారత జట్టుకు ఎంపికకావడం హర్షించదగ్గ విషయమని, అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రా క్రీడాకారులు రాణించాలనేదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. ఏపీ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ చైర్మన్ దారం నవీన్‌కుమార్‌తో కలిసి శాప్‌చైర్మన్‌ను సోమవారం క్రీడాకారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాప్ నుంచి పూర్తిసహకారం అందిస్తామని, పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర కీర్తి ప్రతిష్టతలను ప్రపంచ వ్యాప్తంగా ఇనుమడింపజేయాలని సూచించారు. ఈ సందర్భంగా క్రీడా ప్రోత్సాహకాల బకాయిల విడుదలకు కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ శాప్ చైర్మన్‌ను ఏపీ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ తరపున సత్కరించారు.

మినీ కోటప్పకొండ.. మల్లయ్య కొండపర్వగట్టు



విస్సన్నపేట: పల్నాడు జిల్లాలో ప్రసిద్ధ శైవ పుణ్యక్షేత్రం కోటప్పకొండ తరహాలోనే ఎన్టీఆర్ జిల్లాలోనూ కొండపర్వగట్టు ఉంది. మినీ కోటప్పకొండగా ప్రసిద్ధికెక్కింది. ఇక్కడ శ్రీ భమరాంభికా మల్లేశ్వరస్వామి (మల్లయ్య రూపం) కొండపర్వపై కొలువై ఉన్నారు. కొండపర్వ మల్లయ్య స్వామిని మొక్కుకుంటే తీరని కోర్కెలు తీరతాయని, ప్రసిద్ధి. సుమారు 70 ఏళ్ల క్రితం ఏలూరు జిల్లా నూజివీడు, ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటలకు మధ్యలో ఉన్న కొండపర్వ గ్రామంలో కొంగగట్టుపై శ్రీ భ్రమరాంభికా మల్లేశ్వర స్వామి (మల్లయ్య స్వామి) స్వయంభువుగా వెలసినట్టు స్థానికులు చెబుతుంటారు. సమీపంలోని చిత్తపూర్‌కు చెందిన కొందరు మేకల కాపరులకు మల్లయ్య స్వామి దర్శనమిచ్చారని అప్పటి నుంచి పూజలు చేయడం ప్రారంభించారు. ఏడాది పాటు చిత్తపూర్ గ్రామస్థులు తిరునాళ్లు నిర్వహించారు. రెండో ఏడాది నుంచి కొండపర్వకు చెందిన గ్రామస్థులే స్వామి కల్యాణం నిర్వహించేవారు. అప్పటి నుంచి గ్రామస్తులే వైభవంగా తిరునాళ్లు నిర్వహించారు. ప్రస్తుతం గొట్టిపూళ్ల బుచ్చి వెంకట్రామ లక్ష్మి నరసింహారావు (బుచ్చిబాబు) ట్రస్టీగా ఉన్నారు.

ఉత్తరవాహినిలో పుణ్యస్నానం



పడమటి కనుమల్లో పుట్టిన కృష్ణమ్మ వడివడిగా ముక్త్యాలకు ఎగువన ఉత్తరంగా దిశను మార్చుకుని ముక్త్యాల వద్దకు రాగానే తూర్పుగా ప్రవహిస్తుంది. అందుకే ఇక్కడ కృష్ణానది ఉత్తరవాహినిగా ప్రసిద్ధి. మహా శివరాత్రికి ముక్త్యాల క్షేత్రానికి తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా వస్తారు. ఉత్తరవాహినిలో పుణ్యస్నానం చేస్తే కాశీలో పుణ్యస్నానం చేసిన ఫలితం వస్తుందని పురాణ ఉవాచ. 26న శివరాత్రి సందర్భంగా భవానీ ముక్తేశ్వర స్వామి, కోటిలింగాల అమృతలింగేశ్వర స్వామి ఆలయాలను సిద్ధం చేశారు. కృష్ణానదిలో ఇబ్బందులు లేకుండా జల్లు స్నానాలు, రక్షణకు పడవలు ఏర్పాటు చేశారు. చలువ పందిళ్లు, కోటిలింగాలలో షామియానాలు ఏర్పాటు చేశారు. కేసీపీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేస్తారు. పుణ్యస్నానాలు, మొక్కులు తీర్చుకోవటం, పిత్రుతర్పణ తీర్చుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో వాహనాల్లో వస్తారు. దీంతో పోలీసులు విధించే ఆంక్షలతో భక్తులకు తిప్పలు తప్పేలా లేవు. నదికి కిలోమీటరు దూరంలోనే వాహనాలు నిలిపేస్తే వృద్ధులు, మహిళలు, చిన్నారులకు ఇబ్బందే. ఆర్టీసీ బస్సులను దొండపాడు మార్గం వరకు అనుమతించేలా మాడాలని కోరుతున్నారు.

శంభో శంకర

రేపు శివనామస్మరణతో మార్మోగనున్న శివాలయాలు


మహా శివరాత్రి మహోత్సవాలకు దేవాలయాల ముస్తాబు

త్రికాల, లింగోద్భవ అభిషేకాలు, శివ పార్వతుల కల్యాణం, హోమాలు, పుష్పయాగాలు

ప్రభల ఊరేగింపులు, రథోత్సవాలు, గ్రామోత్సవాలకు సిద్ధం



హరహర మహదేవ.. శంభోశంకర..! అంటూ శివనామస్మరణతో శివాలయాలు మారుమోగనున్నాయి. శివరాత్రి సందర్భంగా కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాలు మహోత్సవాలకు సిద్ధమౌతున్నాయి. ఎంతో చరిత్రగాంచిన ఇంద్రకీలాద్రిపైనున్న మల్లేశ్వరాలయం, దిగువునున్న విజయేశ్వర స్వామి ఆలయం, యనమలకుదురులోని రామలింగేశ్వరస్వామి ఆలయం, ధర్మరాజు ప్రతిష్ఠించినట్టు చెప్పబడుతున్న వన్‌టౌన్‌పాత శివాలయం.. మినీ కోటప్పకొండగా చెప్పుకునే విస్సన్నపేట శివారు కొండపర్వ మల్లయ్యస్వామి ఆలయం, ఐలూరులోని ఉభయ రామక్షేత్రం, పెదకళ్లేపల్లిలోని నాగేశ్వరక్షేత్రం, నందిగామ దగ్గర్లో ఉన్న సంగమేశ్వరస్వామి ఆలయంతో



పాటు అనేక శైవాలయాలు అంగరంగ వైభవంగా ముస్తాబౌతున్నాయి. ఈ దేవాలయాల్లో త్రికాల అభిషేకాలు, లింగోద్భవ అభిషేకాలు, పార్వతీ శివ కల్యాణం, హోమాలు, పుష్పయాగాలు అన్నింటికి మించి ప్రభల ఉత్సవాలు కన్నుల పండువుగా నిర్వహించనున్నారు. వారం రోజులుగా రెండు జిల్లాల్లో శివరాత్రి మహోత్సవాల సందడి మొదలైంది. - ఆంధ్రజ్యోతి, విజయవాడ కల్చరల్/విస్సన్నపేట, పెనమలూరు, తోట్లవల్లూరు, మోపిదేవి, ఇబ్రహీంపట్నం, నందిగామ రూరల్, జగ్గయ్యపేట రూరల్, బస్టేషన్



బెజవాడకు కంఠాభరణం ఇంద్రకీలాద్రి

విజయవాడ నగరానికి కంఠాభరణంగా నిలిచే ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరాలయం వెలిసి భక్తులకు అద్భుతమైన దైవ సన్నిధినంలో ప్రశాంతతను అందిస్తోంది. ప్రముఖ శక్తిపీఠమైన దుర్గమ్మ ఆలయ సమీపంలోని మల్లేశ్వర స్వామి ఆలయానికి చారిత్రక ప్రాధాన్యతతో పాటు పురాణ మహత్యం ఉంది. తూర్పు ముఖంగా ఉన్న ఈ ఆలయంలోకి భక్తులు ఉత్తర దిశ నుంచి ప్రవేశిస్తారు. ప్రవేశ ద్వారంలో రౌద్రస్వరూపుడైన కాలభైరవుడు, నందీశ్వర దర్శనం లభిస్తాయి. పురాణ కథనం ప్రకారం కృతయుగంలో రాహన సంహారానంతరం రౌద్ర రూపిణిగా వెలిసిన దుర్గాదేవిని శాంతింపచేయడానికి దేవతలు మహాదేవుడిని ప్రార్థించారు. అక్కడే శివలింగాన్ని ప్రతిష్ఠించి బ్రహ్మదేవుడు మల్లికాపుష్పాలతో పూజించగా 'మల్లేశ్వరస్వామిగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ దుర్గామల్లేశ్వరస్వామి అర్థనారీశ్వర రూపంలో భక్తులకు దర్శనం ఇస్తాడు. 24 నుంచి శివరాత్రి మహోత్సవాలు ప్రారంభమవుతాయి. ఉదయం 9 గంటలకు దుర్గామల్లేశ్వరులకు మంగళ స్నానాలు ఆచరించి వధూవరులుగా అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేస్తారు. సాయంత్రం 4 గంటలకు అంకురారోహణ, కలశ స్థాపన, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ఠాపనతో ప్రారంభమై మార్చి 3 వరకు సాగుతాయి.

అర్జునుడి పవిత్రస్థలం.. విజయేశ్వరస్వామి ఆలయం



ఇంద్రకీలాద్రి కేవలం మల్లేశ్వరాలయానికే కాకుండా, ద్వాపర యుగానికి చెందిన మరో శివక్షేత్రానికి నిలయమైంది. కురుక్షేత్ర యుద్ధానికి ముందు అర్జునుడు పరమశివుడి కోసం కఠోర తపస్సు చేశాడు. అతడి భక్తిని పరీక్షించేందుకు శివుడు కిరాతక రూపంలో ప్రత్యక్షమై యుద్ధంచేసి ధైర్యశక్తులను అంచనా వేసి, భక్తికి మెచ్చి 'పాశుపతాస్త్రాన్ని' ప్రసాదించారు. ఆ విజయానికి గుర్తుగా అర్జునుడు ఇక్కడే శివలింగాన్ని ప్రతిష్ఠించాడు. అందుకే 'విజయేశ్వర స్వామి ఆలయం' గా పిలుస్తారు. ఇంద్రకీలాద్రిపై ఈ శైవక్షేత్రాలు భక్తులకు దివ్యానుభూతిని కలిగిస్తూ విజయవాడ నగరానికి మహాత్యాన్ని కలిగిస్తోంది.





మహిమాన్విత్వం.. పెదకళ్లేపల్లి క్షేత్రం

కృష్ణా నదితీరాన పవిత్ర శైవ క్షేత్రాల్లో పెదకళ్లేపల్లి క్షేత్రం ఒకటి. దీనిని అంబాపురమని, నాగేశ్వర క్షేత్రమని, కర్కోటక క్షేత్రమని పిలుస్తారు. క్రీస్తుశకం 1292లో సోమశివాచార్యులచే నిర్మించబడినట్టు శాసనాల్లో ఉంది. 1782లో చల్లపల్లి ప్రభువులు శ్రీ రాజా యార్లగడ్డ కోదండ రామన్న ఆలయానికి ప్రాకారాలు కట్టించారు. నేటికీ శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి దేవాలయానికి చల్లపల్లి రాజా వంశీయులే ధర్మకర్తలుగా ఉన్నారు. ఇక్కడ స్వామి కల్యాణ మహోత్సవాలు ఈ నెల 26 నుంచి 9 రోజులు నిర్వహించనున్నారు. ఉత్సవాల చివరిరోజు చల్లపల్లి రాజా వంశీయులు ప్రారంభించి నిర్వహించే స్వామి రథోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. పితృదేవతల కు పిండ తర్పణం గావిస్తారు.

వన్‌టౌన్ పాత శివాలయం



పాండవుల్లో ప్రథముడైన ధర్మరాజు ద్వాపర యుగంలో ప్రతిష్ఠించిన పురాతన శివాలయం శీ గంగా సమేత భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవాలయం. అనంతరం కాలంలో ఇప్పటివరకు పునఃప్రతి ష్ఠ జరగలేదు. 808వ సంవత్సరంలో మాధవవర్మ పరిపాలనలో దుర్గమ్మ మెచ్చి కనకవర్షం కురిపించినట్టు శాసనాలు చెబుతున్నాయి. వరంగల్‌లోని వేయి స్తంభాల గుడి ఎంత ప్రాచీనమైందో అంతే ప్రాచీనమైన ఈ దేవాలయంలోనూ వేయి స్తంభాలున్నాయి. కాలక్రమేణా అవి కనుమరుగయ్యాయి. శ్రీశైలంలో ఇష్టంగా దర్శించుకునే ఇష్టకామేశ్వరి దేవాలయం ఇక్కడుంది. శివరాత్రి మరుసటిరోజు నిర్వహించే రథోత్సవంలో దుర్గామల్లేశ్వరస్వామి వార్లు, బ్రాహ్మణ వీధిలో వేంచేసిన శ్రీ వసంత మల్లిఖార్జున స్వామివారు, ఇక్కడికి చేరుకొని శ్రీ గంగా సమేత భ్రమరాంబ మల్లిఖార్జున స్వామితో కలిసి నగరోత్సవానికి బయలుదేరడం ఆనవాయితీ. ఇక్కడ శివలింగానికి బ్రహ్మసూత్రం ఉంటుంది. పంచభూతాలకు ప్రతీకగా మృత్యుంజయుడు, రామలింగేశ్వరుడు, కాశీ విశ్వేశ్వరుడు, మల్లేశ్వరుడు ఇలా శివుడు 5 రూపాల్లో దర్శనమిస్తాడు. భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవాలయం, శ్రీ సీతారామస్వామి దేవాలయం, అయ్యప్ప దేవాలయం, అలివేలు మంగా సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయం గణపతి దేవాలయం, వల్లీ దేవసేన సమేత షణ్ముఖ దేవాలయం దర్శనమిస్తాయి. శివరాత్రి ఉత్సవాల్లో భాగగా బ్రహ్మోత్సవం ఘనంగా జరుగుతుంది.

పవిత్ర సంగమంలో స్నానాలకు ఏర్పాట్లు



ఈనెల 26న మహా శివరాత్రి పుణ్యస్నానాలకు స్థానిక పవిత్ర సంగమంలో చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి గోదావరి - కృష్ణా నదులు కలిసిన సంగమ ప్రాంతంలో పుణ్యస్నానాలు ఆచరిస్తూ ఉంటారు. ఫెర్రీ, పవిత్ర సంగమం రోడ్డులో, స్నానాల ఘాట్ వద్ద, ప్లాట్‌ఫామ్‌పై ఉన్న చెత్తా చెదారాన్ని పారిశుధ్య సిబ్బంది శుభ్రం చేస్తున్నారు. భక్తులకు అసౌకర్యం కలుగ కుండా ఏర్పాట్లు చేయిస్తున్నారు. పిండ ప్రదానం చేసే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లతో పాటు, స్నానాలు చేసే మహిళా భక్తులు బట్టలు మార్చుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం బయో టాయిలెట్స్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నారు. నియోజకవర్గంలోని పలు శివాలయాలు శివరాత్రికి పర్వదినానికి ముస్తాబయ్యాయి. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. లక్ష మందికి పైగా స్నానాలకు వచ్చే అవకాశం ఉందని, అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్టు కొండపల్లి మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన తెలిపారు. పవిత్రసంగమం వద్ద పుణ్య స్నానాలకు మైలవరం నుంచి 5, కొండపల్లి రైల్వేస్టేషన్ నుంచి 3, ఇబ్రహీంపట్నం రింగ్ నుంచి 2 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నామని ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ వేణు తెలిపారు. పుణ్య స్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు ట్రాఫిక్ ఇక్కట్లు చూస్తామని, భక్తుల భద్రత విషయంలో నిఘా ఏర్పాటు చేస్తున్నట్టు సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

ఐలూరులో ఉభయ రామక్షేత్రం



కృష్ణాజిల్లా తోట్లవల్లూరు మండలం ఐలూరు దక్షిణకాశీగా, ఉభయ రామక్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. నందీశ్వరుడు, అమ్మవారు లేని ఆలయంగా ఉంది. త్రేతాయుగంలో రావణ సంహారానంతరం సీతాసమేతంగా శ్రీరాముడు అయోధ్యకు పుష్పక విమానంపై బయలుదేరాడు. అదే సమయంలో ఐలూరు సమీపంలో రైభ్యుడనే ముని తపస్సు చేస్తుండేవాడు. ఆ ముని తపఃప్రభావంతో ఈశ్వరుడు ప్రతక్షమై నీ కోరిన నెరవేరుతుందని వరమిస్తాడు. శ్రీరాముడు ప్రయాణిస్తున్న పుష్పక విమానం చిలుమూరు సమీపంలో కృష్ణానది వద్ద ఆగిపోతుంది. కారణం తెలియక శ్రీరాముడు వ్యధ చెందుతుండగా, ఆ ముని శ్రీరాముడి వద్దకు వచ్చి ఇచ్చట శివలింగం ప్రతిష్ఠించాలని తెలియజేస్తాడు. దాంతో శ్రీరాముడు హనుమంతుడిని శివలింగం తేమ్మని అయోధ్యకు పంపిస్తాడు. ఆయన వచ్చేలోపు సీతమ్మ ఇసుకతో సైకత లింగాన్ని చేస్తుంది. ముహూర్తానికి హనుమంతుడు రాకపోవటంతో చిలుమూరు వద్ద సైకత లింగాన్ని శ్రీరాముడు ప్రతిష్ఠిస్తాడు. కొద్దిసేపటికే వాయువేగంతో వచ్చిన హనుమంతుడు సైకత లింగాన్ని చూసి తన శ్రమ వృథా అయిందని కోపంతో రగిలిపోతాడు. హనుమంతుడిని శాంతింపజేసి అయోధ్య నుంచి తెచ్చిన శివలింగాన్ని శ్రీరాముడు స్వయంగా ఐలూరులో ప్రతిష్ఠిస్తాడు. అప్పుడు శివుడు శ్రీరాముడికి ప్రత్యక్షమై ఇది దక్షిణ కాశీగాను, ఉభయ రామక్షేత్రంగాను విలసిల్లుతుందని, కృష్ణానదిలో స్నానమాచరించి శివుడిని దర్శించుకుంటే కాశీ వెళ్లి గంగలో స్నానమాచరించనంత పుణ్యఫలం కులుగుతుందని, పక్కనే రఘునాయకస్వామి పేరుతో ఇక్కడే ఉంటానని అంతర్ధానమవుతాడు. రామేశ్వరస్వామి దేవస్థానం, రఘునాయకస్వామి దేవస్థానం రెండు పక్కపక్కనే ఉండటంతో ఉభయ రామక్షేత్రంగా ప్రసిద్ధిగాంచింది. ఈ నెల 26న జరిగే మహాశివరాత్రికి జిల్లా నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు ఐలూరు వస్తారని అధికారులు అంచనా వేసి ఏర్పాట్లు చేపట్టారు. బారికేడ్లు నిర్మాణం, షామియానాల ఏర్పాటు చేస్తున్నారు. కృష్ణానదీపాయలో నీరు లేకపోవటంతో జల్లు స్నానాలకు 4 బోర్లను సోమవారానికే సిద్ధం చేశారు. మచిలీపట్నం, ఉయ్యూరు ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు అధికారులు తెలిపారు.

మునిగిరిపై వెలసిన రామలింగేశ్వరస్వామి దేవాలయం

కృష్ణాజిల్లా యనమలకుదురు గ్రామంలోని మునిగిరి కొండపై శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం భక్తుల ఆరాధన కేంద్రంగా వెలుగొందుతోంది. ఈ దేవస్థానం పురాతనమైంది. శివుడు స్వయంభువుగా వెలిసినట్టు పురాణ గాథ. పురాణాల ప్రకారం పరశురాముడు ఇక్కడ శివుడిని ధ్యానించి తపస్సు చేయగా, వేయి మంది మునులు సమాహారంగా చేరి, శివుడి సేవిస్తూ మహాయజ్ఞాన్ని నిర్వహించినట్టు స్థల పురాణం. ఈ యజ్ఞాన్ని దుష్టశక్తుల నుంచి పరశురాముడు రక్షించాడని, యజ్ఞపరిపూర్ణమైన తరువాత శివుని ఆదేశంతో పరశురాముడు స్వయంగా శివలింగాన్ని ప్రతిష్ఠించాడని చెబుతారు. అందుకే దీన్ని 'వేయి మునుల కుదురు'గా పిలిచేవారు. కాలక్రమేణా 'యనమలకుదురు'గా మారింది. భూమికి 612 అడుగుల ఎత్తులో ఉన్న మునిగిరి కొండ ముఖద్వారంలో భక్తులకు అంగారక మహాశక్తిగా హనుమంతుడు దర్శనమిస్తాడు. గ్రామంలో మహాశివరాత్రి ఉత్సవాలు 3 రోజుల పాటు వైభవంతో నిర్వహిస్తారు.

రేపటి నుంచి ఉత్సవాలు ప్రారంభం

పార్వతీదేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు ఈనెల 25 నుంచి జరగనున్నాయి. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా ఆలయానికి రానున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా పాలగ వర్గం ఏర్పాట్లు చేసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు శాఖ ఏర్పాట్లు చేసింది.

శైవ క్షేత్రాలకు ఏపీఎస్ఆర్టీసీ బస్సులు

ఈనెల 26న ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని డిపోల నుంచి శైవ క్షేత్రాలకు సుమారు 130 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్టు జిలా ప్రజారవాణ అధికారి ఎం.వై.దానం తెలిపారు. విజయవాడ నుంచి శ్రీశైలానికి ఆన్‌లైన్‌లో సీట్లు రిజర్వ్ చేసుకునే సదుపాయం ఉందన్నారు. వివరాలకు సమీప బస్టేషన్లలో సంప్రదించవచ్చునన్నారు. కోటప్పకొండకు 43 బస్సులు, జగ్గయ్యపేట నుంచి ముక్త్యాలకు 23 బస్సులు, కోదాడకు 2, నందిగామ కూడలికి 2, తిరువూరు నుంచి నీలాద్రికి 15 బస్సులు, గుట్టపాడుకు 3, ఇబ్రహింపట్నం నుంచి పవిత్రసంగమానికి 2, మైలవరం నుంచి 5, కొండపల్లి నుంచి 3 బస్సులు నడపనున్నారు. విజయవాడ నుంచి శ్రీశైలానికి 20 బస్సులు, అమరావతికి 13 బస్సులు, భీమవరానికి 2 బస్సులు, మొత్తం 90 బస్సులు నడపనున్నట్టు తెలిపారు.



కల్యాణోత్సవాలకు సంగమేశ్వరుడు సిద్ధం

దాములూరు కూడలి గ్రామంలో వేంచేసియున్న సంగమేశ్వర స్వామి ఆలయం మహా శివరాత్రి తిరునాళ్లకు ముస్తాబైంది. విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో నరసింహమూర్తి తెలిపారు. ఈ నెల 25 నుంచి 4 రోజుల పాటు స్వామి కల్యాణ మహోత్సవాలను నిర్వహిస్తున్నట్టు ఈవో తెలిపారు. 25న స్వామిని పెండ్లి కుమారుడిని చేయటం, గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ఠాపన, 26న నిత్య ఔపోసన, రుద్రహోమం, బలిహరణ, హోమాలు, రాత్రి 10 గంటలకు ఎదురుకోలోత్సవం, కల్యాణం జరుగుతుందన్నారు. 27న రుద్రాభిషేకం, 28న పూర్ణాహుతితో ముగుస్తాయన్నారు.

సెంట్రల్ ఎక్సైజ్ చట్టం కీలకం

● సెంట్రల్ ట్యాక్స్, కస్టమ్స్ కమిషనర్ ఎస్.నరసింహారెడ్డి

లబ్బీపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): 80 ఏళ్ల కిత్రమే అమలులోకి వచ్చిన సెంట్రల్ ఎక్సైజ్ చట్టానికి అపారమైన చారిత్రక, గొప్ప పరిపాలన ప్రాముఖ్యత ఉందని సెంట్రల్ ట్యాక్స్, కస్టమ్స్ కమిషనర్ ఎస్.నరసింహారెడ్డి అన్నారు. లబ్బీపేటలోని జీఎస్టీ అమరావతి డివిజన్ కార్యాలయంలో సోమవారం సెంట్రల్ ఎక్సైజ్ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1944 ఫిబ్రవరి 24న సెంట్రల్ ఎక్సైజ్, సాల్ట్ చట్టం ఆమోదించి అదేరోజు నుంచి అమలులోకి వచ్చిందన్నారు. 11 చట్టాల కలయికగా పిలిచే సెంట్రల్ ఎక్సైజ్ చట్టం 1966లో సెంట్రల్ ఎక్సైజ్ యాక్ట్ 1944గా పేరు మార్చుకుందన్నారు. పన్నులు చెల్లించడం, చట్టాలను పాటించడం, వాటి విలువపై అవగాహన కల్పించడమే సెంట్రల్ ఎక్సైజ్ దినోత్సవ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ నెల 21 నుంచి 23 వరకు జరిగిన 54వ ఆలిండియా సెంట్రల్ రెవెన్యూ క్రీడా పోటీల్లో రజత పతకాలు సాధించిన ఉద్యోగులను సత్కరించారు. అసిస్టెంట్ కమిషనర్లు బి.ఆనంద కుమార్, ఎం.నాగరాజు, బి.రవికుమార్, సూపరింటెండెంట్లు గాదె శ్రీనివాసరెడ్డి, ఎం.గిరిబాబు, పి.నాగేశ్వరరావ, సిహెచ్.ఈశ్వర్, కాకర్ల పాల్గొన్నారు.

బాయిలర్ల నిర్వహణ పటిష్ఠంగా ఉండాలి

● తనిఖీ అధికారి శ్రీనివాసరావు

కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో ఏర్పాటయ్యే బాయిలర్ల నిర్వహణలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై బాయిలర్ ఆపరేటర్లకు శిక్షణ తరగతులను నిర్వహించడం జరిగిందని విజయవాడ బాయిలర్ల తనిఖీ అధికారి జె.శ్రీనివాసరావు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా బాయిలర్ల శాఖ అధ్వర్యంలో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా పరిసర ప్రాంతాల్లో పనిచేస్తున్న బాయిలర్ అటెండెన్స్ (ఆపరేటర్లు) పునఃశ్చరణ తరగతులను గాంధీనగర్‌లోని కృష్ణాజిల్లా రైస్ అండ్ ఆయిల్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్‌లో సోమవారం నిర్వహించారు. సుదీర్ఘ అనుభవం గల పరిశ్రమ నిష్ణాతులచే శిక్షణను అందించామన్నారు. ఏటా జరిగే ఇటువంటి తరగతులను గతంలో రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ హాల్, గుడివాడ, హనుమాన్‌జంక్షన్, కొండపల్లిలో కూడా నిర్వహించామన్నారు. విజయవాడ బాయిలర్ల ఉప ముఖ్య తనిఖీ అధికారి ఎం.సత్యనారాయణతో పాటు జోసిల్ ఫ్యాక్టరీకి చెందిన షేక్ రిషావత్ ఆలీ తదితరులు పాల్గొని తమ సలహాలు, సూచనలను అందించారు.

గ్రూప్-2 మెయిన్స్‌లో అమరావతి రైల్వే లైన్‌పై ప్రశ్న

వన్‌టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 175 పరీక్షా కేంద్రాల్లో ఆదివారం జరిగిన గ్రూప్ 2 మెయిన్స్ పరీక్షలో ఆబ్జెక్టివ్ పేపర్-2లో అమరావతి రైల్వే లైన్ గురించి ప్రశ్న అడిగారు. ప్రాజెక్టు, ప్రతిపాదన కాలపరిమితి, పొడవు, వ్యయం, ఏపీ జిల్లాల గుండా వెళుతుందనే ప్రశ్నను అడిగారు. అయితే దాదాపుగా ఈ ప్రశ్నకు చాలా మందికి అవగాహన లేకపోయి ఉండవచ్చునని భావిస్తున్నారు. ఇటీవలే ప్రభుత్వం అమరావతి రైల్వే లైన్‌ను ప్రతిపాదించింది. ఇందుకు సంబంధించిన ప్రాథమిక పనులు కూడా ప్రారంభం అయ్యాయి. తెలంగాణలోని ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు ఈ రైల్వే లైన్ రానున్నది. మరోవైపు పేపర్-1లో విజయవాడలో ఒక చారిత్రక అంశానికి సంబంధించి ప్రశ్న అడిగారు. విజయవాడలో నెడుంబవసతి అనే జైన్ ఆలయాన్ని మహిళ అయ్యన మహాదేవి నిర్మించారు. అయితే ఆమె ఎవరి పట్టమహిషి అనే ప్రశ్న అడిగారు. సాయంత్రం వెలువడిన కీలో సమాధానంగా కుబ్జ విష్ణువర్ధనుడు అని సమాధానం ఇచ్చారు.

విజయవాడలో పోస్టర్లు నిషేధం

వన్‌టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఎక్కడా గోడలపై పోస్టర్లు అంటించరాదని, నగరమంతా పోస్టర్ల రహితంగా ఉండాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలు జారీ చేశారు. బహిరంగ గోడలపై బ్యానర్లు, పోస్టర్లు, ఫ్లెక్సీలను నిషేధించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఒక ఆసుపత్రికి రూ.50వేలు జరిమానా విధించారు. బహిరంగ ప్రదేశాల సుందరీకరణను భగ్నపరచడం, అందవిహీనంగా మార్చడం కింద 1997 యాక్ట్ 28 ప్రకారం నగరమంతా పోస్టర్ రహితంగా ఉంచాలన్నారు. ప్రజా ఆరోగ్యం, పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని నగర సుందరీకరణను కాపాడుకోవటంలో భాగస్వాములు కావాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భవనాలు, ప్రహరీగోడలు, డివైడర్లు, కరెంటు స్తంభాలు, ట్రాఫిక్ ఐలండ్‌లు, ఫ్లైఓవర్‌లు, బ్రిడ్జిలు ఎక్కడా పోస్టర్లు అతికించరాదని స్పష్టం చేశారు. పోస్టర్లు అంటిస్తే ప్రకటనదారులు, ముద్రించిన ప్రింటింగ్ ప్రెస్ నుంచి కూడా రూ.లక్ష వరకు జరిమానా విధిస్తామన్నారు. ఇప్పటికే పోస్టర్లు అతికించిన ప్రకటనదారులు, ముద్రించిన వారిని గుర్తించామన్నారు. వీరందరిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

మద్యం విక్రయాలు 48గంటలపాటు బంద్: కలెక్టర్

కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో జిల్లా పరిధిలో మద్యం దుకాణాలను 48 గంటల పాటు మూసి ఉంచాలని కలెక్టర్ లక్ష్మీశ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 135 ప్రకారం ఈసీఐ, ఏపీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ మార్గదర్శకాలకు అనుగుణంగా 25న సాయంత్రం 4 నుంచి 27 సాయంత్రం 4 గంటల వరకు డ్రై డే అమల్లో ఉంటుందని తెలిపారు.

వైసీపీ అధికార ప్రతినిధిగా 'పులిపాటి'

కృష్ణలంక, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధికార ప్రతినిధిగా పులిపాటి దుర్గారెడ్డి నియమితులయ్యారు. సోమవారం ఆయన ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్, వైసీపీ నాయకులు కడియాల బుచ్చిబాబును కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలపై తన శక్తిమేర పోరాడతానని తెలిపారు. కూటమి ప్రభుత్వంపై వెల్లువెత్తుతున్న ప్రజాగ్రహానికి వైసీపీ గొంతుకగా నిలుస్తానని పులిపాటి తెలిపారు.

అధికారంలో ఎవరున్నా ఉద్యమ బాట వీడం

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఏపీటీఎఫ్-257, ఏపీటీఎఫ్-1938 మధ్య పరస్పర ఆరోపణలు పెరుగుతున్నాయి. ఎవరు ఉద్యమ ద్రోహంలో ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ తెలుసని ఏపీటీఎఫ్-257 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ మంజుల, కె.భానుమూర్తి అన్నారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జేఏసీ సెక్రటరీ జనరల్‌గా ఉన్న జి.హృదయరాజు ఏం చేయలేదని విమర్శించారు. గత ప్రభుత్వం 23శాతం ఫిట్‌మెంట్ ప్రకటిస్తే అంగీకరించిన మహానుభావులు అని ఆరోపించారు. ఎవరు అధికారంలో ఉన్నా సమస్యల పరిష్కారం విషయంలో ఏపీటీఎఫ్ ఉద్యమ బాటను వీడదని స్పష్టంచేశారు. గత ప్రభుత్వంలో ఉద్యమాలు చేశామని, ఈ ప్రభుత్వం వచ్చాక కూడా దశల వారీగా ఉద్యమానికి పిలుపునిచ్చామన్నారు.

లక్ష్మణరావుకు పీటీఎల్ఎఫ్ మద్దతు

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు మద్ధతిస్తున్నట్లు ప్రైవేటు టీచర్లు, లెక్చరర్ల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు డి.ప్రసన్న సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేని అభ్యర్థి అయిన ఆయనకు ప్రైవేటు టీచర్లు, లెక్చరర్లు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు.

పౌష్టికాహారం

గుడ్లు తింటున్నారా?

గుడ్లు ప్రకృతిసిద్ధ మల్టీవిటమిన్లు. భిన్నమైన పోషకాలన్నీ దొరికే అతి తక్కువ పదార్థాల్లో గుడ్డ ఒకటి. వీటిలోని పోషకాలతో ఎలాంటి మేళ్లను పొందవచ్చంటే....



- **విటమిన్ బి12:** నాడీ పనితీరు మెరుగు పడుతుంది
- **కోలీన్:** మెదడు సామర్థ్యం పెరుగుతుంది
- **విటమిన్ డి3:** ఆటోఇమ్యూన్ వ్యాధుల ముప్పు తగ్గుతుంది
- **విటమిన్‌కెఎ2:** ఎముకలు, గుండె ఆరోగ్యానికి రక్షణ దక్కుతుంది
- **విటమిన్ ఇ:** ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతుంది
- **ల్యూటీన్:** కంటి ఆరోగ్యం మెరుగు పడుతుంది
- **అయోడిన్:** థైరాయిడ్ గ్రంథి పనితీరు మెరుగవుతుంది

అవగాహన

ప్రయాణాల్లో ఆహారం

ప్రయాణాల్లో బయటి భోజనాలు తినకూడదు అనుకుంటే, తినడానికి సులువుగా ఉండి, శక్తిని అందించే బలవర్థకమైన పదార్థాలను వెంట తీసుకు వెళ్లాలి. అలాంటి పదార్థాలు ఇవే!



- **షియా:** వీటిని వెంట తీసుకువెళ్లడం తేలిక. నీళ్ల కలిపి నేరుగా తినేయవచ్చు. ఓట్స్, పండ్ల రసాల్లో కలుపుకుని తాగేయవచ్చు. తక్కువ సమయంలో బలవర్థకమైన ఆహారం తినాలనుకునేవారికి ఇదొక ఉత్తమమైన ప్రత్యామ్నాయం.
- **బాదం:** ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్ ఇ, ప్రొటీన్లు ఎక్కువగా ఉండే బాదం పప్పులు అద్భుతమైన అల్పాహారం. వీటిలో పీచు ఎక్కువ కాబట్టి ఆకలి కూడా అదుపులో ఉంటుంది. వీటిని పచ్చిగా కూడా తినొచ్చు కాబట్టి ఎక్కడికైనా వెంట తీసుకువెళ్లొచ్చు.
- **డార్క్ చాక్లెట్:** యాంటీఆక్సిడెంట్లు, మెగ్నీషియం కలిగి ఉండే డార్క్ చాక్లెట్ మనసును ఉల్లాసంగా ఉంచుతుంది. ప్రయాణాల్లో వీటిని వెంట తీసుకువెళ్లడం కూడా తేలికే!
- **డ్రైడ్ ఫ్రూట్స్:** బరువు తక్కువగా ఎండిన పండ్లు తక్షణ శక్తినిస్తాయి. వీటిలోని పోషకాలు ఆకలిని కూడా అదుపులో ఉంచుతాయి. కాబట్టి అంజీర్, ఎండుద్రాక్ష, అప్రికాట్స్, ఎండు ఖర్జూరం లాంటి ఎండిన పండ్లను వెంట ఉంచుకోవాలి.

మధుమేహం



మధుమేహాన్ని తిరోగవింపచేలా చేయవచ్చు. అంతే తప్ప తిరిగి రాకుండా చేయలేం! అంటున్నారు ప్రముఖ వైద్యులు, డాక్టర్ వసంత్ కుమార్. ఈ వ్యాధిని రివర్స్ చేస్తామనే ప్రలోభాలకు లోను కావద్దనీ, కొత్త మందులతో చక్కెర వ్యాధికి చుక్కలు చూపించడం సాధ్యమేననీ అంటున్నారాయన. ఈ వ్యాధి గురించి ఆయన మాటల్లోనే...

చక్కెర వ్యాధికి చుక్కలు చూపిద్దాం!

ఏళ్ల తరబడి మధుమేహంతో బాధపడుతూ, చక్కెర హెచ్చుతగ్గులకు లోనయ్యే వాళ్లలో మందులు ప్రభావం చూపించని పరిస్థితి తలెత్తుతుంది. అలాగే మూత్రపిండాలు, గుండె దెబ్బతినే సమస్య కూడా వీరిలో ఎక్కువగా ఉంటుంది. అలాంటి పరిస్థితిలో పాత మాత్రలే వాడుకోవడం వల్ల ప్రయోజనం లేకపోగా, మరింత నష్టం జరిగే ప్రమాదం ఉంటుంది. ఈ సమస్యను పరిష్కరించే క్రమంలో గత ఐదు, పదేళ్ల నుంచి మధుమేహానికి కొత్త మందులు అందుబాటులోకొచ్చాయి. సురక్షితమైన, ప్రభావవంతమైన ఈ మందులతో మూత్రపిండాలు, గుండెకు కూడా అదనపు రక్షణ దక్కుతుంది. దీర్ఘకాలం నుంచి మధుమేహంతో బాధపడుతున్న వాళ్లు కూడా ఈ మందులను నిర్భయంగా వాడుకోవచ్చు. నిజానికి పాత మందులు విఫలయ్యేవరకూ ఆగకుండా, వీలైనంత త్వరగా కొత్త మందులు మొదలుపెట్టుకోవడం అన్ని విధాలా శ్రేయస్కరం.

కొత్త మందులతో గుండెకు, కిడ్నీలకు రక్ష

మధుమేహంలో మూడు రకాల మందులున్నాయి. మొదటి రకం... జీఎల్‌పి-1 అనలాగ్స్. ఇవి ఇంజెక్షన్స్, మాత్రలు... రెండు రకాలుగా అందుబాటులో ఉన్నాయి. ఈ మందులకున్న అతి పెద్ద ప్రయోజనం ఏంటంటే, అధిక బరువు కలిగి ఉన్న వాళ్లు ఈ మందులు తీసుకోవడం వల్ల బరువు తగ్గుతారు. కానీ ఈ మందులు ఖరీదైనవి. ఇవే కాకుండా డిపిపి-4 ఇన్హిబిటర్స్ అనే రెండో రకం మందులు కూడా అందుబాటులో ఉన్నాయి. ఇవి కూడా మాత్రల రూపంలో దొరుకుతాయి. పాత మందుల స్థానంలో వీటిని వాడుకోవచ్చు. కొత్తగా మధుమేహం బారిన పడిన వాళ్లు కూడా వీటితోనే చికిత్స మొదలుపెట్టుకోవచ్చు. మూడో రకం మందులు... ఎస్‌జిఎల్‌టి2 ఇన్హిబిటర్స్. ఈ విభాగానికి చెందిన 'డాపాగ్లిఫోజిన్' విస్తృతంగా వాడకలో ఉంది. పాత మందులు బరువును పెంచే దుష్ప్రభావాన్ని కలిగి ఉంటాయి. కానీ ఈ కొత్త మందులతో ఆ భయం లేకపోగా, బరువు తగ్గే ప్రయోజనాన్ని కూడా పొందే అవకాశం కూడా ఉంది. ఈ మందులు, రక్తంలో ఉన్న చక్కెరను మూత్రపిండాల సహాయంతో మూత్రం ద్వారా బయటకు పంపించేస్తాయి. దాంతో మూత్రం ద్వారా చక్కెర బయటకు వెళ్లిపోతుంది. కాబట్టి ఈ మందులతో చక్కెర వ్యాధి ముప్పు తప్పినా, కొంతమందిలో మూత్రనాళ, ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు వేధించే అవకాశాలుంటాయి. కానీ ఈ సమస్యకు శారీరక శుభ్రతతో అడ్డుకట్ట వేయవచ్చు.

కొని తెచ్చుకుంటున్నామా?

40 ఏళ్లకు చక్కెర వ్యాధి నిర్ధారణ అయితే, 'అయ్యో ఇంత చిన్న వయసులోనే వచ్చేసిందా?' అని కంగారు పడే పరిస్థితి ఇప్పుడు లేదు. ఇప్పుడు 30 ఏళ్లకే మధుమేహం బారిన పడుతున్నాం. చిన్న వయసు నుంచి ఆహార నియమాలు పాటించకపోవడం, వ్యాయామం చేయకపోవడమే ఇందుకు ప్రధాన కారణాలు. మనం మన పిల్లలకు శుద్ధి చేసిన పదార్థాలు, ప్యాకెట్లలో దొరికే పదార్థాలు, పిజ్జాలు, బర్గర్లు, స్వీట్లు తినిపిస్తున్నాం. మన మేమో, ప్లేటు నిండా తెల్ల అన్నం పెట్టుకుని, ప్రొటీన్లు, పీచు తక్కువగా, పిండిపదార్థాలు ఎక్కువగా తినేస్తున్నాం. అలాగే నూనెలు, చక్కెరతో తయారయ్యే పదార్థాలు కూడా ఎక్కువగా తింటున్నాం. తీపి పెద్దగా తినం అనుకునేవాళ్లు, రోజుకు ఏడెనిమిది సార్లు టీలు, కాఫీలు తాగితే అంతే సమానమైన చక్కెర మన శరీరాల్లోకి చేరిపోతుందనే విషయం గుర్తు పెట్టుకోవాలి. ఉరుకుల పరుగుల జీవితాలకు అలవాటు పడిపోయి వ్యాయామాన్ని కూడా నిర్లక్ష్యం చేస్తున్నాం. వీటికి తోడు వృత్తిపరమైన ఒత్తిళ్లు. వెరసి 30 ఏళ్లకే మధుమేహం బారిన పడుతున్నాం. ఈ వ్యాధిలో లక్షణాలు బయల్పడవు కాబట్టి నిర్ధారణ, చికిత్స... అలస్యమయ్యే ప్రమాదం కూడా ఉంటోంది. కాబట్టి 30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఆరు నెలలకోసారి చక్కెర పరీక్ష చేయించుకోవాలి. దాన్లో మధుమేహం లేదని ఫలితం వస్తే, ఇక మధుమేహం రాదనుకోకూడదు. చక్కెర లేదని తెలిస్తే, మళ్లీ రెండు మూడేళ్ల వరకూ ఆ పరీక్ష జోలికి వెళ్లని వాళ్లు కూడా ఉంటారు. కానీ వీళ్లే, ఏదో ఒక సందర్భంలో చేయించుకునే పరీక్షల్లో అత్యధిక చక్కెర కనిపించగానే భయంతో, వైద్యుల దగ్గరకు పరుగులు పెడుతూ ఉంటారు. మొట్టమొదటిసారి చక్కెర వ్యాధి నిర్ధారణ అయిన వాళ్లలో అత్యధిక మోతాదుల్లో చక్కెర ఉండడానికి ఇదే ప్రధాన కారణం. కాబట్టి మధుమేహం లేని వాళ్లు ప్రతి ఆరు నెలలకూ, మధుమేహులు ప్రతి నెలా చక్కెరను పరీక్షించుకుంటూ ఉండాలి. మధుమేహ మందులు వాడుకుంటున్న వాళ్లు, ప్రతి మూడు నెలలకోసారి, హెచ్‌బిఎ1సి పరీక్ష కూడా చేయించుకుంటూ, ఫలితం ఏడు లోపు ఉండేలా చూసుకోవాలి. ఇలా ఉంటే, గత మూడు నెలల నుంచి చక్కెర అదుపులోనే ఉందని అర్థం.

> మధుమేహులను దోచుకునే ధోరణి ఇటీవలి కాలంలో బాగా పెరిగింది. ఒక పౌడరు వాడుకుంటే, మధుమేహం ఉన్నప్పటికీ ఎలాంటి ఆహార నియమాలూ పాటించవలసిన అవసరం లేదని ప్రచారం చేసుకుంటున్న వాళ్లున్నారు. సామాజిక మాధ్యమాల్లో, యూట్యూబ్‌లో రకరకాల చిట్కాలు కూడా షికార్లు చేస్తుంటాయి. కానీ ఇవన్నీ వృథా ప్రయాసలే!



మధుమేహం 'రివర్స్' కాదు

చక్కెర వ్యాధికి మందులు వాడడం ఎంత ముఖ్యమో, ఆహార నియమాలు పాటించడం, వ్యాయామం చేయడం అంతే ముఖ్యం. క్రమం తప్పకుండా మందులు వాడుతూ, ఆహార నియమాలు పాటిస్తూ, వ్యాయామంతో బరువు తగ్గించుకుంటే, చక్కెర మందులు ఆపేయవచ్చు కూడా! అయితే క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకుంటూ, మునుపటి జీవనశైలినీ, ఆహార నియమాలనూ తూచ తప్పకుండా కొనసాగించాలి. ఇలా మధుమేహాన్ని తిరోగమించేలా చేయవచ్చు. కానీ తిరిగి రాకుండా చేయలేం! కానీ ఇటీవలి కాలంలో మధుమేహాన్ని రివర్స్ చేయొచ్చనే ప్రచారం విస్తృతంగా జరుగుతోంది. ఇది పూర్తి అబద్ధపు ప్రచారం.

> జీఎల్‌పి-1 అనలాగ్ మందులు ఇంజెక్షన్లు, మాత్రల రూపంలో ఉంటాయి. ఇంజెక్షన్ రూపంలో ఉన్న జీఎల్‌పి-1 అనలాగ్‌ను బరువు తగ్గడానికి ఉపయోగిస్తూ ఉంటారు. 'ఒజెంపిక్' పేరుతో విదేశాల్లో విస్తృతంగా వాడకలోకొచ్చిన ఈ ఇంజెక్షన్లు ప్రస్తుతం మన దేశంలో అందుబాటులో లేవు. మధుమేహాన్ని అదుపులో ఉంచడంతో పాటు మూత్రపిండాలు, గుండెకు రక్షణ కల్పించడం, బరువు తగ్గించే అదనపు ప్రయోజనాన్ని కలిగి ఉండడం వల్ల ఈ ఇంజెక్షన్లకు సర్వత్రా ఆదరణ పెరిగిపోయింది. మధుమేహం లేని వాళ్లు కూడా అధిక బరువును తగ్గించుకోవడం కోసం ఈ ఇంజెక్షన్లను తీసుకోవచ్చని యుఎస్ ఎఫ్‌డిఎ (ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్) ఆమోదించడంతో వీటి వాడకం పెరిగింది. అయితే ఇవే ఇంజెక్షన్లు సెమాగ్లూటైడ్ అనే మాత్రల రూపంలో మనకు కూడా అందుబాటులో ఉన్నాయి.

నివారణ మన చేతుల్లోనే...

సాధారణంగా తెల్ల అన్నం తినేవాళ్లు కూరలు తక్కువగా అన్నం ఎక్కువగా తింటూ ఉంటారు. ఇది అనారోగ్యకరం. తెల్ల అన్నానికి బదులుగా దంపుడు బియ్యం/బ్రౌన్ రైస్ పరిమితంగా, ఆకుకూరలు, కూరగాయలు, పప్పుదినుసులు ఎక్కువగా తీసుకోవాలి. దుంపలు మానేయడం మంచిది. అలాగే మధుమేహులు పండ్లు నిర్భయంగా తినొచ్చు. ప్రతి రోజూ కొద్దిగా బొప్పాయి, లేదా కమలా పండు, జామ పండు తినొచ్చు. అరటి పండ్లు, మామిడి, పైనాపిల్ చాలా తక్కువగా తినాలి. పండ్లలోని విటమిన్లు ఆరోగ్యానికి మేలు చేస్తాయి కాబట్టి, మధుమేహులు పండ్లు తినడం అవసరం. తీపి తినాలనిపించినప్పుడు పండు తినడం అన్ని విధాలా ఆరోగ్యకరం. ఈ నియమాలతో పాటు....

- బరువును అదుపులో పెట్టుకోవాలి
- ప్రతి రోజూ అరగంట పాటు నచ్చిన వ్యాయామం చేయాలి
- ఒత్తిడిని అదుపులో పెట్టుకోవాలి
- క్రమం తప్పకుండా చక్కెరను పరీక్షించుకుంటూ ఉండాలి
- సమతులాహారం తీసుకోవాలి
- తీపిని వీలైనంత తగ్గించాలి
- దురలవాట్లకు దూరంగా ఉండాలి

ఇన్సులిన్‌తో ప్రమాదం లేదు

సాధారణంగా ఇన్సులిన్ అనగానే మధుమేహులు ఉలిక్కిపడుతూ ఉంటారు. చక్కెర, మాత్రలతో అదుపు కాని పక్షంలో, చివరి ప్రయత్నంలో భాగంగా ఇన్సులిన్ తీసుకోవాలనే అపోహ మధుమేహుల్లో స్థిరపడిపోయింది. కానీ పదేళ్లు, పదిహేనేళ్ల పాటు మధుమేహంతో బాధపడుతున్న వాళ్లకు మందులు పని చేయని పరిస్థితి తలెత్తవచ్చు. అలాంటి సందర్భాల్లో ఇన్సులిన్ తీసుకోవడంలో తప్పు లేదు. దీంతో భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటాయి. కాబట్టి వైద్యులు ఇన్సులిన్‌ను సూచించినప్పుడు వద్దని అనకూడదు. ఒకవేళ ఇన్సులిన్ ఇంజెక్షన్‌తో చక్కెర అదుపులోకి వస్తే, కొంతకాలం తర్వాత ఈ ఇంజెక్షన్ ఆపేయవచ్చు కూడా!

డాక్టర్ వసంత్ కుమార్
సీనియర్ కన్సల్టెంట్ ఫిజీషియన్,
ప్రెసిడెంట్ అండ్ ఫౌండర్ ఆఫ్ డయాబెటిస్ అండ్ యూ సొసైటీ,
అపోలో హాస్పిటల్స్, హైదరాబాద్.



తెలుసుకుందాం

మద్యంతో ముప్పులు

మద్యపానం ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. మద్యంతో ఆరోగ్యానికి పొంచి ఉండే ప్రధాన ముప్పులు ఏవంటే...

- **క్యాన్సర్ ముప్పు:** ఆల్కహాల్‌కు 'కార్సినోజెన్' అనే పేరుంది. అంటే మద్యంతో రొమ్ములు, కాలేయం, తల, మెడ, గొంతు, పెద్దపేగు.. ఇలా పలురకాల క్యాన్సర్ల ముప్పు పొంచి ఉంటుంది
- **కాలేయ జబ్బు:** తీవ్ర మద్యపాన వ్యసనంతో కాలేయానికి కొవ్వు పడుతుంది. మద్యం సంబంధిత కామెర్లు, కాలేయం గట్టిపడే ఫైబ్రోసిస్, సిర్రోసిస్, కాలేయ వైఫల్యం సమస్యలు పొంచి ఉంటాయి
- **గుండె జబ్బులు:** రక్తపోటు పెరుగుతుంది. గుండె లయ క్రమం తప్పుతుంది. గుండెపోటు ముప్పు పెరుగుతుంది
- **ఇన్‌ఫెక్షన్లు:** వ్యాధినిరోధకశక్తి బలహీనపడుతుంది. ఫలితంగా క్షయ లాంటి ఇన్‌ఫెక్షన్లు సులభంగా సోకుతాయి
- **నాడీ నష్టం:** దీర్ఘకాలం పాటు విపరీతంగా మద్యం తాగితే, జ్ఞాపకశక్తి తగ్గుతుంది. మద్యం సంబంధిత బ్రెయిన్ డ్యామేజీ జరుగుతుంది
- **స్వీయ హాని:** మద్యం నిర్ణయ సామర్థ్యాన్ని కుంటు పరుస్తుంది. ఆత్మహత్య, స్వీయ హాని ఆలోచనలను పెంచుతుంది. భావోద్వేగాలు అదుపుతప్పేలా చేస్తుంది
- **మానసిక కుంగుబాటు:** మద్యంతో మానసిక కుంగుబాటు, ఆందోళనలు పెరుగుతాయి



ఆహారం ఆరోగ్యం

అనాస పువ్వుతో...

బిరియానిలో వాడుకునే అనాస పువ్వుతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. అవేంటంటే....

- **ఇన్‌ఫెక్షన్లు:** అనాస పువ్వులోని షికిమిక్ ఆమ్లం, అనెథోల్, లినలూల్ సమ్మేళనాలు బ్యాక్టీరియాతో పోరాడడంతో పాటు పేగుల ఆరోగ్యాన్ని కాపాడతాయి. దాంతో మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు, న్యుమోనియా దరి చేరకుండా ఉంటాయి
- **ఫంగస్‌కు వ్యతిరేకంగా:** అనెథోల్, లినలూల్ అనే ఫ్లేవనాయిడ్లు ఫంగస్ పెరుగుదలను అడ్డుకుంటాయి.
- **వైరస్‌కు వ్యతిరేకంగా:** టామిఫ్లూ లాంటి యాంటీవైరల్ మందుల తయారీలో అనాస పువ్వులోని షికిమిక్ ఆమ్లాన్ని ఉపయోగిస్తారు
- **మధుమేహం:** అనాస పువ్వులోని అనెథోల్, పిండిపదార్థాలు శక్తిగా మారే ప్రక్రియకు దోహదపడుతూ, రక్తంలో చక్కెర మోతాదును సమంగా ఉంచుతుంది.



- **యాంటీఆక్సిడెంట్లు:** అనాస పువ్వులోని యాంటీఆక్సిడెంట్లు కణ నష్టాన్ని నివారిస్తాయి. ఫలితంగా కణుతులు పెరిగే అవకాశాలు తగ్గుతాయని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి.
- **అజీర్తి:** కడుపు ఉబ్బరం, అజీర్తిని తగ్గించే స్వభావం అనాస పువ్వుకు ఉంటుంది.

ఇన్ని సుగుణాలు కలిగిన అనాస పువ్వును తరచూ వంటకాల్లో వాడుకోవడం వాడుకోవడం ఆరోగ్యకరం. సాస్ తయారీలో, సూప్ తయారీలో, మాంసాహార వంటకాల్లో విరివిగా వాడుకోవచ్చు.

సన్‌స్క్రీన్స్

ఎండ నుంచి చర్మానికి రక్ష



ఎండాకాలం చర్మం నల్లబడకుండా ఉండాలంటే సన్‌స్క్రీన్స్ వాడుకోవాలనే విషయం అందరికీ తెలిసిందే! అయితే సన్‌స్క్రీన్‌ను ఎలా ఎంచుకోవాలో, వాటినెలా వాడుకోవాలో కూడా తెలుసుకోవాలి. అప్పుడే ఎండకు చర్మం నల్లబడిపోకుండా సమర్థంగా అడ్డుకట్ట వేయగలుగుతాం!

సన్‌స్క్రీన్‌ను ఎంచుకునేటప్పుడు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా దాని లేబుల్ పైన సూచించిన వివరాలను అర్థం చేసుకోవాలి. ప్రత్యేకించి ఆ లేబుల్ మీద ఎస్‌పిఎఫ్ (సన్ ప్రొటెక్షన్ ఫ్యాక్టర్), పిఎ ఫ్యాక్టర్ (అతినీలలోహిత కిరణాల నుంచి రక్షణ) ఎంత పేర్కొని ఉందో గమనించాలి. వాటితో పాటు...

ఎస్‌పిఎఫ్: కనిష్ఠంగా 30 ఎస్‌పిఎఫ్ నుంచి గరిష్ఠంగా 100 ఎస్‌పిఎఫ్ వరకూ సన్‌స్క్రీన్స్ మార్కెట్లో దొరుకుతూ ఉంటాయి. కొన్ని ఉత్పత్తుల మీద 10 నుంచి 15 ఎస్‌పిఎఫ్ ఉంటూ ఉంటుంది. కానీ ఇవి చర్మానికి ఎటువంటి రక్షణనూ కల్పించలేవు. అలాగే కొన్ని సన్‌స్క్రీన్స్ లేబుళ్ల మీద సన్‌స్క్రీన్‌తో పాటు విటమిన్ సి, మాయిశ్చరైజరు కూడా అదనంగా ఉన్నట్టు పేర్కొంటూ ఉంటారు. ఇలాంటివి కూడా నిరుపయోగమే! కాబట్టి కనిష్ఠంగా 30 ఎస్‌పిఎఫ్‌ను ఎంచుకోవాలి. ఎక్కువగా ఎండకు బహిర్గతమయ్యేవారు 60 అంతకంటే ఎక్కువ ఎస్‌పిఎఫ్ ఉన్న సన్‌స్క్రీన్స్ వాడుకోవాలి. అలాగే చర్మపు అలర్జీలు ఉన్న వారు, ఎండకు చర్మం కమిలిపోయే సున్నిత చర్మం కలిగిన వారు కూడా ఎక్కువ ఎస్‌పిఎఫ్ ఉన్న సన్‌స్క్రీన్స్ ఎంచుకోవాలి. అలాగే చర్మ చికిత్సలు చేయించుకున్న వాళ్లు కూడా ఇలాంటి అత్యధిక ఎస్‌పిఎఫ్ ఉన్న సన్‌స్క్రీన్స్ మాత్రమే వాడుకోవాల్సి ఉంటుంది.

పిఎ ఫ్యాక్టర్: సూర్యరశ్మిలోని అతినీలలోహిత కిరణాల ప్రభావంతో చర్మం దెబ్బతింటుంది. కాబట్టి ఆ కిరణాల నుంచి రక్షణ కల్పించే అంశం సన్‌స్క్రీన్‌లో ఉందో, లేదో గమనించాలి. ఈ అంశాన్ని సూచించే ప్లస్ గుర్తులు ఎన్ని ఎక్కువగా ఉంటే అతినీలలోహిత కిరణాల నుంచి అంత ఎక్కువ రక్షణ దక్కుతుంది.

నీలి రంగు రక్షణ: ఇళ్లలో లేదా కార్యాలయాల్లో కంప్యూటర్ల ముందు పని చేసేవారు నీలి రంగుకు బహిర్గతం అవుతూ ఉంటారు. దీని నుంచి రక్షణ కల్పించే బ్లూ లైట్ ప్రొటెక్షన్ కూడా సన్‌స్క్రీన్స్‌లో ఉండేలా చూసుకోవాలి.

పరారుణ రేడియేషన్: కొందరు వేడి వాతావరణంలో పని చేస్తూ ఉంటారు. మరీ ముఖ్యంగా గృహిణులు వంటగదిలో ఎక్కువ సమయం గడుపుతూ ఉంటారు. వీళ్లకు ముందు నుంచే పిగ్మెంటేషన్ సమస్య ఉన్నప్పుడు, వేడికి బహిర్గతమవడం వల్ల ఆ సమస్య మరింత పెరుగుతుంది. కాబట్టి ఈ కోవకు చెందినవాళ్లు, పరారుణ రేడియేషన్ (ఇన్‌ఫ్రారెడ్) కలిగి ఉన్న సన్‌స్క్రీన్స్ వాడుకోవాలి.

వాటర్ రెసిస్టెంట్: ఈతకొలనుకు వెళ్లేటప్పుడు, సముద్రంలో మునిగేటప్పుడు వాటర్ రెసిస్టెంట్ సన్‌స్క్రీన్స్ వాడుకోవాలి. ఈ అంశం కూడా లేబుల్ మీద గమనించాలి.

ఎలాంటి సన్‌స్క్రీన్?

> ఓరల్ సన్‌స్క్రీన్
> పైపూత సన్‌స్క్రీన్స్ సరిపోని సందర్భాల్లో నోటి మాత్రల రూపంలో తీసుకునే సన్‌స్క్రీన్స్ కూడా ఇప్పుడు అందుబాటులోకొచ్చాయి.

చర్మ తత్వాన్ని బట్టి అందుకు నప్పే సన్‌స్క్రీన్స్ ఎంచుకోవాలి.

జెల్: జిడ్డు చర్మం కలిగిన వాళ్లు వాడుకోవాలి

క్రీమ్, ఆయింట్‌మెంట్, లోషన్: పొడి చర్మం కలిగిన వాళ్లు వాడుకోవాలి

పౌడర్: ముఖానికి పూసుకున్న సన్‌స్క్రీన్ జిడ్డుగా ఉందనిపించినప్పుడు, దాని పైన పౌడర్ సన్‌స్క్రీన్ అద్దుకోవచ్చు.

టింటెడ్ సన్‌స్క్రీన్స్

ఇవి మేకప్ ఫౌండేషన్ ప్రభావాన్ని కనబరిచే తత్వాన్ని కలిగి ఉంటాయి. మేకప్‌లో మాదిరిగా టింటెడ్ సన్‌స్క్రీన్స్‌లో కూడా అందుకు తగ్గట్టు 'ఐవరీ, బ్రాంజ్' అనే రెండు రంగుల సన్‌స్క్రీన్స్ అందుబాటులోకొచ్చాయి. తెల్లని చర్మం కలిగిన వాళ్లు ఐవరీ, ముదురు రంగు ఉన్నవాళ్లు బ్రాంజ్ వాడుకోవచ్చు. ఈ టింటెడ్ సన్‌స్క్రీన్స్ వాడుకుంటే, అదనంగా ఇతరత్రా ఫౌండేషన్ల అవసరం తగ్గిపోవడంతో పాటు ఎండ నుంచి కూడా రక్షణ దక్కుతుంది.

> కొంతమంది సన్‌స్క్రీన్స్ వాడకంతో చర్మం నల్లబడిందనీ, మొటిమలు మొదలయ్యాయనీ అంటూ ఉంటారు. చర్మ తత్వానికి తగిన సన్‌స్క్రీన్‌ను ఎంచుకోలేకపోవడం వల్లే ఇలా జరుగుతూ ఉంటుంది. కాబట్టి సన్‌స్క్రీన్స్‌తో చర్మం దెబ్బతినకుండా ఉండాలంటే వైద్యులు సూచించే సన్‌స్క్రీన్స్‌నే వాడుకోవాలి.



ఎంత తరచుగా...

ఎండలోకి వెళ్లడానికి 30 నిమిషాల ముందే సన్‌స్క్రీన్ పూసుకోవాలి. అలాగే వేసవి ఎండ తీవ్రత సాయంత్రం నాలుగు గంటల వరకూ ఉంటుంది. కాబట్టి కనిష్ఠంగా ప్రతి రెండు గంటలకూ, గరిష్ఠంగా ప్రతి మూడు గంటలకూ, సన్‌స్క్రీన్ పూసుకుంటూనే ఉండాలి. 30 ఎస్‌పిఎఫ్ సన్‌స్క్రీన్ ఎండ నుంచి 95% మేరకు రక్షణ కల్పిస్తుంది. 50 నుంచి 60 ఎస్‌పిఎఫ్ ఉన్న సన్‌స్క్రీన్‌తో 98% రక్షణ దక్కుతుంది. అయితే సన్‌స్క్రీన్ ఎస్‌పిఎఫ్ ఎక్కువగా ఉన్నంత మాత్రాన తరచూ పూసుకోవలసిన అవసరం లేదనుకుంటే పొరపాటు. సన్‌స్క్రీన్ వాడుకుంటున్నప్పటికీ సన్‌ట్యాన్ నుంచి పూర్తి రక్షణ పొందడం కోసం స్కార్ఫ్, చలువ కళ్లజోడు, గొడుగు, టోపీలు వాడుకోవాలి. ఒకవేళ ఏదైనా ఒక రోజు ఎక్కువ సమయం పాటు ఎండకు బహిర్గతమైతే, డీట్యాన్ మాస్కులు వాడుకుని, ఎండకు నల్లబడిన చర్మాన్ని సరిచేసుకోవచ్చు.

ఎండకు చర్మం నల్లబడిందా? కాలిందా?

ఎండకు బహిర్గతమై, చర్మం నల్లబడినట్టు అనిపించగానే వెంటనే టమాటా రసం, బంగాళాదుంప రసాలు లాంటివి పూసుకోకూడదు. చర్మ పరిస్థితి సర్దుకునే వరకూ కనీసం వారం రోజుల పాటైనా ఆగి, ఆ తర్వాతే ఇలాంటి చిట్కాలు పాటించాలి. కొన్ని సందర్భాల్లో ఎండకు చర్మం కాలి, పొక్కులు తలెత్తి, తోలు ఊడినట్టు, అట్ట కట్టినట్టు తయారవుతుంది. ఇలాంటప్పుడు ఇంటి చిట్కాలు పాటించకుండా చర్మ వైద్యులను కలిసి, చికిత్స తీసుకోవాలి.

పిల్లలకు, గర్భిణులకు

మార్కెట్లో దొరికే సన్‌స్క్రీన్స్ రసాయనాలతో తయారవుతాయి. వీటితో పిల్లలూ, గర్భిణులూ దుష్ప్రభావాలకు గురయ్యే అవకాశం ఉంటుంది. కాబట్టి పిల్లలకూ, గర్భిణులకూ సురక్షితమైన మినరల్ సన్‌స్క్రీన్స్ అందుబాటులోకొచ్చాయి. జింక్ ఆక్సైడ్, టైటానియం ఆక్సైడ్ ఆధారిత సన్‌స్క్రీన్స్‌తో అన్ని విధాలా సురక్షితమైనవి.

డాక్టర్ స్వప్న ప్రియ
కన్సల్టెంట్ డెర్మటాలజిస్ట్,
కాస్మోస్యూర్ క్లినిక్,
హైటెక్ సిటీ, హైదరాబాద్.



చాంపియన్స్ ట్రోఫీలో నేడు
ఆస్ట్రేలియా X దక్షిణాఫ్రికా
మ.2.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

ఎకెల్‌స్టోన్ 'సూపర్'

బెంగళూరుపై యూపీ ఉత్కంఠ విజయం


ఎకెల్‌స్టోన్

బెంగళూరు: సోఫీ ఎకెల్‌స్టోన్ (19 బంతుల్లో 33) మాయాజాలంతో.. యూపీ వారియర్స్ 'సూపర్' గెలుపును నమోదు చేసింది. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో సోమవారం జరిగిన మ్యాచ్‌లో యూపీ వారియర్స్ సూపర్ ఓవర్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుపై ఉత్కంఠ విజయం సాధించింది. ఇరుజట్ల స్కోర్లు 180 పరుగుల వద్ద టై కావడంతో.. మ్యాచ్ ఫలితం సూపర్ ఓవర్‌కు మళ్లింది. ఇందులో యూపీ 8/1 స్కోరు చేయగా.. ఎకెల్‌స్టోన్ బౌలింగ్ ధాటికి బెంగళూరు 4 పరుగులు మాత్రమే చేసి ఓడింది. అంతకుముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన బెంగళూరు 20 ఓవర్లలో 180/6 స్కోరు చేసింది. ఎలీస్ పెర్రీ (56 బంతుల్లో 90 నాటౌట్), డానీ వ్యాట్ (57) రెండో వికెట్‌కు 94 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. హెన్రీ, దీప్తి, తాలియా మెక్‌గ్రాత్ తలో వికెట్ తీశారు. ఛేదనలో యూపీ ఓవర్లన్నీ ఆడి 180 పరుగులకే ఆలౌటైంది. రాణా మూడు, రేణుక రెండు వికెట్లు పడగొట్టారు. పవర్‌ప్లేలోపే ఓపెనర్లు కిరణ్ నవగిరె (24), వృంద (14)తోపాటు మెక్‌గ్రాత్ (0) వికెట్లను చేజార్చుకొన్న యూపీ 50/3తో ఇబ్బందుల్లో పడింది. ధాటిగా ఆడుతున్న దీప్తి శర్మ (25)ను రాణా.. శ్వేత (31)ను పెర్రీ అవుట్ చేయడంతో వారియర్స్ ఓటమి ఖాయమనిపించింది. కానీ, విజయానికి 36 బంతుల్లో 58 రన్స్ కావాల్సిన సమయంలో క్రీజులోకి వచ్చిన ఎకెల్‌స్టోన్ సిక్సర్లతో విరుచుకుపడడంతో.. లక్ష్యం చివరి ఓవర్‌లో 18 రన్స్‌కు దిగివచ్చింది. ఎకెల్‌స్టోన్ 6,6,4,1తో స్కోరు సమం చేసినా.. ఆఖరి బంతికి ఆమె రనౌట్ కావడంతో మ్యాచ్ టై అయింది. కాగా, డబ్ల్యూపీఎల్ చరిత్రలో ఇదే తొలి సూపర్ ఓవర్ మ్యాచ్ కావడం విశేషం.

డబ్ల్యూపీఎల్‌లో నేడు
ఢిల్లీ x గుజరాత్
రాత్రి 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

సంక్షిప్త స్కోర్లు
బెంగళూరు: 20 ఓవర్లలో 180/6 (పెర్రీ 90 నాటౌట్, వ్యాట్ 57; మెక్‌గ్రాత్ 1/30, దీప్తి 1/42).
యూపీ: 20 ఓవర్లలో 180 ఆలౌట్ (ఎకెల్‌స్టోన్ 33, శ్వేత 31; రేణుక 3/27).

కివీస్ గెలుపు బంగ్లా, పాక్ ఇంటికి

సెమీస్‌లో న్యూజిలాండ్, భారత్

రచిన్ సెంచరీ


రవీంద్ర (112)

1 ఐసీసీ టోర్నీల్లో కివీస్ తరఫున ఎక్కువ శతకాలు (4) బాదిన ప్లేయర్‌గా రచిన్ రవీంద్ర.

రావల్పిండి: ఒక్క మ్యాచ్‌తో రెండు ఫలితాలు.. చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా సోమవారం బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ 5 వికెట్ల తేడాతో నెగ్గింది. దీంతో గ్రూప్ 'ఎ' నుంచి నాలుగేసి పాయింట్లతో కివీస్‌తో పాటు భారత్ కూడా సెమీఫైనల్స్‌లో చోటు దక్కించుకుంది. అటు కచ్చితంగా గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో ఓటమితో బంగ్లా, ఇప్పటికే రెండు ఓటములతో ఉన్న ఆతిథ్య పాక్ ఇంటిముఖం పట్టాయి. ఈ మ్యాచ్‌లో రచిన్ రవీంద్ర (112) క్లాస్ ఇన్నింగ్స్‌తో జట్టును విజయం వైపు నడిపించాడు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 236 పరుగులు చేసింది. కెప్టెన్ షంటో (77), జాకెర్ అలీ (45), రిషాద్ (26) మాత్రమే రాణించారు. బ్రేస్‌వెల్‌కు నాలుగు, ఓరౌర్క్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో కివీస్ 46.1 ఓవర్లలో 5 వికెట్లకు 240 పరుగులు చేసి గెలిచింది. లేథమ్ (55), కాన్వే (30) ఆకట్టుకున్నారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా బ్రేస్‌వెల్ నిలిచాడు.

శతక భాగస్వామ్యంతో..: ఛేదన ఆరంభంలోనే కివీస్‌కు బంగ్లా బౌలర్లు షాకిచ్చారు. ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే ఓపెనర్ విల్ యంగ్‌ను పేసర్ టస్కిన్ డకౌట్ చేయగా.. యువ పేసర్ నహీద్ రాణా వెటరన్ విలియమ్సన్ (5)ను దెబ్బతీశాడు. దీంతో 15/2 స్కోరుతో కివీస్ ఇబ్బందుల్లో పడింది. అదే జోరులో బంగ్లా సంచలన ఫలితం సాధించేనా? అనిపించింది. కానీ గాయంతో తొలి మ్యాచ్‌కు దూరమైన రచిన్ రవీంద్ర అదిరే ఆటతో జట్టును ఆదుకున్నాడు. ఏడో ఓవర్‌లో రచిన్ రెండు, ఎనిమిదో ఓవర్‌లో కాన్వే మూడు ఫోర్లతో బంగ్లా బౌలర్లపై ఒత్తిడి పెంచే ప్రయత్నం చేశారు. కానీ 16వ ఓవర్‌లో కాన్వేను ముస్తాఫిజుర్ అవుట్ చేయడంతో మూడో వికెట్‌కు 57 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత లేథమ్‌ను అండగా చేసుకున్న రచిన్ 49 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. సంయమనంతో ఆడిన ఈ జోడీని విడదీసేందుకు బంగ్లా చెమటోడ్చాల్సి వచ్చింది. లేథమ్ కాస్త ఆచితూచి ఆడినా.. రచిన్ మాత్రం బంతులను వృథా చేయలేదు. అడపాదడపా బౌండరీలతో 95 బంతుల్లోనే శతకం పూర్తి చేశాడు. అటు 38వ ఓవర్‌లో స్కోరును 200కి చేర్చిన రచిన్‌ను స్పిన్నర్ రిషాద్ అవుట్ చేశాడు. అప్పటికే నాలుగో వికెట్‌కు 128 పరుగుల భారీ భాగస్వామ్యం సమకూరింది. అనంతరం హాఫ్ సెంచరీ అయ్యాక లేథమ్ రనౌట్‌గా వెనుదిరిగాడు. అయితే, విజయానికి 50 బంతుల్లో 23 పరుగులే కావాల్సి ఉండడంతో కివీస్‌కు ఇబ్బంది లేకపోయింది. ఫిలిప్స్ (21 నాటౌట్), బ్రేస్‌వెల్ (11 నాటౌట్) 46.1 ఓవర్లలోనే మ్యాచ్‌ను ముగించారు.

షంటో పోరాటం: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాకు ఓపెనర్లు షంటో, తన్‌జీద్ శుభారంభం అందించారు. కివీస్ బౌలర్లను ఈ జోడీ దీటుగా ఎదుర్కొంది. తన్‌జీద్ బంతికో పరుగు చొప్పున సాధిస్తూ జోరు మీదున్నా.. తొమ్మిదో ఓవర్‌లో బ్రేస్‌వెల్‌కు చిక్కాడు. దీంతో తొలి వికెట్‌కు 45 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత షంటోకు పెద్దగా సహకారం అందలేదు. బ్రేస్‌వెల్ ధాటికి మిడిలార్డర్‌లో తొలి మ్యాచ్ సెంచరీ హీరో తౌహీద్ (7), ముష్ఫికర్ (2), మహ్మదుల్లా (4) చకచకా పెవిలియన్‌కు చేరారు. అయితే షంటోకు ఏడో నెంబర్ బ్యాటర్ జాకెర్ సహకారం అందించాడు. ఈ జోడీ ఆరో వికెట్‌కు 45 పరుగులు జత చేయగలిగింది. షంటో వెనుదిరిగాక టెయిలెండర్లతో కలిసి జాకెర్ విలువైన భాగస్వామ్యాలు నెలకొల్పడంతో స్కోరు 200 దాటింది.

సంక్షిప్త స్కోర్లు
బంగ్లాదేశ్: 50 ఓవర్లలో 236/9 (షంటో 77, జాకెర్ 45, రిషాద్ 26, తన్‌జీద్ 24; బ్రేస్‌వెల్ 4/26, ఓరౌర్క్ 2/48).
న్యూజిలాండ్: ఓవర్లలో 46.1 ఓవర్లలో 240/5. (రచిన్ 112, లేథమ్ 55, కాన్వే 30; టస్కిన్ 1/28, ముస్తాఫిజుర్ 1/42).

మహిళా క్రికెట్‌కు ఆదరణ రెట్టింపు

న్యూఢిల్లీ: దేశంలో పురుషుల క్రికెట్‌తో పోలిస్తే మహిళల క్రికెట్‌కు ఆదరణ తక్కువే. అయితే, కాంతర్ ఇండియా అనే సంస్థ నివేదిక ప్రకారం దేశంలో మహిళల క్రికెట్‌కు ఊహించని రీతిలో ఆదరణ పెరిగిందట. 2023 నవంబరు నుంచి 2024 అక్టోబరు మధ్య మహిళా క్రికెట్ గురించి అంతర్జాలంలో శోధించిన వారి సంఖ్య గతంతో పోలిస్తే 103 శాతం పెరిగిందని ఆ సంస్థ పేర్కొంది. మహిళల ప్రీమియర్ లీగ్ ప్రారంభం, హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన వంటి స్టార్ క్రికెటర్లకు అభిమానగణం వృద్ధి కూడా మహిళా క్రికెట్ ఆదరణ పెరగడానికి కారణమని ఈ నివేదికలో తేలింది. మహిళల క్రికెట్‌తో పాటు కబడ్డీకి 75 శాతం, హాకీకి 40 శాతం గతంలో కంటే ఆదరణ పెరిగినట్టు కాంతర్ ఇండియా తెలిపింది.

బాబర్ మోసగాడు

'కింగ్' కోహ్లీయే

పాక్ మాజీలు షోయబ్, హఫీజ్



లాహోర్: చాంపియన్స్ ట్రోఫీలో వరుస ఓటముల నేపథ్యంలో పాకిస్థాన్ జట్టుపై విమర్శల జడివాన కురుస్తోంది. ముఖ్యంగా స్టార్ బ్యాటర్ బాబర్ ఆజమ్ ఆట తీరుపై పాక్ మాజీలు విరుచుకు పడుతున్నారు. మాజీ పేసర్ షోయబ్ అక్తర్ అయితే టీవీ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారంలో..బాబర్‌ను మోసగాడని దుయ్యబట్టాడు. 'మనం ఎప్పుడూ బాబర్‌ను విరాట్‌తో పోలుస్తాం. ఇప్పుడు చెప్పండి.. హీరో ఎవరో? అంతర్జాతీయ క్రికెట్‌లో సచిన్ 100 శతకాలు చేశాడు. విరాట్ వాటిని చేరుకొనే దిశగా సాగుతున్నాడు. అసలు బాబర్ ఆజమ్ ఎవరు? అభిమానులూ...మీరు తప్పుడు హీరోను ఎంచుకున్నారు. మీ నిర్ణయమే తప్పు. మొదటి నుంచీ బాబర్ మోసగాడు' అని అక్తర్ నిప్పులు చెరిగాడు. హఫీజ్ కూడా అక్తర్‌ను సమర్థించాడు. 'బాబర్ నిజమైన 'కింగ్' కాదు. విరాట్ అసలైన కింగ్. బాబర్ ఆజమ్ భారత్‌పై ఎప్పుడైనా చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడాడా? జట్టు నుంచి బాబర్‌ను తప్పించాలి' అని హఫీజ్ సూచించాడు. తెల్లబంతుల ఫార్మాట్‌లో పాకిస్థాన్ జట్టును సమూలంగా ప్రక్షాళన చేయాలని మాజీ కెప్టెన్, వ్యాఖ్యాత వసీమ్ అక్రమ్ అభిప్రాయపడ్డాడు. ప్రతిభ కలిగిన క్రికెటర్లకు జట్టులో స్థానం కల్పించాల్సిన తరుణం ఆసన్నమైందని మరో మాజీ సారథి వకార్ యూనిస్ వ్యాఖ్యానించాడు.


విరాట్ కోహ్లీ

అదే నా బలం బలహీనత

దుబాయ్: ఆఫ్ స్టంప్ ఆవలిగా పడిన బంతులను ఆడడం తన బలహీనతేనని స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అంగీకరించాడు. అదే సమయంలో అదే తన బలం కూడా అని స్పష్టం చేశాడు. 'అవుట్ సైడ్ ఆఫ్ స్టంప్ బంతులను ఆడాలా..వద్దా.. అనే సందిగ్ధ పరిస్థితి. అది నా బలహీనత. అలాగే అది బలం కూడా. ఆ షాట్ ద్వారా నేను ఎన్నో పరుగులు సాధించా' అని విరాట్ గుర్తు చేశాడు. ఈమేరకు పాకిస్థాన్‌తో చాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్ అనంతరం కోహ్లీ చేసిన వ్యాఖ్యల వీడియోను బీసీసీఐ ఎక్స్‌లో పోస్ట్ చేసింది.

సూపర్ ఇన్నింగ్స్: తీవ్ర ఒత్తిడిలో ఉన్న కోహ్లీ పాకిస్థాన్‌పై సెంచరీ చేయడం అద్భుతమని కేంద్ర క్రీడా శాఖ మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్, బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా కొనియాడారు.

మరో మూడేళ్లు ఆడతాడు

కోహ్లీని తరానికొక్క క్రికెటర్‌గా భారత జట్టు మాజీ ఆటగాడు నవజ్యోత్‌సింగ్ సిద్ధూ అభివర్ణించాడు. పాకిస్థాన్‌పై అతడి ఇన్నింగ్స్ గమనిస్తే మరో రెండు లేదా మూడేళ్లు విరాట్ క్రికెట్‌లో కొనసాగుతాడని అభిప్రాయపడ్డాడు.

టిక్కెట్లు పంపించి.. అదే హోటల్లో బస కల్పించి..

చిన్ననాటి కోచ్‌పట్ల కోహ్లీ కృతజ్ఞత

న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీలో పాకిస్థాన్‌తో పోరులో అజేయ సెంచరీతో ఆకట్టుకున్న విరాట్ కోహ్లీ ఇన్నింగ్స్‌ను ప్రత్యక్షంగా చూడడం తనకు ఎంతో ఆనందాన్నిచ్చిందని అతని చిన్ననాటి కోచ్ రాజ్‌కుమార్ తెలిపాడు. కాగా, మ్యాచ్‌లో శతకం సాధించిన విరాట్.. అనంతరం స్టాండ్స్‌లో ఉన్న ఎవరికో 'చూశావా' అనే సైగ చేసినట్టుగా కనిపించింది. అయితే, అప్పుడు స్టాండ్స్‌లో ఉన్న తనను ఉద్దేశించే కోహ్లీ అలా చేశాడని రాజ్‌కుమార్ వెల్లడించాడు. అంతేకాదు, మ్యాచ్‌కోసం స్వయంగా కోహ్లీనే టిక్కెట్లు పంపించడంతో పాటు అతను బస చేసిన హోటల్లోనే తనకూ ఏర్పాట్లు చేశాడని తెలిపాడు. కోహ్లీ గురువుగా తనకు ఇంతకువిుంచిన ఆనందం ఇంకేం కావాలని రాజ్‌కుమార్ సంతోషం వ్యక్తం చేశాడు.

విరాట్.. ఏం నిర్ణయించుకున్నావ్?

భవిష్యత్ గురించి ప్రశ్నించిన గంభీర్, అగార్కర్



న్యూఢిల్లీ: పాకిస్థాన్‌తో జరిగిన చాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తన సత్తా ఏమిటో చాటుకున్నాడు. జట్టులో చోటు అవసరమా? అంటున్న విమర్శకులకు శతకంతో సమాధానమిచ్చాడు. అయితే బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో తను అంచనాలను అందుకోలేకపోయిన విషయం తెలిసిందే. వన్డేల్లోనూ చివరి శతకం 2023లో వచ్చింది. అందుకే ఆ సమయంలో పరుగుల కోసం ఇబ్బందిపడిన కోహ్లీని.. కోచ్ గంభీర్, చీఫ్ సెలెక్టర్ అగార్కర్ తన భవిష్యత్ ప్రణాళికలపై ప్రశ్నించారట. ఆసీస్ టూర్‌లో విఫలమయ్యాక టీమిండియాలో కోహ్లీ స్థానంపై ఏదో ఒకటి తేల్చాలని వారు భావించారు. అందుకే కెరీర్ గురించి ఏం నిర్ణయించుకున్నావని అతడినే నేరుగా అడిగినట్టు మీడియాలో కథనం రావడం సంచలనం సృష్టించింది.

పాక్‌లో సంబరాలు



ఇస్లామాబాద్: విరాట్ కోహ్లీ అభిమానులకు సరిహద్దులు లేవని మరోసారి రుజువైంది. పొరుగు దేశం పాకిస్థాన్‌లోనూ విరాట్ వీరాభిమానులు భారీ సంఖ్యలో ఉన్న విషయం తెలిసిందే. చాంపియన్స్ ట్రోఫీలో భారత్-పాకిస్థాన్ మ్యాచ్ సందర్భంగా ఇస్లామాబాద్‌లో ఆదివారం పలు చోట్ల ప్రత్యేక స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. విరాట్ ఫోర్‌కొట్టి శతకం సాధించగానే ఇస్లామాబాద్‌లో అతడి అభిమానులు సంబరాలు చేసుకున్న వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. తమ జట్టు ఓడిపోయిందన్న బాధ కంటే కోహ్లీ శతకమే వారిని సంతోషపెట్టింది. ఫామ్‌లో లేక కొంతకాలంగా ఇబ్బంది పడుతున్న కోహ్లీ ఎట్టకేలకు సెంచరీ సాధించేసరికి అతడి అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది.

పీఎస్‌బీల్లో తగ్గనున్న ప్రభుత్వ వాటా

మరిన్ని వాటాల విక్రయానికి సన్నాహాలు

మర్చంట్ బ్యాంకర్ల నుంచి బిడ్స్ ఆహ్వానం

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని ప్రభుత్వ రంగ సంస్థల్లో (పీఎస్‌యూ) మరో విడత పెట్టుబడుల ఉపసంహరణకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఈక్విటీలో 25 శాతం కంటే తక్కువ పబ్లిక్ ఫ్లోటింగ్ ఉన్న లిస్టెడ్ ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీ), ప్రభుత్వ రంగ ఆర్థిక సంస్థల (పీఎఫ్‌ఐ) నుంచి పెట్టుబడుల ఉపసంహరణకు రంగం సిద్ధం చేస్తోంది. ఇందుకు అవసరమైన సేవలు అందించే మర్చంట్ బ్యాంకర్లు, న్యాయ సేవల సంస్థలు వచ్చే నెల 27లోగా తమ ప్రతిపాదనలు అందజేయాలని కోరింది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నిర్వహణలోని ప్రభుత్వ ఆస్తులు, పెట్టుబడుల నిర్వహణ శాఖ (దీపమ్) దీనికి సంబంధించి సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఎంపిక చేసిన సంస్థలు మూడేళ్ల పాటు ప్రభుత్వానికి ఈ విషయంలో సేవలు అందించాలి. ఒకవేళ అవసరమనుకుంటే ఈ గడువును మరో ఏడాది పొడిగిస్తారు. లిస్టెడ్ పీఎస్‌బీలు, పీఎఫ్‌ఐలు వచ్చే ఏడాది ఆగస్టు 1లోగా తమ ఈక్విటీలో 25 శాతం పబ్లిక్ ఫ్లోటింగ్ ఉండేలా చూసుకోవాలని సెబీ ఆదేశించింది. దీంతో స్టాక్ మార్కెట్ కోలుకున్న వెంటనే ఈ పని పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం.

- గ్లోబ్ టెక్స్‌టైల్స్.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.151.29 కోట్ల ఆదాయంపై రూ.2.91 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 46.2 శాతం వృద్ధి చెందగా లాభం 53.7 శాతం పెరిగింది. కాగా కంపెనీ జారీ చేసిన రూ.45.04 కోట్ల రైట్స్ ఇష్యూకు మంచి స్పందన లభించిందని, ఇది కంపెనీ పట్ల మదుపరులకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమని తెలిపింది. డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలల కాలానికిగాను రూ.423.97 కోట్ల ఆదాయంపై రూ.9.43 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది.

- ఇస్రో వాణిజ్య విభాగమైన న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌ఎస్‌ఐఎల్) నుంచి రూ.43.25 కోట్ల విలువైన ఆర్డర్‌ను చేజిక్కించుకున్నట్లు అవాంటెల్ లిమిటెడ్ వెల్లడించింది. ఆర్డర్‌లో భాగంగా మారిటైమ్ కమ్యూనికేషన్ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు అవసరమైన ఎక్స్‌పాండర్స్‌కు 45,252 పరికరాల సరఫరా, ఇన్‌స్టలేషన్, పనిచేయించటం వంటివి అవాంటెల్ చేపట్టాల్సి ఉంటుంది. ఈ ఏడాది ఆగస్టు నాటికి ఈ ఆర్డర్‌ను పూర్తి చేయాల్సి ఉంటుందని అవాంటెల్ తెలిపింది



ఐటీ పరిశ్రమకీ సుంకాల భయం

- ఆదాయాల వృద్ధికి ఢోకా లేదు
- 2024-25లో రూ.24.5 లక్షల కోట్ల ఆదాయం
- 58 లక్షలకు చేరిన ఐటీ కొలువులు
- 2025-26లో ఆదాయం రూ.26 లక్షల కోట్లు ఉండే చాన్స్

నాస్కామ్ చీఫ్ రాజేశ్ నంబియార్

ముంబై: భారత ఐటీ కంపెనీలకూ ట్రంప్ సుంకాల భయం పట్టుకుంది. ప్రపంచ ఉద్రిక్తతలూ ఇందుకు తోడయ్యాయి. అయినా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత ఐటీ కంపెనీల ఆదాయాలు 5.1 శాతం పెరిగి 28,260 కోట్ల డాలర్లకు (సుమారు రూ.24.5 లక్షల కోట్లు) చేరే అవకాశం ఉందని నాస్కామ్ జాతీయ అధ్యక్షుడు రాజేశ్ నంబియార్ చెప్పారు. నాస్కామ్ వార్షిక సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ విషయం చెప్పారు. అంతేకాదు.. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఐటీ కంపెనీల ఆదాయాలు మరో 6.1 శాతం వృద్ధితో 30,000 కోట్ల డాలర్లు (సుమారు రూ.26.10 లక్షల కోట్లు) మించి పోయే అవకాశం ఉందన్నారు.

1.26 లక్షల కొత్త కొలువులు

ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగానే ఉన్నా ఈ ఆర్థిక సంవత్సరం దేశంలోని ఐటీ సేవల కంపెనీలు, బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ (బీపీఎం) కంపెనీలు, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్స్ (జీసీసీ) ఈ-కామర్స్ కంపెనీలు అన్నీ కలిసి 1.26 లక్షల కొత్త కొలువులు కల్పించినట్టు రాజేశ్ చెప్పారు. దీంతో దేశ ఐటీ రంగంలో పని చేస్తున్న ఉద్యోగుల సంఖ్య 58 లక్షలకు చేరింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) కూడా దేశ ఐటీ రంగంలో కొత్త కొలువుల కల్పన ఇదే స్థాయిలో ఉండే అవకాశం ఉందని నంబియార్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం ప్రపంచ ఐటీ సేవల రంగంలో భారత కంపెనీల వాటా 58 శాతానికి చేరనుందన్నారు.

ఎగుమతులే సింహభాగం

ఈ ఆర్థిక సంవత్సరం భారత ఐటీ కంపెనీలకు వచ్చే 28,260 కోట్ల డాలర్ల ఆదాయంలో మెజారిటీ వాటా 22,440 కోట్ల డాలర్లు ఎగుమతుల ద్వారా రానుంది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 4.6 శాతం ఎక్కువని నంబియార్ చెప్పారు. ఎగుమతులతో పోలిస్తే ఈ సంవత్సరం దేశీయ మార్కెట్ 7 శాతం పెరిగి 5,820 కోట్ల డాలర్లకు చేరనుంది. అలాగే మొత్తం ఐటీ పరిశ్రమ ఆదాయంలో 3,710 కోట్ల డాలర్లు ఐటీ సేవల కంపెనీల నుంచి, బీపీఎం కంపెనీల నుంచి 5,460 కోట్ల డాలర్లు, ఇంజనీరింగ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కంపెనీల నుంచి 5,560 కోట్ల డాలర్ల ఆదాయం లభిస్తుందని నాస్కామ్ అంచనా.

అమెరికాదే అగ్రస్థానం

భారత ఐటీ ఎగుమతుల్లో ఇప్పటికీ అమెరికా వాటా 60 నుంచి 62 శాతం వరకు ఉంది. దీంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న విధానపరమైన చర్యలు ఎక్కడ తమ ఎగుమతులను దెబ్బతీస్తాయోనని ఐటీ కంపెనీలు భయపడుతున్నాయి. 'ప్రస్తుతం అమెరికా మార్కెట్ అగమ్యగోచరంగా ఉంది. అక్కడి కొత్త ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోబోతోందో తెలియడం లేదు' అని నంబియార్ చెప్పారు. అయితే ఇదే సదస్సులో ప్రసంగించిన ఇన్ఫోసిస్ సీఈఓ, ఎండీ సలీల్ పరేఖ్ మాత్రం మన ఐటీ కంపెనీలపై ట్రంప్ హెచ్చరికల ప్రభావం ఏ మాత్రం ఉండదన్నారు. ట్రంప్ సుంకాలతో అమెరికా కంపెనీలు లాభపడితే.. పరోక్షంగా అది మన ఐటీ కంపెనీలకూ మేలు చేస్తుందన్నారు. అమెరికాలోని తమ కంపెనీలో పనిచేసే ఉద్యోగుల్లో 60 శాతం మంది స్థానికులని పరేఖ్ వెల్లడించారు.

బిజినెస్

భీమ జువెలర్స్‌లో ఆఫర్లు

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): భీమ జువెలర్స్ వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. ఈ నెల 5న ప్రారంభమైన ఈ ఆఫర్లు నెలాఖరుతో ముగియనున్నాయి. కస్టమర్లకు సాటిలేని డిస్కౌంట్స్‌తో పాటు పలు రివార్డులు అందించనున్నట్లు భీమ జువెలర్స్ ప్రతినిధులు ప్రకటించారు. ఈ ఆఫర్లలో భాగంగా బంగారం, వెండి ఆభరణాల మేకింగ్ చార్జీలో 70 శాతం వరకు రాయితీని అందిస్తున్నట్లు వారు వెల్లడించారు. అలాగే వజ్రాభరణాల కొనుగోలు చేసే వారికి ప్రతి క్యారట్‌పై రూ.7,000 వరకు తగ్గింపును ఆఫర్ చేస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా వజ్రాభరణాల కొనుగోలుపై ఒక బంగారు నాణెం ఉచితంగా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి వారం తీసే లక్కీ డ్రాలో 20 మంది లక్కీ కస్టమర్లకు అప్రిలియా స్కూటర్‌ను అందజేస్తున్నట్లు భీమ జువెలర్స్ వెల్లడించింది. భీమ స్క్రాచ్ అండ్ విన్ క్యాష్‌బ్యాక్ ఆఫర్ కింద ప్రతి కొనుగోలుపై గ్రాముకు రూ.150 వరకు క్యాష్‌బ్యాక్‌ను అందిస్తున్నట్లు పేర్కొంది. భీమ జువెలర్స్‌కు చెందిన అన్ని స్టోర్లలో ఈ ఆఫర్లు అందుబాటులో ఉన్నాయని వెల్లడించింది.

ఇండియా, యూకే ఎఫ్‌టీఏ చర్చలు పునః ప్రారంభం

న్యూఢిల్లీ: ప్రతిపాదిత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై (ఎఫ్‌టీఏ) చర్చలు పునఃప్రారంభమైనట్టు భారత్, యూకే ప్రకటించాయి. ఉభయ దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం ప్రస్తుతం ఉన్న 2,000 కోట్ల డాలర్ల నుంచి రెండింతలు లేదా మూడింతలు చేయాలన్న లక్ష్యసాధనకు ఇది దోహదపడుతుందని భావిస్తున్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)




25వ తేదీ			
హైదరాబాద్	440	విజయవాడ	480
వరంగల్	442	గోదావరి	470
చిత్తూరు	493	విశాఖపట్నం	470
		దజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	70	విజయవాడ	71
వరంగల్	70	గుంటూరు	71
కరీంనగర్	70	ఒంగోలు	71
మహబూబ్‌నగర్	70	చిత్తూరు	70
కర్నూలు	70	నెల్లూరు	75
విశాఖపట్నం	70	అనంతపురం	75
గోదావరి	71		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	87,870 ▲	80,550 ▲	1,08,000 ▲
విజయవాడ	89,300 ▲	84,500 ▲	99,000 ▲
విశాఖపట్నం	86,520 ▲	79,310 ▲	96,280 ▼
రాజమండ్రి	87,870 ▲	80,550 ▲	99,900 ▼
ప్రొద్దుటూరు	88,600 ▲	82,090 ▲	98,000 ▼
ముంబై	86,400 ▲	79,142 ▲	96,115 ▼

75,000 దిగువకు సెన్సెక్స్

- ఐదో రోజూ ఆగని పతనం
- రూ.4.22 లక్షల కోట్ల సంపద ఆవిరి



ముంబై: ఈక్విటీ మార్కెట్‌పై బేర్ పట్టును మరింత బిగించింది. అంతర్జాతీయ సంకేతాలు, విదేశీ నిధుల తరలింపు, పెరుగుతున్న వాణిజ్య ఉద్రిక్తతలు మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నాయి. వరుసగా ఐదో సెషన్‌లో కూడా ఈక్విటీ సూచీలు భారీ నష్టాలు చవిచూశాయి. దీంతో సోమవారం సెన్సెక్స్ 856.65 పాయింట్ల నష్టంతో 74,454.41 వద్ద ముగిసింది. ఒక దశలో ఇండెక్స్ 923.63 పాయింట్లు నష్టపోయి 74,387.44 వరకు దిగజారింది. నిఫ్టీ 242.55 పాయింట్ల మేరకు దిగజారి 22,553.35 వద్ద ముగిసింది. ప్రధానంగా ఐటీ, టెలికాం, మెటల్ షేర్లలో అమ్మకాలు మార్కెట్‌ను భారీ నష్టాల్లోకి నెట్టాయి. బీఎస్ఈలో 2,810 షేర్లు నష్టపోగా 1,207 షేర్లు మాత్రం లాభపడ్డాయి. 183 షేర్ల ధరల్లో ఎలాంటి మార్పు లేదు. సెన్సెక్స్ నష్టపోవడం వరుసగా ఇది ఐదో రోజు. ఈ ఐదు రోజుల్లో సూచీ 1,542.45 పాయింట్లు నష్టపోయింది. నిఫ్టీ 406.15 పాయింట్లు దిగజారింది. మార్కెట్‌పై ఏర్పడిన బేర్ పట్టుతో మార్కెట్ సూచీలు ఎనిమిది నెలల కనిష్ఠ స్థాయిలకు దిగజారాయని విశ్లేషకులంటున్నారు. రాబోయే కాలంలో కూడా ప్రపంచ మార్కెట్ల గమనమే మన మార్కెట్‌ను భారీగా ప్రభావితం చేస్తుందని, ఫలితంగా భారీ రిస్క్‌కు ఇష్టపడని రిటైల్ ఇన్వెస్టర్లు అనిశ్చితిని ఎదుర్కొంటారని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ విభాగం హెడ్ వినోద్ నాయర్ అంటున్నారు.

ఇన్వెస్టర్లు లబోదిబో : రెండు వారాలుగా మార్కెట్‌పై బేర్ పట్టు బిగియడం ఇన్వెస్టర్లను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. సోమవారం నాటి భారీ పతనం కారణంగా ఒక్క రోజులోనే ఇన్వెస్టర్ల సంపద రూ.4.22 లక్షల కోట్లు తుడిచిపెట్టుకుపోయింది. నికరంగా రూ.4,22,983.08 కోట్లు (4.59 లక్షల కోట్ల డాలర్లు) నష్టంతో రూ.3,97,97,305.47 కోట్ల వద్ద స్థిరపడింది.

- బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 1.31 శాతం, మిడ్‌క్యాప్ సూచీ 0.78 శాతం నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో ఐటీ గరిష్ఠంగా 2.65 శాతం నష్టపోయింది. టెక్ (2.56%), టెలీ కమ్యూనికేషన్ (2.26%), మెటల్ (2.16%), కమోడిటీస్ (1.53%), యుటిలిటీస్ (1.42%) నష్టపోయాయి. ఆటో, ఎఫ్ఎంసీజీ మాత్రం లాభపడ్డాయి..

ట్రంప్ టారిఫ్‌లతో ముప్పే

ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్

ముంబై: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌లతో ఆసియా, పసిఫిక్ ప్రాంతంలోని కొన్ని దేశాలకు ముప్పు తప్పదని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ తెలిపింది. ముఖ్యంగా ఆసియా దేశాలైన వియత్నాం, తైవాన్, దక్షిణ కొరియా, థాయ్‌లాండ్ దేశాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించింది. అయితే దేశీయ వినియోగం ఎక్కువగా ఉండే భారత, జపాన్ దేశాలపై ఈ ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చని అంచనా వేసింది. ఏప్రిల్ నుంచి ఏ దేశం తమ ఎగుమతులపై ఎంత సుంకం విధిస్తే, తామూ ఆ దేశ ఎగుమతులపై అంతే సుంకం విధిస్తామని ట్రంప్ సర్కార్ ఇప్పటికే స్పష్టం చేసింది. ప్రధాని మోదీతో ఎంత దోస్తానా ఉన్నా, ఈ విషయంలో భారత్‌కూ ఎలాంటి మినహాయింపులు ఉండవని ట్రంప్ ఇప్పటికే స్పష్టం చేశారు.

దిగొచ్చిన యాపిల్

అమెరికాలో 50,000 కోట్ల డాలర్ల పెట్టుబడులు

ట్రంప్ సుంకాల హెచ్చరికల దెబ్బకు ఐఫోన్ తయారీ కంపెనీ 'యాపిల్' దిగొచ్చింది. వచ్చే నాలుగేళ్లలో అమెరికాలో 50,000 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టబోతున్నట్టు కంపెనీ సీఈఓ టిమ్ కుక్ సోమవారం ప్రకటించారు. ఇందులో భాగంగా టెక్సాస్‌లో కొత్తగా సర్వర్ల తయారీ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయబోతున్నట్టు తెలిపారు. ఈ చర్యలతో కొత్తగా 20,000 ఉద్యోగాలు ఏర్పడతాయని తెలిపారు. తమ తయారీ యూనిట్‌ను మెక్సికో నుంచి అమెరికాకు తరలిస్తామని యాపిల్ సీఈఓ హామీ ఇచ్చినట్టు అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన కొద్ది రోజులకే కుక్ ఈ ప్రకటన చేయడం విశేషం.

భారత్ నుంచి ఫోన్ల ఎగుమతులపైనా ప్రభావం: ప్రస్తుతం భారత్.. ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల దిగుమతులపై సగటున 16.5 శాతం సుంకం విధిస్తోంది. అమెరికా మాత్రం ఎలాంటి సుంకాలు లేకుండా ఈ దిగుమతులను అనుమతిస్తోంది. దీంతో యాపిల్ కంపెనీ తన సరికొత్త ఐఫోన్లతో సహా అనేక ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను భారత్‌లో అసెంబుల్ చేసి, జీరో డ్యూటీతో అమెరికాకు ఎగుమతి చేస్తోంది. ట్రంప్ పరస్పర సుంకాల విధానం అమల్లోకి వస్తే ఈ ఎగుమతులతో పాటు 'భారత్‌లో తయారీ' కార్యక్రమానికి బ్రేక్ పడే ప్రమాదం ఉందని భావిస్తున్నారు.



టీడీపీలో చేరిన వైస్‌చైర్మన్, కౌన్సిలర్లతో మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు

తునిలో వైసీపీకి షాక్!

- మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి సుధారాణి రాజీనామా
- టీడీపీలోకి వైస్‌చైర్మన్ సహా మరో ఆరుగురు వైసీపీ కౌన్సిలర్లు

తుని రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో వైసీపీకి గట్టి షాక్ తగిలింది. మున్సిపల్ వైస్ చైర్మన్ సహా ఆ పార్టీకి చెందిన కౌన్సిలర్లు మరో ఆరుగురు సోమవారం టీడీపీలో చేరిపోయారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి ఏలూరి సుధారాణి రాజీనామా చేశారు. ఇప్పటికే పది మంది కౌన్సిలర్లు వైసీపీ నుంచి టీడీపీలోకి రాగా, తాజాగా మరో ఆరుగురు రాకతో టీడీపీ కౌన్సిలర్ల సంఖ్య 16కు చేరింది. తుని మున్సిపాలిటీలో మొత్తం 30 మంది కౌన్సిలర్లకుగాను ఒకరు మరణించారు. మరొకరు రాజీనామా చేశారు. మిగిలిన 28 మందిలో ప్రస్తుతం 16 మంది టీడీపీలోనూ, 12 మంది వైసీపీలోనూ ఉన్నారు. తుని టీడీపీ ఎమ్మెల్యే యనమల దివ్య ఓటుహక్కుతో కలిపితే టీడీపీ మొత్తం బలం 17 అవుతుంది. దీంతో రెండో వైస్ చైర్మన్ ఎన్నిక జరిగితే టీడీపీ కైవసం చేసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. తాజాగా ఒకటో వైస్‌చైర్మన్ సహా ఆరుగురు కౌన్సిలర్లకు మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వారిలో కౌన్సిలర్లు సూరిశెట్టి సుభద్రాదేవి(6వ వార్డు), మంతెన నాగలక్ష్మి(8వ వార్డు), వాసంశెట్టి శ్రీను(9వ వార్డు), మొల్లేటి ప్రభావతి(10వ వార్డు), కోలా శ్రీను(21వ వార్డు), కె.రూపాదేవి(28వ వార్డు, వైస్‌చైర్మన్) ఉన్నారు. కాగా, ప్రజా శ్రేయస్సు కోరే మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి తాను రాజీనామా చేస్తున్నట్టు ఏలూరి సుధారాణి మీడియా సమావేశంలో చెప్పారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు రాజీనామా పత్రాన్ని అందజేశారు. చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేసిన తాను సాధారణ కౌన్సిలర్‌గా కొనసాగుతానని కమిషనర్‌కు తెలిపారు.

ఫైబర్‌నెట్ పోస్టులు 'కట్'

(మొదటి పేజీ తరువాయి)

దానిని ఆమోదిస్తూనే... ఐఏఎస్ అధికారి దినేశ్ కుమార్‌ను బదిలీ చేసి, జీఏడీలో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది.

చినికి చినికి...

యువకుడు, ఉత్సాహవంతుడైన జీవీ రెడ్డిని టీడీపీ తొలి నుంచీ ప్రోత్సహించింది. ఆయనను జాతీయ అధికార ప్రతినిధిగా నియమించడంతోపాటు... అధికారంలోకి రాగానే కీలకమైన ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్‌కు చైర్మన్‌గా నియమించింది. అయితే... సంస్థ ఎండీ దినేశ్ కుమార్‌పై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. వరుస ప్రెస్‌మీట్లు పెట్టారు. ఫైబర్‌నెట్ ఎండీగా దినేశ్ కుమార్ బాధ్యతలు చేపట్టాక నెట్‌వర్క్ సేవల్లో వేగం తగ్గిందని... వైసీపీ హయాంలో నియమితులైనవారిని తొలగించలేదని... ఫైబర్‌నెట్ ఎంఎస్‌వోలను ఏనాడూ కలసి మాట్లాడలేదని మండిపడ్డారు. 'దినేశ్ కుమార్‌ది రాజద్రోహం' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఒకే సంస్థకు చెందిన చైర్మన్, ఎండీ మధ్య వివాదాలు బహిర్గతం కావడాన్ని ప్రభుత్వం ఒకింత సీరియస్‌గా తీసుకుంది. దీనిపై తొలుత మంత్రి బీసీ జనార్దన రెడ్డి వద్ద పంచాయితీ జరిగింది. అధికారులపై బహిరంగ ఆరోపణలు సరికాదని, సమయానుకూలంగా స్పందించాలని జీవీ రెడ్డికి పార్టీ పెద్దలు కూడా హితవు పలికారు. తర్వాత... జీవీ రెడ్డి నేరుగా ముఖ్యమంత్రిని కలిసి తన వివరణ ఇచ్చారు. "అక్కడేం జరుగుతోందో నాకు తెలుసు. అధికారులతో పని చేయించుకోవాలి. సంయమనం ప్రదర్శిస్తూ... సందర్భాన్ని బట్టి స్పందించాలి" అని చంద్రబాబు సూటిగా చెప్పారు. అదే సమయంలో... జీవీ రెడ్డి చెప్పిన విషయాలను పరిగణనలోనికి తీసుకుని దినేశ్ కుమార్‌తో మాట్లాడాలని సీఎంవో అధికారులకు పురమాయించారు. కానీ... ఈ సమాచారం తెలియకో, చంద్రబాబు తన వాదనను వినిపించుకోలేదనే ఆక్రోశంతోనో జీవీ రెడ్డి తన పదవికి, పార్టీకి రాజీనామా చేసేశారు.

దినేశ్ పోస్టులకూ ఎసరు...

ఇటీవల టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, కార్యనిర్వహణాధికారి శ్యామలరావు మధ్య విభేదాలు బట్టబయలు కావడాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. కానీ, చర్యలు తీసుకునేదాకా వెళ్లలేదు. గత అనుభవం నేపథ్యంలో ఫైబర్‌నెట్ చైర్మన్, ఎండీ మధ్య విభేదాలపై తీవ్రంగా స్పందించింది. సోమవారం రాత్రి అప్పటికప్పుడు జీవీ రెడ్డి రాజీనామాను ఆమోదించింది. అదే సమయంలో ఐఏఎస్ అధికారి దినేశ్‌కుమార్‌ను కూడా ఫైబర్‌నెట్ ఎండీ పోస్టు నుంచి తప్పించింది. నిజానికి... ఆయన ఉత్సాహంగా పనిచేస్తారనే ఉద్దేశంతో ఏకంగా నాలుగు పోస్టులు కట్టబెట్టారు. అందులో... చంద్రబాబుకు ఎంతో ఇష్టమైన ఆర్టీజీఎస్ సీఈవోతోపాటు ఫైబర్‌నెట్, డ్రోన్ కార్పొరేషన్, ఏపీ గ్యాస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌లకు ఎండీగా నియమించారు. ఇప్పుడు అన్ని బాధ్యతల నుంచి తప్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారంనాడు ఉత్తర్వు జారీ చేశారు.

ఆవేశం... అలసత్వం

ఫైబర్‌నెట్‌కు ఎండీగా ఉంటూ ఇతర సంస్థలకు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న దినేశ్ కుమార్.. అనుబంధ వ్యవహారాలకే అధిక ప్రాధాన్యం ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ కోసం 'వ్యూహం' తీసి.. 'వ్యూస్'కు మించి సొమ్ములు తీసుకున్న సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మపై కేసు పెట్టాలంటూ సంస్థ చైర్మన్‌గా జీవీ రెడ్డి చేసిన సూచనలనూ దినేశ్ కుమార్ పట్టించుకోలేదని తెలుస్తోంది. ఇదేవిధంగా జగన్ జమానాలో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవడంలోనూ మీనమేషాలు లెక్కించారనే విమర్శలు వచ్చాయి. సంస్థ చైర్మన్‌గా తాను తీసుకుంటున్న చొరవ, వేగానికి తగినట్లుగా దినేశ్ కుమార్ స్పందించడంలేదన్నది జీవీ రెడ్డి ప్రధాన అభ్యంతరం! ఈ క్రమంలోనే మీడియా ముందుకొచ్చి తీవ్ర విమర్శలు చేశారు. ఆ వివాదమే ఇప్పుడు చినికి చినికి గాలివానగా మారింది. ఎవరికి వారు ఇలా రచ్చకెక్కితే సహించేది లేదని ప్రభుత్వం సూటిగా సంకేతాలు పంపింది.



ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాపై అధ్యయనం చేస్తున్న ఏపీ మంత్రి నారాయణ బృందం

కుంభమేళా ఏర్పాట్లపై అధ్యయనం

- ప్రయాగ్‌రాజ్‌కు మంత్రి నారాయణ బృందం

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2027లో జరిగే గోదావరి పుష్కరాల ఏర్పాట్ల కోసం అధికారులు ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న మహాకుంభమేళా ఏర్పాట్లపై అధ్యయనం చేస్తున్నారు. ఇందులో భాగంగా మంత్రి నారాయణ బృందం సోమవారం ప్రయాగ్‌రాజ్ చేరుకుంది. మంత్రితో పాటు మున్సిపల్ శాఖ డైరెక్టర్ సంపత్‌కుమార్, రాజమండ్రి మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ వెళ్లారు. ఈ బృందం అక్కడి కుంభమేళా అథారిటీ ఆఫీసును సందర్శించింది. కుంభమేళా ఏర్పాట్లు, రద్దీ నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యల గురించి కుంభమేళా ఆఫీసర్ విజయ్ కిరణ్ ఆనంద్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కుంభమేళా అథారిటీ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను కూడా మంత్రి, అధికారులు పరిశీలించారు.

చాలాకాలం తర్వాత బాబు ఇంటికి దగ్గుబాటి

- 'ప్రపంచ చరిత్ర' పుస్తక ఆవిష్కరణకు ఆహ్వానం

అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలం తర్వాత సీఎం చంద్రబాబు నివాసానికి ఆయన తోడల్లుడు డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు వెళ్లారు. ఉండవల్లి సీఎం నివాసం వీరి కలయికకు వేదికైంది. తాను రాసిన 'ప్రపంచ చరిత్ర' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమానికి రావాల్సిందిగా చంద్రబాబును దగ్గుబాటి ఆహ్వానించారు. దగ్గుబాటి సతీమణి పురందేశ్వరి కూటమి పార్టీల భేటీల సందర్భంగా పలుమార్లు చంద్రబాబు నివాసానికి వచ్చారు. రెండు కుటుంబాలకు చెందిన పిల్లలు తరచూ కలుసుకుంటూ ఉంటారు. దగ్గుబాటి, చంద్రబాబు సైతం కుటుంబ కార్యక్రమాల్లో కలుసుకుంటున్నా చంద్రబాబు నివాసానికి రావడం చాలా కాలం తర్వాత ఇదే. ఈ పుస్తకావిష్కరణకు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కూడా హాజరవుతున్నారు.

జనసేన ఆవిర్భావ సభకు ఏర్పాట్లు

- పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలు



అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో మార్చి 14న జనసేన ఆవిర్భావ సభను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలను పార్టీ ప్రారంభించింది. సభ నిర్వహణ పకడ్బందీగా ఉండాలని పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఈ క్రమంలో 10 కమిటీలను ఏర్పాటు చేశారు. లాజిస్టిక్స్, సభ నిర్వహణ, పబ్లిసిటీ, మెడికల్, మీడియా ఇలా ప్రతి విభాగానికి కమిటీలు ఏర్పాటు చేశారు. వీటితో పాటు పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలను నియమించారు. పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, పీఓసీలు, మండలాధ్యక్షులతో సమావేశాలు నిర్వహించి వేడుకలను విజయవంతం చేసే బాధ్యతను వారికి అప్పగించారు. విశాఖపట్నం పార్లమెంట్‌కు ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్, కాకినాడ పార్లమెంట్‌కు తుమ్మల రామస్వామి(బాబు), విజయవాడ పార్లమెంట్‌కు సామినేని ఉదయభాను, తిరుపతికి ఆరణి శ్రీనివాసులను సమన్వయకర్తలుగా నియమించారు.

డిజిటల్ సాక్ష్యాలతో హత్యానేరం రుజువు

ఐదుగురు ముద్దాయిలకు జీవిత ఖైదు

- అనంతపురం జిల్లా కోర్టు సంచలన తీర్పు
- 2022లో నార్పలలో యువకుడి హత్య



శిక్ష పడిన ముద్దాయిలు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రత్యక్ష సాక్షులు సాక్ష్యం చెప్పకపోయినా, డిజిటల్ సాక్ష్యాలు, అధికారుల నివేదికల ఆధారంగా ఓ హత్య కేసులో నేరం రుజువైనట్లు అనంతపురం జిల్లా కోర్టు స్పష్టం చేసింది. జిల్లాలోని నార్పల మండల కేంద్రానికి చెందిన మట్టి పవన్‌కుమార్ హత్య కేసులో ఐదుగురికి కఠిన జీవిత ఖైదును విధిస్తూ జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ సోమవారం తీర్పునిచ్చారు. ఈ కేసులో మొదటి ముద్దాయి డిపో సాజిద్‌కు హతుడు ఒకనాటి స్నేహితుడు. ఇద్దరి మధ్య భేదాభిప్రాయాలు వచ్చి గొడవపడ్డారు. ఈ క్రమంలో డిపో సాజిద్‌తోపాటు అతని అనుచరుడు తలారి సుధాకర్‌ను చంపుతానని పవన్ కుమార్ బెదిరించేవాడు. గొడవలు తీవ్రం కావడంతో పవన్ కుమార్ తన తల్లిదండ్రులతో కలిసి అనంతపురంలో ఉంటున్నాడు. 2022, ఏప్రిల్ 12న పవన్‌కుమార్ నార్పలకు రాగా, తహసీల్దార్ కార్యాలయంలో డిపో సాజిద్ తారసపడ్డాడు. ఇద్దరూ మరోసారి ఘర్షణపడ్డారు. ఈ క్రమంలో సాజిద్‌పై పవన్‌కుమార్ కత్తితో దాడి చేయడంతో చేతికి గాయాలయ్యాయి. అదే రోజు రాత్రి సాజిద్ తన అనుచరులు చింతాకు రమేశ్, చిక్కేపల్లి నాగేంద్ర, తలారి సుధాకర్, తలారి అరుణ్‌ను వెంట పెట్టుకుని పవన్‌కుమార్ కోసం వెతికారు. రాత్రి 10.30 గంటల సమయంలో నార్పలలోని వడ్డే తిమ్మన్న తోట సమీపంలో పవన్‌కుమార్ ఉన్నాడని తెలుసుకుని అక్కడికెళ్లారు. సాజిద్, సుధాకర్, అరుణ్ స్టీల్‌రాడ్డు, కర్రలతో పవన్ కుమార్‌ను అతి దారుణంగా కొట్టారు. ఆ దాడి దృశ్యాలను చిత్రీకరించాలని చిక్కేపల్లి నాగేంద్రకు సుధాకర్ సూచించాడు. "ఈ వీడియో చూసినవారు మనమంటే భయపడాలి.. సుధాకర్ అంటే ఒక బ్రాండ్" అని వ్యాఖ్యానిస్తూ దాడి కొనసాగించాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. పోలీసులు దాన్ని కోర్టు ఎదుట ప్రవేశపెట్టారు. కేసు విచారణ సమయంలో ప్రత్యక్ష సాక్షులు సాక్ష్యం చెప్పకపోయినా, ఈ వీడియో, అధికారులిచ్చిన నివేదికల ఆధారంగా నేరం రుజువైంది. ముద్దాయిలందరికీ కఠిన జీవిత ఖైదు విధిస్తూ జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున న్యాయవాది రాచమల్లు హరినాథ్‌రెడ్డి వాదనలు వినిపించారు.

16 లక్షలు పోశాం!

ఈ కేసులో రాజీ కుదుర్చుకునేందుకు న్యాయవాదుల సమక్షంలో డబ్బులిచ్చామని ముద్దాయిల తల్లిదండ్రులు ఆరోపించారు. ఐదుగురి తరఫున మొత్తం రూ.16 లక్షలు ఇచ్చామని తెలిపారు. కోర్టు తీర్పు వెలువడగానే ముద్దాయిల తల్లిదండ్రులు, బంధువులు బోరున విలపించారు. హతుడి కుటుంబ సభ్యులకు డబ్బులిచ్చినా రాజీ కుదరలేదని కన్నీటి పర్యంతమయ్యారు. హత్యకు గురైన పవన్‌కుమార్ గతంలో ఓ కానిస్టేబుల్‌ను పొడిచినా, మరిన్ని అరాచకాలు చేసినా కేసులు పెట్టలేదని అన్నారు. అలాంటి వాణ్ణి చంపిన తమ వారిని జైలుకు పంపుతున్నారని వాపోయారు.


చిత్రజ్యోతి
SINCE 1965

సర్కార్స్ లాగీ



'హిట్' సిరీస్‌లో మూడో భాగంగా రాబోతున్న 'హిట్.. ద థర్డ్ కేస్' చిత్రం టీజర్‌ను హీరో నాని పుట్టినరోజు సందర్భంగా సోమవారం విడుదల చేశారు. 'సర్కార్స్ లాగీ' పేరుతో వస్తున్న ఈ టీజర్ ఆకట్టుకుంటోంది. అర్జున్ సర్కార్‌గా నాని పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్‌తో కట్టి పడేశారు. ఆయన నటన సినిమాకు మరింత డెప్త్ యాడ్ చేసింది. దర్శకుడు శైలేష్ కొలను అద్భుతమైన కథనం, విజువల్స్‌తో ఆసక్తికరంగా రూపొందిస్తున్నారు. శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం మే ఒకటిన విడుదల కానుంది. సాను జాన్ వర్గీస్ సినిమాటోగ్రఫీని, మిక్కీ జె మేయర్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రాన్ని ప్రశాంతి తిపిర్నేని నిర్మిస్తున్నారు.

కొల్లగొట్టినాదిరో...



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'హరి హర వీరమల్లు'. జ్యోతికృష్ణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఏ.ఎం. రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఏ.దయాకర్‌రావు నిర్మిస్తున్నారు. మార్చి 28న సినిమా విడుదల కానుంది. ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన 'మాట వినాలి' గీతం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఇప్పుడు 'కొల్లగొట్టినాదిరో' అనే రెండో గీతాన్ని చిత్రబృందం విడుదల చేసింది. ఈ గీతం సినిమాపై అంచనాలను మరోస్థాయికి తీసుకెళ్లింది. పవన్ కల్యాణ్ స్క్రీన్ ప్రజెన్స్ లిరికల్ వీడియోలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పవన్ సరసన జంటగా నటించిన నిధి అగర్వాల్ పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చారు. అలాగే ఈ పాటలో అనసూయ భరద్వాజ్, పూజిత పొన్నాడ తమ నృత్యాలతో అదనపు ఆకర్షణగా నిలిచారు.



జయ ఇంటికెళ్లి రజనీ నివాళి



తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత 77వ జయంతిని పురస్కరించుకుని సోమవారం పోయెస్‌గార్డెన్‌లో వున్న ఆమె నివాసానికి వెళ్లిన తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్.. ఆమె చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించారు. జయ మేనకోడలు, మేనల్లుడితో కలిసి ఆయన పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం రజనీ మీడియాతో మాట్లాడుతూ... సినీ పరిశ్రమలో జయ బిజీగా వున్నప్పుడే ఆమెతో కలిసి నటించే అవకాశం వచ్చిందని పేర్కొన్నారు. తాను జయ ఇంటికి రావడం ఇది నాల్గోసారి అని గుర్తు చేసుకున్నారు. 1977లో జయతో కలిసి నటించే అవకాశం రాగా, దాని గురించి మాట్లాడేందుకు మొదటిసారిగా ఆమె నివాసానికి వచ్చానన్నారు. జయ భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆమె అందించిన సేవల్ని ప్రజలు ఎన్నటికీ మరిచిపోరని, ఆమె కీర్తిప్రతిష్ఠలు కలకాలం వర్ధిల్లాలని రజనీకాంత్ కొనియాడారు.


చెన్నై (ఆంధ్రజ్యోతి)

అందుకే ఆంగ్లంలో కూడా..



భారతీయ భాషలతో పాటు ఆంగ్లంలో కూడా సమాంతరంగా షూటింగ్ చేస్తున్న చిత్రం 'టాక్సిక్.' ఇలా ఆంగ్లంలో చిత్రీకరిస్తున్న తొలి భారతీయ చిత్రం ఇదే కావడం విశేషం. కన్నడ చిత్ర కథానాయకుడు యశ్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాకు గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'విభిన్న భాషా, సాంస్కృతిక నేపథ్యాలతో వస్తున్న మా చిత్రాన్ని అన్ని భాషలు, ప్రాంతాల ప్రేక్షకులు ఆస్వాదించేలా రూపొందిస్తున్నాం. అన్ని సరిహద్దుల్ని 'టాక్సిక్ చెరిపేస్తుందని భావిస్తున్నాం' అన్నారు. 'టాక్సిక్' చిత్రం షూటింగ్ గత ఏడాది ఆగస్టులో మొదలైంది. ఇప్పటివరకూ ఇండియన్ హిస్టరీలోనే అత్యంత భారీ ఖర్చుతో నిర్మించిన చిత్రాల్లో ఇది ఒకటిగా నిలుస్తుంది. హాలీవుడ్ టెక్నీషియన్లు ఈ సినిమాకు పని చేస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత వెంకట్ కె నారాయణ మాట్లాడుతూ 'మా లక్ష్యం చాలా స్పష్టంగా ఉంది. భారతదేశం మాత్రమే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ప్రతిధ్వనించే చిత్రంగా 'టాక్సిక్‌ను రూపొందిస్తున్నాం' అన్నారు.

సప్తగిరి వినోదాల విందు



అల్లరి నరేశ్ హీరోగా 17 ఏళ్ల క్రితం 'పెళ్లి కాని ప్రసాద్' పేరుతో ఓ సినిమా వచ్చి, ప్రేక్షకుల్ని అలరించింది. ఇప్పుడు అదే టైటిల్‌తో మరో సినిమా రూపుదిద్దుకుంటోంది. ఇందులో హాస్య నటుడు సప్తగిరి హీరో కావడం విశేషం. ప్రియాంక శర్మ హీరోయిన్. వినోదభరితంగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి అభిలాష్ రెడ్డి గోపిడి దర్శకుడు. టైటిల్, ఫస్ట్ లుక్ సహా కొన్ని ఆసక్తికరమైన అంశాలను సోమవారం విడుదల చేశారు. సినిమాను మార్చి 21న దిల్ రాజు విడుదల చేస్తున్నారు. కేవై బాబు, భానుప్రకాశ్ గౌడ్, వెంకటేశ్వర గౌడ్, వైభవ్ రెడ్డి ముత్యాల ఈ సినిమాను నిర్మించారు.

బాగుంటే బ్లాక్ బస్టర్ అవుతుంది



అనిల్ బురగాని, ఆర్.జ్వలిత జంటగా శ్రీనివాస్ మల్లం దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ప్రేమకు జై'. ఈశ్వర పరమేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై అనసూర్య నిర్మించారు. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకను హైదరాబాద్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన దర్శక నిర్మాత సాయి వెంకట్ మాట్లాడుతూ 'చిన్న బడ్జెట్ సినిమానా?పెద్ద బడ్జెట్ సినిమానా? అని ప్రేక్షకులు చూడరు. బాగుంటే ఏ సినిమానైనా బ్లాక్ బస్టర్ చేస్తారు' అని అన్నారు. చిత్ర దర్శకుడు శ్రీనివాస్ మల్లం మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో చోటు చేసుకున్న ఒక యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం' అని అన్నారు.

ఛావా.. రూ. వంద కోట్ల దావా... క్షమాపణ




విక్కీ కౌశల్ నటించిన చారిత్రక చిత్రం 'ఛావా' తిరుగులేని వసూళ్లతో దూసుకుపోతోంది. ఇప్పటికే రూ. 300 కోట్లు కలెక్ట్ చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ కూడా 'ఛావా'కు ప్రశంసలందించారు. అయితే ఈ సినిమాపై ఇప్పుడు ఓ కొత్త వివాదం మొదలైంది. చిత్రంలో గానోజీ, కన్హోజీ షిర్కే పాత్రల్ని వక్రీకరించారంటూ వారి వంశస్థులు మండి పడుతున్నారు. తమ వంశానికి అపకీర్తి తెచ్చిన సినిమా ఇదంటూ రూ. వంద కోట్ల దావా వెయ్యడానికి సిద్ధమయ్యారు. షిర్కే వంశానికి చెందిన 13వ తరం వారసుడు లక్ష్మీకాంత్ రాజే షిర్కే 'ఛావా' చిత్రం తమ వంశ ప్రతిష్ఠను మంట కలిపిందనీ, అసత్యాలు, అభూత కల్పనలు చోటు చేసుకున్నాయనీ విమర్శిస్తూ దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్‌కు ఓ లేఖ రాశారు. రూ.వంద కోట్లకు పరువు నష్టం దావా కూడా వేస్తున్నట్టు పేర్కొన్నారు. అది తెలియగానే దర్శకుడు ఉటేకర్ షిర్కే కుటుంబానికి క్షమాపణలు చెప్పారు. ఆ వంశస్థుడు భూషణ్ షిర్కేను కలసి 'మా సినిమాలో గానోజీ, కన్హోజీ పేర్లను మాత్రం పేర్కొన్నాం. వారి ఇంటి పేర్లు, గ్రామాల ప్రస్తావన ఇందులో లేదు. షిర్కే వంశస్థుల మనోభావాలను దెబ్బ తీయడం మా ఉద్దేశం కాదు' అని చెప్పారు.

ఇక నుంచి ఇలాంటి సినిమాలే చేస్తా

- నిర్మాత రాజేశ్



"మజాకా' మంచి ఎంటర్‌టైనర్. ఫ్యామిలీ సినిమా. ఇకపై కూడా ఇలాంటి ఎంటర్‌టైన్‌మెంట్ ఉన్న సినిమాలనే చేస్తాను' అని అన్నారు నిర్మాత రాజేశ్ దండా. సందీప్ కిషన్, రీతూ వర్మ, అన్షు ప్రధాన పాత్రల్లో త్రినాధ్ రావు దర్శకత్వంలో రాజేశ్ దండా నిర్మించిన చిత్రం 'మజాకా'. ఈనెల 26న విడుదలవుతున్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 'ట్రైలర్ కంటే ముందు 'సొమ్మసిల్లి' అనే పాటను రిలీజ్ చేశాం. అది టాప్ ట్రెండింగ్‌లో ఉంది. ఇది కచ్చితంగా చాలా మంచి సినిమా అవుతుంది. ఇంటర్వెల్‌కి మంచి ట్విస్ట్ ఉంటుంది. సందీప్, రీతూ లవ్ స్టోరీ, అలాగే రావు రమేశ్, అన్షు ట్రాక్ కూడా బావుంటుంది. సందీప్‌కి 'భైరవకోన' కంటే బెటర్ సినిమా అవుతుంది. దీనికి సీక్వెల్ చేయాలనే ఆలోచన ఉంది. అందుకే సినిమా ముగింపులో 'డబుల్ మజాకా' అనే టైటిల్ వేశాం' అని అన్నారు.





అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను సభలోకి తోడ్కొని వస్తున్న సభా నాయకుడు చంద్రబాబు, స్పీకర్ అయ్యన్న పాత్రుడు, శాసన మండలి చైర్మన్ మోషేన్ రాజు

అనర్హత తప్పించుకోవడానికే సభకు జగన్

» చట్ట సభల్ని కించపరిచారు: టీడీపీ ప్రజాప్రతినిధుల విమర్శ



అమరావతి, పులివెందుల టౌన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాలకు జగన్‌తో సహా వైసీపీ ఎమ్మెల్యేలు అందరూ అలా వచ్చి ఇలా వెళ్లడాన్ని టీడీపీ నేతలు పలువురు తప్పు పట్టారు. కేవలం శాసన సభ సభ్యత్వాన్ని కాపాడుకోవడానికే సభకు వచ్చారంటూ విరుచుకుపడ్డారు. సోమవారం అసెంబ్లీ వద్ద పలువురు విలేకరులతో మాట్లాడారు. కొద్ది మంది ప్రకటనల రూపంలో స్పందించారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ, 'జగన్‌రెడ్డికి కావాల్సింది ప్రతిపక్ష హోదానే కానీ ప్రజా సమస్యలు కాదు. తన ఎమ్మెల్యే హోదాని రక్షించుకోవడానికే జగన్ సభకు వచ్చారు' అంటూ విమర్శించారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, 'ప్రజలు ఇచ్చిన తీర్పును జగన్‌రెడ్డి అవమానిస్తున్నారు. ప్రతిపక్ష హోదా అడగడానికి మాత్రమే అసెంబ్లీకి రావడం చట్టసభల్ని కించపర్చడమే' అంటూ మండిపడ్డారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, 'అసెంబ్లీకి రాను, ప్రజా సమస్యలపై పోరాడను అనే నాయకుడు జగన్ తప్ప... చరిత్రలో ఎవ్వరూ లేరు. అసెంబ్లీ వేదికగా ప్రజలకు అబద్ధాలు, అసత్యాలు చెప్పాలని చూస్తున్నారు' అని మండిపడ్డారు. మంత్రి సవిత మాట్లాడుతూ... 'ప్రజా సమస్యలపై చర్చించడానికి జగన్ అసెంబ్లీకి రావాలి. పులివెందుల ఎమ్మెల్యేగా ఆయనకు తగిన సమయం ఇచ్చి, మైకు ఇస్తాం. పులివెందుల ప్రజల సమస్యలపై చర్చకైనా ఆయన రావాలి. సబ్జెక్ట్ పరంగా వైసీపీతో చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. జగన్‌కు లండన్ మెడిసిన్ సరిగ్గా పని చేయడం లేదు. ఎన్నికల కోడ్ సమయంలో మిర్చి యార్డులో రాజకీయాలు మాట్లాడకూడదన్న విషయం కూడా జగన్‌కు తెలియదా?' అని ప్రశ్నించారు. మంత్రి పార్థసారథి మాట్లాడుతూ... 'ప్రతిపక్ష హోదా అనేది ఒక పార్టీనో, వ్యక్తో నిర్ణయించేది కాదనే విషయం ఇన్ని రాజకీయాలు చేస్తున్న జగన్‌కు, వైసీపీ సీనియర్లకు తెలియకపోవడం విచిత్రంగా ఉంది. గతంలో కమ్యూనిస్టులు, బీజేపీ, ఇతర పార్టీలు... ఇద్దరు, ముగ్గురున్నా అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా కోసం కాకుండా, ప్రజాసమస్యలపై పోరాడే వారు' అని అన్నారు. టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ, 'జగన్‌కు ప్రతిపక్ష హోదా కోసం చట్టం మార్చాలా? లేక ప్రత్యేక చట్టం ఏమైనా తేవాలా?' అంటూ ఎద్దేవా చేశారు.

సంతకం కోసమే అసెంబ్లీకి: బీటెక్ రవి



పులివెందుల టీడీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి మాట్లాడుతూ, వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి కేవలం సంతకం చేయడానికి మాత్రమే అసెంబ్లీకి వెళ్లారు. వైఎస్ జగన్ అవగాహన లోపం వల్ల రూ.వేల కోట్లు ఖర్చు చేసినా పులివెందుల ప్రాంతంలో తాగు నీరు, రోడ్ల సమస్యలు న్నాయి. అవి చర్చించేందుకు అసెంబ్లీకి వస్తారని ఆశించా. కానీ ఏదో లోటస్ పాండ్‌కు వచ్చినట్లుగా అసెంబ్లీకి వచ్చి అరగంటలోనే ప్రతిపక్ష హోదా డ్రామాతో వెళ్లిపోయారు. రాజ్యాంగంలోని విధి విధానాల ప్రకారమే ప్రతిపక్ష హోదా లభిస్తుంది. నీ కోసం రాజ్యాంగం మార్చాలా?' అని ప్రశ్నించారు. అధికారం పోవడంతో ఎంపీ అవినాశ్‌రెడ్డికి మతిభ్రమించింది. ఆయన... సునీత, షర్మిల ఫొటోలు పెట్టుకుని పూజించాలి. వారు లేకుంటే ఓడిపోయే వారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో మున్సిపాలిటీని టీడీపీ కైవసం చేసుకోవడం తథ్యం. అప్పుడు మీకు ప్రజా వ్యతిరేకత అర్థమవుతుంది' అని అన్నారు.

దుష్పరిపాలన నుంచి విముక్తి



ఉభయ సభల సంయుక్త సమావేశంలో ప్రసంగిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

ఆత్మగౌరవం, ఆర్థిక స్థిరత్వం లక్ష్యంగా..

"ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త అనే విధానాన్ని ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. ఆత్మగౌరవం, ఆర్థిక స్థిరత్వం రెండింటినీ కుల వృత్తులు సాధించుకునేందుకు ఊతం ఇస్తున్నాం. గీత కులాల వారి కోసం 10 శాతం మద్యం దుకాణాలను రిజర్వు చేశాం. వారికి రాయితీలు ఇస్తున్నాం. ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని పోలవరానికి అనుసంధానం చేస్తున్నాం. పోలవరం నిర్మాణం 73 శాతం పూర్తయింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే 28.50 లక్షల మందికి లబ్ధి చేకూరుతుంది. 540 గ్రామాలకు తాగునీరు అందుతుంది. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు ప్రభుత్వం రూపకల్పన చేసింది. రాయలసీమను ఈ ప్రాజెక్టు నీటి సురక్షిత ప్రాంతంగా మారుస్తుంది. అమృత్, జల్‌జీవన్ మిషన్ అమలు గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయింది. కొత్త ప్రభుత్వం తిరిగి వాటిని పునరుద్ధరించింది."

(మొదటి పేజీ తరువాయి)


ప్రసంగించారు. గత ప్రభుత్వం నిలిపివేసిన 93 కేంద్ర ప్రాయోజిత పథకాల్లో 74 పథకాలను పునరుద్ధరించి, రూ.9,371కోట్ల అప్పులు తీర్చామని తెలిపారు. నీటి పారుదల, రోడ్లు, ఇతర పనులకు సంబంధించి రూ.10,125 కోట్ల విలువైన బిల్లులు క్లియర్ చేశామన్నారు. తద్వారా రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు తిరిగి పుంజుకోవడానికీ బ్రాండ్ ఏపీపై విశ్వాసం పునరుద్ధరణకూ వీలు ఏర్పడిందని గవర్నర్ తెలిపారు. పోలవరం నీటి పారుదల ప్రాజెక్టు, అమరావతి రాజధాని ప్రాజెక్టు తిరిగి పట్టాలెక్కాయనీ, విశాఖ ఉక్కు కర్మాగారానికి పునరుజ్జీవం, కొత్త రైల్వే జోన్ వంటి ఎన్నికలను నెరవేర్చామని పేర్కొన్నారు. సుస్థిర వృద్ధి, శ్రేయస్సుకు దోహదపడే 22 కొత్త విధానాలను ప్రారంభించడం ద్వారా ఏపీ ఆర్థికాభివృద్ధికి బలమైన పునాది వేశామన్నారు. ప్రభుత్వ ప్రయత్నాలు మంచి ఫలితాలు ఇస్తుండటం గర్వంగా ఉన్నదని చెప్పారు. భారీ పెట్టుబడుల కోసం గూగుల్, ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ కంపెనీ, టాటా పవర్, గ్రీన్‌కో గ్రూప్, బీపీసీఎల్, టీసీఎస్ వంటి అనేక అంతర్జాతీయ దిగ్గజాలను ఆకర్షిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు రూ.6.5 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టారని, నాలుగు లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించడమైందన్నారు. ఏ సమాజమైనా సుభిక్షంగా ఉండాలంటే సంక్షేమం, అభివృద్ధి కలిసికట్టుగా సాగాలనీ, అవి ఒకే నాణేనికి రెండు పార్శ్వాలని వ్యాఖ్యానించారు. స్వయం సహాయక బృందాల ద్వారా మహిళా సాధికారత సాధించడంలో ముఖ్యమంత్రి మార్గదర్శిగా నిలిచారని కొనియాడారు. "ఎవరికైనా చేపను ఇస్తే అది అతని ఆకలిని ఒక్క రోజు మాత్రమే తీర్చగలదు. అదేగనుక మనిషికి చేపలు పట్టడం నేర్పితే జీవితాంతం తిండి లభిస్తుందనే సూక్తిని ముఖ్యమంత్రి చంద్రబాబు అనుసరిస్తున్నారు." అని గవర్నర్ తెలిపారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

త్వరలోనే 'తల్లికి వందనం'

'ఏపీ గణనీయమైన జనాభా పరివర్తనలకు లోనవుతోంది. సంతాన సాఫల్య రేటులో తీవ్రమైన క్షీణత ఉంది. వృద్ధాప్య జనాభా వేగంగా పెరుగుతోంది. సంప్రదాయ ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోతున్నాయి. అందువల్ల డెమోగ్రాఫిక్ మేనేజ్‌మెంట్‌పై పాలసీని తీసుకొచ్చాం. పిల్లల చదువులు కుటుంబానికి భారంగా మారకుండా తల్లులకు ఆర్థిక చేయూత నిస్తూ 'తల్లికి వందనం' పథకం అమలు చేయనున్నాం."

ప్రపంచ ఉత్తమ వ్యూహరచనలు...

"మెగా పోర్టులు, అంతర్జాతీయ విమానాశ్రయాలు, మల్టీమోడల్ రవాణా కేంద్రాలను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. అవి మన రాష్ట్రాన్ని ప్రపంచ మార్కెట్లతో అనుసంధానించే కొత్త వాణిజ్య కారిడార్లను ఏర్పాటు చేస్తాయి. గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిన రహదారుల స్థితిని మార్చడానికి ప్రారంభించిన 'మిషన్ పాట్‌హోల్ ఫ్రీ ఆంధ్రా' కార్యక్రమం అద్భుతమైన పురోగతి సాధించింది. 20,059 కిమీలకు గాను మూడునెలల్లోనే 17,605 కిమీ పరిధిలో పనులు పూర్తిచేశాం. జిల్లా ప్రధాన కేంద్రం నుంచి మండల కేంద్రం వరకు, ఆనుకుని ఉన్న మండల కేంద్రాల మధ్య డబుల్-లేన్ కనెక్టివిటీని ప్రభుత్వం చేపడుతోంది. 2025-26లో విద్యుత్ చార్జీలు పెంచరాదని నిర్ణయించాం. క్లీన్ ఎనర్జీ లభ్యతను క్రమబద్ధీకరిస్తూ రాష్ట్రంలోని సుమారు 20 లక్షల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా రూఫ్‌టాప్ సోలార్‌ను 'పీఎం సూర్య ఘర్', 'ముఫ్త్ బిజ్లీ యోజన' కింద చేపడుతున్నాం. గత ప్రభుత్వం రెవెన్యూ పరిపాలనకు నిర్లక్ష్యం చేసింది. దీనిని సరిదిద్దడంలో భాగంగా భూదురాక్రమణ నిరోధక చట్టాన్ని తీసుకొచ్చాం. రెవెన్యూ సదస్సుల ద్వారా పాలనను నేరుగా ప్రజల ముంగిటకు చేర్చాం."



గవర్నర్ ప్రసంగ ప్రతులను ఆసక్తిగా పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

కందుకూరి స్ఫూర్తితోనే స్వర్ణాంధ్ర డాక్యుమెంట్

"అవకాశాలొస్తే ప్రతి మనిషిలోని మేటి నైపుణ్యం వెలుగొందుతుంది" అని మహా సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు అన్నారు. కందుకూరి స్ఫూర్తితోనే ప్రభుత్వం స్వర్ణాంధ్ర 2047 డాక్యుమెంట్‌ను రూపొందించాం. ఆంధ్రప్రదేశ్ బలం....దాని విధానాలు, ప్రాజెక్టులలో మాత్రమే కనిపించదు. అది ప్రజల సమైక్యత, దృఢ సంకల్పం, ఆవిష్కరణ స్ఫూర్తిలో ఉంది. మన ముందున్న మార్గం బోలెడు అవకాశాలతో నిండి ఉంది. దానిని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత మనలో ప్రతి ఒక్కరిపైనా ఉంది."

ఇదీ స్వర్ణాంధ్ర లక్ష్యం..

"వ్యక్తులకు, కుటుంబాలకు సాధికారత కల్పించి రాబోయే కొన్నేళ్లలోనే పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించడం స్వర్ణాంధ్ర 2047 లక్ష్యం. ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటి వద్దకే పింఛన్లు అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పథకం..దేశంలోనే అతిపెద్ద సంక్షేమ కార్యక్రమం. నిరుపేదలకు ఆహారభద్రతను కల్పించేందుకు రూ.5కే అన్న క్యాంటీన్లు నడుస్తున్నాయి. ఎస్టీల సమగ్ర సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కట్టుబడి ప్రభుత్వం పని చేస్తోంది. దీనికోసం ఐటీడీఏ ప్రాంతాల్లో గిరిజనుల విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు, జీవనోపాధులు, నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి వంటి రంగాల్లో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నాం. సమాజానికి వెన్నెముక వంటి బీసీల సామాజిక, రాజకీయ సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. బీసీల ఆదాయం పెంచడానికి రూ.896 కోట్లు పలు కార్పొరేషన్ల ద్వారా అందించాం. రాష్ట్ర శాసనసభలో 33 శాతం బీసీ రిజర్వేషన్ల వర్తింపునకు తీర్మానం చేసి కేంద్రానికి పంపాం. ఆలయ అర్చకుల గౌరవవేతనాన్ని రూ.15 వేలకు, నాయీ బ్రాహ్మణుల గౌరవవేతనాన్ని రూ.25 వేలకు పెంచాం. మహిళా సంక్షేమం కోసం ప్రభుత్వం దీపం-2 పథకం కింద సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందిస్తోంది."

60 డేస్.. టెన్షన్...!

(మొదటి పేజీ తరువాయి)

చేసిన రోజును శాసనసభ కార్యకలాపాల్లో భాగంగా గుర్తించరు. అంటే, సోమవారం వైసీపీ సభ్యులు సభకు వచ్చినా, రానట్టే! మరో విషయం ఏమిటంటే... వైసీపీ ఎమ్మెల్యేలకు '60 రోజుల గండం' ముంచుకొచ్చేందుకు ఇంకా చాలా సమయముంది. ప్రస్తుత శాసనసభ సమావేశాల పనిదినాలను కలిపినా... ఈ ప్రభుత్వంలో ఇప్పటి దాకా 43 రోజులు మాత్రమే అసెంబ్లీ జరిగినట్లు! అంటే, జగన్‌కు ఇంకో 17 రోజుల గడువు ఉంది. కానీ... తెలిసో, తెలియకో సోమవారం వైసీపీ సభ్యులు 'హాజరు' కోసం సభకు వెళ్లొచ్చారు.

అరవై రోజుల లెక్కేమిటి?

రాజ్యాంగంలోని ఆర్టికల్ 190(4) ప్రకారం.. ఒక ఎమ్మెల్యే 60 రోజుల పాటు అసెంబ్లీకి గైర్హాజరైతే ఆ స్థానాన్ని ఖాళీగా ప్రకటించే అధికారం స్పీకర్‌కు ఉంది. అయితే... అసెంబ్లీ ప్రోరోగ్ అయినా, సమావేశాలు జరుగుతున్నప్పుడు 4 రోజులకన్నా ఎక్కువ సెలవులు వచ్చినా వాటిని ఈ 60 రోజుల్లో కలపరు. కూటమి ప్రభుత్వం వచ్చాక అసెంబ్లీ తొలి సెషన్ 2024 జూన్ 21, 22న జరిగింది. ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారాలకే సరిపోయింది. తొలి సెషన్‌లో భాగంగానే 2024 జూలై 22 నుంచి జూలై 26 వరకు ఐదు రోజులు సభ జరిగింది. రెండో సెషన్ 2024 నవంబరు 11 నుంచి 22 వరకు జరిగింది. తాజాగా మూడో సెషన్ సోమవారం ప్రారంభమైంది. మార్చి 21 వరకు జరగనుంది. ప్రమాణ స్వీకార రోజులను మినహాయించి మూడు సెషన్ల సమయాన్ని పరిగణనలోకి తీసుకుంటే... అసెంబ్లీ సమావేశాలు 43 రోజులపాటు జరిగినట్లు! అంటే జగన్‌కు ఇంకా 17 రోజుల సమయం ఉంది. '60 రోజుల హాజరు' అంశం పదేపదే తెరపైకి రావడంతో ఎక్కడ అనర్హత వేటు పడుతుందో అనే భయంతో జగన్ సోమవారం అసెంబ్లీకి వచ్చారనే ప్రచారం జరుగుతోంది. అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం పెట్టగానే వచ్చిన పని పూర్తయినట్లు భావించిన వైసీపీ సభ్యులు... పట్టుమని పది నిమిషాలు కూడా అసెంబ్లీలో ఉండకుండా వెనుదిరిగారు. ఇక్కడే ఓ తిరకాసు వచ్చింది. గవర్నర్ ప్రసంగం రోజును వర్కింగ్ డేగా పరిగణించరని అసెంబ్లీ అధికారులు చెబుతున్నారు. స్పీకర్ అధ్యక్షతన జరిగితేనే వర్కింగ్ డే అవుతుందని.. గవర్నర్ ప్రసంగం అసెంబ్లీ సమావేశాల ప్రారంభానికి ముందు జరిగే లాంఛనమేనని స్పష్టం చేశారు. ఈ లెక్కన జగన్‌పై 60 రోజుల నిబంధన కత్తి వేలాడుతూనే ఉంది. అనర్హత వేటు తప్పించుకోవాలంటే ఈ సెషన్‌లో కానీ, వచ్చే శీతాకాల సమావేశాల్లో కానీ మరోసారి అసెంబ్లీ గడప తొక్కాల్సిందే!

ప్రజా సమస్యలు పట్టవా?

జగన్ కేవలం అనర్హత వేటు తప్పించుకునేందుకే అసెంబ్లీకి రావడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. "ప్రధాన ప్రతిపక్షనేత పదవీ.. దాని ద్వారా సంక్రమించే విశేష అధికారాలే జగన్‌కు ముఖ్యమా? ప్రజా సమస్యలు పట్టవా?" అని జనం మండిపడుతున్నారు. 'ప్రతిపక్ష నేత హోదా ఇస్తేనే సభకు వస్తా! అప్పుడు మాత్రమే ముఖ్యమంత్రితో సమానంగా శాసనసభలో మాట్లాడే అవకాశం దక్కుతుంది' అని చెబుతూ వచ్చిన జగన్ సోమవారం బేషరతుగా అసెంబ్లీకి రావడం గమనార్హం. సభలోకి అడుగుపెట్టిన క్షణం నుంచి జగన్ అసహనంగా కనిపించారు. పోడియం వద్దకు వెళ్లాలంటూ.. అసహనంతో చేతులు ఊపుతూ వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఎగదోశారు. గవర్నర్ ప్రసంగం ప్రారంభం కావడమే ఆలస్యమన్నట్లుగా... జగన్‌లేచి నిలబడి, సభలో ఆందోళనకు దిగాలంటూ తమ నేతలను ఆదేశించారు.

సమస్యల ప్రస్తావనకు సంఖ్యతో పనేంటి?

సభలో ప్రజా సమస్యల ప్రస్తావనకు... పార్టీకి ఉన్న సభ్యులకూ సంబంధం లేదని గతంలో అనేక సందర్భాల్లో రుజువైంది. ఒకప్పుడు లోక్‌సభలో బీజేపీకి ఇద్దరంటే ఇద్దరే సభ్యులు ఉండేవారు. వారిద్దరూ లోక్‌సభకు క్రమం తప్పకుండా హాజరవుతూ... తమకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజా సమస్యలను ప్రస్తావించారు. అదేవిధంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వామపక్షానికి చెందిన ఎమ్మెల్యేలు తమ సంఖ్యతో సంబంధం లేకుండా అధికారపక్షాన్ని గట్టిగా నిలదీసేవారు. జగన్ మాత్రం తాను ప్రజా సమస్యలపై మాట్లాడాలంటే.. ప్రతిపక్షనేత హోదా కావాల్సిందేనని పట్టుబడుతుండటం గమనార్హం!

జనం ఛీ కొడుతున్నా తీరు మార్చుకోని జగన్

» 11 మంది ఎమ్మెల్యేలతో 11 నిమిషాలు ఉండటానికా సభకు వచ్చింది?: షర్మిల



అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): 'జనాలు ఛీ కొడుతున్నా వైసీపీ అధ్యక్షుడు జగన్ తీరు మాత్రం మారలేదు. 11 మంది ఎమ్మెల్యేలతో కలిసి 11 నిమిషాలు ఉండటానికా అసెంబ్లీకి వచ్చింది?' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. సోమవారం ఆమె ఎక్స్‌లో స్పందించారు. 'ప్రజా సమస్యల కన్నా మీకు ప్రతిపక్ష హోదానే ముఖ్యమా? సభ్యత్వాలు రద్దవుతాయనే భయంతో హాజరు కోసం వచ్చారా? కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించడానికి మీకు ప్రతిపక్ష హోదానే కావాలా? ప్రజల శ్రేయస్సు కంటే మీకు పదవులే ముఖ్యమని అసెంబ్లీ సాక్షిగా నిరూపించుకున్నారు. సభకు వెళ్లే దమ్ము లేకపోతే తక్షణం పదవులకు రాజీనామా చేయాలని మరోసారి డిమాండ్ చేస్తున్నాం' అని అన్నారు. సోమవారం శాసనసభలో గవర్నర్ చేసిన ప్రసంగంలో కొత్తదనమేదీ లేదని షర్మిలరెడ్డి పెదవి విరిచారు. బడ్జెట్ ప్రసంగంలో గవర్నర్ అర్ధ సత్యాలు చెప్పారన్నారు. సూపర్ సిక్స్ హామీలపై కూటమి ప్రభుత్వం స్పష్టతను ఇవ్వలేదన్నారు.

మార్చి 21 వరకు సభ

నేడు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై చర్చ

» సాయంత్రం 4 గంటలకు చంద్రబాబు సమాధానం
» రేపు, ఎల్లుండి సెలవులు.. 28న రాష్ట్ర బడ్జెట్
» 3 నుంచి కేటాయింపులపై చర్చ
» మొత్తం 15 పనిదినాల్లో సమావేశాలు
» ఇతర రాష్ట్రాల కొత్త అసెంబ్లీ భవనాల పరిశీలన కోసం కమిటీ ఏర్పాటు
» ఎమ్మెల్యేల సాంస్కృతిక కార్యక్రమాల పునరుద్ధరణ
» స్పీకర్ అధ్యక్షతన బీఏసీలో నిర్ణయం.. భేటీకి జగన్ గైర్హాజరు
» వ్యక్తుల కన్నా వ్యవస్థ ముఖ్యం
» ప్రతిపక్ష హోదా డిమాండ్‌పై సీఎం వ్యాఖ్య



బీఏసీ భేటీలో సీఎం చంద్రబాబు, స్పీకర్ అయ్యన్న పాత్రుడు, మంత్రులు పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, బీజేపీ పక్ష నేత విష్ణుకుమార్‌రాజు

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను మార్చి 21 వరకు నిర్వహించాలని సభావ్యవహారాల సలహా సంఘం (బీఏసీ) నిర్ణయించింది. సోమవారం ఉభయసభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగించిన తర్వాత.. స్పీకర్ అయ్యన్నపాత్రుడి అధ్యక్షతన బీఏసీ సమావేశం జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, జనసేన తరఫున మంత్రి నాదెండ్ల మనోహర్, బీజేపీ తరఫున విష్ణుకుమార్‌రాజు పాల్గొన్నారు. వైసీపీ నుంచి మాజీ సీఎం జగన్ హాజరు కావలసి ఉన్నా ఆయన రాలేదు. అసెంబ్లీ సమావేశాలను మొత్తం 15 పని దినాలు నిర్వహించాలని బీఏసీ భేటీలో ఖరారుచేశారు. మంగళవారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగుతుంది. సాయంత్రం 4 గంటలకు సీఎం సమాధానం ఇస్తారు. మహాశివరాత్రి సందర్భంగా 26న సెలవు. ఎమ్మెల్సీ పోలింగ్ సందర్భంగా 27న కూడా సభ ఉండదు. 28వ తేదీన 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి పయ్యావుల ప్రవేశపెడతారు. మార్చి 1, 2 శని, ఆదివారాలు కావడంతో సెలవులు ఇచ్చారు. 3 నుంచి బడ్జెట్ కేటాయింపులపై సాధారణ చర్చ జరుగుతుంది. 19వ తేదీతో బడ్జెట్ ప్రక్రియ ముగుస్తుంది. మార్చి 20, 21లను రిజర్వ్‌డేలుగా ఉంచారు. కాగా.. బీఏసీలో పలు అంశాలపై చర్చించారు. సభ్యులందరూ వారికి కేటాయించిన అంశాలపై సమగ్ర అవగాహనతో మాట్లాడేలా చూడాలని, సభ్యులందరికీ నియోజకవర్గ సమస్యలపై మాట్లాడేందుకు తగిన సమయం ఇవ్వాలని సీఎం సూచించారు. అసెంబ్లీ నూతన భవన నిర్మాణంపైనా చర్చించారు. ఈ భవనాన్ని అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించాలని, ఇతర రాష్ట్రాల్లో కొత్తగా కట్టిన అసెంబ్లీ భవనాలను పరిశీలించాలని నిర్ణయించారు. దీనికోసం ఓ కమిటీని ఏర్పాటు చేస్తారు. ప్రజాప్రతినిధులకు నిర్వహించతలపెట్టిన శిక్షణ తరగతులను ఈ సమావేశాల్లో నిర్వహించే అవకాశం లేదని బీఏసీ అభిప్రాయపడింది. గతంలో ఉభయసభల సభ్యులకు సాంస్కృతిక కార్యక్రమాలను పునరుద్ధరించాలని నిర్ణయించింది.

వ్యక్తిగత డిమాండ్లకు నో

జగన్ ప్రతిపక్ష హోదా డిమాండ్‌పై కూడా చర్చ జరిగింది. రాజ్యాంగబద్ధంగా సభ్యులు ఏమడిగినా ఇవ్వడానికి, చెప్పడానికి అభ్యంతరం లేదని, కానీ వ్యవస్థను కాదని వ్యక్తిగత డిమాండ్లను తెస్తే పరిగణనలోకి తీసుకోవలసిన అవసరం లేదని సమావేశం అభిప్రాయపడింది. వ్యక్తుల కన్నా వ్యవస్థకు ప్రాధాన్యం ఇవ్వాలన్నది తన అభిమతమని చంద్రబాబు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

వచ్చారు.. అరిచారు.. వెళ్లారు..



గవర్నర్ ప్రసంగిస్తున్న సమయంలో పోడియంను చుట్టుముట్టి నిరసన తెలుపుతున్న వైసీపీ సభ్యులు

బడ్జెట్ తొలిరోజు సభలో వైసీపీ వింతధోరణి


» జగన్ సహా 11మంది ఎమ్మెల్యేలు హాజరు
» ప్రతిపక్షంగా గుర్తించాలంటూ నినాదాలు
» జగన్ సైగలతో పోడియం ముందుకు...
» గవర్నర్ ప్రసంగం మొదలైన తొమ్మిదో నిమిషమే సభ నుంచి వాకౌట్

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ సహా 11 మంది వైసీపీ ఎమ్మెల్యేలు బడ్జెట్ సమావేశాల తొలిరోజు పట్టుమని 11 నిమిషాలు కూడా గవర్నర్ ప్రసంగం ఆలకించలేదు. గైర్హాజరైతే అనర్హత వేటు పడుతుందన్న భయంతోనే సభకు వచ్చారా అన్నట్టు.. గవర్నర్ తన ప్రసంగం మొదలుపెట్టిన తొమ్మిదో నిమిషమే వారంతా వాకౌట్ చేశారు. గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ రావడానికి రెండు నిమిషాల ముందు జగన్, వైసీపీ ఎమ్మెల్యేలు సభలోకి వచ్చారు. గవర్నర్ 10.01 గంటలకు ప్రసంగం ప్రారంభించారు. ప్రసంగం ప్రారంభంలో నారా చంద్రబాబు నాయుడు అని పలకాల్సి ఉండగా, నరేంద్ర చంద్రబాబునాయుడు అని పొరపాటున ఆయన పలికారు. దీనిపై వైసీపీ సభ్యులు వ్యాఖ్యలు చేశారు. నరేంద్ర మోదీ లేకపోతే గెలిచేవారు కాదంటూ చంద్రబాబును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. జగన్ సైగ చేయడంతో వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పోడియం ముందుకు ప్లకార్డులతో దూసుకెళ్లారు. మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, జగన్ తప్ప మిగిలిన సభ్యులందరూ పోడియం ముందుకెళ్లి....'ప్రతిపక్షాన్ని గుర్తించండి. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అంటూ నినాదాలిచ్చారు. టీడీపీ సభ్యులు కూడా..గుర్తింపు కోసం అడుక్కోవద్దంటూ ప్రతిగా నినాదాలు చేశారు. 10.09 నిమిషాలకు జగన్ మళ్లీ సైగ చేయడంతో అక్కడ నుంచి అందరూ వాకౌట్ చేశారు. వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పార్టీ కండువా వేసుకుని రాగా, జగన్ మాత్రం కండువా లేకుండా కనిపించారు. సీనియర్ వైసీపీ నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు చేతికర్ర ఆసరాతో పోడియం వద్దకు వచ్చి నిలబడ్డారు. 10.01 గంటలకు ప్రసంగం ప్రారంభించిన గవర్నర్.. 38 పేజీల బడ్జెట్ పుస్తకాన్ని చదవడం 11.08 గంటలకు ముగించారు.



వైసీపీ తీరు దారుణం: విష్ణుకుమార్‌రాజు

అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో తొలి రోజు వైసీపీ సభ్యులు ప్రవర్తించిన తీరు దారుణంగా ఉందని బీజేపీ శాసన సభాపక్ష నేత విష్ణుకుమార్‌రాజు అన్నారు. గవర్నర్ ప్రసంగిస్తున్నప్పుడు పేపర్లు చించి, స్పీకర్, మండలి చైర్మన్‌పై విసిరేయడం బాధాకరం. బడ్జెట్ ప్రసంగాన్ని చింపేసి విసరడం ద్వారా గవర్నర్‌నూ, సభాపతిని మాత్రమే కాదు... తాను నియమించుకున్న మండలి చైర్మన్ మోషేన్ రాజును కూడా జగన్ అవమానించారు. వైసీపీ సభ్యులకు కనీసం సభా మర్యాదలు, సంప్రదాయాలు తెలియవా? జగన్ ట్రాప్ నుంచి వైసీపీ నేతలు బయటకు రావాలి' అని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యలపై చర్చించే దమ్ము, బాధ్యత జగన్‌కు లేదని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని జగన్ ఖూనీ చేస్తున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు మండిపడ్డారు.



లేని హక్కు కోసం జగన్ వెంపర్లాట: లంకా దినకర్



అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ సభ్యులకు నిబంధనల మేరకు శాసనసభలో తమ సమస్యలపై వాణిని వినిపించే బాధ్యతను ప్రజలు ఇచ్చారు. దానిని జగన్ బేఖాతరు చేస్తూ లేని హక్కుల కోసం వెంపర్లాడుతున్నారు' అని 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ విమర్శించారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'మంచి, చెడులు బేరీజు వేసుకోకుండా జగన్ చేసే ఈ రకమైన ఆలోచనా సరళి ప్రజాస్వామ్యానికి ప్రమాదం. రాజ్యాంగ బద్ధ హోదాలు నిబంధనలకు లోబడి వాటంతట అవే వస్తాయి." అని దినకర్ పేర్కొన్నారు.

టీడీపీ ఎన్నికల వాగ్దానాలకే పరిమితం: రామకృష్ణ

గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం ఆసాంతం టీడీపీ ఎన్నికల వాగ్దానాలకే పరిమితమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ తదితర పథకాల గురించి ప్రస్తావించిన గవర్నర్... వాటి అమలు గురించి చెప్పలేదు. గిట్టుబాటు ధరలు లేక రైతులు అల్లాడుతుంటే రాష్ట్రంలో రైతులందరూ సుభిక్షంగా ఉన్నారని చెప్పడం విడ్డూరంగా ఉంది. కూటమి ఏర్పడి 9 నెలలు కావస్తున్నా ఇంతవరకు డీఎస్సీని ప్రకటించలేకపోయారు' అని రామకృష్ణ అన్నారు.

పేదల ఇళ్లకు 5 లక్షలు సబ్సిడీ ఇవ్వాలి: సీపీఐ

అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): "పేదల ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు చొప్పున రాయితీ ఇవ్వాలి. 3 నెలల్లోగా టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు స్వాధీనపరచాలి. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాల కోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయించాలి" అని సీపీఐ డిమాండ్ చేసింది. ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా, పట్టణ, నగర కార్యదర్శులతో సోమవారం నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో పేదల ఇళ్ల స్థలాల సమస్యలపై చర్చించి ఈ మేరకు తీర్మానాలు ఆమోదించారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

ప్రతిపక్ష హోదా అడగడం అవివేకం: కాంగ్రెస్

వేంపల్లె, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): వైసీపీకి ప్రతిపక్ష హోదా, జగన్‌కు ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వాలని ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కోరడం అవివేకమైన చర్య అని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ప్రతిపక్ష హోదా కోసం వాకౌట్ చేయడం వారి మూర్ఖత్వానికి, అవివేకానికి నిదర్శనం. పది శాతం సభ్యులు ఉంటే నిబంధనల ప్రకారం ప్రతిపక్ష హోదా వస్తుంది. గతంలో సమైక్యాంధ్రలో కాంగ్రెస్‌కు 26 మంది ఎమ్మెల్యేలు ఉండగా అప్పట్లో ప్రతిపక్ష హోదా ఇవ్వలేదు. 2019లో రాజ్యసభలో కాంగ్రెస్‌కు 52 మంది ఎంపీలు ఉండటంతో ప్రతిపక్ష హోదా ఇవ్వలేదు. ఇవన్నీ తెలిసినా వైసీపీ నాయకులు ప్రతిపక్ష హోదా అడగడం... వారి పిరికితనానికి, ప్రజల సమస్యలపై ప్రశ్నించలేని, పోరాడ లేని నిస్సహాయతకు అద్దంపడుతోంది. గవర్నర్ ప్రసంగం కూటమి ప్రభుత్వం రాసిచ్చిన వివరాలను చదివినట్లు ఉంది. డీఎస్సీపై తొలి సంతకం అన్నారు. ఎనిమిది నెలలైనా పట్టించుకోలేదు. రాష్ట్రాన్ని మద్యాంధ్ర, గంజాయి ఆంధ్ర, జూదాంధ్రగా మార్చారు' అని తులసిరెడ్డి ఆరోపించారు.

గవర్నర్ ప్రసంగం ఆకాంక్షలకు దూరం: పీడీఎఫ్

అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం ప్రజల ఆశలు, ఆకాంక్షలకు, వాస్తవాలకు దూరంగా ఉందని పీడీఎఫ్ ఎమ్మెల్సీలు వ్యాఖ్యానించారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ, 'వచ్చే నాలుగైదేళ్లలో ప్రభుత్వం ఏం చేస్తుందో స్పష్టత లేదు. సూపర్ సిక్స్ పథకాలపై స్పష్టత ఇవ్వకుండా, డీఎస్సీ పోస్టుల గురించి గొప్పలు చెప్పారు. తొలి సంతకం ప్రకారం నవంబరులో టీచర్ పోస్టుల భర్తీ ఎందుకు చేయలేదో చెప్పలేదు' అని విమర్శించారు. ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, 'గవర్నర్ ప్రసంగంలో కూటమి ప్రభుత్వ మేనిఫెస్టోలోని వాగ్దానాలు ఏవీ కనిపించలేదనీ, ప్రభుత్వ పథకాల అమలుపై స్పష్టమైన కాలపరిమితి లేదన్నారు. స్వర్ణాంధ్ర 2047... కేవలం తేదీని జోడించడం తప్ప కొత్తదనం లేదు' అని విమర్శించారు. ఎమ్మెల్సీ గోపీమూర్తి మాట్లాడుతూ... గవర్నర్ ప్రసంగం కేవలం పదజాలానికే పరిమితమైందనీ, గ్రాఫికల్ స్వభావంతో ఉందన్నారు.

జగన్ జర్మనీకి వెళ్లాలి

- అక్కడైతేనే వైసీపీకి 'హోదా' వస్తుంది
- ఇక్కడ ఈ ఐదేళ్లూ ప్రతిపక్ష నేత హోదా రాదు
- దాని కోసం సభా సమయం వృథా చేయడం సబబు కాదు
- గవర్నర్, సీఎం, నేను ఆయనకు తగిన గౌరవాన్ని ఇచ్చాం
- 11 సీట్లే వచ్చాయని ఎవరూ తక్కువగా చూడలేదు
- డిప్యూటీ సీఎంకు ప్రత్యేక ప్రొటోకాల్ ఉండదు
- అందుకనే ప్రమాణస్వీకారోత్సవంలో మంత్రుల వరుసలోనే కూర్చున్నా: పవన్ కల్యాణ్



అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): 'వైసీపీకి కనీసం ప్రతిపక్షంగా కూడా ప్రజలు అవకాశం ఇవ్వలేదు. కాబట్టి ఈ ఐదేళ్లు జగన్‌కు ప్రతిపక్ష నేత హోదా రాదు. జగన్‌కు ప్రతిపక్ష హోదా అనేది సీఎం చంద్రబాబో, నేనో ఇచ్చేది కాదు. 39% ఓట్లు వచ్చినందున ప్రతిపక్ష హోదా కావాలని అనుకుంటే జర్మనీ వెళ్లాలి. మన రాజ్యాంగం ప్రకారం వైసీపీకి ప్రతిపక్ష హోదా దక్కదు' అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తేల్చి చెప్పారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో జనసేన పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. 'నిబంధనల ప్రకారం వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇచ్చే అవకాశమే లేదు. ఈ విషయాన్ని ఆపార్టీ నేతలంతా అర్థం చేసుకోవాలి. ప్రతిపక్షంగా గుర్తింపు పొందడానికి అవసరమైనన్ని సీట్లు వైసీపీ గెలవలేకపోయింది. అందువల్ల జగన్‌కు ప్రతిపక్ష నేత హోదా ఈ ఐదేళ్లలో రాదని ఫిక్స్ అవ్వాలి. జగన్‌ని అవమానించాలని, స్థాయి తగ్గించాలని కాదు. ఓట్ల శాతం ప్రకారం ప్రతిపక్ష హోదా కావాలంటే వైసీపీ నేతలు జర్మనీ వెళ్లాలి. అక్కడ ఓట్ల శాతాన్ని పరిగణలోకి తీసుకుంటారు. భారత రాజ్యాంగం ప్రకారం సీట్లు ప్రతిపాదికన ప్రతిపక్ష హోదా ఉంటుందని వైసీపీ నేతలు గ్రహించాలి. అత్యధిక సీటు వచ్చిన టీడీపీ అధికారంలో ఉంటే, రెండో అతిపెద్ద పార్టీగా జనసేన ఉంది. మా కన్నా ఒక్క సీటు ఎక్కువ తెచ్చుకున్నా, వైసీపీకి ప్రతిపక్ష హోదా అడగకుండానే వచ్చేది. కానీ ప్రజలు వైసీపీని 11 సీట్లకే పరిమితం చేశారు. ఇది ప్రజలిచ్చిన తీర్పు. దీన్ని వైసీపీ నేతలు అర్థం చేసుకోకుండా, ఇవ్వడం కుదరని ప్రతిపక్ష హోదా కోసం సభా సమయాన్ని వృథా చేయడం సబబు కాదు. గవర్నర్‌కు ఆరోగ్యం బాలేకపోయినా... అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం కోసం వచ్చి, ప్రభుత్వం ఏం చేస్తుంది? ఏం చేయబోతుంది? అనే విషయాలను వివరించారు. కానీ వైసీపీ సభ్యులు గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకుంటూ, ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటూ నినాదాలు చేయడం బాధాకరం. గవర్నర్ ప్రసంగంలో ఏముందో తెలుసుకోకుండా, ప్రసంగ ప్రతులను చించేసి, అరుపులు, కేకలతో ప్రసంగం మధ్యలో సభ నుంచి వెళ్లారు. వైసీపీ నేతలు అనుసరించిన ఈ వైఖరి సరికాదు. వారు అసెంబ్లీకి వస్తే... ఆ పార్టీకి ప్రశ్నలు, సమాధానాల కోసం ఏ మేరకు అవకాశం ఇవ్వాలో ఆమేరకు ఇస్తారు. కేవలం హాజరు కోసం వచ్చి వెళ్లడం కాదు. ప్రజా సమస్యలపై స్పందించాలి. హుందాగా చర్చల్లో పాల్గొనాలి. వైసీపీ నాయకుడు సభకు వస్తే... మాట్లాడేందుకు ఎంత సమయం ఇస్తారో తెలుస్తుంది. రాని హోదా కోసం డిమాండ్ చేస్తూ, అసలు సభకే రాకపోవడం అనైతికం. మొదటి సమావేశాల్లో గవర్నర్, సీఎం, నేను... జగన్‌కు తగిన గౌరవం ఇచ్చాం. 11 సీట్లే వచ్చాయని జగన్‌ను ఎవ్వరూ తక్కువగా చూడలేదు. తగిన మర్యాద ఇస్తున్నా.. తనకు ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని, తమకు అవకాశం ఇవ్వరంటూ వాళ్లకి వాళ్లే ఫిక్స్ అవ్వడం సరికాదు. అసెంబ్లీలో నిబంధనల ప్రకారం, ప్రొటోకాల్ పాటించాల్సిందే. డిప్యూటీ సీఎంకు ప్రత్యేక ప్రొటోకాల్ ఉండదు. మంత్రిగానే పరిగణిస్తారు. కాబట్టే మంత్రివర్గ ప్రమాణ స్వీకార సమయంలో నేను మంత్రుల వరుసలో కూర్చున్నాను. అసెంబ్లీ సమావేశాల ప్రారంభంలో గవర్నర్‌ను ఆహ్వానించేందుకు నన్ను రమ్మన్నా... స్పీకర్, సీఎం, మండలి చైర్మన్ వెళ్తారనే నేను వెళ్లలేదు. ఈ విషయాలను వైసీపీ నేతలు గమనించాలి' అని డిప్యూటీ సీఎం వివరించారు. సనాతన ధర్మపరిరక్షణ బోర్డు ఏర్పాటుపై మీడియా ప్రశ్నించగా... 'మార్చి 14న పార్టీ ఆవిర్భావ వేదికగా ఈఅంశంపై మాట్లాడతాను. వక్ఫ్ బోర్డు ఉన్నట్లే...సనాతన ధర్మ పరిరక్షణకు కూడా బోర్డు ఏర్పాటు కావాలి. మిర్చి రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం' అని పవన్ కల్యాణ్ తెలిపారు.

నాడు పదవులిచ్చాను.. నేడు కృతజ్ఞత చూపండి

- పార్టీ కోసం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కష్టపడాలి
- ప్రతిపక్ష నేత హోదా ఇస్తేనే అసెంబ్లీకి వెళ్తా
- అప్పుడే సీఎంతో సమానంగా మాట్లాడగలను
- శాసనసభాపక్ష భేటీలో జగన్ స్పష్టీకరణ



అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉండగా మీ అందరికీ పదవులు ఇచ్చానని.. అందుకు కృతజ్ఞతగా ఇప్పుడు పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని వైసీసీ శాసనసభ్యులు, ఎమ్మెల్సీలను పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కోరారు. ప్రభుత్వంలో ఉన్నప్పుడు పార్టీ కోసం ఎవరెవరు శ్రమిస్తున్నారో గమనించడం కష్టమని.. కానీ ప్రతిపక్షంలో ఉండగా పార్టీ బలోపేతానికి ఎవరెవరు కష్టపడి పనిచేస్తున్నారో సులువుగా తెలుసుకోవచ్చని చెప్పారు. సోమవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగాన్ని బాయ్‌కాట్ చేసి బయటకు వచ్చాక.. తాడేపల్లి ప్యాలెస్‌లో పార్టీ శాసనసభాపక్ష సమావేశం నిర్వహించారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. తనకు ప్రతిపక్ష నేత హోదా ఇస్తేనే శాసనసభలో బలంగా ప్రజాసమస్యలను లేవనెత్తేందుకు వీలుంటుందని జగన్ మరోసారి స్పష్టం చేశారు. అప్పుడే ముఖ్యమంత్రితో సమానంగా సభలో మాట్లాడే అవకాశం వస్తుందన్నారు. ఆ హోదా ఇస్తేనే అసెంబ్లీకి వెళ్తానని పునరుద్ఘాటించారు. కాగా.. ప్రతిపక్ష నేత పదవి లేకున్నా.. సభకు వెళ్తేనే కదా ప్రభుత్వం ఏం చేస్తోందో తెలిసేదని వైసీపీ నేతలు అంటున్నారు. అధికారంలో ఉన్నప్పుడు పార్టీ నేతల పనితీరు తెలుసుకోలేమన్న ఆయన వ్యాఖ్యలతోనూ వారు విభేదిస్తున్నారు.

హోదాపై ప్రభుత్వ స్పందన చూశాక నిర్ణయం: బొత్స

జగన్‌కు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాలన్న డిమాండ్‌పై ప్రభుత్వ స్పందన చూసిన తర్వాత సభకు వెళ్లాలో లేదో నిర్ణయించుకుంటామని శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ చెప్పారు. సోమవారం అసెంబ్లీ నుంచి బయటకు వచ్చాక ఆయన మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని అసెంబ్లీ వేదికగా గవర్నర్‌ను కోరాం. వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వాలని ఆయన్ను డిమాండ్ చేశాం. ప్రజల తరఫున పోరాడేందుకే ప్రతిపక్ష హోదా అడుగుతున్నాం. మిర్చి రైతులు ఇబ్బందులు పడుతుంటే ఈ ప్రభుత్వం గిట్టుబాటు ధర ఇప్పించలేకపోతోంది. జగన్ మిర్చి యార్డును సందర్శించేవరకు చలనం లేదు. రైతులను ఆదుకోవలసిన బాధ్యత ప్రభుత్వంపై లేదా? రైతు సమస్యలకు ఎన్నికల కోడ్ అడ్డొస్తుందా? వారి కోసం జగన్ మాట్లాడితే కేసులు పెడతామని బెదిరిస్తారా? మ్యూజికల్ నైట్‌కు కోడ్ వర్తించదా' అని ప్రశ్నించారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే సభకు వస్తామని.. లేకపోతే లేదంటే.. ఎమ్మెల్యే పదవులెందుకని విలేకరులు అడుగగా.. మీ సలహాలు తీసుకోవలసిన అవసరం లేదని బొత్స బదులిచ్చారు. ప్రతిపక్ష హోదా కోసం పోరాడతామని వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి వ్యాఖ్యానించారు. వైసీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తోందని, ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా గొంతు నొక్కుతోందని విమర్శించారు.

గన్నవరాన్ని గుల్ల చేసేశారు

- ఐదేళ్లూ వంశీ, అనుచరుల అరాచకకాండ
- అక్రమ మైనింగ్‌తో కోట్లు లూటీ ..చెరువులు చెర
- టీడీపీ నేతలు, సానుభూతిపరులపై దాడులు.. వారి ఆస్తుల ధ్వంసం

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

గన్నవరం నియోజకవర్గంలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, ఆయన అనుయాయుల పేరిట జరిగిన అరాచకాలు, అక్రమాలు అన్నీ, ఇన్నీ కావు. గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు, విజయవాడ రూరల్ మండలాల పరిధిలో అక్రమ మైనింగ్, భూ కబ్జాలు, దందాలు, బెదిరింపులు, మోసాలు.. ఇలా చెప్పుకొంటూ పోతే చాంతాడంత ఉన్నాయి. గన్నవరం నియోజకవర్గంలో కొండలు, చెరువులు, మామిడి తోటలు, పేదల భూములు.. ఇలా అన్నింటినీ చెరబట్టి అక్రమ మైనింగ్ కార్యకలాపాలు సాగించారు. వంశీ అనుచరుల పేరిట సాగిన దోపిడీలో అక్రమ మైనింగ్ ప్రధానమైనది. అప్పటి రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులను చేతుల్లోకి తీసుకుని వారికి కూడా వాటాలు పంచుతూ కోట్లాది రూపాయల మైనింగ్ దోపిడీకి పాల్పడ్డారు. పగలు, రాత్రి 24 గంటల పాటు షిఫ్టుల పద్ధతిలో అక్రమ మైనింగ్ జరిపి లక్షలాది క్యూబిక్ మీటర్ల గ్రావెల్, మట్టిని తరలించుకుపోయారు. పేదల భూములను చెరబట్టారు. ప్రైవేటు వ్యక్తుల భూములను కబ్జా చేశారు. ఇలా ఐదేళ్ల పాటు గన్నవరం నియోజకవర్గంలో అంతులేని అరాచకకాండను సాగించారు. కూటమి ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయటంతో ఈ అక్రమాలపై లోతైన విచారణ జరగనుంది.

అక్రమ క్వారీయింగ్...

కొండపావులూరులోని సర్వే నెంబర్ 6లో పేదలకు ఇళ్ల పేరిట విజయవాడ నగరంలోని 5 వేల మందికి ఇళ్ల పట్టాలను కేటాయించగా... ఇందులో ఉన్న సూది గట్టు, గదబాలగట్టు, గుర్రం గట్టు, పాత గట్టు నాలుగు కొండలకు గుండుకొట్టి కోట్లాది రూపాయల గ్రావెల్‌ను అక్రమంగా తరలించుకుపోయారు. వెదురుపావులూరు, కొండపావులూరులలో 300 ఎకరాలకు పైగా విస్తరించి ఉన్న కొండ ప్రాంతాన్ని భారీ బ్లాస్టింగ్‌లతో పిండి చేశారు. డ్రిల్లింగ్ మెషిన్లను తెప్పించి కొండకు ఐదారు మీటర్ల లోతున రంధ్రాలు చేసి అందులో పేలుడు పదార్థాలు నింపి భారీ ఎత్తున బ్లాస్టింగ్ చేశారు. సూరంపల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 526లోని 500 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న తోకతిప్పను కూడా వంశీ అనుయాయులు వదల్లేదు. గన్నవరం మండలం పరిధిలోనే ముస్తాబాద, చనుపల్లివారిగూడెం కొండలను కూడా అనధికారికంగా చేజిక్కించుకున్నారు. రాత్రివేళల్లో కొండలను పిండిచేశారు. లక్షల క్యూబిక్ మీటర్ల మేర గ్రావెల్‌ను తన్నుకుపోయారు. బాపులపాడు మండలం మల్లవల్లిలోని సర్వే నెంబర్ 11లో 175 ఎకరాలను అడ్డగోలుగా తవ్వేశారు. మల్లవల్లి గ్రావెల్‌ను గుడివాడ, బందరులకు భారీ ఎత్తున తరలించారు. పోర్టు పనుల పేరుతో భారీ ఎత్తున గ్రావెల్‌ను తవ్వుకుపోయారు.



చెరువులను చెరబట్టి..

నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో 80 శాతంపైగా చెరువులలో అడ్డగోలుగా తవ్వకాలు చేపట్టారు. కొండపావులూరులోని సర్వే నెంబర్ 144లోని ఎర్ర చెరువు, బాపులపాడు మండలంలోని బిళ్లనపల్లి, రేమల్లెలోని ఊరచెరువు, వేలేరులోని ఊరచెరువు, ఉంగుటూరులో ఏ సీతారామపురం చెరువు, బాపులపాడు మండలంలో కానుమోలులోని 12 ఎకరాల చెరువు, ఇతర అనేక కుంటలను 150 ఎకరాలకు పైగా తవ్వేశారు. నాలుగు నియోజకవర్గాలలో మొత్తంగా 50 చెరువులకు పైగా వంశీ అనుచరులు అక్రమ తవ్వకాలు జరిపారు. పోలవరం కాలువపై రెండువైపులా గట్లపై కొండల్లా ఉన్న మట్టిని కూడా జగనన్న కాలనీల మెరక పేరుతో కొల్లగొట్టారు.

పేదల భూములు గుప్పిట్లోకి...

నియోజకవర్గంలో గ్రావెల్ నిక్షేపాలు కలిగిన మామిడి తోటలను కూడా వదల్లేదు. రంగన్నగూడెం, సింగన్నగూడెం గ్రామాలలోని మామిడి తోటల నేలలు గ్రావెల్‌తో కూడుకుని ఉండటంతో వంశీ అనుయాయులు వాటాల ప్రాతిపదికన చేజిక్కించుకుని గ్రావెల్ తవ్వేశారు. దాదాపుగా 15 మీటర్ల మేర లోతున గ్రావెల్ తవ్వేసి సొమ్ము చేసుకున్నారు. నియోజకవర్గంలో పేదలకు ఇచ్చిన సాగు పట్టాలను, ప్రజలు ఆక్రమించుకున్న భూములను నయాన, భయాన తమ గుప్పిట్లోకి తీసుకుని మట్టిని అడ్డగోలుగా తవ్వేశారు. కొండపావులూరులో సర్వే నెంబర్ 33, 34, 62లలో పెద్ద సంఖ్యలో భూములను లీజుకు తీసుకుని 35 మీటర్ల లోతున మట్టిని తరలించారు. మట్టిని ఇటుక బట్టీలకు భారీగా తరలించి సొమ్ము చేసుకున్నారు.

భూ కబ్జాలు.. దందాలు

మల్లవల్లి పారిశ్రామికవాడకు వెళ్లే రహదారికి రేమల్లె శివారులో సర్వే నెంబర్ 418-8, 9ల్లోని సుమారు 22 ఎకరాల భూమిని హరిదాసులకు పట్టాలు కేటాయించారు. రెవెన్యూ అధికారుల సహకారంతో వంశీ అనుయాయులు బెదిరించి ఆ భూమిని తమ అధీనంలోకి తీసుకున్నారు. అందులో తవ్వకాలు జరిపి గ్రావెల్‌ను తరలించేశారు. ఇదే ప్రాంతంలో ఉన్న సర్వే నెంబర్ 422లోని 18 ఎకరాల భూమి స్థానిక ప్రజలు ఆక్ర మణలో ఉండగా వారిని భయపెట్టి చేతుల్లోకి తీసుకున్నారు. ఈ భూముల విలువ రూ.50 కోట్ల మేర విలువ ఉండగా, తరలించిన గ్రావెల్ విలువే రూ.17 కోట్లు ఉంటుందని అంచనా!

కోడూరుపాడులోని శ్రీకోదండ రామస్వామి ఆలయానికి 1968లో వెలమదొరలు సర్వే నెంబర్ 111-1లో ఎకరం భూమి దానంగా దేవస్థాన అభివృద్ధి కోసం ఇచ్చారు. ఆ భూమిని కూడా వదలకుండా బినామీ పేర్లతో దక్కించుకున్నారు. మల్లవల్లిలో 3 ఎకరాల అసైన్డ్ భూమిని తమ అధీనంలోకి తీసుకుని తవ్వకాలు జరిపారు. మల్లవల్లిలో 2014లో వేసిన సాయితేజ ఇన్‌ఫ్రా హైలెట్ ప్రైవేట్ లిమిటెడ్ వెంచర్‌లో పలువురు ప్లాట్లు కొన్నారు. ఆ భూములను కూడా వంశీ అనుయాయులు చెరబట్టి తమకు అమ్మినట్టుగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అంపాపురంలో సర్వే నెంబరు 109-3లో పేద రైతుల సాగులో ఉన్న 14 ఎకరాల భూములను సాగు చేయకూడదని హెచ్చరిక బోర్డు పెట్టి ఖాళీ చేయించారు. తిరిగి బినామీల పేర్లతో పట్టాలను పుట్టించి వాటిని జగనన్న కాలనీల కోసం అమ్మకానికి పెట్టారు. చివర్లో అది ఫలించలేదు. రేమల్లెలో సర్వే నెంబరు 422-8,9లో 20 ఎకరాల అసైన్డ్ భూముల్లో సాగు చేసుకుంటున్న సన్నకారు రైతులను బెదిరించి ఆక్రమించుకోవడంతో పాటు 20 అడుగులకు పైగా అక్రమ మైనింగ్ చేశారు. రేమల్లె గ్రామంలోనే హైదరాబాద్‌కు చెందిన ఒక వ్యక్తి పోలవరం గట్టున ఉన్న 3ఎకరాల భూమిలో లేఅవుట్ వేస్తున్న విషయం తెలుసుకుని స్థానిక నాయకులతో కలిసి 26 సెంట్ల కామన్‌సైట్ భూమిని మండల స్థాయి వైసీపీ నాయకుడి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించారు. తర్వాత వంశీ అనుయాయులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

అడ్డగోలుగా తవ్వకాలు

మల్లవల్లి పారిశ్రామికవాడలో చదును చేస్తున్నామనే పేరుతో కన్‌స్ట్రక్షన్ వారిని అడ్డుపెట్టుకుని 100ఎకరాలకు పైగా భూమిలో అక్రమంగా తవ్వకాలు జరిపారు. కోట్లాది రూపాయల విలువ చేసే గ్రావెల్‌ను పోర్టు అభివృద్ధి పనుల పేరిట తరలించేశారు. మట్టి మాఫియా అయితే వేలేరు, కొత్తపల్లి, రంగన్నగూడెం, తదితర గ్రామాల్లో చెరువులను చెరపట్టి దోచుకోవడమే పనిగా అక్రమ తవ్వకాలు నిర్వహించారు. బాపులపాడు మండలంలోనే సుమారు 200 ఎకరాల వరకూ అక్రమ తవ్వకాలతో గోతులు పడి ఉన్నాయి. బాపులపాడు మండలానికి తహసీల్దార్‌గా రావడానికే అధికారులు భయపడ్డారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇదే అదనుగా గన్నవరం తహసీల్దార్‌గా పనిచేసిన నరసింహారావు (బాపులపాడు మండలంలో కూడా పని చేశారు) ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తూ పనులను చక్కబెట్టారు.

బెదిరింపుల పర్వం

వంశీ, ఆయన అనుచరులు నియోజకవర్గంలో ఎంతోమందిని వేధించారు. తన గెలుపునకు కృషి చేసిన టీడీపీ నాయకులను తనతో పాటు వైసీపీలో చేరాలని వంశీ అల్టిమేటం జారీ చేశారు. బాపులపాడు మండలంలోని నాయకులు అడ్డం తిరగడంతో వారి ఆస్తులను ధ్వంసం చేసేందుకు అధికారులతో కలిసి భయోత్పాతం సృష్టించారు. తిప్పనగుంటకు చెందిన పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మాదాల శ్రీనివాసరావు ఎరువుల దుకాణాన్ని అర్ధరాత్రి నేలమట్టం చేయించారు. దీనికి అప్పటి తహసీల్దార్ నరసింహారావుతో పాటు రెవెన్యూ సిబ్బంది సహకారం అందించారు. రేమల్లెకు చెందిన తుమ్మల ఉదయ్‌ను వైసీపీలోకి చేరాలని ఒత్తిడి చేసినా లొంగకపోవడంతో సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని పోలీస్ స్టేషన్ తీసుకువెళ్లి బెదిరించారు. అయినా లొంగకపోవటంతో అతను సాగు చేసుకుంటున్న 13 ఎకరాల రొయ్యల చెరువుకు గండ్లు పెట్టించారు. ఇలా ఎన్నో దాడులు చేయించారు. విజయవాడ మధురానగర్‌కు చెందిన సుంకర సీతామహలక్ష్మి తాను గన్నవరంలో కొనుగోలు చేసిన సర్వే నెంబర్ 477-2లో 484 చదరపు గజాల స్థలాన్ని వల్లభనేని వంశీ ప్రోద్బలంతో ఆక్రమించుకున్నట్లు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు ఫిర్యాదు చేశారు. అలాగే సూరంపల్లి గ్రామానికి చెందిన గొట్టిపూళ్ల రఘునాథ్ సర్వే నెంబర్ 366లోని 5.77 ఎకరాల భూమిని ఆక్రమించుకున్నట్టు ఫిర్యాదు చేశారు.

వంశీ అక్రమాలపై సిట్

(మొదటి పేజీ తరువాయి)

ప్రతాప్ శివకిశోర్‌తో కూడిన ఐపీఎస్ అధికారుల బృందం (సిట్) వంశీ దోపిడీని వెలికి తీయబోతోంది. మట్టి, ఇసుక ఇతర అక్రమ మైనింగ్ ద్వారా ప్రభుత్వానికి 195 కోట్ల రూపాయల మేర వంశీ నష్టం చేకూర్చినట్లు ఇప్పటికే విజిలెన్స్ నివేదిక ఇచ్చింది. దీని ఆధారంగా సిట్ ఏర్పాటు చేసింది. మొత్తం పర్యవేక్షణ బాధ్యతను సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్‌కు అప్పగించింది. దర్యాప్తులో సహకారం, అవసరం నిమిత్తం డీజీపీ ఎవరినైనా సిట్‌లోకి సిఫారసు చేస్తే తీసుకోవాలని ఆదేశించింది. ఇప్పటికే విజిలెన్స్ గుర్తించిన వంశీ అక్రమాల్లో కొన్నింటిని పరిశీలిస్తే.. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కృష్ణా జిల్లాలో ఇష్టారాజ్యంగా కొండలను తవ్వేశారు. సన్నిహితులతో నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకుని అక్రమ కార్యకలాపాలకు పాల్పడ్డారు. కేవలం పానకాల చెరువు నుంచి అక్రమంగా 100 కోట్ల విలువైన మట్టిని అనుచరులతో తవ్వించి దోచేశారు. ఇలా ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారు. విజిలెన్స్ వెలికితీసిన వీటితో పాటు బెదిరింపులు, ఇతర అరాచకాలు నిగ్గు తేల్చే బాధ్యత ప్రభుత్వం సిట్‌కు అప్పగించింది. సిట్‌కు అవసరమైన అన్ని సహకారాలు రాష్ట్ర ప్రభుత్వ శాఖలు అందించాలని, దర్యాప్తులో భాగంగా సిట్ ఎలాంటి రికార్డులు అడిగినా ఇవ్వాలని ఆదేశించింది. ప్రతి పదిహేను రోజులకు ఒకసారి దర్యాప్తులో పురోగతిని డీజీపీకి సిట్ అధిపతి అందజేయాలని జీవోలో ప్రభుత్వం పేర్కొంది.

పోలీసు కస్టడీకి వంశీ

- విజయవాడ కోర్టు 3 రోజుల అనుమతి
- నేడు కస్టడీకి తీసుకోనున్న పోలీసులు
- సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో విచారణ
- గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడి కేసులో పీటీ వారెంట్ దాఖలు చేసిన సీఐడీ
- మరో ముగ్గురు నిందితుల అరెస్ట్



సత్యవర్ధన్

విజయవాడ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని మూడు రోజుల పాటు పోలీసు కస్టడీకి ఇస్తూ విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో ఫిర్యాదుదారుడు ముదునూరి సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి బెదిరించి, కేసు నుంచి తప్పుకొనేలా చేశారన్న ఆరోపణలతో వంశీతో పాటు మరో నలుగురిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో మరిన్ని వివరాలు తెలుసుకోవడానికి, వంశీ నుంచి స్వాధీనం చేసుకోవాల్సిన వస్తువుల గురించి ఆయనను పది రోజుల కస్టడీకి ఇవ్వాలని విజయవాడ పటమట పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయాధికారి హిమబిందు సోమవారం తీర్పును వెలువరించారు. మూడు రోజుల పాటు పోలీస్ కస్టడీలో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విచారించాలని తీర్పులో స్పష్టం చేశారు. విజయవాడలోని జిల్లా జైలు నుంచి తీసుకెళ్లేటప్పుడు, తిరిగి జైలుకు తీసుకొచ్చేటప్పుడు ఆయనకు వైద్య పరీక్షలు చేయించాలని ఆదేశించారు. విచారణ సమయంలో మూడు నుంచి నాలుగు సార్లు ఐదు నుంచి పది నిమిషాల పాటు న్యాయవాదులతో మాట్లాడుకునే అవకాశం కల్పించారు. సీసీ కెమెరాల చిత్రీకరణ మధ్య విచారణ సాగాలని తీర్పులో పేర్కొన్నారు. వంశీని ఎక్కడ విచారిస్తారో ఆయన తరఫు న్యాయవాదులకు ముందుగానే తెలియజేయాలని సూచించారు. పోలీసులు మంగళవారం ఉదయం వంశీని కస్టడీకి తీసుకుంటారు.

సీఐడీ పీటీ వారెంట్

వల్లభనేని వంశీపై సీఐడీ పోలీసులు కోర్టులో పీటీ వారెంట్ దాఖలు చేశారు. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో 71వ నిందితుడిగా ఉన్న వంశీ తనను పోలీసులు అరెస్టు చేయకుండా హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిని హైకోర్టు కొద్దిరోజుల క్రితం తిరస్కరించింది. దీంతో సీఐడీ అధికారులు మూడో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో సోమవారం పీటీ వారెంట్ దాఖలు చేశారు.

మరో ముగ్గురి అరెస్టు

గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో మరో ముగ్గురు నిందితులను సీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. ఏ27గా ఉన్న శివకుమార్, ఏ28గా ఉన్న ఆదిలక్ష్మి, ఏ54గా ఉన్న ప్రవీణ్‌ను సోమవారం అరెస్టు చేసి విజయవాడలోని సీఐడీ కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి తిరుమలరావు రిమాండ్ విధించారు. అనంతరం వారిని నెల్లూరు జిల్లా కేంద్ర కారాగారానికి తరలించారు.

జైలులో వంశీకి వసతులు

విజయవాడ జిల్లా జైలులో ఉన్న వల్లభనేని వంశీకి నిద్రించడానికి మంచం, కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెస్ట్రన్ కమోడ్ ఉన్న బాత్‌రూం కేటాయించాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ న్యాయస్థానం ఆదేశించింది. అయితే ఇంటి నుంచి భోజనం, ఫర్నీచర్ సమకూర్చుకునేందుకు నిరాకరించింది. తనకు వెన్ను నొప్పి ఉన్నందున వసతులు కల్పించాలని వంశీ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయాధికారి హిమబిందు కొద్దిరోజుల క్రితం జైలు అధికారులను విచారించారు. జైలులో ఉన్న పరిస్థితిని తెలుసుకున్నారు. దీనిపై సోమవారం ఆమె ఆదేశాలు జారీ చేశారు.



సీఎం చంద్రబాబును కలిసిన ముఖ్యమంత్రి సీపీఆర్వో ఆలూరి రమేశ్

సీఎం సీపీఆర్వోగా ఆలూరి రమేశ్

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రజా సంబంధాల ప్రధాన అధికారి (సీపీఆర్వో)గా ఆలూరి రమేశ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. గతంలో జర్నలిస్టుగా పనిచేసిన రమేశ్.. ఎన్నికల ముందు నుంచి చంద్రబాబు వద్ద పీఆర్వోగా పనిచేస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కొనసాగుతోన్న ఆయన్ను గత ఏడాది జూన్ 13 నుంచి సీఎం సీపీఆర్వోగా ఖరారు చేస్తూ జీఏడీ ముఖ్య కార్యదర్శి మీనా సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

వాట్సాప్ ద్వారా త్వరలో 500 సేవలు

అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా త్వరలో 500 సేవలను అందిస్తామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. సోమవారం సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీపై ఆయన సమీక్షించారు. వాట్సాప్ సేవల్లో ఎదురయ్యే సమస్యలపై స్పందించేందుకు వీలుగా వాట్సాప్ గవర్నెన్స్ సెల్‌ను ఏర్పాటు చేయాలని అధికారులకు సీఎం ఆదేశించారు. వాట్సాప్ సేవల్లో భాగంగా రైతు బజార్లు, నిత్యావసర షాపుల వద్ద కూడా ఆ క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. ప్రపంచంలో తొలిసారిగా 161 సేవలను వాట్సాప్ ద్వారా అందిస్తున్నామని సీఎం అన్నారు. వాట్సాప్ నంబర్ 95523 00009కు సందేశాన్ని పంపడం ద్వారా కావాల్సిన సేవలు అందుకోవచ్చని సీఎం వెల్లడించారు. విద్యుత్తు, హాల్ టికెట్లు వంటి సేవలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయని సీఎం వెల్లడించారు.

పెట్రోలు బంకుల్లో మోసాలపై చర్యలు

» డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా హెచ్చరిక

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పెట్రోలు బంకుల్లో మోసాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా హెచ్చరించారు. అనంతపురం జిల్లాలోని ఓ పెట్రోలు బంకులో 10 లీటర్ల డీజిల్‌కు 9 లీటర్లే వస్తోందని, రాజమహేంద్రవరంలో ఒకచోట 5 లీటర్లకు 50 మిల్లీలీటర్లు తగ్గుతోందని, ఏలూరు, నెల్లూరు, కర్నూలు జిల్లాల్లోనూ పలు పెట్రోలు బంకుల నిర్వాహకులు వినియోగదారులను మోసగిస్తున్నట్లు వెల్లడైందని తెలిపారు. పెట్రోలు బంకుల్లో మోసాలపై ఇటీవల వరుసగా ఫిర్యాదులు అందాయి. దీంతో అన్ని జిల్లాల్లో తనిఖీలు చేపట్టాలని విజిలెన్స్ డీజీ బాధ్యతలు నిర్వర్తిస్తోన్న హరీశ్ కుమార్ గుప్తా ఆదేశించారు.

ప్రకృతి సాగులో రాష్ట్రానికి అవార్డుల పంట

» 15 జాతీయ స్థాయి పురస్కారాల్లో 7 మన రైతులకే



అవార్డు అందుకుంటున్న ఏపీ రైతు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో రాష్ట్ర రైతులకు అవార్డుల పంట పండింది. జాతీయ స్థాయి 15 అవార్డుల్లో ఏడు అవార్డులు దక్కించుకున్నారు. నాగపూర్‌లో ఈనెల 23, 24 తేదీల్లో సేంద్రీయ వ్యవసాయంపై జాతీయ సదస్సు నిర్వహించారు. జాతీయ సేంద్రీయ ప్రకృతి వ్యవసాయ కేంద్రం, భారత ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా సదస్సు నిర్వహించాయి. ఎం.నాగేంద్ర(అనంతపురం), కె.శ్రీనివాస్(విజయనగరం), ఆర్.రజిని(శ్రీసత్యసాయి),ఎం.సత్యనారాయణ(తిరుపతి), జి.అశ్విని(కోనసీమ), జి.వెలుగొండయ్య(ప్రకాశం), పుల్లయ్య (కర్నూలు) అవార్డులు దక్కించుకున్నారు. అదనంగా ఏపీ రైతు సాధికార సంస్థ ఉత్తమ రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అవార్డు గెలుచుకుంది.

అరెస్ట్ నుంచి శ్రీరెడ్డికి రక్షణ

అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా వేదికగా అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో నమోదైన కేసులలో సినీ నటి శ్రీరెడ్డికి తక్షణ అరెస్ట్ నుంచి హైకోర్టు రక్షణ కల్పించింది. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులపై అనుచిత పోస్టులు పెట్టిన వ్యవహారంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 6 కేసులలో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ శ్రీరెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై సోమవారం హైకోర్టు విచారణ జరిపింది. చిత్తూరు వన్‌టౌన్ రాణా పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు అన్నీ బెయిలబుల్ స్వభావం ఉండటంతో శ్రీరెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌కు విచారణార్హత లేదని స్పష్టం చేస్తూ వ్యాజ్యాన్ని కొట్టివేసింది. విశాఖ పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేసిన కోర్టు పలు షరతులు విధించింది. రూ.10 వేలతో 2 పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. అలాగే కర్నూలు టూటౌన్, కృష్ణా జిల్లా గుడివాడ వన్‌టౌన్, విజయనగరం జిల్లా నెలిమర్ల రాణాలో నమోదైన కేసులలో పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు అన్నీ ఏడేళ్ల లోపు శిక్షకు వీలున్నవేనని గుర్తు చేసింది. మరోవైపు గత ఏడాది నవంబరు 13న అనకాపల్లి పట్టణ రాణా పోలీసులు నమోదు చేసిన కేసు విచారణ సందర్భంగా అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాయి రోహిత్ స్పందిస్తూ... పిటిషనర్ అసభ్యకర భాష వాడారని, రికార్డులు కోర్టు ముందు ఉంచుతామన్నారు. పిటిషనర్ తరఫు న్యాయవాది ఇనకొల్లు వెంకటేశ్వర్లు స్పందిస్తూ... పోలీసులు కేసు నమోదు చేసిన తరువాత పిటిషనర్ ఎలాంటి పోస్టులు పెట్టడం లేదన్నారు.

కోర్టు విధులకు హాజరుకండి

అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అడ్వొకేట్ సవరణ బిల్లు-2025ను పునఃపరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు ఆందోళనలు విరమించి కోర్టు విధులకు హాజరు కావాలని ఏపీ బార్ కౌన్సిల్ చైర్మన్ నల్లారి ద్వారకానాథ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

పోలవరాన్ని పరిశీలించిన నిపుణుల బృందం

పోలవరం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో మట్టి, రాతి నాణ్యతా పరిశీలనా బృందం సోమవారం పర్యటించింది. ఈ బృందంలో రాతి సామర్థ్యం నిపుణులు ఎం.కార్తికేయ, ఉదయ్ భానుచంద్ర ఉన్నారు. పాత చేగొం డపల్లి సమీపంలో ఉన్న బ్లాస్టింగ్ ప్లాంటు నుంచి రాళ్ల నమూనాలు సేకరించారు. ఈ నమూనాలను పరిశీలించిన బృందం.. డిల్లీ వెళ్లి రాక్‌ఫిల్ డ్యాం నిర్మాణానికి ఎంత వరకు అనుకూలమో కేంద్రానికి వివరించనుందని డీఈఈ అనిల్ కుమార్ తెలిపారు.

ఏపీకి 397 కోట్లు కేంద్ర సాయం: పెమ్మసాని

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాలకు మూలధన పెట్టుబడుల కోసం ప్రత్యేక సహాయం కింద రూ. 397.72 కోట్లను కేంద్రప్రభుత్వం మంజూరు చేసిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. రాష్ట్రంలోని 6,680 గ్రామాలలో భూ రికార్డుల రీసర్వే తొలి దశను విజయవంతంగా పూర్తి చేసిన నేపథ్యంలో కేంద్రప్రభుత్వం ఈ నిధులను మంజూరు చేసినట్లు సోమవారం ఎక్స్ వేదికగా కేంద్ర మంత్రి తెలిపారు.

కమిటీ ఆన్ అబ్సెన్స్‌లో సభ్యుడిగా ఎంపీ చిన్ని

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా సోమవారం కమిటీ ఆన్ అబ్సెన్స్ ఆఫ్ మెంబర్ ఫ్రమ్ ది సిట్టింగ్ ఆఫ్ ది హౌస్‌కు 14 మంది సభ్యులను నామినేట్ చేశారు. ఈ కమిటీలో టీడీపీ ఎంపీ కేశినేని చిన్ని నామినేట్ అయ్యారు.

ఐదూ కూటమి ఖాతాలోకే

ఎమ్మెల్యే కోటా 'మండలి' సీట్లలో ఒకటి జనసేనకు.. పవన్ సోదరుడు నాగబాబుకు ఖాయం!



» మిగతా 4 సీట్లకు టీడీపీలో భారీగానే పోటీ

» ఆశావహుల్లో దేవినేని, కొమ్మాలపాటి, బుద్ధా వెంకన్న, ఎండీ నజీర్, మరికొందరు

» బడ్జెట్ తర్వాత చంద్రబాబు దృష్టి

» అసెంబ్లీలో సంఖ్యాబలం లేని వైసీపీ బరిలోకి దిగే అవకాశాలు లేనట్లే

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ సోమవారం విడుదలైన నేపథ్యంలో టీడీపీలో ఆశావహులు, నేతల్లో సందడి మొదలైంది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలుగా ఉన్న యనమల రామకృష్ణుడు, జంగా కృష్ణమూర్తి, దువ్వారపు రామారావు, పర్చూరి అశోక్ బాబు, బి.తిరుమల (బీటీ) నాయుడి పదవీకాలం మార్చి 29తో ముగియనుంది. ఖాళీ అవుతున్న ఈ ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో ఒక స్థానాన్ని జనసేనకు కేటాయించనున్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ సోదరుడు నాగబాబును కేబినెట్‌లోకి తీసుకుంటామని ఇప్పటికే సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఆయన ఎమ్మెల్సీగా ఎన్నికయ్యాక మంత్రి పదవి ఇవ్వాలన్న యోచనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో జనసేనకు ఒక సీటు ఖాయమైంది. మిగిలిన నాలుగు స్థానాల్లో టీడీపీ అభ్యర్థులే పోటీచేయనున్నారు. వీటి కోసం ఆ పార్టీలో చాలా మంది పోటీపడుతున్నారు. అభ్యర్థుల ఎంపికలో ప్రాంతాలు, కులాల సమీకరణలను పరిగణనలోకి తీసుకోవడంతోపాటు పొత్తులో భాగంగా సీట్లు త్యాగం చేసిన వారికి, వైసీపీ నుంచి వచ్చిన వారికి చంద్రబాబు ప్రాధాన్యమిచ్చే అవకాశం ఉంది. వీరిలో పలువురికి ఆయన గతంలోనే హామీ ఇచ్చారు. అలాంటి వారిలో పవన్ కల్యాణ్ కోసం పిఠాపురం అసెంబ్లీ సీటును త్యాగం చేసిన ఎస్వీఎస్ఎన్ వర్మ ముందు వరుసలో ఉన్నారు. అయితే ఆయనకు ఎమ్మెల్సీ ఇస్తే ఆ నియోజకవర్గంలో మరో అధికార కేంద్రం ఏర్పడుతుందని జనసైనికులు భావిస్తున్నారు. జనసేన నుంచి తీవ్రస్థాయిలో అభ్యంతరం వ్యక్తమైతే తప్ప వర్మకు కేటాయింపులో పెద్దగా అవరోధాలు లేవు. మిగిలిన మూడు స్థానాలకు మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, బీసీ కోటాలో మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న, మైనారిటీ కోటాలో విశాఖపట్నంకు చెందిన ఎండీ నజీర్ వంటి వారు పోటీపడుతున్నారు. భాష్యం ప్రవీణ్ కోసం పెదకూరపాడు స్థానాన్ని కొమ్మాలపాటి, వసంత కృష్ణ ప్రసాద్ కోసం మైలవరం సీటును దేవినేని త్యాగం చేసిన సంగతి తెలిసిందే. ముమ్మందుపోటీదారుల జాబితా మరింత పెరిగే అవకాశం ఉంది. 28న బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తర్వాత సీఎం అభ్యర్థుల ఎంపికపై దృష్టిసారించనున్నారు. అసెంబ్లీ సమావేశాలు మార్చి 21 వరకు జరగనుండగా.. ఎమ్మెల్సీ ఎన్నిక మార్చి 20న జరగనుంది. వైసీపీకి సభలో సంఖ్యాబలం లేనందున పోటీచేసే అవకాశాలు తక్కువే. ఏకగ్రీవానికే ఎక్కువ చాన్సు ఉందని కూటమి వర్గాలు చెబుతున్నాయి.

మార్చి 20న ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు

» షెడ్యూల్ విడుదల చేసిన ఈసీ

» వచ్చే నెల 29తో ముగియనున్న ఐదుగురు సభ్యుల పదవీ కాలం

» తెలంగాణలో ఐదు స్థానాలకు కూడా..

అమరావతి/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఐదు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. మార్చి 29వ తేదీతో ఎమ్మెల్సీలు యనమల రామకృష్ణుడు, జంగా కృష్ణమూర్తి, దువ్వారపు రామారావు, పర్చూరి అశోక్‌బాబు, బి.తిరుమలనాయుడుల పదవీ కాలం ముగియనుంది. ఇందులో జంగా కృష్ణమూర్తిపై గతేడాది మే 15న మండలి చైర్మన్ అనర్హత వేటు వేసిన విషయం విదితమే. అప్పటి నుంచి ఆ ఎమ్మెల్సీ స్థానం ఖాళీగానే ఉంది. ఈ నేపథ్యంలో ఈసీ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం.. ఆయా స్థానాలకు ఎన్నికల నిర్వహణ కోసం మార్చి 3న నోటిఫికేషన్ విడుదల కానుంది. మార్చి 10న నామినేషన్ల స్వీకరణకు తుది గడువు, 11న నామినేషన్ల పరిశీలన, 13వ తేదీని నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీగా ఈసీ పేర్కొంది. మార్చి 20వ తేదీన ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్, అదే రోజు సాయంత్రం కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపింది. మార్చి 24వ తేదీతో ఈ ఎన్నికల ప్రక్రియ ముగియనుంది. కాగా, ఇదే షెడ్యూల్ ప్రకారం తెలంగాణలో కూడా ఐదు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ రాష్ట్రంలోని మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, శేరి సుభాష్ రెడ్డి, ఎగ్గె మల్లేశం, మీర్జా రియాజుల్ హసన్‌ల పదవీకాలం సైతం మార్చి 29తోనే ముగియనుంది. ఇందులో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన మల్లేశం కాంగ్రెస్‌లో చేరారు. రియాజుల్ హసన్ ఎంఐఎం ఎమ్మెల్సీ కాగా, మిగిలిన ముగ్గురు బీఆర్ఎస్ సభ్యులు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో.. బాబు, లోకేశ్‌లకు ఓటుహక్కు

» ఇద్దరూ గ్రాడ్యుయేట్లు కావడంతో ఓటర్లుగా నమోదు

» పట్టభద్రుడు కాకపోవడంతో పవన్ దూరం

» జగన్ తాడేపల్లివాసి అయినా ఓటు పులివెందులలో



గుంటూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ విద్యార్హతలు ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుమారుడు మంత్రి లోకేశ్ పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు అర్హత పొందారు. చంద్రబాబు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో బీఏ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ కూడా చేశారు. లోకేశ్ బీఎస్సీ, ఎంబీఏ పట్టభద్రుడు. మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి పరిధిలో వీరిద్దరు నివశిస్తూ గత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఇక్కడి నుంచే ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కూటమి అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచిన విషయం తెలిసిందే. చంద్రబాబు, లోకేశ్ ఇద్దరూ ఓటు కోసం దరఖాస్తు చేసుకుని, ఓటు హక్కు పొందారు. ఇదే నియోజకవర్గంలో నివసిస్తున్న జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ పట్టభద్రుడు కానందున ఈ ఎన్నికకు దూరంగా ఉన్నారు. ఇక మంగళగిరి నియోజకవర్గం పరిధిలోనే తాడేపల్లిలో స్థిర నివాసం ఏర్పరచుకున్న మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కూడా ఇక్కడ ఓటు పొందలేకపోయారు. ఎందుకంటే గత ఏడాది జరిగిన అసెంబ్లీ/లోక్‌సభ ఎన్నికల్లో ఆయన తన ఓటును పులివెందులలో వినియోగించుకున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎక్కడ ఓటు ఉంటే అదే ప్రాంతంలో ఎమ్మెల్సీ ఓటు కూడా నమోదు చేసుకోవాలనే నిబంధన ఉంది. చంద్రబాబు, లోకేశ్ ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాడేపల్లి మండలం పరిధిలోని గాదె రామయ్య, సీతారావమ్మ మండల పరిషత్ పాఠశాలలోని పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

'ఎమ్మెల్సీ' ఎన్నికల్లో

కూటమి అభ్యర్థులను గెలిపించండి: జనసేనాని

అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమికి ఎలాంటి ఘన విజయాన్ని అందించారో ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని జనసేనాని కోరారు.

తొలి ప్రాధాన్య ఓట్లతోనే కూటమి అభ్యర్థులు గెలవాలి

» పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీ నేతలకు లోకేశ్ దిశానిర్దేశం

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): 'ఉభయ గోదావరి, కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొలి ప్రాధాన్య ఓట్లతోనే కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలవాలి' అని మంత్రి నారా లోకేశ్ పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. ఉండవల్లి నివాసంలో పార్టీ సీనియర్ నేతలతో ఎమ్మెల్సీ ఎన్నికలపై ఆయన సోమవారం సమీక్ష నిర్వహించారు. 'ప్రచారానికి అతి తక్కువ సమయం ఉండటంతో టెక్నాలజీ వినియోగం ద్వారా ప్రతి ఓటరునూ ఓటు అభ్యర్థించాలి. ఎన్నికల ముందు రోజు శివరాత్రి పండుగ నేపథ్యంలో మరుసటి రోజు జరిగే ఎన్నికల్లో ప్రతి ఓటరూ వచ్చి ఓటు హక్కు వినియోగించుకునేలా ఇన్‌చార్జి మంత్రులు, ఎమ్మెల్యేలు బాధ్యత తీసుకోవాలి. ఎన్నికల రోజు పరిస్థితిని ఎప్పటికప్పుడు కేంద్ర కార్యాలయం నుంచి పర్యవేక్షించేందుకు వార్ రూంను ఏర్పాటు చేయాలి. కూటమి నాయకులంతా కలిసికట్టుగా అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి' అని లోకేశ్ కోరారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, వేపాడ చిరంజీవి, ప్రాంతీయ సమన్వయకర్తలు సుజయకృష్ణ రంగారావు, ఎంవీ సత్యనారాయణరాజు, దామచర్ల సత్య, మండలపు రవి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జలాలను ఏపీ ఎక్కువ వాడలేదు!

» కేఆర్ఎంబీ స్పష్టీకరణ

» వరద సమయంలో వాడుకున్నా వెంటనే ప్రాజెక్టులు నిండాయి: జైన్

» సాగర్‌లో ఉన్న నీటి వినియోగంపై 2 రాష్ట్రాల సీఈలతో కమిటీ

» నేడు నల్లగొండలో భేటీ

» 27న బోర్డు సమావేశంలో చర్చించి నీటి కేటాయింపులపై నిర్ణయం

అమరావతి/హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ నుంచి కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ కేటాయింపులను మించి వాడేసుకుందన్న తెలంగాణ వాదనతో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) విభేదించింది. గత ఏడాది అక్టోబరు 27వ తేదీ వరకూ కృష్ణా పరివాహక ప్రాజెక్టులకు వరద వచ్చిందని.. ఈ సమయంలో ఏపీ ఆ నీటిని వాడుకున్నా.. ఈ వెంటనే ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో నిండిపోయాయని కేఆర్ఎంబీ చైర్మన్ అతుల్ జైన్ పేర్కొన్నారు. గత ఏడాది నవంబరు నుంచి నీటివాడకం మొదలైందని.. ఈ లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్ ఎక్కువగా వాడలేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం సాగర్‌లో నీటి నిల్వ చాలా తక్కువగా ఉన్నందున వ్యూహాత్మంగా వాడుకోవాలని సూచించారు. ఇప్పటికే ఏపీ ఎక్కువగా వాడేసిందని.. ఇకపై ఆ రాష్ట్రానికి నీటిని విడుదల చేయొద్దని తెలంగాణ కోరింది. అయితే వరదల సమయంలో నీటిని దిగువకు వదిలేశారని.. అవి సముద్రంలోకి పోతుంటే కొంత తాము వాడుకుంటే వచ్చిన నష్టం ఏమిటని ఆంధ్రప్రదేశ్ వాదించింది. పైపెచ్చు తెలంగాణ విద్యుదుత్పత్తి కోసం నీటిని కిందకు వదిలేయడంతో తమకు నష్టం వాటిల్లిందని ఏపీ ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆంధ్రలోని పంటలకు నీళ్లొదిలితే.. తెలంగాణలో రాజకీయ సమస్యలు ఎదురవుతాయని ఆ రాష్ట్ర అధికారులు చెప్పడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న పంటలను కాపాడుకోవడానికి ఎంత నీరు అవసరమో గుర్తించి ఇవ్వాలని అన్నారు. ఆయనతో చైర్మన్ అతుల్‌సింగ్ ఏకీభవించారు. కాగా.. మే, జూన్ నెలలకు తమకు 116 టీఎంసీలను విడుదల చేయాలని తెలంగాణ ఇండెంట్ పెట్టింది. తమ రాష్ట్రంలోనూ నీటి అవసరం భారీగానే ఉందని వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వాస్తవ నీటి అవసరాలు తేల్చడానికి.. సాగర్‌లో మిగిలి ఉన్న జలాలను ఏ విధంగా వాడుకోవాలో అధ్యయనం చేయడానికి రెండు రాష్ట్రాల చీఫ్ ఇంజనీర్లు.. నల్లగొండ సీఈ, సాగర్ కుడికాలువ సీఈతో అతుల్‌సింగ్ కమిటీని వేశారు. వీరు మంగళవారం నల్లగొండలో సమావేశమై రెండు రాష్ట్రాల్లో నీటి అవసరాలపై పరస్పరం చర్చించుకుని బోర్డుకు నివేదిక సమర్పిస్తారు. 27న జరిగే బోర్డు సమావేశంలో రెండు రాష్ట్రాల వినతులపై చర్చించి ఎవరికెంత కేటాయించాలో నిర్ణయిస్తారు.

క్రైస్తవుల స్వయం ఉపాధికి రాయితీ రుణాలు

» రూ.2.43 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం: మంత్రి ఫరూక్

అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రైస్తవ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న స్వయం ఉపాధి పథకాలకు రుణ రాయితీ కింద రూ.2.43 కోటను ప్రభుత్వం విడుదల చేసిందని రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి ఈ కార్పొరేషన్ ద్వారా రూ.4.86 కోట్లతో స్వయం ఉపాధి ప్రణాళిక అమలుకు నిర్ణయించామని, ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.2.43 కోట్లు రాయితీ కింద ఇస్తుండగా, మిగతా రూ.2.43 కోట్లు బ్యాంకుల ద్వారా రుణ రూపంలో పంపిణీ చేయనున్నట్టు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

10న బెజవాడలో అంగన్వాడీల మహాధర్నా

అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, మిని అంగన్వాడీలను మెయిన్ అంగన్వాడీ సెంటర్లుగా మార్చుతూ జీవో ఇవ్వాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ అసోసియేషన్, ఏపీ ప్రగతిశీల అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్లు డిమాండ్ చేశాయి. సమస్యలను పరిష్కరిచాలని కోరుతూ మార్చి 10న విజయవాడలో ధర్నా చేయనున్నట్లు తెలిపాయి.

వీఆర్వోలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోండి

విజయవాడ(గాంధీనగర్), ఫిబ్రవరి 24: సచివాలయాల రేషనలైజేషన్‌లో వీఆర్వోలకు భవిష్యత్తులో ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఏపీ వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీహెచ్.రవీంద్రరాజు కోరారు. ఈ మేరకు మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను సచివాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు, పౌర సరఫరాలు ఇతర శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో అర్హులైన గ్రేడ్-1, గ్రేడ్-2 వీఆర్వోలకు అవకాశం కల్పించాలని కోరారు.

సన్నరకాల వరి సాగుకు ప్రోత్సాహం

» మంత్రి అచ్చెన్న అధ్యక్షతన భేటీలో నిర్ణయం

అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సన్నరకాల వరి సాగును ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముతక రకాలు, గింజ లావు రకాలు అమ్ముడుపోక, ఎగుమతి కాక, పౌరసరఫరాల ద్వారా పంపిణీ చేసినా ప్రజలు తినక సమస్యగా మారుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సన్నరకాల వరి సాగు, ఉత్పత్తిని పెంచే ప్రణాళికలో భాగంగా సోమవారం అమరావతి సచివాలయంలో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్‌గౌర్, వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు, పౌర సరఫరాల సంస్థ ఎండీ మనజీర్ జిలానీ, వ్యవసాయ విశ్వవిద్యాలయ రీసెర్చ్ డైరెక్టర్ పీవీ సత్యనారాయణ, రైతుప్రతినిధులు పాల్గొన్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో వివిధ మండలాల్లో పండుతున్న వరి రకాలు, సాగు విస్తీర్ణం, ఉత్పత్తిపై వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఖరీఫ్‌లో ఎంటీయూ-1121,1061,1064, పీఆర్126, రబీలో ఎంటీయూ-1121, 1153, పీఆర్ 126 రకాల విస్తీర్ణాన్ని తగ్గించాలని, ఈ రకం ధాన్య సేకరణను నిలిపివేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. వీటికి ప్రత్యామ్నాయ రకాలను సూచించాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని కోరారు. సన్న రకాలైన బీపీటీ-5204, 3291, ఆర్ఎన్ఆర్ 15049, ఎంటీయూ 1224, ఆర్‌జీఎల్ 2537, ఎన్ఎల్ఆర్ 34449, ఎన్‌డీఎల్ఆర్7, పీఎల్ఏ 1100, జేజీఎల్ 384, హెచ్ఎంటీ, జైశ్రీరామ్ వంటి రకాలను సాగు చేసేలా ప్రోత్సహించాలని నిర్ణయించారు.

అగ్రిమిషన్ సభ్య కార్యదర్శిగా మండవ

రాష్ట్ర వ్యవసాయ మిషన్ సభ్యకార్యదర్శిగా బాపట్ల వ్యవసాయ విస్తరణ విభాగం ప్రొఫెసర్ మండవ శ్రీనివాసరావును ప్రభుత్వం నియమించింది. ఓడీపై రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారని సోమవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

అటవీ శాఖ వెనుకడుగు?

» 'సజ్జల' భూఆక్రమణలపై వింత వైఖరి

» ఆ భూములు తమవి కాదంటున్న అటవీశాఖ

కడప, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో అటవీభూములను మాజీ సీఎం జగన్ హయాంలో ప్రభుత్వ సలహాదారుగా పనిచేసిన సజ్జల రామకృష్ణారెడ్డి కుటుంబీకులు ఆక్రమించుకున్నారని పదే పదే రెవెన్యూ యంత్రాంగం చెబుతున్నప్పటికీ.. అవి మావి కాదంటూ అటవీ అధికారులు చెబుతుండడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కడప నగర శివారులోని సీకేదిన్నె రెవెన్యూ పొలం సర్వే నంబర్లలో 1,590 నుంచి 1,629 పరిధిలో సజ్జల రామకృష్ణారెడ్డి సోదరుల కుటుంబానికి చెందిన తొమ్మిది మంది పేర్లతో 146.75 ఎకరాల పట్టాభూమి ఉంది. బినామీ పేర్లతో కలిపి మొత్తం 202 ఎకరాలు వారి ఆధీనంలో ఉన్నాయి. కాగా, సర్వే నెంబరు 1,629లో అటవీశాఖకు 11,129.33 ఎకరాల భూములున్నాయి. ఇవి సజ్జల కుటుంబం భూముల మధ్యలో కూడా ఉన్నాయి. వీటిలో సుమారు 55 ఎకరాల్లో సజ్జల కుటుంబీకులు ఆక్రమించి మామిడి, ఇతర చెట్లు నాటారన్నది ఆరోపణ. ఇదే విషయం రెవెన్యూ అధికారుల సర్వేలో కూడా తేలింది. ఈ వ్యవహారం 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టడంతో కలకలం రేగింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ, సర్వే అధికారులు ఇప్పటికే పలుమార్లు సర్వే నిర్వహించారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం అవి అటవీశాఖ భూములుగా తేలాయి. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ విచారణలోనూ ఇవి అటవీశాఖ భూములని తేలింది. అయితే అటవీశాఖ మాత్రం ఈ భూములు తమవి కాదంటూ తప్పించుకుంటూ కాలయాపన చేస్తోంది.

కడప భూముల వ్యవహారంపై సజ్జల కుటుంబీకులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. త్రిసభ్య కమిటీతో విచారణ చేయించేందుకు న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు రెవెన్యూ, సర్వే, అటవీ అధికారులు విచారణ చేస్తున్నారు. సోమవారం మరోసారి ఆర్డీవో జాన్ ఎర్విన్, సీకేదిన్నె తహశీల్దారు నాగేశ్వరరావు, డీఎఫ్‌వో వివేకానంద భూముల వద్దకు వెళ్లారు. భూముల మ్యాప్‌ను పరిశీలించారు.



టన్నెల్‌లో సగానికి పైగా నిండిన బురద, నీరు; సహాయక చర్యల్లో సిబ్బంది

అడుగడుగునా అవాంతరాలు!

» ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో తొలగని బురద.. పెరిగిన ఊటనీరు

మహబూబ్‌నగర్/అచ్చంపేట/దోమలపెంట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగంలో చిక్కుకున్న వారిని కాపాడేందుకు చేపట్టిన సహాయ చర్యలు వేగంగా సాగడంలేదు. బృందాలకు అడుగడుగునా అవాంతరాలు ఎదురవుతున్నాయి. సొరంగంలో ఇంకా 2.5 మీటర్ల మేర బురద అలాగే ఉండటంతో అక్కడి నుంచి ఘటనా స్థలం వద్దకు నడవడం చాలా కష్టంగా మారింది. పైగా, ఆదివారంతో పోల్చితే ఊటనీరు మరింత పెరిగింది. ఇప్పటికీ నిమిషానికి 3,500 లీటర్ల చొప్పున నీరు ఉబికి వస్తుండటంతో నిల్వ పేరుకుపోతోంది. 13 కిలోమీటర్ల లోపలి నుంచి ఐదు దశలుగా డీ వాటరింగ్ ప్రక్రియ కొనసాగిస్తున్నారు. సోమవారం మరో 100 హెచ్‌పీ మోటార్‌ను ఏర్పాటు చేశారు. ఉత్తరాఖండ్‌లోని సహాయ చర్యల్లో పాల్గొన్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని ఈ రెస్క్యూ ఆపరేషన్ కోసం రప్పించారు. శనివారం రాత్రే ఆపరేషన్ పనులు ప్రారంభమైనా.. ఇప్పటివరకు కొలిక్కి వచ్చినట్లు కనిపించడంలేదు. లోపల ఉన్న పరిస్థితులపై పూర్తి అవగాహన రాకుండా చర్యలు చేపడితే మళ్లీ టన్నెల్ కూలిపోయే ప్రమాదం ఉందని ఎన్డీఆర్ఎఫ్ బలగాలు భావిస్తున్నాయి. పూర్తిస్థాయి ఆపరేషన్ చేపట్టేందుకు బృందాలు సోమవారం మధ్యాహ్నం 3.40 గంటలకు పూర్తి ప్రణాళికతో టన్నెల్ లోపలికి వెళ్లాయి. గ్యాస్ కట్టర్లతో ఐరన్ షీట్లు, పైపులు, చువ్వలను తొలగిస్తున్నారు. సాయంత్రం 4.30 గంటలకు ప్రత్యేకంగా తయారుచేసిన వ్యాగన్ ట్రాలీలో పొక్లెయిన్‌ను లోపలికి పంపించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.